

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



గురువారం | 9-5-2024 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 23 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతఋతువు, వైశాఖమాసం, శుక్లపక్షం; తిథి: పాడ్యమి ఉ. 6.21, విదియ తె. 4.18 వరకు, నక్షత్రం: కృత్తిక ఉ. 11.55 తదుపరి రోహిణి, వర్జ్యం: తె.3.09-4.41, దుర్ముహూర్తం: ఉ.10.04-10.55, మ.3.10-4.01, అమృతఘడియలు: ఉ.9.40-11.10, రాహుకాలం: మ.1.30-3.00, సూర్యోదయం: 5.48, సూర్యాస్తమయం: 6.34 | హైదరాబాద్ సిటీ *

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ప్రపంచకప్‌లో నేటి మ్యాచ్‌లు

వెస్టిండీస్ x ఉగాండా (ఉ.6. గం.)
భారత్ x పాకిస్థాన్ (రాత్రి.8. గం.)
ఒమన్ x స్కాట్లాండ్ (రాత్రి 10.30 గం.)

కివీస్‌కు అఫ్ఘాన్ షాక్

కేన్ సేన 75 ఆలౌట్
కూల్చేసిన రషీద్, ఫజల్
గుర్బాజ్ అర్ధ శతకం


రషీద్

జార్జ్‌టౌన్ (గయానా): టీ20 వరల్డ్‌కప్‌లో వరుస సంచలనాలు నమోదవుతున్నాయి. రషీద్ ఖాన్ (4-0-17-4), ఫజల్ ఫరూకీ (3.2- 0-17-4) చెరో నాలుగు వికెట్లతో చెలరేగడంతో.. గ్రూప్-సిలో శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో అఫ్ఘానిస్థాన్ 84 పరుగుల తేడాతో న్యూజిలాండ్‌కు షాకిచ్చింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన అఫ్ఘాన్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 159 పరుగులు చేసింది. ఓపెనర్లు రహ్మనుల్లా గుర్బాజ్ (56 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సర్లతో 80), ఇబ్రహీం జద్రాన్ (41 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో 44) తొలి వికెట్‌కు 103 పరుగులు జోడించారు. అయితే, ఆ తర్వాతి బ్యాటర్లు వేగంగా పెవిలియన్ చేరారు. ఆఖరి ఓవర్‌లో కెప్టెన్ రషీద్ (6) రనౌట్ కాగా.. హాఫ్ సెంచరీ చేసిన గుర్బాజ్, గుల్బదిన్ (0)ను అవుట్ చేసిన బౌల్ట్ జట్టు స్కోరు 160 చేరకుండా అడ్డుకొన్నాడు. మ్యాట్ హెన్రీ 2 వికెట్లు తీశాడు. ఛేదనలో అఫ్ఘాన్ బౌలర్ల దెబ్బకు కివీస్ 15.2 ఓవర్లలో 75 పరుగులకే కుప్పకూలింది. ఫిలిప్స్ (18), హెన్రీ (12) మాత్రమే రెండంకెల స్కోరు చేశారు. గుర్బాజ్‌కు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది.

పాయింట్ల పట్టిక — గ్రూప్-సి

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
అఫ్ఘానిస్థాన్	2	2	0	0	4	5.225
వెస్టిండీస్	1	1	0	0	2	0.411
ఉగాండా	2	1	1	0	2	-2.952
పీఎన్‌జీ	2	0	2	0	0	-0.434
న్యూజిలాండ్	1	0	1	0	0	-4.200

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు

సంక్షిప్త స్కోరు

అఫ్ఘానిస్థాన్: 20 ఓవర్లలో 159/6 (గుర్బాజ్ 80, జద్రాన్ 44; బౌల్ట్ 2/22, హెన్రీ 2/37); **న్యూజిలాండ్:** 15.2 ఓవర్లలో 75 ఆలౌట్ (ఫిలిప్స్ 18; ఫరూకీ 4/17, రషీద్ 4/17).


రోహిత్


ప్రాక్టీస్‌లో విరాట్ కోహ్లీ


బాబర్ ఆజమ్

ప్రపంచ క్రికెట్ ప్రేమికులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న తరుణం రానేవచ్చింది. టీ20 వరల్డ్‌కప్‌లో అసలైన కిక్కిచ్చే ఫైట్‌కు రంగం సిద్ధమైంది. ఇప్పటికి నాలుగు మ్యాచ్‌లు జరిగినా బోసిపోయి కనిపించిన నసౌ స్టేడియం ఇక ఇరు జట్ల ఫ్యాన్స్‌తో కిటకిటలాడనుంది. రీసేల్ మార్కెట్‌లో ఒక్క టికెట్ ధరే కోటీ 50 లక్షలు పలుకుతుందంటేనే ఈ పోరుకున్న డిమాండ్ ఏంటో అర్థమవుతోంది. ఇదంతా.. భారత్-పాకిస్థాన్ జట్ల మధ్య మ్యాచ్ గురించే. ఈ మెగా టోర్నీ ముఖాముఖి పోరులో 6-1 ఆధిక్యంతో తిరుగులేని రికార్డున్న టీమిండియాను.. పసికూన యూఎస్ చేతిలో ఓడిన పాక్ ఏమేరకు ఎదుర్కోగలదో చూడాల్సిందే!

కిక్కిచ్చే ఫైట్

నేడే భారత్ X పాక్ మ్యాచ్
పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు

న్యూయార్క్: టీ20 ప్రపంచకప్‌లో అత్యంత ఆసక్తికర పోరుకు రంగం సిద్ధమైంది. రెండేళ్ల తర్వాత తొలిసారిగా టీమిండియా ఆదివారం పాకిస్థాన్‌తో తలపడనుంది. తొలి మ్యాచ్‌లో ఐర్లాండ్‌పై విజయంతో రోహిత్ సేన ఆత్మవిశ్వాసంతో ఉండగా.. పాకిస్థాన్ పసికూన యూఎస్‌ఏ చేతిలో ఓడి డీలా పడింది. దీంతో ఇంటా బయటా విమర్శలు ఎదుర్కొంటున్న బాబర్ బృందానికి భారత్‌పై గెలుపు చాలా కీలకం. ఇక ఇక్కడి డ్రాప్ ఇన్ పిచ్‌పై అనూహ్య బౌన్స్ బ్యాటర్లను బెంబేలెత్తిస్తోంది. చివరిసారి ఇరుజట్లు 2022 టీ20 వరల్డ్‌కప్‌లో తలపడగా ఆఖరి బంతికి భారత్ గెలిచింది. ఉగ్రదాడి హెచ్చరికల నేపథ్యంలో ఈ మ్యాచ్‌కు అధ్యక్షస్థాయి భద్రతను ఏర్పాటు చేశారు.

మెరుగైన రికార్డుతో...: కొత్త బంతిని ఎదుర్కొనేందుకు ఈసారి కూడా ఓపెనర్లుగా రోహిత్, విరాట్ రానున్నారు. ఐర్లాండ్‌తో కోహ్లీ అనవసర షాట్‌కు వెళ్లి అవుటయ్యాడు. కానీ పాక్‌పై మెరుగైన రికార్డున్న విరాట్‌పై ఈసారీ భారీగా అంచనాలున్నాయి. బంతి పాతగా మారే వరకు ఓపిగ్గా ఎదురుచూస్తేనే ఈ పిచ్‌పై పరుగులు వస్తాయి. వన్‌డౌన్‌లో పంత్ ఫామ్ జట్టుకు సానుకూలాంశం. పాక్ స్పిన్నర్లపై ఎదురుదాడికి శివమ్ దూబే సిద్ధంగా ఉన్నాడు. ఐర్లాండ్‌తో ఆడిన మాదిరే భారత్ నలుగురు పేసర్లు, ఇద్దరు స్పిన్నర్లతో బరిలోకి దిగనుంది.

తీవ్ర ఒత్తిడిలో...: ఐసీసీ టోర్నీల్లో భారత్‌పై ఓడడాన్ని అలవాటుగా మార్చుకున్న పాక్.. ఈ మ్యాచ్‌ను మరింత ఒత్తిడి మధ్య ఆడనుంది. పాక్‌కు బౌలింగే ప్రధాన బలంగా ఉన్నప్పటికీ యూఎస్ బ్యాటర్లు వీరిని దీటుగా ఎదుర్కొని సూపర్ ఓవర్‌లో గెలిచారు. ఈ ఓటమితో ఆగ్రహంగా ఉన్న అభిమానులను తిరిగి సంతోషంలో ముంచెత్తాలంటే భారత్‌పై విజయం పాక్‌కు అవసరం. పేసర్లు షహీన్, నసీమ్, ఆమిర్, రౌఫ్ తమ పేస్ పదునుతో భారత బ్యాటర్లను ఇబ్బంది పెట్టాలనుకుంటున్నారు. బ్యాటింగ్‌లో రిజ్వాన్, ఉస్మాన్ విఫలమవుతున్నారు. బాబర్ వేగంగా ఆడాల్సి ఉంది. స్పిన్నర్ షాదాబ్ స్థానంలో సయీమ్ అయూబ్‌ను తీసుకునే చాన్సుంది.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ (కెప్టెన్), విరాట్ కోహ్లీ, పంత్, సూర్యకుమార్, శివమ్ దూబే, హార్దిక్, జడేజా, అక్షర్, బుమ్రా, అర్ష్‌దీప్, సిరాజ్.
పాకిస్థాన్: రిజ్వాన్, ఉస్మాన్, బాబర్ ఆజమ్ (కెప్టెన్), ఫఖర్, ఆజమ్ ఖాన్, ఇఫ్తికార్, షాదాబ్/సయీమ్, షహీన్, నసీమ్ షా, ఆమిర్, రౌఫ్.

పిచ్, వాతావరణం

నేటి ఉదయం 10 గంటలకు వర్షం కురిసే అవకాశం ఉంది. టాస్ ఆలస్యం కావచ్చు. ఇక నసౌ స్టేడియం పిచ్‌ను అర్థం చేసుకోవడం కష్టంగా మారింది. ఇప్పటి దాకా జరిగిన నాలుగు మ్యాచ్‌ల్లో రెండుసార్లు మాత్రమే 100+ స్కోరు దాటింది. అందుకే పేసర్లకు ఎక్కువగా అనుకూలించే ఈ ట్రాక్‌పై భారీ స్కోర్లను ఆశించలేం. టాస్ గెలిచిన జట్టు బౌలింగ్ ఎంచుకునే అవకాశం ఉంది.

స్వియటెక్.. హ్యాట్రిక్

పోలెండ్ స్టార్‌దే ఫ్రెంచ్ ఓపెన్ • ఫైనల్లో పాలినీ చిత్తు



పారిస్: టాప్‌సీడ్ ఇగా స్వియటెక్ సాధించింది..వరుసగా మూడోసారి ఫ్రెంచ్ ఓపెన్ కిరీటం సొంతం చేసుకుంది. ఈక్రమంలో అనేక రికార్డులు అందుకుంది. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ ఏకపక్ష ఫైనల్లో 23 ఏళ్ల స్వియటెక్ 6-2, 6-1తో 12వ సీడ్ జాస్మిన్ పాలినీ (ఇటలీ)ని చిత్తు చేసింది. గంటా ఎనిమిది నిమిషాలు సాగిన తుది సమరం..తొలి సెట్‌లో ఓ దశలో స్వియటెక్ 1-2తో వెనుకంజలో నిలిచింది. ఆపై వరుసగా 10 గేములు గెలిచి మొదటి సెట్‌ను సొంతం చేసుకుంది. ఇక రెండో సెట్‌లోనైతే స్వియటెక్ ధాటికి పాలినీ పూర్తిగా చేతులెత్తేసింది. ఏకంగా 5-0తో ప్రత్యర్థిని బెంబేలెత్తించిన పోలెండ్ స్టార్..ఆ సెట్‌ను మరింత సులువుగా ముగించడంతోపాటు మ్యాచ్‌ను చేజిక్కించుకుంది. మ్యాచ్‌లో స్వియటెక్, జాస్మిన్ చెరో ఏస్ కొట్టగా..తొలి గ్రాండ్‌స్లామ్ ఫైనల్ ఆడిన 28 ఏళ్ల పాలినీ రెండు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. స్వియటెక్ 18 విన్నర్లు కొడితే..పాలినీ ఏడింటికే పరిమితమైంది. స్వియటెక్‌కు రొలాండ్ గారోస్‌లో ఇది వరుసగా 21వ విజయం. ఇక.. జస్టిన్ హెనిన్ (2005, 06, 07)) తర్వాత హ్యాట్రిక్ ఫ్రెంచ్ ఓపెన్ టైటిళ్లు అందుకున్న తొలి క్రీడాకారిణిగా స్వియటెక్ రికార్డు సృష్టించింది. గత ఐదేళ్లలో ఇగాకు ఇది నాలుగో ఫ్రెంచ్ ఓపెన్. అంతకుముందు ఆమె తొలిసారిగా 2020లో ఇక్కడ విజేతగా నిలిచింది. ఓవరాల్‌గా స్వియటెక్‌కు ఇది ఐదో గ్రాండ్‌స్లామ్ టైటిల్. 2022లో యూఎస్ ఓపెన్ గెలిచింది. ఇక, గ్రాండ్‌స్లామ్స్‌లో ఫైనల్ చేరిన ప్రతిసారీ స్వియటెక్ విజేతగా నిలవడం విశేషం.

స్వియటెక్‌కు రూ. 21.65 కోట్లు
పాలినీకి రూ. 10.82 కోట్లు

పురుషుల సింగిల్స్ ఫైనల్ నేడు



అల్కారజ్ X జ్వెరెవ్ — సా. 6.30 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో

మిల్లర్.. గట్టెక్కించెన్

దక్షిణాఫ్రికా విజయం
వణికించిన డచ్ బౌలర్లు


మిల్లర్ (59 నాటౌట్)

న్యూయార్క్: లక్ష్యం 104 పరుగులు.. అయితేనేం నెదర్లాండ్స్ బౌలర్లు దక్షిణాఫ్రికా బ్యాటర్లకు పట్టపగలే చుక్కలు చూపించారు. అటు వికెట్లు తీస్తూ మరోవైపు ఒక్కో పరుగు కోసం చెమటోడ్చేలా చేయడంతో 12/4 స్కోరుతో దీనంగా నిలిచింది. అయితే ఈ స్థితిలో డేవిడ్ మిల్లర్ (51 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 59 నాటౌట్) చివరికంటా నిలిచి జట్టు పరువు దక్కేలా చేశాడు. అతడికి స్టబ్స్ (33) సహకరించాడు. ఫలితంగా శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో 4 వికెట్ల తేడాతో సఫారీలు గెలిచారు. ఐసీసీ ఈవెంట్స్‌లో డచ్‌పై నెగ్గడం సౌతాఫ్రికాకిదే తొలిసారి. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన నెదర్లాండ్స్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 103 పరుగులకు కుప్పకూలింది. ఏంజెల్‌బ్రెట్ (40), వాన్ బీక్ (23) మినహా అంతా విఫలమయ్యారు. ఆఖరి ఓవర్‌లో పేసర్ బ్రాట్‌మన్ ఒక్క పరుగుకు 3 వికెట్లు తీసి ఈ టోర్నీలో సఫారీల తరఫున మూడో ఉత్తమ బౌలర్ (4-0-11-4)గా నిలిచాడు. నోకియా, జాన్సెన్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. స్వల్ప ఛేదనలో దక్షిణాఫ్రికా 18.5 ఓవర్లలో 106/6 స్కోరు చేసి గెలిచింది.

అతికష్టంగా...: స్వల్ప ఛేదనలో సఫారీలు కూడా తడబడ్డారు. తొలి బంతికే డికాక్ (0) రనౌట్ కాగా.. డచ్ బౌలర్ల ధాటికి టీ20ల్లో తమ అత్యల్ప పవర్‌ప్లే (16/4) స్కోరుతో దక్షిణాఫ్రికా నిలిచింది. ఈ దశలో మిల్లర్, స్టబ్స్ ఆదుకునే ప్రయత్నం చేశారు. కానీ నిదానం కనబర్చడంతో పది ఓవర్లలో 32 పరుగులే సమకూరాయి. ఆ తర్వాత రెండు ఓవర్లలో మిల్లర్ జోరుతో 22 రన్స్ రాబట్టడంతో సౌతాఫ్రికా కోలుకుంది. అయితే 17వ ఓవర్‌లో స్టబ్స్‌ను బాస్ డి లీడ్ అవుట్ చేయగా, ఐదో వికెట్‌కు 65 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ వెంటనే జాన్సెన్ (3)ను వాన్ బీక్ వెనక్కి పంపడంతో ఉత్కంఠ పెరిగింది. ఈ దశలో మిల్లర్ బ్యాట్ ఝుళిపిస్తూ 19వ ఓవర్‌లో 6,4,6తో చెలరేగి అర్ధసెంచరీతో పాటు మ్యాచ్‌ను ముగించాడు.

పాయింట్ల పట్టిక — గ్రూప్-డి

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
దక్షిణాఫ్రికా	2	2	0	0	4	0.789
బంగ్లాదేశ్	1	1	0	0	2	0.379
నెదర్లాండ్స్	2	1	1	0	2	0.024
నేపాల్	1	0	1	0	0	-0.539
శ్రీలంక	2	0	2	0	0	-0.777

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు

సంక్షిప్త స్కోరు

నెదర్లాండ్స్: 20 ఓవర్లలో 103/9 (ఏంజెల్‌బ్రెట్ 40, వాన్ బీక్ 23, బార్ట్‌మన్ 4/11, నోకియా 2/19, జాన్సెన్ 2/20)
దక్షిణాఫ్రికా: 18.5 ఓవర్లలో 106/6 (మిల్లర్ 59 నాటౌట్, స్టబ్స్ 33; కింగ్మా 2/12, వాన్ బీక్ 2/21).

స్వల్ప స్కోర్ల ఉత్కంఠ పోరు

లంకపై బంగ్లా గెలుపు


హ్రిదయ్ (40)

సంక్షిప్త స్కోరు

శ్రీలంక: 20 ఓవర్లలో 124/9 (నిస్సాంక 47, ధనంజయ డిసిల్వా 21, అసలంక 19, ముస్తాఫిజుర్ 3/17, రిషద్ హొసేన్ 3/22, టస్కిన్ 2/25).
బంగ్లాదేశ్: 19 ఓవర్లలో 125/8 (హ్రిదయ్ 40, లిటన్ దాస్ 36, మహ్మదుల్లా 16 నాటౌట్, నువాన్ తుషార 4/18, హసరంగ 2/32).

డాలస్: ప్రతిష్ఠాత్మక టీ 20 వరల్డ్ కప్‌లో మరో స్వల్ప స్కోర్ల పోరు. అయినాసరే ఆఖరి ఓవర్ వరకూ ఈ మ్యాచ్ అభిమానులను మునివేళ్లపై నిలబెట్టింది. చివరకు మహ్మదుల్లా (16 నాటౌట్) అండతో బంగ్లాదేశ్ కేవలం రెండు వికెట్లతో శ్రీలంకపై గెలిచి మెగా టోర్నీలో బోణీ కొట్టింది. శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో తొలుత శ్రీలంక 20 ఓవర్లలో 124/9 స్కోరుకే పరిమితమైంది. ఓపెనర్ నిస్సాంక (47) టాప్ స్కోరర్. ధనంజయ (21) పర్లేదనిపించాడు. ముస్తాఫిజుర్ (4-0-17-3), రిషద్ హొసేన్ (4-0-22-3) చెరో మూడు వికెట్లు పడగొట్టారు. ఛేదనలో తౌహిద్ హ్రిదయ్ (20 బంతుల్లో ఓ ఫోర్, 4 సిక్సర్లతో 40) ధనాధన్ బ్యాటింగ్‌తోపాటు లిటన్ దాస్ (36)తో నాలుగో వికెట్‌కు 63 పరుగులు జోడించడంతో బంగ్లా గెలుపు సులువే అనిపించింది. కానీ నువాన్ తుషార (4-0-18-4) విజృంభించడంతో బంగ్లా 113/8తో ఇబ్బందుల్లో పడింది. విజయానికి 12 రన్స్ కావాల్సిన దశలో..19వ ఓవర్లో షనక బంతిని మహ్మదుల్లా సిక్సర్‌గా కొట్టి జట్టును గెలిపించాడు. రిషద్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

ప్రజ్ఞానందకు మూడో స్థానం

నార్వే చెస్ విజేత కార్ల్‌సన్

స్టావెంజర్ (నార్వే): నార్వే చెస్ టోర్నీలో భారత టీనేజ్ గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద మూడో స్థానంలో నిలిచాడు. ఆఖరిదైన పదో రౌండ్లో అమెరికా గ్రాండ్ మాస్టర్ హికరు నకమురాతో క్లాసికల్ గేమ్‌ను ప్రజ్ఞానంద డ్రాగా ముగించాడు. అయితే, అర్మగెడాన్‌లో నకమురాపై ప్రజ్ఞానంద గెలిచాడు. మొత్తం 14.5 పాయింట్లతో ప్రజ్ఞానంద తృతీయ స్థానం దక్కించుకొన్నాడు. వరల్డ్ నెంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ (17.5 పాయింట్లు) విజేతగా నిలవగా.. నకమురా (15.5) రెండో స్థానం సొంతం చేసుకున్నాడు. మహిళల విభాగంలో భారత స్టార్లు వైశాలి (12.5), కోనేరు హంపి (10) వరుసగా నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచారు. 19 పాయింట్లతో చైనా గ్రాండ్ మాస్టర్ జు వెన్ టైటిల్‌ను అందుకుంది.

అన్షు, అంతిమ్‌కు రజతాలు



బుడాపెస్ట్ (హంగేరి): బుడాపెస్ట్ ర్యాంకింగ్ సిరీస్‌లో భారత రెజ్లర్ అన్షు మాలిక్ రజతం దక్కించుకొంది. మహిళల 57 కిలోల ఫైనల్లో అన్షు 1-12తో కీజిన్ హాంగ్ (చైనా) చేతిలో చిత్తుగా ఓడింది. భారత్‌కే చెందిన అంతిమ్ పంగల్ 53 కిలోల్లో రజతం సాధించగా.. 50 కిలోల్లో వినేష్ ఫొగట్ క్వార్టర్స్ బౌట్‌లో ఓడింది.

బిజినెస్

భారీ జీతంతో పాటు

వినూత్న ప్రోత్సాహకాలు

ఉద్యోగులను ఆకర్షించేందుకు కార్పొరేట్ల సరికొత్త వ్యూహాలు



బెంగళూరు/న్యూఢిల్లీ: ప్రతిభావంతులను ఆకర్షించడంతో పాటు ఉన్న ఉద్యోగులు వలస పోకుండా కాపాడుకునేందుకు కార్పొరేట్ కంపెనీలు సరికొత్త వ్యూహాలను అనుసరిస్తున్నాయి. వారికి భారీ జీతంతో పాటు వ్యక్తిగత అభివృద్ధికి మద్దతు, పనిలో వెసులుబాటు, తోబుట్టువులకూ ఆరోగ్య బీమా సదుపాయం వంటి వినూత్న ప్రోత్సాహకాలను ఆఫర్ చేస్తున్నాయి. రిస్క్, అడ్వైజరీ, బ్రోకింగ్ కంపెనీ డబ్ల్యూటీడబ్ల్యూ ఈ ఏడాదికి గాను గ్లోబల్ బెనిఫిట్స్ ఆటిట్యూడ్ సర్వేను చేపట్టింది. జీతంతో పాటు లభిస్తున్న అదనపు ప్రయోజనాలే ప్రస్తుత కంపెనీలో కొనసాగుతుండటానికి ప్రధాన కారణాల్లో ఒకటని సర్వేలో పాల్గొన్న 76 శాతం మంది ఉద్యోగులు వెల్లడించారు. ప్రస్తుతం లభిస్తున్న జీతంతో పాటు మరింత మెరుగైన ప్రయోజనాలను ఆఫర్ చేసే కంపెనీకి మారేందుకూ సిద్ధమని మూడింట రెండొంతుల మంది ఉద్యోగులు తెలిపారు. ప్రముఖ వినియోగదారుల ఉత్పత్తుల సంస్థ పీ అండ్ జీ తన ఉద్యోగులు వ్యక్తిగత అభివృద్ధి, కుటుంబ సభ్యులు, పిల్లలు, తల్లిదండ్రులు, పెంపుడు జంతువుల సంరక్షణ తదితర అవసరాల కోసం ఉపయోగించుకునేందుకు వార్షిక స్థిర నగదు భత్యం ప్యాకేజీని ప్రవేశపెట్టింది. కంపెనీ సమగ్ర సంరక్షణ కార్యక్రమంలో భాగంగా ఈ ప్యాకేజీని ప్రవేశపెట్టినట్లు, సిబ్బంది తమ వ్యక్తి ప్రాధాన్యాల పైనా దృష్టి సారించేందుకు ఇది దోహదపడనుందని పీ అండ్ జీ ఇండియా చీఫ్ హెచ్ఆర్ ఆఫీసర్ శ్రీనివాస్ అన్నారు.

కార్పొరేట్ కంపెనీల్లో ఉద్యోగులు గంటల తరబడి కూర్చుని పనిచేయాల్సిన పరిస్థితి. దాంతో వారికి ఊబకాయంతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని పలు ఆరోగ్య సర్వేలు ఇప్పటికే వెల్లడించాయి. ఈ నేపథ్యంలో దేశంలోని అతిపెద్ద ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్ ఫ్లిప్‌కార్ట్ తన గ్రూప్ వ్యాపారాల ఉద్యోగుల కోసం గత ఏడాది ఆగస్టులో ఉచిత ఆరోగ్య పరీక్షల కార్యక్రమాన్ని ప్రారంభించింది. 33 నగరాల్లోని కంపెనీ కార్యాలయాల్లో ఉద్యోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు ఫ్లిప్‌కార్ట్ సీనియర్ డైరెక్టర్ ఆకృతి చంద్ర తెలిపారు. కొత్తగా కంపెనీలో చేరబోయేవారు జీతంతో పాటు ఆ యాజమాన్యం అందిస్తున్న బీమా సదుపాయం వంటి అదనపు సదుపాయాల గురించీ వాకబు చేస్తున్నారని శాప్ ఇండియా హెచ్ఆర్ హెడ్ శ్వేత మొహంతి అన్నారు. శాప్ తన సిబ్బంది మానసిక ఆరోగ్య సంరక్షణ కోసం యెల్లో సర్కిల్స్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది.



ఎల్‌జీ ఓఎల్ఈడీ సీ4 ఏఐ టీవీ

ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా.. హైదరాబాద్ మార్కెట్లోకి సరికొత్త 64 అంగుళాల ఓఎల్ఈడీ సీ4 ఏఐ టీవీ తీసుకువచ్చింది. అడ్వాన్స్‌డ్ ఓఎల్ఈడీ టెక్నాలజీ, ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) సామర్థ్యాలతో కూడిన ఈ టీవీ అద్భుతమైన పిక్చర్ క్వాలిటీతో వీక్షకులకు మంచి అనుభూతిని అందిస్తుందని ఎల్‌జీ తెలిపింది. శనివారం నాడ్కిడ జరిగిన కార్యక్రమంలో ఎల్‌జీ హెచ్ఈ డైరెక్టర్ యంగ్‌వాన్ జంగ్, సీఏవీహెడ్ లీ ఈ టీవీని విడుదల చేశారు. బిల్ట్ ఇన్ యాపిల్ ఎయిర్‌ప్లే, గూగుల్ క్రోమ్ కాస్ట్ ఫీచర్లను ఈ టీవీలో పొందుపర్చింది. అన్ని ప్రముఖ రిటైల్ అవుట్‌లెట్స్‌తో పాటు ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్‌పై అందుబాటులో ఉండనున్న ఈ టీవీ ప్రారంభ ధర రూ.1,79,999.

బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ రూ.7,000 కోట్ల ఐపీఓ

న్యూఢిల్లీ: బజాజ్ గ్రూప్ నుంచి మరో కంపెనీ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కు రాబోతోంది. బజాజ్ ఫైనాన్స్ అనుబంధ విభాగమైన బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ ఐపీఓకు అనుమతి కోరుతూ క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించింది. ఐపీఓలో భాగంగా రూ.4,000 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు మాతృసంస్థ బజాజ్ ఫైనాన్స్‌కు చెందిన రూ.3,000 కోట్ల విలువైన షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించనున్నట్లు డీఆర్‌హెచ్‌పీలో కంపెనీ వెల్లడించింది.తద్వారా సంస్థ మొత్తం రూ.7,000 కోట్లు సమీకరించనుంది. అప్పర్ లేయర్ ఎన్‌బీఎఫ్‌సీల పరిధిలోకి వచ్చే కంపెనీలు 2025 సెప్టెంబరు నాటికి స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు కావాలన్న ఆర్‌బీఐ నిబంధనలకు అనుగుణంగా బజాజ్ గ్రూప్ ఈ కంపెనీని మార్కెట్లో లిస్ట్ చేయబోతోంది. తాజా ఈక్విటీ ద్వారా సమీకరించనున్న నిధులను భవిష్యత్ మూలధన అవసరాలకు వినియోగించుకోనున్నట్లు కంపెనీ పేర్కొంది.

2015 సెప్టెంబరులో నేషనల్ హౌసింగ్ బ్యాంక్ (ఎన్‌హెచ్‌బీ) వద్ద రిజిస్టర్ చేసుకున్న బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్.. గృహాలు, వాణిజ్య ప్రాపర్టీల కొనుగోలు, పునరుద్ధరణకు రుణాలందిస్తోంది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో కంపెనీ నికర లాభం 38 శాతం వృద్ధితో రూ.1,731 కోట్లకు చేరుకుంది.

టాటా ఏఐఏ లైఫ్ మిడ్‌క్యాప్ మూమెంటమ్ ఇండెక్స్ ఫండ్

టాటా ఏఐఏ లైఫ్ ఇన్సూరెన్స్ (టాటా ఏఐఏ).. మిడ్‌క్యాప్ మూమెంటమ్ ఇండెక్స్ ఫండ్ పేరుతో సరికొత్త ఫండ్‌ను ప్రారంభించింది. మిడ్‌క్యాప్ 150 ఇండెక్స్‌లోని 50 అత్యుత్తమ పనితీరు కనబరుస్తున్న స్టాక్స్‌లో ఈ ఫండ్ పెట్టుబడులు పెట్టనుంది. దీర్ఘకాలంలో మంచి రిటర్నులు అందించే విధంగా ఈ ఫండ్‌ను తీర్చిదిద్దింది. ఈ కొత్త ఫండ్ ఆఫర్ ఈ నెల 15 వరకు అందుబాటులో ఉండనుంది.

పొగాకు ఉత్పత్తులు, పాన్ మసాల కంపెనీల కోసం ప్రత్యేక జీఎస్‌టీ ఫారం

న్యూఢిల్లీ: పాన్ మసాలా, పొగాకు ఉత్పత్తుల తయారీదారుల పన్ను ఎగవేతలను అరికట్టేందుకు జీఎస్‌టీ నెట్‌వర్క్ (జీఎస్‌టీఎన్) ప్రత్యేక ఫారం 'జీఎస్‌టీ ఎస్ఆర్ఎం-2'ను ప్రవేశపెట్టింది. ఈ ఫారం ద్వారా కంపెనీలు సంబంధిత నెలకు సేకరించిన, వినియోగించిన ఇన్‌పుట్, అవుట్‌పుట్ వస్తు వివరాలను పన్ను అధికారులకు రిపోర్టు చేయాల్సి ఉంటుంది. ఈ కంపెనీలు తమ యంత్రాలను రిజిస్టర్ చేసేందుకు జీఎస్‌టీఎన్ ఎస్ఆర్ఎం-1 ఫారాన్ని ఇప్పటికే అందుబాటులోకి తెచ్చింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	71,670 ▼	65,700 ▼	96,000 ▼
ముంబై	71,913 ▼	65,872 ▼	90,535 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



9వ తేదీ

హైదరాబాద్	445	విజయవాడ	460
వరంగల్	447	గోదావరి	455
చిత్తూరు	513	విశాఖపట్నం	460

డజను గుడ్లు రూ. 72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	147	గోదావరి	149
వరంగల్	147	విజయవాడ	149
కరీంనగర్	147	గుంటూరు	149
మహబూబ్‌నగర్	147	ఒంగోలు	149
కర్నూలు	147	చిత్తూరు	154
విశాఖపట్నం	135		

జీఎస్‌టీఆర్-1 రిటర్న్‌లో చూపిన

మొత్తాన్ని చెల్లించకుంటే..?



రాంబాబు గొండాల

జీఎస్‌టీలో రిటర్న్ దాఖలు చేసే ప్రక్రియ మొదట జీఎస్‌టీఆర్-1 రిటర్న్‌తో ప్రారంభమవుతుందనే విషయం తెలిసిందే. ఒక నెలలో జరిపిన అమ్మకాలు లేదా సరఫరాల తాలుకు వివరాలు, అంటే సరఫరాల విలువ, ఇన్వాయిస్‌ల వివరాలు, పన్ను శాతం, కట్టవలసిన పన్ను, ఇంకా క్రెడిట్ నోట్, డెబిట్ నోట్ వివరాలతో పాటు కొనుగోలుదారుల జీఎస్‌టీ వివరాలు కూడా ఇందులో ఉంటాయి. అలాగే జీఎస్‌టీఆర్-1లో చూపిన వివరాల ప్రకారమే అవతలి వ్యక్తి ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) తీసుకుంటాడు. ఒక విధంగా చెప్పాలంటే జీఎస్‌టీఆర్-1 అతి ముఖ్యమైన రిటర్న్. ఇందులో చూపిన పన్ను అనేది స్వయంగా మదింపు చేసిన పన్ను. దీనినే 'సెల్ఫ్ అసెస్డ్ ట్యాక్స్' అంటారు. కానీ, ఈ రిటర్న్ ద్వారా పన్ను చెల్లించే సౌలభ్యం లేదు. ఈ రిటర్న్‌లో చూపిన మొత్తాన్ని జీఎస్‌టీఆర్-3బీ రిటర్న్ ద్వారా చెల్లించాలి. అందుకే, ఏదేనీ నెలకు లేదా పీరియడ్‌కు సంబంధించి జీఎస్‌టీఆర్-3బీ రిటర్న్ ద్వారా కట్టిన పన్ను వివరాలు జీఎస్‌టీఆర్-1లో చూపిన పన్ను వివరాలతో సరిపోవాలి. సాధారణంగా కట్టాల్సిన పన్ను కంటే తక్కువ కడితే, చట్ట ప్రకారం నోటీసు ఇవ్వవలసి ఉంటుంది. కానీ, జీఎస్‌టీఆర్-1లో చూపిన పన్ను కంటే జీఎస్‌టీఆర్-3బీ ద్వారా కట్టిన పన్ను తక్కువగా ఉంటే ఎలాంటి నోటీసు ఇవ్వాల్సిన అవసరం లేకుండా రికవరీ చర్యలకు ఉపక్రమించే అధికారం అధికారులకు ఉంది. ఎందుకంటే ఇది వ్యాపారి తాను స్వయంగా మదింపు చేసిన పన్ను కాబట్టి.

అయితే ఇలా పన్ను తక్కువ కట్టటానికి కొన్ని సందర్భాల్లో సరైన కారణాలు ఉండవచ్చు. ఉదాహరణకు ముందు నెలలో ఎక్కువ పన్ను కట్టి ఉండవచ్చు. ఆ మేరకు ఈ నెలలో తగ్గించి ఉండవచ్చు. పన్ను తక్కువ కట్టటానికి గల కారణాలను తెలుసుకోకుండా తగు చర్యలు తీసుకుంటే పన్ను చెల్లింపుదారులకు ఇబ్బందులు ఎదురవుతాయన్న కారణంతో ప్రభుత్వం కొత్తగా ఒక పద్ధతిని ప్రవేశపెట్టింది. దీనినే డీఆర్‌సీ-01 బీ అంటారు. ఎప్పుడైతే, జీఎస్‌టీఆర్-1లో చూపిన పన్ను కంటే జీఎస్‌టీఆర్-3బీ ద్వారా కట్టిన పన్ను తక్కువగా ఉందో, అప్పుడు తగు వివరణ కోరుతూ సదరు వ్యాపారికి ఈ డీఆర్‌సీ-01 బీ జారీ చేస్తారు. ఇది జీఎస్‌టీ కామన్ పోర్టల్ ద్వారా జారీ చేయబడుతుంది. అంతే కాకుండా సంబంధిత వ్యాపారి, జీఎస్‌టీలో ఇచ్చిన ఈ-మెయిల్‌కు కూడా పంపబడుతుంది.

ఈ డీఆర్‌సీ-01 బీ రెండు భాగాలుగా ఉంటుంది. మొదటిది పార్ట్-ఏ, ఇందులో జీఎస్‌టీఆర్-1లో చూపిన పన్ను వివరాలు, జీఎస్‌టీఆర్-3బీ ద్వారా కట్టిన పన్ను వివరాలు, ఎంత తక్కువ కట్టారు మొదలైన వివరాలు ఉంటాయి. తక్కువ కట్టిన పన్నును ఈ నోటీస్ అందుకున్న వారంలోపు వడ్డీతో సహా డీఆర్‌సీ-03లో కట్టాలి. ఆ వివరాలను పార్ట్-బీలో చూపాలి. లేదా పన్ను తక్కువ కట్టటానికి తగు కారణాలు ఉంటే, ఆ వివరాలను కూడా పార్ట్-బీలో చూపవచ్చు. లేదా రెండు కలిపి చూపవచ్చు. ఇలా వారం రోజుల లోపు వడ్డీతో సహా పన్ను కట్టటం లేదా వివరణ ఇవ్వటం జరగాలి. పన్ను కట్టకున్నా, వివరణ ఇవ్వకున్నా లేదా ఇచ్చిన వివరణ ఆమోదయోగ్యంగా లేకున్నా పైన చెప్పిన నోటీస్ ఇవ్వాల్సిన అవసరం లేకుండా రికవరీ చర్యలు తీసుకునే అధికారం అధికారులకు ఉంటుంది. కాబట్టి జీఎస్‌టీఆర్-3బీ రిటర్న్ వేసేటప్పుడు సంబంధిత వివరాలను జీఎస్‌టీఆర్-1 రిటర్న్‌తో ఒకటికి రెండు సార్లు సరిచూసుకోవాలి. సరైన కారణాలు ఉంటే తప్ప జీఎస్‌టీఆర్-1లో చూపిన దాని కంటే తక్కువ పన్ను కట్టకూడదు.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఆదివారం | 9-6-2024 | పేజీలు: 16 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 54 | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | హైదరాబాద్ సిటీ *

అక్షర యోధుడి అస్తమయం

ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు కన్నుమూత

చద్ది వార్తల తెలుగు పాత్రికేయాన్ని కొత్త పుంతలు తొక్కించిన చీఫ్ ఎడిటర్!
వార్తలనే అందించే టీవీకి 24 గంటల వినోదాన్ని జోడించిన తెలుగు టీవీ!
కమర్షియల్ సినిమాకు కళాత్మకత అద్దిన మూవీ మొఘల్!
హాలీవుడ్‌లోనే ఉండే ఫిలిం సిటీని తెలుగు నేలకూ తెచ్చిన ధన్యజీవి..
ఊరికి పరిమితమైన చిట్‌ఫండ్‌ను కార్పొరేట్ చేసిన మార్గదర్శి!
ఇంటింటా పెట్టుకునే పచ్చళ్లను పరిశ్రమగా మార్చిన దార్శనికుడు!
తన కంపెనీలతో వేల మందికి ఉపాధి కల్పిస్తున్న అన్నదాత..
ఆయనే.. అతి సామాన్యుడిగా జీవితాన్ని ప్రారంభించి అనన్య సామాన్యుడిగా ఎదిగిన చెరుకూరి రామోజీ రావు! నిత్యం ఉషోదయంతో సత్యం నినదించుగాక అనే ఆయన ఆ ఉషోదయానికి ముందే పరమపదించారు!

- 5న తీవ్ర గుండెపోటుతో ఆస్పత్రిలో చేరిక
- ఆరోగ్యం క్షీణించి శనివారం తెల్లవారుజామున తుదిశ్వాస
- ముర్ము, మోదీ, రేవంత్, బాబు దిగ్భ్రాంతి
- 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ఎండీ వేమూరి రాధాకృష్ణ సహా నివాళులర్పించిన రాజకీయ, సినీ, వ్యాపార ప్రముఖులు
- నేడు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ లాంఛనాలతో ఫిలింసిటీలో అంత్యక్రియలు

పనిలోనే విశ్రాంతి అంటూ దశాబ్దాలుగా అవిశ్రాంత పయనం సాగించిన ఆ మహా మనిషి శాశ్వత నిద్రలోకి జారుకున్నారు..! వేలాది జీవితాల్లో వెలుగుగా మారి.. కోట్లాది మందిని కదిలించిన చైతన్యమూర్తి ఇక సెల వంటూ వీడ్కోలు పలికారు..! సామాన్య రైతు కుటుంబంలో పుట్టి.. దీక్షాదక్షతతో ముందుకు సాగి.. గొప్ప శక్తిగా మారి.. మహా వ్యవస్థగా ఎదిగిన ధీశాలి, ఈనాడు గ్రూప్ సంస్థల ఛైర్మన్ చెరుకూరి రామోజీరావు(88) అస్తమించారు. శనివారం తెల్లవారుజామున హైదరాబాద్ నాన క్రామ్‌గూడలోని స్టార్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఈ నెల 5న తీవ్ర మైన గుండె పోటు రావడంతో రామోజీరావును ఆస్పత్రిలో చేర్చారు. అప్పటికే గుండె పనితీరు విఫలం కావడంతో పాటు రక్తపోటు పడిపో యింది. దీంతో వెంటిలేటర్‌పై ఉంచి ఇంట్రా అరోటిక్ బెలూన్ పంప్ (ఐఏబీపీ) మద్దతుతో

మిగతా 13వ పేజీలో...

రామోజీరావు మరణం బాధాకరం. భారతీయ మీడియాలో ఆయన విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చిన దార్శనికుడు. ఆయన సేవలు సినీ, పత్రికా రంగాల్లో చెరగని ముద్ర వేశాయి. తన అవిరళ కృషితో మీడియా, వినోద ప్రపంచాల్లో నూతన ప్రమాణాలను నెలకొల్పారు. ఆయనతో సంభాషించడం, ఆయన అపారమైన జ్ఞానం నుంచి లబ్ధి పొందేందుకు నాకు అనేక అవకాశాలు లభించడం నా అదృష్టం.


\- ప్రధాని నరేంద్ర మోదీ



తెలుగు రాష్ట్రాలకు ఆరేడు

కేంద్ర మంత్రివర్గంలో పదవులు!?.. టీడీపీకి 3, బీజేపీకి 3, జనసేనకు 1

- రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, బాలశౌరి, పురందేశ్వరి, ఈటల, బండి లేదా డీకే అరుణకు చాన్స్
- కిషన్‌రెడ్డికి పదవిపై సందిగ్ధత.. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియామకం?
- మంత్రివర్గంపై అర్ధరాత్రి దాకా మోదీ కసరత్తు
- మిత్రపక్షాలకు ఇచ్చే పదవులపై స్పష్టత!
- కీలక శాఖలు బీజేపీ వద్దే
- మిత్రపక్షాలకు రైల్వే, విద్య, ఐటీ, జలశక్తి..
- నేటి ఉదయం రాష్ట్రపతి భవన్‌కు జాబితా
- రాత్రి 7.15 గంటలకు మోదీ ప్రమాణం



ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో ఒడిసాలోని పూరీ తీరంలో మోదీ సైకత శిల్పం

న్యూఢిల్లీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రివర్గంలో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు ఆరు నుంచి ఏడు గురికి మంత్రి పదవులు లభించే అవకాశాలు కనిపిస్తు న్నాయి. వీరిలో టీడీపీ నుంచి ముగ్గురు, బీజేపీ నుంచి ముగ్గురు, జనసేన నుంచి ఒకరు ఉండవచ్చని తెలుస్తోంది. మంత్రి పదవులు వరించే అవకాశం ఉన్న వారిలో తెలుగు దేశం నుంచి కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. జనసేన నుంచి బాలశౌరికి, బీజేపీ నుంచి పురందేశ్వరికి

మిగతా 2వ పేజీలో...

మోదీ ప్రమాణానికి అసాధారణ భద్రత!

- ఢిల్లీలో హైఅలర్ట్.. డ్రోన్ సంచారం నిషిద్ధం
- నేటి ప్రమాణస్వీకార వేదిక రాష్ట్రపతి భవన్ పరిసరాలు ఎన్ఎస్‌జీ ఆధీనంలోకి
- 'జీ-20' తర్వాత మళ్లీ ఆ స్థాయి ఉక్కురక్షణ
- ఇప్పటికే ఢిల్లీకి దక్షిణాసియా దేశాధినేతలు

2

ఏమో.. మోదీ సర్కారు 15 రోజుల్లో కూలిపోవచ్చు

- కేంద్రంలో త్వరలో 'ఇండియా' సర్కారు
- ప్రమాణానికి పిలవలే.. వెళ్లేదీ లేదు: మమత

విపక్ష నేతగా రాహుల్!


ఢిల్లీలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో రాహుల్, సోనియా, ఖర్గే

గతంలో 3 సీట్లుంటే.. ఇప్పుడు 8 గెలిచాం
ఢిల్లీలో మీడియాతో రేవంత్

11

- సీడబ్ల్యూసీ సభ్యుల ఏకగ్రీవ తీర్మానం
- లోక్‌సభలో పార్టీకి నేతృత్వం వహించాలని విజ్ఞప్తి
- త్వరలో నిర్ణయం చెబుతానన్న అగ్రనేత
- మీరంతా నా కుటుంబం.. మీకు నేనున్నా: రాహుల్
- భారత్ జోడోయాత్రతో ప్రజలకు దగ్గరయ్యాం
- కాంగ్రెస్ రాష్ట్రాలలో అంచనాలకు భిన్నంగా ఫలితాలు
- కారణాలను కనుగొని చర్యలు తీసుకుంటాం: ఖర్గే
- సీపీపీ నేతగా సోనియాగాంధీ తిరిగి ఎన్నిక
- ప్రజలతీర్పు మోదీకి వ్యతిరేకం: సోనియా

న్యూఢిల్లీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభలో విపక్ష నేతగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ బాధ్యతలు స్వీకరించటానికి రంగం సిద్ధమైంది. పార్టీ లోక్ సభాపక్ష నేత పదవిని చేపట్టాలంటూ కాంగ్రెస్ పార్టీ రాహుల్‌ను కోరింది. త్వరలో దీనిపై నిర్ణయం తీసుకుంటానని ఆయన పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో శనివారం ఢిల్లీలోని ఆశోకా హోటల్‌లో సీడబ్ల్యూసీ విస్తృతస్థాయి సమావేశం జరిగింది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీ, ఇతర సీడబ్ల్యూసీ సభ్యులు ఈ భేటీకి హాజరయ్యారు. ఈ సందర్భంగా సభ్యులందరూ రాహుల్ ఈసారి లోక్‌సభలో పార్టీకి నేతృత్వం

మిగతా 2వ పేజీలో...

'నీట్' మార్కులపై కమిటీ

- నలుగురు సభ్యులతో ఏర్పాటు చేసిన కేంద్ర విద్యా శాఖ
- 1,500 మంది విద్యార్థులకు గ్రేస్ మార్కులపై సమీక్ష
- వారంలో కమిటీ నివేదిక: ఎన్‌టీఏ డీజీ

2

ఆరోగ్యశ్రీలోకి యాంజియోగ్రామ్

- కొత్తగా 65 చికిత్స విధానాలకు ఆమోదం
- 'ఆయుష్మాన్'లోని 98 చికిత్సలకు కూడా..

11

పెద్దపల్లిలో కోకాకోలా పరిశ్రమ

- రూ.700 కోట్లతో ప్లాంట్ ఏర్పాటుకు సిద్ధం

నేడు గ్రూప్-1 ప్రిలిమ్స్

- పరీక్షకు హాజరు కానున్న 4.03 లక్షల మంది
- రాష్ట్ర వ్యాప్తంగా 897 పరీక్ష కేంద్రాలు
- ఉదయం 10.30 నుంచి ఒంటిగంట దాకా
- అరగంట ముందు వస్తేనే అనుమతి: టీజీపీఎస్సీ

12

జనం నేర్పిన గుణపాఠం


కొత్త పలుకు!

ఈ దేశంలో ప్రజలెవ్వరూ రాజకీయ నాయకులను మోసం చెయ్యలేరు. నాయకులే అధికార పీఠాలు ఎక్కాక ప్రజలను వంచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు తమ తీర్పు ద్వారా యావత్ దేశానికే అద్భుత సందేశాన్ని ఇచ్చారు. పాలకుడు ఎలా ఉండకూడదో తేల్చి చెప్పారు. జగన్మోహన్ రెడ్డి ఎంచుకున్న మోడల్ భావి తరాల ప్రయోజనాలకు ఎంత ప్రమాదకరమైనదో తమ తీర్పు ద్వారా ప్రజలు స్పష్టం చేశారు.

వంచనతో రాజకీయాలు చేసే వారికి ఏ దుస్థితి ఎదురవుతుందో స్పష్టం చేశారు. సీఎం అనే వాడు బటన్లు నొక్కడానికే పరిమితం కాకూడదని, రాష్ట్ర భవిష్యత్తు గురించి కూడా ఆలోచించాలన్న సందేశాన్ని ప్రజలు బలంగా పంపారు. కేవలం సంక్షేమం లేదా అభివృద్ధిని మాత్రమే నమ్ముకుంటే ఫలితాలు ఇలాగే ఉంటాయని గతంలో చంద్రబాబు, ఇప్పుడు జగన్ విషయంలో రుజువైంది. ప్రభుత్వం పట్ల ప్రజల్లో సానుకూల భావన ఉన్నప్పుడే ఎవరైనా మళ్లీ మళ్లీ అధికారంలోకి వస్తారు. ఆ విషయం విస్మరించి సోషల్ మీడియా సైన్యాలను ఏర్పాటు చేసుకొనో, ప్రధాన మీడియాను దొడ్లో కట్టేసుకొనో పబ్బం గడుపుకోవాలంటే కుదరదని ప్రధాని మోదీ దగ్గర నుంచి తెలంగాణలో కేసీఆర్, ఏపీలో జగన్ విషయంలో ప్రజలు రుజువు చేశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రజలు కుల మతాల రొచ్చులో కూరుకుపోయారన్న భావన నిన్నటిదాకా ఉండేది. తాజా తీర్పుతో వారు తమ విజ్ఞతను ప్రదర్శించారు. ముఖ్యమంత్రి ఎలా ఉండకూడదో ఈవీఎంల బటన్లు నొక్కి మరీ చెప్పారు. బటన్లు నొక్కడం మినహా జగన్మోహన్ రెడ్డి చేసిన మంచి ఇదీ అని చెప్పలేని పరిస్థితి. ప్రజలను కులాల వారీగా విడదీయాలని అనుకున్నారు. ఈ పన్నాగం ఫలించలేదు. పేదలకూ పెత్తందార్లకూ మధ్య పోరాటమంటూ రెచ్చగొట్టిన ప్రయత్నాలు కూడా వికటించాయి. జగన్‌కు వ్యతిరేకంగా మొత్తం 61 శాతం ఓట్లు పడ్డాయి.

ప్రజాస్వామ్య చరిత్రలో అత్యంత ప్రమాదకర ఆటకు జగన్ రెడ్డి తెరలేపారు. సంక్షేమం మాటున ప్రజలకు డబ్బు పంచి, ఆ మాటున దోపిడీ, దౌర్జన్యాలకు పాల్పడినా అధికారానికి ఢోకా ఉండదని భావించారు. అందుకే 2019లో అధికారంలోకి రావడానికి ముందు కూడా... ఒక్కసారి అధికారంలోకి వస్తే 30 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉంటానని చెప్పుకొనేవారు. జగన్ అనుసరించిన ఈ మోడల్ ఎంత ప్రమాదకరమైనదో ప్రజలు ఐదేళ్లకే గుర్తించారు.

4

ఈ ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి మళ్లీ అధికారంలోకి వచ్చి ఉంటే ప్రతీ రాష్ట్రంలోనూ ఒక జగన్ తయారయ్యేవారు. రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తూ అంతిమంగా దేశాన్ని దివాలా తీయించేవారు. ఆఫ్రికాలోని కొన్ని దేశాల్లోని అరాచకత్వం మన దేశంలో కూడా ఏర్పడేది.

వైసీపీకి ఇప్పుడు 11 మంది ఎమ్మెల్యేలే ఉన్నందున జగన్మోహన్ రెడ్డికి అధికారికంగా ప్రతిపక్ష నాయకుడి హోదా కూడా దక్కదు.

ఇప్పుడు ప్రతిపక్షమే లేకుండా పోయిందని కూటమి నేతలుగానీ, ఎమ్మెల్యేలు గానీ, కాబోయే మంత్రులుగానీ విర్రవీగితే ఐదేళ్ల తర్వాత కర్రు కాల్చి వాత పెట్టడానికి ప్రజలు సిద్ధంగా ఉంటారని గుర్తుంచుకోవాలి.

బాధ్యత గల మీడియాగా ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ సంస్థలు ప్రభుత్వ పోకడలపై కన్నేసి ఉంచుతాయి. జగన్ ప్రభుత్వ దుశ్చర్యలకు వ్యతిరేకంగా కష్టనష్టాలకు ఓర్చి అలుపెరుగని పోరాటం చేసినట్టుగానే.. కూటమి ప్రభుత్వంపై అక్షరాయుధాలు ఎక్కుపెట్టడానికి మేం వెనుకాడబోము.

ఈ కాలమ్ రాయడానికి ఉపక్రమించినప్పుడే రామోజీరావు ఇక లేరన్న వార్త వెలువడింది. తెలుగు జర్నలిజంలో చరిత్ర సృష్టించిన ఆయన మరణం పత్రికా రంగానికే కాదు, సమాజానికి కూడా లోటు. అధికార హుంకరింపులకు వెరవకుండా రామోజీరావు అక్షర యుద్ధం సాగించారు. రామోజీరావు కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలుపుతూ, 'ఆంధ్రజ్యోతి' సంస్థల తరఫున ఆయనకు అక్షర నమస్సుమాంజలులు సమర్పిస్తున్నాను!

విపక్ష నేతగా రాహుల్!

(మొదటి పేజీ తరువాయి)

వహించాలని, తద్వారా విపక్ష నేతగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేశారు. దీనిపై రాహుల్ సానుకూల సంకేతాలు ఇస్తూ.. త్వరలోనే తన నిర్ణయం చెబుతానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'మీరంతా నా కుటుంబం. గత పదేళ్లలో పార్టీని వీడిపోయే వాళ్లు పోయారు. మీకు నేనున్నా' అని కాంగ్రెస్ నేతలకు భరోసానిచ్చారు. పోరాడే ధైర్యం ఉన్న వాళ్లే పార్టీలో ఉన్నారని రాహుల్ వ్యాఖ్యానించారు.

జోడోయాత్రతో పార్టీ ప్రజలకు దగ్గరైంది

రెండు గంటల పాటు జరిగిన సీడబ్ల్యూసీ సమావేశాన్ని ఉద్దేశించి ఖర్గే ప్రారంభోపన్యాసం చేస్తూ.. ఎన్నికల్లో దేశప్రజలు కాంగ్రెస్‌ను విశ్వసించారని తెలిపారు. రాహుల్ జరిపిన భారత్ జోడో యాత్ర, భారత్ జోడో న్యాయ్ యాత్రతో దేశప్రజలకు కాంగ్రెస్ దగ్గరైందన్నారు. రాజ్యాంగ పరిరక్షణ, ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం, సామాజిక న్యాయం తదితర అంశాలను ఈ ఎన్నికలలో ప్రజల సమస్యలుగా రాహుల్ మార్చారని పేర్కొన్నారు. రాహుల్ యాత్రలు జరిగిన చోట్ల కాంగ్రెస్‌కు ఎన్నికలలో మంచి ఫలితాలు వచ్చాయని ఖర్గే తెలిపారు. గత పదేళ్లలో బీజేపీ జరిపిన విభజన, విద్వేషపూరిత రాజకీయాలను ప్రజలు ఎన్నికలలో తిరస్కరించారని, నియంతృత్వ, రాజ్యాంగ వ్యతిరేక శక్తులకు బుద్ధి చెప్పారన్నారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించుకునేందుకు కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి అపారమైన మద్దతు లభించిందని తెలిపారు. కొన్ని రాష్ట్రాలలో కాంగ్రెస్ మంచి పనితీరు కనబరిచినప్పటికీ మరికొన్ని రాష్ట్రాలలో అంచనాలకు భిన్నంగా ఫలితాలు వచ్చాయన్నారు. అసెంబ్లీ ఎన్నికలలో మంచి ఫలితాలు సాధించి లోక్‌సభ ఎన్నికలలో ఆ స్థాయి ప్రదర్శనను పునరావృతం చేయలేకపోయామని హిమచల్‌ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో కాంగ్రెస్‌కు లభించిన స్థానాలను ఉద్దేశించి ఖర్గే వ్యాఖ్యానించారు. ఫలితాలు ఆశించిన స్థాయిలో రాని రాష్ట్రాల్లో పార్టీ పనితీరుపై కమిటీలను ఏర్పాటు చేసి సమీక్షిస్తామన్నారు. ఎన్నికల్లో ఇండియా కూటమి పక్షాలు ఐక్యంగా, సమర్థంగా పని చేశాయని.. ఇదే ఒరవడిని ఇకపైనా పార్లమెంటులోనూ, పార్లమెంటు బయటా కొనసాగించాలని పేర్కొన్నారు. కాగా, రాహుల్‌గాంధీని లోక్‌సభలో ప్రతిపక్షనేతగా బాధ్యతలు స్వీకరించాలని సీడబ్ల్యూసీ సభ్యులు ఏకగ్రీవంగా కోరారు. కాంగ్రెస్ ఎజెండాను, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలలోకి బలంగా తీసుకెళ్లేందుకు ప్రతిపక్షనేతగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. ఖర్గే కూడా సీడబ్ల్యూసీ సభ్యుల విజ్ఞప్తికి మద్దతు పలికారు. స్పందించిన రాహుల్ త్వరలోనే తన నిర్ణయం చెబుతానని అన్నారు.

మళ్లీ అగ్రస్థానం చేరుకోవాలి

సీడబ్ల్యూసీ రెండు తీర్మానాలు చేసింది. ఒక తీర్మానంలో ఎన్నికల ఫలితాలు, పార్టీ పనితీరును ప్రస్తావించింది. 'మోదీ పాలన 2014లో మొదలైనప్పటి నుంచీ దేశంలో ప్రజాస్వామ్యానికి, ప్రజాస్వామిక సంస్థలకు దుర్దశ ప్రారంభమైంది. దీనికి వ్యతిరేకంగా ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారు. మోదీ గ్యారెంటీల పేరుతో ఎన్నికలకు వెళ్లిన ప్రధాని అబద్ధాలు, విద్వేషం, విభజనపూరిత ప్రచారం నిర్వహించారు. ప్రజలు దీనిని తిరస్కరిస్తూ తీర్పు చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, సామాజిక, ఆర్థిక న్యాయాన్ని రక్షించుకోవటానికి వీలుగా తీర్పు ఇచ్చారు. ఇది మోదీకి రాజకీయంగానేగాక నైతికంగా, వ్యక్తిగతంగా కూడా ఓటమే. ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రజల పక్షాన అద్భుతమైన అంశాలను ముందుకు తీసుకొచ్చి ప్రచారం జరిపింది. ఎన్నికల్లో మనం పునరుజ్జీవం పొందాం. కానీ దేశ రాజకీయాల్లో ఒకప్పుడు మనకున్న అగ్రస్థానానికి తిరిగి చేరేందుకు చాలా దూరం వెళ్లాల్సి ఉంది. ప్రజలు కాంగ్రెస్‌కు మరో అవకాశం ఇచ్చారు. పార్టీని నిర్మించుకోవాల్సిన బాధ్యత ఇప్పుడు మనపై ఉంది. మనం చేయాలి. చేస్తాం' అని తీర్మానంలో పేర్కొన్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా బాధ్యతలు చేపట్టాలని రాహుల్‌ను కోరుతూ మరో తీర్మానం చేశారు. కాగా, ఈ భేటీకి ఏపీ, తెలంగాణ నుంచి పలువురు కాంగ్రెస్ నేతలు హాజరయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు దామోదర రాజనర్సింహ, వంశీచంద్‌రెడ్డి, పల్లంరాజు, టి.సుబ్బిరామిరెడ్డి, రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు తదితరులు హాజరయ్యారు. మరోవైపు, ఏపీలో జరుగుతున్న దాడుల పట్ల కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు స్పందిస్తూ.. ఈ రకమైన దాడులను వైసీపీయే మొదలుపెట్టిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. దేశవ్యాప్తంగా బీజేపీ కూడా ఇదే తరహా దాడులకు పాల్పడుతోందన్నారు. శాంతిభద్రతలను పోలీసులు కాపాడాలని విజ్ఞప్తి చేశారు.


సీడబ్ల్యూసీ సమావేశంలో రాహుల్, ఖర్గే, సోనియా, ప్రియాంక, కేసీ వేణుగోపాల్

రాయ్‌బరేలీకే రాహుల్ ఓటు

న్యూఢిల్లీ, జూన్ 8: కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ రాయ్‌బరేలీ స్థానాన్ని అట్టిపెట్టుకునే అవకాశాలు ఉన్నట్టు కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. ఆయన ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీతో పాటు, కేరళలోని వయనాడ్ నుంచి కూడా గెలుపొందారు. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం ఒక సభ్యుడు రెండు స్థానాల్లో పోటీ చేయవచ్చు. కానీ ఒక స్థానానికి మాత్రమే ప్రాతినిధ్యం వహించాల్సి ఉంటుంది. ఈ అంశంపై ఫలితాలు వెలువడిన 14 రోజుల్లోగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. లేకుంటే రెండూ రద్దవుతాయి. ఈ నేపథ్యంలో ఆయన ఏ నియోజకవర్గాన్ని అట్టిపెట్టుకోవాలి, దేన్ని విడిచిపెట్టాలన్నదానిపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో చర్చ జరిగింది. వయనాడ్ నుంచే ప్రాతినిధ్యం వహించాలని కేరళ ఎంపీలు కోరగా, రాయ్‌బరేలీని నిలుపుకోవాలని యూపీ నేతలు కోరారు. మూడు సార్లు మినహాయిస్తే రాయ్‌బరేలీ నుంచి గాంధీ కుటుంబ సభ్యులే ప్రాతినిధ్యం వహిస్తున్నారని యూపీ నేతలు గుర్తుచేశారు. 1952 నుంచి ఆ కుటుంబానికి చెందిన వారే ఎంపీలుగా ఉన్నారని, అది తరతరాలుగా వారికి కంచుకోటలా ఉందని తెలిపారు. రాహుల్.. రాయ్‌బరేలీలో ఉంటేనే యూపీలో కాంగ్రెస్ బలపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో ఆయన రాయ్‌బరేలీనే నిలుపుకొని అవకాశం ఉందని భావిస్తున్నారు.

కాంగ్రెస్ సీపీపీ నేతగా సోనియాగాంధీ

కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సీపీపీ) చైర్‌పర్సన్‌గా సోనియాగాంధీ తిరిగి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో కొత్తగా ఎన్నికైన కాంగ్రెస్ ఎంపీలతో సమావేశం జరిగింది. సీపీపీ నేతగా సోనియా పేరును ఖర్గే ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనను గౌరవ్ గొగోయ్, కె.సుధాకరన్, తారిఖ్ అన్వర్ బలపరిచారు. ఈ సందర్భంగా సోనియా మాట్లాడుతూ, ఎన్నికల్లో మోదీ ప్రజాతీర్పును కోల్పోయారని, అయినప్పటికీ నైతిక బాధ్యత తీసుకోకుండా తిరిగి ప్రధాని పదవి చేపట్టటానికి సిద్ధమయ్యారని విమర్శించారు. మోదీ తన పనితీరును మార్చుకుంటారని ఆశించలేమని, కాబట్టే, విపక్షంగా ఎప్పటికప్పుడు ఆయనను, ఆయన ఎన్డీఏ ప్రభుత్వ పనితీరును ప్రజలకు జవాబుదారీగా ఉండేట్లు చూసే బాధ్యత మనదేనన్నారు.

లోకం తీరు



ప్రధాని పదవి ఇస్తామని నితీశ్‌కు 'ఇండియా' ఆఫర్

» జేడీయూ నేత త్యాగి



న్యూఢిల్లీ, జూన్ 8: బిహార్ సీఎం, జేడీయూ అధినేత నితీశ్‌కుమార్‌కు ప్రధాని పదవి ఇస్తామంటూ ఇండియా కూటమి ఆఫర్ చేసిందని ఆ పార్టీ నేత కేసీ త్యాగి సంచలన వ్యాఖ్యలు చేశారు. అయితే.. ఎలాంటి ఆఫర్లనూ తాము స్వీకరించేది లేదని చెప్పారు. ఓ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో త్యాగి ఈ వ్యాఖ్యలు చేశారు. "ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత ఇండియా కూటమి నితీశ్‌కు ప్రధాని పదవిని ఆఫర్ చేసింది. కానీ, వచ్చే ఐదేళ్లు ఎన్డీయేతోనే కలిసి పనిచేయాలని మేం నిర్ణయించుకొన్నాం" అని త్యాగి అన్నారు. తమను ఆఫర్లకు లొంగే నాయకులుగా కాంగ్రెస్ సహా మిత్ర పక్షాలు భావించడం బాధ కలిగించిందన్నారు. ఇండియా కూటమి కన్వీనర్ పోస్టుకు నితీశ్‌కు అర్హత లేదని భావించిన వారు ఇప్పుడు ప్రధాని పదవికి పనికి వస్తారని ఎలా భావిస్తున్నారని త్యాగి ప్రశ్నించారు. బిహార్‌కు ప్రత్యేక హోదా కావాలనేదే తమ ప్రధాన డిమాండ్ అని తెలిపారు. హోదా ఇవ్వకపోతే బిహార్ అభివృద్ధి అసాధ్యమని చెప్పారు. ఇదిలా వుంటే, ఎన్డీయే కూటమిలో భాగస్వామ్య పక్షంగా ఉన్న జేడీయూకు కేంద్రంలో రెండు పదవులు దక్కనున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే ఆయా పదవులకు సీనియర్ నాయకుడు లలన్ సింగ్, రామ్‌నాథ్ ఠాకూర్ పేర్లను నితీశ్ కుమార్ సూచించినట్టు సమాచారం. వీరిలో రామ్‌నాథ్ ఠాకూర్.. భారత రత్న కర్పూరీ ఠాకూర్ కుమారుడు కావడం గమనార్హం. కాగా, కేసీ త్యాగి చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ ఖండించారు. "కూటమి విషయం పక్కన పెడితే.. కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి సమాచారం లేదు" అని అన్నారు.

'నీట్' మార్కులపై కమిటీ

» నలుగురు సభ్యులతో ఏర్పాటు చేసిన కేంద్ర విద్యాశాఖ

» 1,500 మంది విద్యార్థులకు గ్రేస్ మార్కులపై సమీక్ష

న్యూఢిల్లీ, జూన్ 8: నీట్-2024 పరీక్షలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై కేంద్రం స్పందించింది. 1,500 మందికి పైగా అభ్యర్థులకు ఇచ్చిన గ్రేస్ మార్కులను సమీక్షించడానికి నలుగురు సభ్యులతో కూడిన ప్యానెల్‌ను కేంద్ర విద్యాశాఖ ఏర్పాటు చేసిందని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) శనివారం ప్రకటించింది. ఎన్‌సీఈఆర్‌టీ పాఠ్యపుస్తకాల్లో చేసిన మార్పులు, పరీక్ష కేంద్రాల్లో సమయం వృథా అయిన వారికి గ్రేస్ మార్కులు కలపడం వంటివి కొందరు విద్యార్థులు ఎక్కువ మార్కులు సాధించడానికి కారణమయ్యాయని తెలిపింది. '1,500 మంది అభ్యర్థుల ఫలితాలను సమీక్షించేందుకు అత్యున్నత స్థాయి కమిటీ ఏర్పాటైంది. యూపీఎస్సీ మాజీ చైర్మన్ నేతృత్వంలోని నలుగురు సభ్యుల కమిటీ వారం రోజుల్లో సిఫారసులతో కూడిన నివేదికను సమర్పిస్తుంది. దాని ప్రకారం ఈ అభ్యర్థుల ఫలితాలను సవరించే అవకాశం ఉంది' అని ఎన్‌టీఏ డైరెక్టర్ జనరల్ సుబోధ్ కుమార్ సింగ్ తెలిపారు. గ్రేస్ మార్కులతో పరీక్ష అర్హత ప్రమాణాలపై ఏ ప్రభావం ఉండదని, అలాగే ఈ అభ్యర్థుల ఫలితాలు సమీక్షించడం అడ్మిషన్ల ప్రక్రియపై ప్రభావం చూపబోదని స్పష్టం చేశారు. పరీక్షల నిర్వహణలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలను ఆయన ఖండించారు. కమిటీ సిఫారసులను అనుసరించి కొందరు విద్యార్థులకు పరీక్ష మళ్లీ నిర్వహించే అంశంపై నిర్ణయం తీసుకుంటామన్నారు.

ప్రజ్వల్ గర్ల్‌ఫ్రెండ్‌కు సిట్ నోటీసులు

బెంగళూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): లైంగిక దాడుల కేసు నిందితుడు, జేడీఎస్ తాజా మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణ గర్ల్‌ఫ్రెండ్‌కు సిట్ అధికారులు శనివారం నోటీసులు జారీ చేశారు. ఏప్రిల్ 26న రాత్రి బెంగళూరు నుంచి జర్మనీకి వెళ్లిన ప్రజ్వల్, 34 రోజుల తర్వాత వెనుతిరిగి వచ్చాడు. జర్మనీలో ఉన్న సమయంలో ప్రజ్వల్‌కు గర్ల్‌ఫ్రెండ్ సాయం చేసినట్లు సిట్ గుర్తించింది. దీంతో విచారణకు హాజరు కావాలని నోటీసులు జారీ చేసింది. కాగా, సిట్ అధికారులు ప్రజ్వల్, అతని తల్లి భవానీ రేవణ్ణను శనివారం పక్కపక్క గదుల్లోనే విచారించారు. వారం రోజులపాటు భవాని రేవణ్ణపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని హైకోర్టు శుక్రవారం సూచించింది. ఈ నేపథ్యంలో భవాని విచారణకు వెళ్లారు. సుమారు 5 గంటలపాటు సిట్ కార్యాలయంలో అధికారులు ఆమెను విచారించారు.

రేప్‌లు, హత్యలు చేసినా మీకు ఫర్వాలేదా?

» తనను కొట్టిన కానిస్టేబుల్‌ను సమర్థించిన వారిపై కంగన

న్యూఢిల్లీ, జూన్ 8: చండీగఢ్ విమానాశ్రయంలో తనపై జరిగిన దాడి ఘటనను సమర్థించిన వారిపై బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ విరుచుకుపడ్డారు. తనను చెంప దెబ్బ కొట్టిన సీఐఎస్ఎఫ్ మహిళా కానిస్టేబుల్‌ను సమర్థించిన వారిని ఉద్దేశిస్తూ.. 'అత్యాచారాలు, హత్యలు జరిగినా మీకు ఫర్వాలేదా?' అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. శనివారం 'ఎక్స్'లో ఆమె ఈ మేరకు పోస్టు చేశారు. 'ప్రతి రేపిస్టు, హంతకుడు లేదా దొంగ నేరం చేయడానికి బలమైన భావోద్వేగ, శారీరక, మానసిక లేదా ఆర్థిక పరమైన కారణం ఉంటుంది. కారణం లేకుండా ఏ నేరం జరగదు. చట్టాలను ఉల్లంఘించి నేరాలకు పాల్పడే నేరస్తుల భావోద్వేగాలకు మీరు విలువ ఇవ్వడం అత్యాచారాలు, హత్యలను సమ్మతించడం కిందకే వస్తుంది" అని కంగన తన విమర్శలకు సూచించారు.

హమాస్ నుంచి నలుగురు బందీలకు విముక్తి

టెల్ అవీవ్, జూన్ 8: బందీలుగా చిక్కి ఎనిమిది నెలలుగా హమాస్ చెరలో మగ్గుతున్న.. తమ దేశానికి చెందిన నలుగురు పౌరులను ఇజ్రాయెల్ రక్షించింది. శనివారం సెంట్రల్ గాజాలోని హమాస్ శిబిరంపై ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించి నోవా అర్గామని (25), అల్మోగ్ మెయిర్ జాన్ (21), ఆంద్రీ కోజ్‌లోవ్ (27), ష్లోమీ జీవ్ (40) అనే నలుగురు బందీలను విడిపించింది. హమాస్ చెర నుంచి బయటపడ్డ ఈ నలుగురు క్షేమంగా, ఆరోగ్యంగా ఉన్నారని అధికారులు తెలిపారు. విడుదలైన వారు తిరిగి తమ వారిని కలుసుకున్నందుకు ఆనందం వ్యక్తం చేశారు.

డెన్మార్క్ ప్రధానిపై దాడి.. ఒకరి అరెస్టు

న్యూఢిల్లీ, జూన్ 8: డెన్మార్క్ ప్రధాని మెటె ఫ్రెడ్రిక్సెన్‌పై దాడి జరిగింది. శుక్రవారం సాయంత్రం డెన్మార్క్ రాజధాని కోపెన్‌హాగన్‌లోని కోల్ట్‌రవెట్ ప్రాంతంలో ఒక వ్యక్తి ప్రధానిపై దాడి చేశారని, ఆ ఘటనతో ఆమె షాక్‌కు గురయ్యారని ప్రధాన మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. దాడిలో ప్రధానికి ఎలాంటి గాయాలుకాలేదని నిందితుడ్ని అరెస్ట్ చేశామని, ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నామని అధికారులు చెప్పారు. అయితే మెటె ఆరోగ్య పరిస్థితి గురించి ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు. కాగా, అత్యంత పిన్న వయస్సు డెన్మార్క్ ప్రధానిగా 2019లో ఫ్రెడ్రిక్సెన్ బాధ్యతలు స్వీకరించారు.

డీప్ ఫేక్ యుగంలో ఫొటోలు సాక్ష్యాలు కావు

» వివాహేతర సంబంధం కేసులో ఢిల్లీ హైకోర్టు వ్యాఖ్య

న్యూఢిల్లీ, జూన్ 8: డీప్ ఫేక్ చిత్రాలు చలామణి అవుతున్న ప్రస్తుత కాలంలో ఫొటోలను సాక్ష్యాలుగా పరిగణించలేమని ఢిల్లీ హైకోర్టు అభిప్రాయపడింది. ఆ ఫొటోలు నిజమైనవని నిరూపించేందుకు ఇతరత్రా ఆధారాలు ఉండాలని తెలిపింది. తన భార్యకు వివాహేతర సంబంధం ఉందంటూ ఓ భర్త సాక్ష్యాలుగా సమర్పించిన ఫొటోలపై ఈ వ్యాఖ్య చేసింది. ఓ జంటకు విడాకులు మంజూరు చేసిన ఫ్యామిలీ కోర్టు..భార్యకు, అయిదేళ్ల కుమార్తెకు కలిపి నెలకు రూ.75వేల వంతున మనోవర్తిగా చెల్లించాలని భర్తను ఆదేశించింది. దీన్ని సవాలు చేస్తూ ఆయన హైకోర్టులో అప్పీలు చేయగా జస్టిస్ రాజీవ్ షక్దర్, జస్టిస్ అమిత్ బన్సల్‌ల ధర్మాసనం విచారణ జరిపింది. తన భార్యకు వివాహేతర సంబంధం ఉందని, అందువల్ల మనోవర్తి ఇవ్వాల్సిన పనిలేదంటూ కొన్ని ఫొటోలను ఆయన కోర్టుకు సమర్పించాడు. ఫొటోలు స్పష్టంగా లేవని, డీప్ ఫేక్ చిత్రాల బెడద ఉన్నందున వాటిని సాక్ష్యాలుగా గుర్తించలేమని ధర్మాసనం తెలిపింది.

నేవీ మహిళా పైలట్‌కు తొలిసారిగా 'గోల్డెన్ వింగ్స్'

న్యూఢిల్లీ, జూన్ 8: భారత నౌకాదళంలో పనిచేస్తున్న మహిళా పైలట్‌కు తొలిసారిగా గోల్డెన్ వింగ్స్ పతకం లభించింది. హెలికాప్టర్ పైలట్‌గా శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన సబ్ లెఫ్టినెంట్ అనామిక బి రాజీవ్‌కు ఈ గౌరవం దక్కింది. తమిళనాడులోని అరక్కోణంలో ఉన్న నేవల్ ఎయిర్ బేస్ స్టేషన్‌లో శనివారం జరిగిన పాసింగ్ అవుట్ పెరేడ్‌లో ఈస్టర్న్ నావల్ కమాండ్ ఫ్లాగ్ ఆఫీసర్, కమాండింగ్ ఇన్ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్ దీన్ని అందజేశారు. శిక్షణ పూర్తి చేస్తున్న 21 మందికి ఈ అవార్డులు దక్కాయి. ఆమెతో పాటు జమ్‌యాంగ్ త్సెవాంగ్ మరో రికార్డు సృష్టించారు. ఆయన లద్దాఖ్ నుంచి ఎంపికయిన తొలి నేవీ కమిషన్డ్ ఆఫీసర్ కావడం విశేషం. 22 వారాల శిక్షణలో ప్రతిభ చూపించిన వారికి ఈ పతకాలు బహూకరించారు.

సీట్లెందుకు తగ్గాయి.. లోపమెక్కడ?

» పార్టీ రాష్ట్రాల అధ్యక్షులతో బీజేపీ అధ్యక్షుడు నడ్డా భేటీ

» తెలుగు రాష్ట్రాల్లో ఫలితాలపై హర్షం

న్యూఢిల్లీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో 370 స్థానాలకు పైగా గెల్చుకుంటామని చెప్పిన బీజేపీకి ఆశించిన ఫలితం దక్కలేదు. దీంతో ఎన్డీఏ కూటమిలోని భాగస్వామ్య పక్షాలపై ఆధారపడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో, ఏయే రాష్ట్రాల్లో నష్టం ఏ మేరకు వాటిల్లింది? కారణాలేమిటి? అనే దానిపై ఆ పార్టీలో అంతర్మథనం మొదలైంది. శనివారం ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ అన్ని రాష్ట్రాల అధ్యక్షులతో జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సమావేశం నిర్వహించారు. యూపీలో సీట్లు తగ్గడంపై ఈ భేటీలో ప్రత్యేకంగా చర్చించినట్లు తెలిసింది. దక్షిణాదిలో ఇంకొన్ని సీట్లు వస్తాయని భావించామని, కానీ, ఆశించిన మేర రాలేదని అభిప్రాయపడ్డారు. తెలుగు రాష్ట్రాల్లో ఫలితాలపై నడ్డా సంతోషం వ్యక్తం చేసినట్లు బీజేపీ వర్గాలు తెలిపాయి. తెలంగాణలో పార్టీకి పోలైన ఓట్ల శాతం పెరగడం, గతంలో కంటే నాలుగు స్థానాలు ఎక్కువగా రావడం శుభ పరిణామమని, అయితే.. 10 స్థానాలు వస్తాయని ఆశించామని, కానీ 8 స్థానాలే వచ్చాయని నడ్డా వ్యాఖ్యానించినట్టు సమాచారం. తెలంగాణలో పార్టీ బలోపేతంపై మరింత శ్రద్ధ పెట్టాలని రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి సూచించినట్టు తెలిసింది. ఏపీలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి రావడం, బీజేపీ తొలిసారిగా 8 శాసనసభ, 3 లోక్‌సభ సీట్లలో విజయం సాధించడంపై నడ్డా హర్షం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

మోదీ ప్రమాణానికి అసాధారణ భద్రత!

ఢిల్లీలో హైఅలర్ట్.. డ్రోన్ సంచారం నిషిద్ధం.. నేటి ప్రమాణస్వీకార వేదిక రాష్ట్రపతి భవన్

న్యూఢిల్లీ, జూన్ 8 : మోదీ 3.0 సర్కారు కొలువు తీరే వేళయింది. మూడోసారి ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ ఆదివారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమం కోసం దేశ రాజధాని అసాధారణ రీతిలో అప్రమత్తమైంది. ప్రమాణ స్వీకార వేదిక అయిన రాష్ట్రపతి భవన్ పరిసరాల్లో ప్రైవేటు డ్రోన్ల సంచారాన్ని పూర్తిగా నిషేధించారు. ఢిల్లీ ఇప్పటికే భద్రతా వలయంలోకి వెళ్లిపోయింది. నేషనల్ సెక్యూరిటీ గార్డులు, షార్ప్ షూటర్ బృందాలు రంగంలోకి దిగాయి. ప్రమాణ స్వీకార మహోత్సవానికి దక్షిణాసియా దేశాల అధినేతలు వస్తుండటం, అధికార ఎన్డీయే పార్టీల అధినాయకులందరికీ ఆహ్వానాలు వెళ్లడంతో, ఢిల్లీలో హై అలర్ట్ ప్రకటించారు. ప్రపంచ దేశాల అధినేతలు గత ఏడాది పాల్గొన్న జీ-20 సదస్సుకు కల్పించిన భద్రతను తలపించేలా ఏర్పాట్లు ఉన్నాయని ఢిల్లీ పోలీసులు చెబుతున్నారు. ప్రపంచాధినేతలు ఢిల్లీలో బస చేసిన హోటళ్ల దగ్గర, వారు పాల్గొనాల్సిన సదస్సు ప్రాంగణం, పరిసర ప్రాంతాలను అప్పట్లో అణువణువున ప్రత్యేక భద్రతా బృందాలు జల్లెడ పట్టాయి. చిన్న పొరపాటుకూ తావు ఇవ్వకుండా డేగకళ్ల పహారా కొనసాగించాయి. మళ్లీ.. ఇప్పుడు అదే వాతావరణం దేశ రాజధానిలో కనిపిస్తోంది. ఢిల్లీ హై ఓల్టేజీ స్థితికి చేరుకుంది. ప్రమాణ స్వీకార వేడుకలో పాల్గొనే ప్రముఖులు బస చేసిన హోటళ్లు, రిసార్టులు, ప్రభుత్వ అతిథి గృహాల వద్ద పెద్దఎత్తున భద్రతా సిబ్బందిని మోహరించారు. మూడు అంచెల భద్రతా వలయాన్ని రాష్ట్రపతి భవన్ వద్ద, పరిసరాల్లో నిర్మించారు. మొదటి అంచెలో ఐదు కంపెనీల పారామిలిటరీ బలగాలు, రెండో అంచెలో నేషనల్ సెక్యూరిటీ గార్డులు, డ్రోన్లు, ఆ తర్వాతి అంచెలో స్నైపరు బృందాలు (స్వాట్- స్పెషల్ వెపన్స్ అండ్ ట్యాక్టిక్స్) ఉన్నాయి. రాష్ట్రపతి భవన్ బయటి పరిసరాలు పూర్తిగా ఎన్ఎస్‌జీ, స్వాట్ బృందాల అదుపులో ఉన్నాయి. ప్రముఖులు తాము బస చేసిన హోటళ్ల నుంచి ఏ మార్గంలో రాష్ట్రపతిభవన్‌కు వెళ్లాలి.. తిరిగి వారి బసకు ఎలా చేరుకోవాలనేదానిపై నిర్దిష్ట రూట్‌మ్యాప్‌ను తయారుచేశారు. ఈ రూట్లను స్నైపర్లు, సాయుధ బలగాలు తమ అదుపులోకి తీసుకున్నాయి. దాదాపు 2500 మంది పోలీసులను ఈ పనులకు నియమించారు. ఢిల్లీలోని వ్యూహాత్మక ప్రాంతాల్లో డ్రోన్ల పహారా కొనసాగుతోంది. అతిథులుగా ఆహ్వానించిన ఇరుగుపొరుగు (పాకిస్థాన్‌ను మినహాయించి) దేశాల అధినేతలు ఇప్పటికే ఢిల్లీకి చేరుకున్నారు. లీలా, తాజ్, ఐటీసీ మౌర్య, క్లారిడ్జెస్, ఒబెరాయ్ తదితర ఫైవ్ స్టార్ హోటళ్లను వారికోసం బుక్ చేశారు.

హాజరుకానున్న పలు దేశాల అధినేతలు

న్యూఢిల్లీ, జూన్ 8 : వరుసగా మూడోసారి దేశ ప్రధానిగా మోదీ ఆదివారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. 73 ఏళ్ల మోదీ భారత తొలి ప్రధాని జవహర్ లాల్ నెహ్రూతో సమానంగా మూడోసారి ప్రధాని కానుండడం విశేషం. నెహ్రూ వరుసగా 1952, 1957, 1962 సాధారణ ఎన్నికల్లో గెలిచి ప్రధాని అయ్యారు. భారత పొరుగు దేశాలు, హిందూ మహా సముద్ర ప్రాంత దేశాల అధినేతలు మోదీ ప్రమాణస్వీకార కార్యక్రమానికి హాజరుకానున్నారు. రాష్ట్రపతి భవన్‌లో ఆదివారం సాయంత్రం 7.15 గంటలకు ఈ కార్యక్రమం జరగనుంది. శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే, మాల్దీవుల అధ్యక్షుడు మహమద్ ముయిజ్జు, సీషెల్స్ వైస్‌ప్రెసిడెంట్ అహ్మద్ అఫిఫ్, బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా, మారిషస్ ప్రధాని ప్రవింద్ కుమార్ జగ్‌నాథ్, నేపాల్ ప్రధాని పుష్ప కమల్ దహల్ ప్రచండ, భూటాన్ ప్రధాని షెరింగ్ తబ్గే హాజరుకానున్నారు. భారత్ అనుసరిస్తున్న పొరుగు దేశాలకు తొలి ప్రాధాన్యం, సాగర్ విజన్‌లో భాగంగానే వీరిని ఆహ్వానించినట్లు విదేశాంగ శాఖ తెలిపింది. కాగా 2014లో ప్రధానిగా నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సార్క్ దేశాల అధినేతలు హాజరయ్యారు. 2019లో రెండోసారి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి బిమ్స్‌టెక్(బే ఆఫ్ బెంగాల్ ఇనిషియేటివ్ ఫర్ మల్టి సెక్టొరల్ టెక్నికల్ అండ్ ఎకనమిక్ కోపరేషన్) దేశాల అధినేతలు హాజరయ్యారు. తాజా ప్రమాణ స్వీకార కార్యక్రమానికి దేశంలో పలువురికి ఆహ్వానం అందింది. మహారాష్ట్రలో వందేభారత్ రైలు లోకో పైలెట్ సురేఖా యాదవ్‌తోపాటు మరో 9 మంది లోకో పైలెట్‌లకు ఆహ్వానం అందడం విశేషం. కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని అధికారులు వెల్లడించారు. రెడ్ కార్పెట్‌తో ఈ కార్యక్రమానికి చేసిన ఏర్పాట్ల చిత్రాలను రాష్ట్రపతి భవన్ విడుదల చేసింది.


మోదీ ప్రమాణ స్వీకారోత్సవం కోసం శనివారం ఢిల్లీకి చేరుకొన్న బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనా

కొన్ని ప్రభుత్వాలు ఒక్క రోజే!

» ఏమో.. మోదీ సర్కారు 15 రోజుల్లో కూలిపోవచ్చు

» కేంద్రంలో త్వరలో 'ఇండియా' కూటమి ప్రభుత్వం: మమత



కోల్‌కతా, జూన్ 8: ఎన్నికల్లో కనీస మెజారిటీ సాధించడంలో విఫలమై.. మిత్రపక్షాల మద్దతుతో ఎన్డీఏ అధికారం చేపడుతున్న వేళ పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేశారు. కొన్ని ప్రభుత్వాలు ఒక్కరోజే ఉంటాయని.. మోదీ సర్కారు పదిహేను రోజుల్లో కూలిపోవచ్చేమో? అని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం అప్రజాస్వామికంగా, అక్రమంగా అధికారంలోకి వచ్చిందని, వారికి శుభాకాంక్షలు చెప్పలేమని వ్యాఖ్యానించారు. కేంద్రంలో త్వరలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని అన్నారు. ఇప్పుడు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేమని అంటే ఎప్పటికీ చేయలేమని అర్థం కాదు కదా? అని తెలిపారు. శనివారం కొత్తగా ఎన్నికైన తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీల సమావేశంలో మమతా మాట్లాడారు. "400 సీట్లు గెలుస్తామని మాట్లాడినవారు సొంతంగా కనీస మెజారిటీ కూడా సాధించలేకపోయారు. ఇండియా కూటమి వెనక్కుపోయిందని అనుకోవద్దు. పరిస్థితులు మారుతాయని మేం వేచి చూస్తున్నాం. కొద్ది రోజులు ఆగండి. ఏమో ఏమైనా జరగొచ్చు. ఇలాంటి బలహీన, అనిశ్చిత ప్రభుత్వం పడిపోతేనే మాకు ఆనందం. మోదీ ప్రమాణానికి మమ్మల్ని పిలవలేదు. పిలిచినా మేం వెళ్లేవాళ్లం కాదు. అసంతృప్తులను పట్టుకుని బీజేపీ వాళ్లు మళ్లీ పార్టీలను చీలుస్తారు" అని మండిపడ్డారు. కాగా, తృణమూల్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్‌గా మమతా బెనర్జీని, లోక్‌సభాపక్ష నేతగా సుదీప్ బందోపాధ్యాయను, ఉపనేతగా కకోలీ ఘోష్ దస్తీదర్‌ను ఎన్నుకున్నారు. రాజ్యసభా పక్ష నేతగా డెరెక్ ఓబ్రయిన్‌ను మరోసారి నియమించారు.

తెలుగు రాష్ట్రాలకు ఆరేడు

(మొదటి పేజీ తరువాయి)

అవకాశం లభించవచ్చని సమాచారం. తెలంగాణ నుంచి ఈసారి కిషన్ రెడ్డికి మళ్లీ మంత్రి పదవి ఇస్తారా? లేదా? అన్న చర్చ జరుగుతోంది. ఆయనకు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బాధ్యతలు అప్పజెప్పే అవకాశాలు కూడా ఉన్నట్లు ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి. తెలంగాణకు చెందిన ఇతర నేతల్లో ఈటల రాజేందర్, డీకే అరుణ, బండి సంజయ్ పేర్లు ప్రముఖంగా వినిపిస్తుండగా, బండి సంజయ్, డీకే అరుణల్లో ఒకరికి పార్టీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు అప్పగించవచ్చునని బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. మొత్తమ్మీద ఏపీ, తెలంగాణలకు ఆరు నుంచి ఏడు మంత్రి పదవులు లభించే అవకాశం కనిపిస్తోంది. మూడవసారి ప్రధాని పదవిని చేపట్టటానికి సిద్ధమవుతున్న మోదీ తన నూతన మంత్రివర్గం కూర్పుపై కసరత్తును ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. శనివారం అర్థరాత్రి వరకూ కసరత్తు కొనసాగినట్లు తెలుస్తోంది. ఎన్డీఏ కూటమి మిత్రపక్షాలకు కేటాయించాల్సిన మంత్రిపదవులు, శాఖలపై మోదీ దాదాపు ఒక నిర్ణయానికి వచ్చారని, బీజేపీలో ఎవరెవరికి ఇవ్వాలనేది మాత్రం ఇంకా ఖరారు కాలేదని పార్టీ వర్గాలు తెలిపాయి. ఆదివారం రాత్రి 7.15 నిమిషాలకు మోదీ, ఆయనతోపాటు కొందరు మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరగనున్న విషయం తెలిసిందే. మోదీతోపాటు దాదాపు 30 మంది మంత్రులు ప్రమాణం చేయనున్నట్లు తెలుస్తోంది. మంత్రివర్గంలోకి తీసుకునే వారి పేర్ల జాబితాను ఆదివారం ఉదయమే రాష్ట్రపతి భవన్‌కు పంపిస్తారని, ఈ మేరకు ఆయా నేతలకు ప్రధానమంత్రి కార్యాలయం సమాచారం అందిస్తుందని తెలిసింది. ఇప్పటి వరకూ పూర్తిగా సొంత మెజారిటీతో ప్రభుత్వాన్ని నడిపిన మోదీ.. తొలిసారిగా సంకీర్ణ ప్రభుత్వాన్ని నిర్వహించాల్సి రావడం వల్ల మంత్రివర్గ కూర్పులో మిత్రపక్షాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన పరిస్థితి ఉంది. అయితే హోం, ఆర్థికం, వాణిజ్యం, పరిశ్రమలు, రక్షణ, విదేశాంగ వ్యవహారాలు, పెట్రోలియం, రోడ్డు రవాణా, న్యాయ మొదలైన మంత్రిత్వ శాఖలను బీజేపీయే తీసుకోవచ్చని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రైల్వే, విద్య, ఐటీ, జలశక్తి, విద్యుత్, గనులు, వ్యవసాయం తదితర మంత్రిత్వ శాఖల్లో క్యాబినెట్ మంత్రి పదవులుగానీ, సహాయ మంత్రి పదవులనుగానీ మిత్రపక్షాలకు కేటాయించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

ఎన్డీయే మిత్రపక్షాల నుంచి

కేంద్ర మంత్రివర్గంలో ఎన్డీఏ భాగస్వామ్యపక్షాలకు చెందిన కుమార స్వామి (జేడీఎస్), చిరాగ్ పశ్వాన్ (లోక్ జనశక్తి), ప్రఫుల్ పటేల్ (ఎన్సీపీ), లలన్ సింగ్, ఇటీవల భారతరత్న పురస్కారం పొందిన దివంగత నేత కర్పూరీ ఠాకూర్ తనయుడు రాంనాథ్ ఠాకూర్, సంజయ్ కుమార్ ఝా (జేడీయూ), జితన్ రాం మాఝీ (హెచ్ఏఎం), అనుప్రియ పటేల్ (అప్నాదళ్), జయంత్ చౌదరి (ఆర్ఎల్డీ), శ్రీరంగ్ బర్నే, ప్రతాప్ రావు జాదవ్ (శివసేన)లకు అవకాశాలు కనిపిస్తున్నాయి.

బీజేపీ నుంచి..

బీజేపీ నుంచి అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్, నితిన్ గడ్కరీ, పీయూష్ గోయల్, శివరాజ్ సింగ్ చౌహాన్, జ్యోతిరాదిత్య సింధియా, బసవరాజ్ బొమ్మై, ప్రహ్లాద్ జోషి, జితిన్ ప్రసాద, రాజీవ్ ప్రతాప్ రూడీ, గజేంద్ర సింగ్ షెఖావత్, సురేశ్ గోపి, జితేంద్రసింగ్, సర్బానంద సోనోవాల్, దుష్యంత్ సింగ్, శంతను ఠాకూర్, జస్టిస్ అభిజిత్ గంగోపాధ్యాయ, బాన్సురీ స్వరాజ్, పురందేశ్వరి, సంజయ్ జైస్వాల్ తదితరులు ఉండే అవకాశాలున్నాయి.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
ABN ఆంధ్రజ్యోతి
Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

తడిసిన ధాన్యానికీ మద్దతు ధర

» వారంలో ఎన్‌డీఎస్‌ఏ నివేదిక.. 2019లోనే మేడిగడ్డ బ్యారేజీలో లోపాలు: ఉత్తమ్



హైదరాబాద్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కనీస మద్దతు ధరతో కొంటామని పౌర సరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి తెలిపారు. మిల్లర్లు తరుగు తీస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ధాన్యం కొనుగోలుకు గతంలో కంటే ఎక్కువ కేంద్రాలు తెరిచామని, ప్రతీ గింజను ప్రభుత్వం కొంటుందని చెప్పారు. బుధవారం ఆయన గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. గత ఏడాది ఇదే సమయానికి 13.77 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా ఈ దఫా ఇప్పటిదాకా 24.85 లక్షల మెట్రిక్ టన్నులు కొన్నామన్నారు. అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలకు, పిడుగుపాటుతో చనిపోయిన వారికి పరిహారం ఇస్తామని తెలిపారు. రాష్ట్రంలో తాగునీటి అవసరాల కోసం 2.25 టీఎంసీల నీటిని కర్ణాటక ప్రభుత్వం ఇస్తుందన్నారు. 2019 నవంబరులోనే మేడిగడ్డ బ్యారేజీలో లోపాలు బయటపడ్డాయని, అప్పుడే ఖాళీ చేసి, మరమ్మతులు చేస్తే కుంగేదే కాదన్నారు. బ్యారేజీల్లో నీటి నిల్వ శ్రేయస్కరం కాదని ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీ నివేదిక ఇచ్చిందన్నారు. కమిటీ పూర్తి నివేదిక వారం రోజుల్లో రానుందని, ఆ తర్వాత పూర్తి వివరాలు అందజేస్తామన్నారు. రైతుబంధును బీజేపీ, బీఆర్ఎస్ వాళ్లు కలిసి ఆపించారని ఆరోపించారు. ఈ సారి 400 కాదు.. 200 సీట్లు కూడా బీజేపీకి రావని, ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందన్నారు. జూన్ 9న ప్రధానిగా రాహుల్ గాంధీ ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌కు అత్యధిక సీట్లు రానున్నాయని, బీజేపీకి గతంలో కంటే సీట్లు తగ్గుతాయని, బీఆర్ఎస్‌కు జీరో సీట్లు వస్తాయన్నారు. క్రిటికల్ సీట్లలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రచారం చేస్తున్నారని తెలిపారు.

అప్పటి డీజీపీ, ఇంటెలిజెన్స్ చీఫ్ పర్యవేక్షణలోనే పనిచేశా

ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు అఫిడవిట్

హైదరాబాద్ సిటీ, మే 8 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడు ఎస్ఐబీ మాజీ చీఫ్ టీ ప్రభాకర్ రావు మొదటిసారి కోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారు. ఎస్ఐబీ చీఫ్‌గా తనకు పూర్తి అధికారులు లేవని, తన పనిని డీజీపీ, ఇంటెలిజెన్స్ చీఫ్ ఎప్పుడూ పర్యవేక్షిస్తుండేవారని పేర్కొన్నారు. ఒకే కులానికి చెందినవాడిని కావడం వల్లే మాజీ సీఎం కేసీఆర్ తనను ఎస్ఐబీ చీఫ్‌గా నియమించారన్న పోలీసుల అభియోగాన్ని ఖండించారు. తన అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని డీజీ సిఫారసు చేశారని తెలిపారు. తాను కేసీఆర్ కులానికే చెందినవాడిని కావడం ఆరోపణలు మోపడానికి ప్రాతిపదిక కాకూడదని పేర్కొన్నారు. తాను నల్లగొండ ఎస్పీగా పనిచేస్తున్నప్పుడు ఇదే కేసీఆర్ తనను ఆకస్మికంగా బదిలీ చేశారన్నారు. తాను ప్రతిపక్ష నాయకులకు సహకరిస్తున్నానంటూ ఆ జిల్లా నాయకుల నుంచి కేసీఆర్‌కు వచ్చిన ఒత్తిళ్లే తన బదిలీకి కారణమన్నారు. అంతేకాకుండా చాలారోజులు పోస్టింగ్ ఇవ్వకుండా పక్కన పెట్టారన్నారు. పదోన్నతుల్లో కూడా అన్యాయం జరిగిందంటూ తాను కూడా కేసీఆర్ బాధితుడేనన్నారు. అధికారంలో ఉన్న వారి ఆదేశాలపై తనను నిందితుడిని చేశారని పేర్కొన్నారు. కాగా, అమెరికాలో ఉన్న ప్రభాకర్ రావుపై అరెస్టు వారెంట్ ఇవ్వాలని, తద్వారా తాము రెడ్ కార్నర్ నోటీసు కోరవచ్చని పోలీసులు కోర్టును కోరారు. దీనిని వ్యతిరేకిస్తూ ప్రభాకర్ రావు తరఫున ఆయన సీనియర్ న్యాయవాది వీ సురేందర్ ఈ అఫిడవిట్ దాఖలు చేశారు. ప్రభాకర్ రావు పరారీలో లేరని, క్యాన్సర్ చికిత్స కోసం అమెరికా వెళ్లారని, చికిత్స పూర్తయ్యాక తిరిగి వచ్చేస్తారని పేర్కొన్నారు. ప్రభాకర్ రావు అఫిడవిట్ పోలీసు ఉన్నతాధికారుల్లో చర్చనీయాంశంగా మారింది. ఫోన్ ట్యాపింగ్ కేసు ఎవరి మెడకు చుట్టుకుంటుందోనని చర్చించుకుంటున్నారు.

జూన్‌లో రైతు భరోసా పంపిణీ

» ఎకరాకు రూ.15వేల సాయం అందిస్తాం

» పంటల బీమాకు రోల్‌మోడల్‌గా తెలంగాణ

» తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం: తుమ్మల



ఖమ్మం, మే 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వానా కాలం సీజన్ నేపథ్యంలో జూన్ నెలలోనే రైతు భరోసా పంపిణీకి శ్రీకారం చుడతామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటించారు. ప్రస్తుతం ఎకరాకు రూ.10వేలు అందిస్తుండగా, ఈ సీజన్ నుంచే రూ.15వేల సాయం అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. జూన్‌లో పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టి రైతుభరోసాకు నిధులు కేటాయిస్తామని వెల్లడించారు. పంటల బీమాకు సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తయిందని, దేశానికే రోల్ మోడల్‌గా ఆ పథకాన్ని అమలు చేస్తామని పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఒక రైతు సెంటు భూమిలో పంట నష్టపోయినా ఆ మేరకు పరిహారం అందుతుందన్నారు. ఎన్ని వేల కోట్లు ఖర్చయినా ప్రభుత్వమే రాష్ట్రంలోని 70లక్షల మంది రైతులకు ప్రీమియం చెల్లించి భరోసా ఇవ్వబోతున్నట్లు వెల్లడించారు. ఆగస్టు 15 నాటికి అన్ని హామీలను అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం కాంగ్రెస్ కిసాన్ సెల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ వరంగల్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు ఆగస్టు 15నాటికి రైతులకు రుణమాఫీ చేసి తీరుతామని స్పష్టం చేశారు. వానాకాలం సీజన్‌లో ఎరువులు, విత్తనాల కొరత లేకుండా ముందు జాగ్రత్తలు తీసుకున్నామని, విత్తనాల కోసం రైతులు ఎండలో నిలబడే పరిస్థితి రానివ్వబోమన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చినట్లు ధాన్యాన్ని బోనస్ చెల్లించి ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. తడిచిన ధాన్యాన్నీ కొనుగోలు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.

ఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్ మొరాయింపు

గంట తర్వాత పునరుద్ధరించిన అధికారులు

హైదరాబాద్, మే 8(ఆంధ్రజ్యోతి): దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ వెబ్‌సైట్ కుదుపునకు గురైంది. బుధవారం సాయంత్రం వెబ్‌సైట్‌లో ఒక్కసారిగా సాంకేతిక సమస్యలు ఉత్పన్నమై... మొరాయించింది. దాదాపు గంట పాటు వెబ్‌సైట్ పనిచేయలేదు. దాంతో సాంకేతిక బృందాలు రంగంలోకి దిగి... వెబ్‌సైట్‌ను పునరుద్ధరించాయి. వెబ్‌సైట్ హ్యాక్‌కు గురైనట్లు, వినియోగదారుల డేటా చౌర్యం అయినట్లు ప్రచారం జరిగింది. అయితే అలాంటిదేం లేదని, విద్యుత్ వినియోగదారుల డేటా సురక్షితంగానే ఉందని అధికారులు ప్రకటించారు.

అక్రమ నిర్మాణాలు తొలగించాలని ఆదేశించే అధికారం లోకాయుక్తకు లేదు: హైకోర్టు

హైదరాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్మాణాలు తొలగించాలని ఆదేశాలు ఇచ్చే అధికారం లోకాయుక్తకు లేదని హైకోర్టు స్పష్టం చేసింది. అక్రమ నిర్మాణాల తొలగించాలంటూ గతంలో లోకాయుక్త ఇచ్చిన ఆదేశాలను కొట్టేసింది. చాంద్రాయణగుట్టకు చెందిన సీహెచ్ హనుమంతరావు 18-9-9/49 ఇంటి నెంబరు గల ప్రాంతంలో రోడ్డును ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని పేర్కొంటూ అదే ప్రాంతానికి చెందిన అంజమ్మ లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన లోకాయుక్త.. అక్రమ నిర్మాణాలు తొలగించాలని జీహెచ్ఎంసీ అధికారులకు ఆదేశాలు జారీచేసింది. ఈ ఆదేశాలను సవాల్ చేస్తూ హనుమంతరావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం.. తెలంగాణ లోకాయుక్త చట్టం-1983 ప్రకారం అక్రమనిర్మాణాలు తొలగించాలని ఆదేశాలిచ్చే అధికారం లోకాయుక్తకు లేదని స్పష్టం చేసింది.

ఏసీ బస్సుల్లో స్నాక్స్ బంద్: టీఎస్ఆర్టీసీ

దూర ప్రాంతాలకు వెళ్లి వచ్చే ఏసీ బస్సుల్లో మే 15 నుంచి ప్రయాణికులకు అందించే స్నాక్స్‌ను నిలిపివేస్తున్నట్లు టీఎస్ఆర్టీసీ ప్రకటించింది. టికెట్ చార్జీతో పాటు అదనంగా రూ.30 వసూలు చేస్తూ ఆర్టీసీ ప్రయాణికులకు స్నాక్స్ సమకూర్చుతోంది. స్నాక్స్‌లో భాగంగా వాటర్‌బాటిల్‌తో పాటు సమోసా, కచోరి స్వీట్‌ను సరఫరా చేస్తున్నారు. అయితే బస్సులు బయలుదేరే సమయంలో తాజా స్నాక్స్‌ను ఆయా బస్‌స్టేషన్లలో నిల్వ చేయడం అధికారులకు సవాల్‌గా మారింది. అలాగే ప్రయాణికులు స్నాక్స్ స్వీకరించిన తర్వాత కవర్‌లు, ఆహార పదార్థాలు బస్సు సీట్లపై అపరిశుభ్రంగా పడేస్తున్నారనే ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని స్నాక్స్ సరఫరాను నిలిపివేయాలని ఆర్టీసీ నిర్ణయించినట్లు తెలిసింది.

అందరికీ సమాన వేతనం ఇవ్వాలి

» పీఆర్‌సీకి గ్రూప్-1 అధికారుల సంఘం విజ్ఞప్తి

హైదరాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రూప్-1 నోటిఫికేషన్ ద్వారా నియమించిన ఉద్యోగుల వేతనాల్లో మూడు రకాల వ్యత్యాసాలు ఉన్నాయని, వాటిని సవరించి అందరికీ సమాన వేతనాలు అందించేలా ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని గ్రూప్-1 అధికారుల సంఘం పీఆర్‌సీ కమిషనర్‌కు విజ్ఞప్తి చేసింది. సంఘం, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్, హన్మంతు నాయక్ ఆధ్వర్యంలో గ్రూప్-1 అధికారుల సంఘం బుధవారం కమిషనర్ శివశంకర్‌ను కలిసింది. ఈ సందర్భంగా పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కమిషనర్‌కు అందజేశారు.



జపాన్ కాన్సులేట్ జనరల్ టకాహాషీ మునేయో దంపతుల నుంచి అవార్డు స్వీకరిస్తున్న బొడ్డుపల్లి రామభద్ర దంపతులు

హైదరాబాద్ వాసికి జపాన్ అత్యున్నత పురస్కారం ప్రదానం

హైదరాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): జపాన్ సంస్కృతిని భారత్‌లో పరిచయం చేయడం, ఇరు దేశాల మధ్య వాణిజ్య, సంస్కృతిక సంబంధాల మెరుగుకు కృషి చేస్తున్న హైదరాబాద్ వాసి బొడ్డుపల్లి రామభద్ర... జపాన్ అత్యున్నత పురస్కారం స్వీకరించారు. హైదరాబాద్‌లోని 'ఏఎస్ఏ భాను జపాన్ సెంటర్' ద్వారా బొడ్డుపల్లి రామభద్ర చేస్తున్న కృషిని అభినందిస్తూ గత నవంబరులో జపాన్ ప్రభుత్వం ఆయనకు 'ది ఆర్డర్ ఆఫ్ రైజింగ్ సన్..గోల్డ్ రేస్ విత్ రోసేట్' అవార్డును ప్రకటించింది. ఈ అవార్డు ప్రదానోత్సవం బుధవారం చెన్నైలోని జపాన్ కాన్సులేట్ కార్యాలయంలో జరిగింది. జపాన్ కాన్సులేట్ జనరల్ టకాహాషీ మునేయో దంపతులు ఈ అవార్డును బొడ్డుపల్లి రామభద్ర దంపతులకు అందించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ప్లాస్టిక్‌పై విఫలపోరు

ప్లాస్టిక్‌ని భూతం అంటాం కానీ, దాన్ని అంతం చేయడానికి మాత్రం మనసొప్పడం లేదు. ప్లాస్టిక్ ఉత్పత్తిని పూర్తిగా నిలిపివేయాలన్న సదాశయంతో రెండేళ్ళక్రితం ప్రపంచదేశాల మధ్య ఒక ప్రయత్నం ఆరంభమైంది. ఐక్యరాజ్యసమితిలో సభ్యత్వం ఉన్న 175దేశాల ప్రతినిధులతో ఒక ఉన్నతస్థాయి కమిటీ ఏర్పడి, ఈ ఏడాది చివరకల్లా ప్లాస్టిక్ విషయంలో ఒక విధాన నిర్ణయానికి రావాలని సంకల్పించాయి. ఇప్పటివరకూ మూడువిడతల చర్చలు జరిగినప్పటికీ ఈ భూతాన్ని అంతం చేసి భవిష్యత్తును కాపాడుకొనే విషయంలో ఈ దేశాలు ఒకేతాటిపైకి రాలేకపోయాయి. గతవారం కెనడాలో నాలుగోవిడత చర్చలు కూడా విఫలం కావడాన్ని బట్టి ప్లాస్టిక్ పరిశ్రమకు రాజకీయంగా,ఆర్థికంగా ఎంతబలం ఉన్నదో అర్థమవుతుంది.

దక్షిణకొరియాలో ఈ నవంబరులో మరోవిడత చర్చలు జరగబోతున్నప్పటికీ, ఈ ఏడాది ముగిసేలోగా 'గ్లోబల్ ప్లాస్టిక్స్ ట్రీటీ' సాధ్యమయ్యే అవకాశాలైతే లేవు. ప్లాస్టిక్ ఉత్పత్తిని తగ్గించడం, భారీ వ్యర్థాలను మిగల్చే చోట్ల తయారీని పూర్తిగా మానివేయడం, ఉత్పత్తిలో భాగంగా హానికర రసాయనాల వాడకాన్ని ఆపివేయడం, హెచ్చుస్థాయిలో రీసైక్లింగ్ లక్ష్యాలను నిర్ణయించుకోవడం ఇత్యాది అంశాల్లో నిర్దిష్టమైన గడువులను విధించుకోవాలన్నది ఈ దేశాల తాపత్రయం. ఏయే లక్ష్యాలను ఎప్పటిలోగా సాధించాలో తెలియచెబుతున్న ఒక ఆచరణసాధ్యమైన ఒప్పందాన్ని అన్నిదేశాలు కలసికట్టుగా సాధించగలిగితే అంతకంటే అద్భుతం మరొకటి లేదు. కానీ, సహజంగానే ఆర్థికం దీనికి అడ్డుపడింది. చమురు ఉత్పత్తి దేశాలతో పాటు దానిని భారీగా శుద్ధిచేస్తూ లాభపడుతున్న దేశాలు ఒక అవగాహనకు రాకుండా మోకాలడ్డుతున్నాయి. ప్లాస్టిక్ ఉత్పత్తిని నిలిపివేసే విషయంలో గడువులు విధించడాన్ని మిగతా కొన్ని దేశాలతో పాటు భారత్ కూడా వ్యతిరేకిస్తోందని వార్తలు వచ్చాయి. 2040ను లక్ష్యంగా పెట్టుకుంటే, ఇప్పటినుంచే ఆ దిశగా ప్రయత్నాలు ఆరంభించడం, లక్ష్యాన్ని సాధించడం సులువవుతుందని ఆఫ్రికన్ దేశాలతోపాటు, అనేక యూరోపియన్ దేశాలు కూడా భావించాయట. ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయాలంటే ప్రత్యామ్నాయాలను అభివృద్ధిపరచాలని, అవి తక్కువ ఖర్చుతో కూడుకున్నవై సులభంగా అందుబాటులో రావాలని భారత్ భావిస్తోంది. సదరు ప్రత్యామ్నాయాలకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధిపరచడంతో పాటు అది సులభంగా మిగతాదేశాలకు బదిలీకావాలని కూడా భారత్ అంటోంది. ఉమ్మడి లక్ష్యమే అయినప్పటికీ ధనికదేశాలు, అధిక ఉత్పత్తిదేశాలు ఎక్కువ బాధ్యతలను పంచుకోవాలన్నది ప్రతిపాదన.

ప్లాస్టిక్ కాలుష్యం మీద అన్ని దేశాలదీ ఒకే అభిప్రాయం. మానవ మనుగడను ప్రమాదంలో పడేస్తున్న దీనిని పూర్తిగా నిషేధించుకోవాలన్న విషయంలోనూ భేదాభిప్రాయాలు లేవు. కానీ, లక్ష్యసాధన దిశగా అడుగులు ఎలావేయాలన్న విషయంలో ఒక్కమాట సాధ్యపడటం లేదు. పెట్రో కెమికల్ పరిశ్రమ బలంగా ఉన్నదేశాలు ప్లాస్టిక్ తయారీమీద నియంత్రణలు విధించాలన్న ప్రతిపాదనను ఏమాత్రం పడనీయడం లేదు. అభివృద్ధి చెందుతున్నదేశాలకంటే ధనికదేశాల్లో ప్లాస్టిక్ పరిశ్రమ వెలిగిపోతున్నది కనుక అవి ప్రతీ ఆలోచనకూ అడ్డుపడుతున్నాయి. పేద దేశాలతో పోల్చితే అభివృద్ధిచెందిన దేశాల్లో మరిన్ని వందల రకాల ప్లాస్టిక్ ఉత్పత్తుల వినియోగం అధికంగా ఉంటూ, అక్కడి జనజీవనంతో మిళితమైపోయాయి. వినియోగరంగాన్ని, ఆర్థికాన్ని ప్లాస్టిక్ శాసిస్తోంది.

ప్లాస్టిక్స్ ఒప్పందం ప్రతిపాదన ముందుకు కదిలిన 2022లో భారతదేశం 19రకాల సింగిల్ యూజ్ ప్లాస్టిక్స్‌ను నిషేధించిన విషయం తెలిసిందే. మరిన్నింటిని కూడా చేర్చవలసిన అవసరం ఉన్నప్పటికీ ప్రభుత్వం ఉదాసీనత ప్రదర్శించిందని అప్పట్లోనే పర్యావరణ ఉద్యమకారులు విమర్శించారు. ఆ తరువాత కాలంలో ఈ నిషేధం కూడా దేశవ్యాప్తంగా ప్రభావవంతంగా అమలుజరగలేదు. మట్టిలో కలవదనీ, మనిషిప్రాణానికి మహాప్రమాదకారనీ, పర్యావరణాన్ని నాశనం చేస్తోందనీ ప్లాస్టిక్ గురించి భయపడని క్షణం లేదు, తిట్టుకోనిరోజు ఉండదు. దాని తయారీ భూతాపాన్ని తీవ్రంగా హెచ్చిస్తోంది. ప్లాస్టిక్ ఉత్పత్తి ఏయేటికాయేడు పెరిగిపోతూ, ఏటా మరింత చెత్త చేరుతూంటే, మొత్తం ప్లాస్టిక్స్‌లో పదోవంతు కూడా రీసైకిల్ కావడం లేదు. ఈ విషవలయంనుంచి ప్రజలను రక్షించి ఒడ్డునపడేయాల్సిన ప్రభుత్వాలు ఇలా నిమ్మకునీరెత్తినట్టు ఉండటం విషాదం.

గ్రహిస్తారు, అనుగ్రహిస్తారు, ఆగ్రహిస్తారు

మేరేరామ్ అన్న నాటకం చూశాను. అందులో రావణుడు చనిపోతూ అన్న ఈ మాటలు కదిలించాయి. "నా పతనానికి కారణం ఏమిటంటే, నాకు నా జ్ఞానం గురించి అహంకారం ఉంది. రాముడికేమో అహంకారానికి సంబంధించిన జ్ఞానం ఉంది...". ఈ విషయం అర్థంచేసుకుని మనం మన పనితీరులో మార్పు చేసుకుంటేనే ఉపయోగం. జై భారత్... ఇది జీగ్రూప్ అధినేత సుభాష్ చంద్ర ఈ మధ్య చేసిన ట్వీట్. అంతకు ముందు రోజే ఆయన పత్రికాస్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా, ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టడంలో స్వతంత్ర పత్రికారంగానికి ఉన్న శక్తిని స్మరించుకున్నారు.

ఈ మధ్య భారతదేశంలో కొన్ని అనూహ్యమైన ఆశ్చర్యాలు కూడా ఎదురవుతున్నాయి. ఈ సుభాష్ చంద్ర, జీటీవీ ఛానెళ్ల మీడియా సంస్థ ఎస్సెల్ గ్రూప్ అధినేత. గోదీ మీడియా అని విమర్శకులు పిలిచే మోదీ సన్నిహిత మీడియాలో ఈ జీటీవీ ది ప్రధానపాత్ర. బీజేపీ సహాయంతో రాజ్యసభకు ఒకసారి సుభాష్ చంద్ర ఎన్నికయ్యారు కూడా. ఇంతకూ ఆయన తన ఇటీవలి ట్వీట్‌లో చెప్పిన రావణాసురుడు ఎవరు? అహంకారం ఎవరిది? జీ మీడియా కార్పొరేషన్ సీఈవో అభయ్ ఓఝాతో సహా కొందరు ముఖ్యుల నిష్క్రమణ, ప్రభుత్వ అనుకూల విధానాన్ని విరమించుకుంటున్నందువల్లనే అని వినిపిస్తున్న వార్తల నేపథ్యంలో, సుభాష్ చంద్రకు పత్రికాస్వేచ్ఛ గుర్తు వచ్చిందా? లేదా, దేశంలో గాలి మళ్లుతున్నదని ముందుగానే గ్రహించి, ఎన్నికల ప్రక్రియ మధ్యలోనే అధికార శిబిరానికి వీడ్కోలు చెప్పారా? వార్తాప్రసారకులలోనే కాదు, వీక్షకులలో కూడా మార్పు వచ్చిందని, ప్రభుత్వంపై విమర్శలకు కూడా కోట్లాది వీక్షణలు దొరుకుతున్నాయని ధ్రువ్ రాఠీ, రవీశ్ కుమార్ వంటి వారి విజృంభణ తెలియజేస్తోంది. అయితే, స్వేచ్ఛాభాషణ పెరిగినంత మాత్రాన, పెను రాజకీయమార్పులు జరుగుతాయని అనుకోనక్కరలేదు.

అహంకారపు వేడి అస్మదీయులకు కూడా సోకి, అంతిమంగా అధికార మార్పిడికే కారణమయిన అనుభవం తెలంగాణ రాష్ట్రంలో జరిగింది. కేసీఆర్ ప్రభుత్వం మీద సవాలక్ష ఫిర్యాదులు ఉండవచ్చు, క్షేత్రస్థాయిలో అభివృద్ధి సమస్యలు అనేకం ఉండి ఉండవచ్చు కానీ, వాటన్నిటికి ఎగువన, ప్రజల అభిమతాన్ని తీవ్రంగా ప్రభావితం చేసిన అంశం మాత్రం 'అహంకారమే'. కేసీఆర్ వ్యవహార సరళిలోని ఆభిజాత్యం, అధికారస్వరం మొన్నటి ఎన్నికల నాటికి ప్రజలు భరించలేని స్థాయికి చేరుకున్నాయి. మరి నరేంద్రమోదీ తీరులో కూడా పతనానికి దారితీసే అవలక్షణం కనిపిస్తున్నదని సుభాష్ చంద్ర చెబుతున్నారా? ప్రజల ఎంపికల మీద నిజంగా ఇటువంటి వ్యక్తిత్వ అంశాలు ప్రభావం వేస్తాయా? అసలు ఎన్నికల తీర్పు వెనుక ఉండే చలనసూత్రాలు, తర్కం ఏమిటి?

రాజకీయవాదులు ప్రజలను ఆకర్షించడానికి అనేక ప్రయత్నాలు చేస్తారు. వాటిలో ముఖ్యమైనది, అభినయం. తమ స్వభావాలు, అభిప్రాయాలు ఎటువంటివైనా ప్రజల ముందుకు వెళ్లినప్పుడు, ముఖ్యంగా ఎన్నికల వేళ, గౌరవంగా, ప్రేమగా, సానుభూతిగా మాట్లాడడానికి ప్రయత్నం చేస్తారు. చనువుగా ఉండడానికి చూస్తారు. అధికారంలోకి వచ్చాక కూడా, ఆ నటనను కొనసాగించాలనే అనుకుంటారు కానీ, క్రమంగా స్వభావానిదీ, పదవుల దర్పానిదీ పైచేయి అవుతుంది. స్వరం మారుతుంది. జనాన్ని విదిలించి దూరం పెడతారు. ప్రజలకు కూడా ఇది తెలుసు. కొంతవరకు అర్థం చేసుకుని, సహిస్తారు. అది ఒక నిర్ణయంగా మారడానికి సమయం పడుతుంది. తాము గమనిస్తున్న ప్రతికూల అంశం ఒక నిష్పత్తి దాటిన తరువాత, జనం ఇక లెక్కపెట్టుకోవడం మొదలు పెడతారు. అవకాశం వచ్చినప్పుడు తమ చేతిలో ఉన్న ఆయుధాన్ని ఉపయోగించుకుంటారు. పూర్తి అక్షరాస్యత ఉండి, రాజకీయచైతన్యం అధికంగా ఉండే పశ్చిమదేశాలలో సైతం అన్నీ తెలిసి ఓటు చేయగలిగే వివేకం లేదు. ఇక, భారత్ వంటి ఎదుగుతున్న దేశంలో, పూర్తి అవగాహనతో, విచక్షణతో ఓటు చేయగలిగే పరిస్థితి ఎక్కడ? అందుకని, సులభ సంకేతాల నుంచే ప్రజల సమ్మతి కానీ, అసమ్మతి కానీ రూపొందుతుంది. మనసు పడడమో, మనసు విరగడమో!





■ కె. శ్రీనివాస్

సందర్భం

అయితే, ఓటు ఆయుధానికి పెద్ద పదును లేదు. ఒకరిని తీసి మరొకరిని ఎక్కించడానికి తప్ప ఓటరుకు పెద్దగా ఒరిగేదేమీ ఉండదు. ముప్పాతిక సంవత్సరాల భారత ప్రజాస్వామ్యంలో చాలా గొప్పగా సాధించామని ప్రశంసకులు అంటుంటారు. సాధించింది శూన్యమని విమర్శకులూ అంటారు. ప్రజలు తమ అభిమతాన్ని ఎన్నికలలో స్వేచ్ఛగా వ్యక్తం చేసే పరిస్థితులు లేవని, అధికారం ఇమ్మని జనం ముందుకు వచ్చే అభ్యర్థుల మధ్య, పార్టీల మధ్య పెద్ద వ్యత్యాసమే లేదని, చట్టసభల ద్వారా కాక, వీధుల్లోనే ప్రజలు ఎక్కువ పోరాటాలు చేసి సాధించుకున్నారని రాజకీయ చరిత్రకారులు చెబుతుంటారు. ప్రజలను మభ్యపెట్టి, భయపెట్టి, గందరగోళపరచి, ప్రలోభపరచి జరిగే ఎన్నికల ప్రచారం ఏ విధంగా అవగాహనాయుత ఓటింగ్ సాధిస్తుందన్న ప్రశ్న సహేతుకమైనదే. ప్రజల తరఫున పనిచేయవలసిన ప్రజాప్రతినిధులు సామాజిక వనరులను, సంపదను ప్రైవేటు లాభార్జనాపరులకు కట్టబెట్టే కమిషన్ ఏజెంట్లుగా పని చేస్తున్నారన్నది కూడా చాలావరకు నిజమే. అట్లాగని, ఇంతకాలంగా జరుగుతూ వచ్చిన ఎన్నికలలోని ప్రజల తీర్పుల్లో ఒక క్రమంకానీ, అంతస్సూత్రం కానీ, మార్పు కానీ లేదని అనగలమా? భారతదేశంలోని వివిధ ప్రజావర్గాలు అవకాశాలకు, అధికారానికి దగ్గర కాలేదని చెప్పగలమా? ప్రాంతాలు, లింగ, కుల తదితర సామాజిక వర్గాలు తమ సాధికారతాస్థలాన్ని విస్తరించుకోవడాన్ని విస్మరించగలమా? అదే సమయంలో, పారిశ్రామిక, కార్పొరేట్ సంపన్నులు, భూస్వామ్యవర్గాలు తమ తమ ప్రయోజనాలను రక్షించుకోవడానికి, తమ ఆస్తులను ఇబ్బడి ముబ్బడిగా పెంచుకోవడానికి, ఆర్థిక అంతరాలను అగాధాలుగా మార్చడానికి ఆయా ప్రభుత్వాలే ప్రత్యక్షంగానో పరోక్షంగానో కారణమని చెప్పకుండా ఉండగలమా?

ప్రజల అభిమతాన్ని సాధించడానికి చేసే రకరకాల విన్యాసాలు, ఆ సమ్మతి పొందిన తరువాత పొందిన అధికారంతో చేసే దాష్టీకాలూ భారత ప్రజాస్వామ్య చరిత్ర పొడవునా చూడవచ్చు. అయితే, ప్రజలు ఈ క్రమంలో కేవలం మభ్యపడేవారిగాను, మాయకు లోబడేవాళ్లగాను లేరు. వారు కూడా పరిస్థితులను ఓట్ల ద్వారానో, ఉద్యమాల ద్వారానో మారుస్తూ వచ్చారు. చాయిస్ లేకపోవడం వల్లా, తీవ్ర ఉద్వేగాల ప్రభావం వల్లా ప్రజలు కొన్ని సందర్భాలలో గాలివాటంలో కొట్టుకుపోయిన మాట నిజమే. అందుకు కూడా కొన్ని నిగూఢ రాజకీయార్థిక, ఉద్వేగ కారణాలు ఉండవచ్చు. కానీ, ఎక్కువ కాలం అహంకారాన్ని, ఉన్మాద రాజకీయాలను భారత ప్రజలు సహించిన ఉదాహరణలు లేవు. 1970 దశకం మొదట్లో విజయేందిరగా జయజయధ్వానాలు అందుకున్న ఇందిర, అయిదేళ్లు గడిచేసరికి నియంతగా నిలబడ్డారు, మరో రెండేళ్లకు ఘోరపరాజయం పొందారు. కలహాల జనతా పాలన తిరిగి ఇందిరకే దారి ఇచ్చింది. కార్గిల్ నేపథ్యంలో అవతరించిన మొదటి ఎన్డీయే ప్రభుత్వం, ఐదేళ్లకే దేశం మెరిసిపోతున్నదన్న ఆభాస నినాదంతో పరాజయం పాలయింది. రాజీవ్ ప్రభంజనాన్ని ఎదుర్కొని ఘన విజయం సాధించిన ఎన్టీయార్ తరువాతి దఫాకు ఘోరంగా ఓడిపోయారు. తరువాత అధికారం పొందిన కాంగ్రెస్ ఏడాదికో ముఖ్యమంత్రిని మార్చి, సకల రంగాలలో విధ్వంసపాలన అమలుజరిపి, తిరిగి జనం అదే ఎన్టీయార్‌కు ఘనవిజయం ఇచ్చేట్టు చేసింది. వ్యవసాయానికి, గ్రామీణరంగాలకు వ్యతిరేకమన్న ముద్ర 2004లో చంద్రబాబుకు ప్రతికూలంగా పనిచేసింది. కానీ, నగరాభివృద్ధిలోను, పాలనలోను ఉన్న అనుభవం కారణంగా విభజిత ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఆయనను మొదటి ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నారు. ఒక అవకాశం ఇద్దామని జగన్మోహన్ రెడ్డికి ఇచ్చిన అవకాశం దుష్పరిపాలనకు దారితీయడంతో, ఇప్పుడు తిరిగి ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఓటు వేటు వేసి తీరతారన్న వాతావరణం వ్యాపించి ఉంది. ఈ అన్ని సన్నివేశాలలోనూ, ప్రజలు ఏదో ఒక అనుకూలతను లేదా ప్రతికూల అంశాన్ని పూర్తి అనుభవ జ్ఞానంతో లేదా సహజాత శక్తితో గ్రహించారు. పత్రికల్లోనూ టీవీ చర్చల్లోనూ సిద్ధాంత చర్చల్లోనూ వినిపించే విశ్లేషణలతో, రాజకీయ కథనాలతో వారికి పెద్దగా నిమిత్తం ఉండదు. తాము కనెక్ట్ అయ్యే ఒక సంకేతం వారికి అందితే చాలు. ఉష్ణోగ్రతో శీతలత్వమో వారికి తాకితే చాలు. అట్లాగని, ప్రజాపక్ష మేధావులు, ఉద్యమకారులు కల్పించే భావ వాతావరణం అవసరం లేదని కాదు. ప్రజల గ్రహింపును అది ఉద్దీపింపజేస్తుంది. ఆ పౌరసమాజం తమ ఆలోచనలతో చర్చలతో కల్పించే వాదనా, సాధారణ ప్రజ గ్రహించే సంకేతమూ ఒకటే అయినప్పుడు, వాటి ఫలితాలు తీవ్రంగా ఉంటాయి. ఎన్నికల సందర్భంలో అయితే, అది ప్రభంజన ఫలితంగా ఉంటుంది.


2014 నుంచి రెండు దఫాలు నరేంద్రమోదీ ప్రభుత్వం ఏర్పడడానికి ప్రాథమికంగా ప్రజలు కనెక్ట్ అయిన సంకేతాలే కారణం. యూపీఏ ప్రభుత్వం అవినీతో, విధాన వైకల్యమో, బీజేపీ అచ్ఛేదిన్ వాగ్దానమో ఏదో మొగ్గను సృష్టించింది. 2019లో తీవ్ర జాతీయభావాల దగ్గర నుంచి మతభావోద్వేగాల దాకా ప్రజల మనస్సులను ఆవరించాయి. ప్రతిపక్షం అత్యంత బలహీనంగా ఉండడం మరో కారణం. సాధించినవాటిని గొప్పగా చెప్పుకోవడం కంటె, బలహీనంగా కనిపిస్తున్న ప్రత్యర్థి విధానాంశాలే ప్రస్తుత ఎన్నికల్లో ఎందుకు చర్చలో ఉంటున్నాయి? రాముడికి ఉన్న అహంకార జ్ఞానం రామ ప్రతినిధులమని చెప్పే రాజకీయవాదులకు ఉండడం లేదా? సుభాష్ చంద్ర 'అహంకారం' అని గుర్తించిన దాన్ని, సాధారణ ప్రజలు నియంతృత్వంగానో, పరమాధికారంగానో గుర్తిస్తున్నారా? 2024లో ఓటర్లకు అందవలసిన సంకేతం అందిందా?

> ఇందిర నుంచి జగన్ దాకా అన్ని సన్నివేశాలలోనూ, ప్రజలు ఏదో ఒక అనుకూలతను లేదా ప్రతికూల అంశాన్ని పూర్తి అనుభవ జ్ఞానంతో లేదా సహజాత శక్తితో గ్రహించారు. పత్రికల్లోనూ టీవీ చర్చల్లోనూ సిద్ధాంత చర్చల్లోనూ వినిపించే విశ్లేషణలతో, రాజకీయ కథనాలతో వారికి పెద్దగా నిమిత్తం ఉండదు. తాము కనెక్ట్ అయ్యే ఒక సంకేతం వారికి అందితే చాలు. ఉష్ణోగ్రతో శీతలత్వమో వారికి తాకితే చాలు. అట్లాగని, ప్రజాపక్ష మేధావులు, ఉద్యమకారులు కల్పించే భావ వాతావరణం అవసరం లేదని కాదు. ప్రజల గ్రహింపును అది ఉద్దీపింపజేస్తుంది. ఆ పౌరసమాజం తమ ఆలోచనలతో చర్చలతో కల్పించే వాదనా, సాధారణ ప్రజ గ్రహించే సంకేతమూ ఒకటే అయినప్పుడు, వాటి ఫలితాలు తీవ్రంగా ఉంటాయి. ఎన్నికల సందర్భంలో అయితే, అది ప్రభంజన ఫలితంగా ఉంటుంది.

> పూర్తి అక్షరాస్యత ఉండి, రాజకీయ చైతన్యం అధికంగా ఉండే పశ్చిమదేశాలలో సైతం అన్నీ తెలిసి ఓటు చేయగలిగే వివేకం లేదు. ఇక, భారత్ వంటి ఎదుగుతున్న దేశంలో, పూర్తి అవగాహనతో, విచక్షణతో ఓటుచేయగలిగే పరిస్థితి ఎక్కడ? అందుకని, సులభ సంకేతాల నుంచే ప్రజల సమ్మతి కానీ, అసమ్మతి కానీ రూపొందుతుంది. మనసు పడడమో, మనసు విరగడమో!

వంచన పాలైన పాలమూరు – ఇంకా వలసే దిక్కైన ప్రజలు!

పదేళ్ళు కావస్తున్నా 'పాలమూరు – రంగారెడ్డి' ప్రాజెక్టు ఇంకా పూర్తి కాలేదు. 2015లో పరిపాలనా అనుమతిని లభించినప్పటితో పోలిస్తే ఇప్పుడు ప్రాజెక్ట్ అంచనా వ్యయం రెండింతలు అయ్యింది. 2004–2014 మధ్య కాలంలో కేంద్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ అధికారంలో ఉంది. నీటిపారుదల రంగాన్ని వేగంగా అభివృద్ధి చేయడం ద్వారా దేశంలో ఆహార కొరతను తీర్చవచ్చు అని భావించి 11వ పంచవర్ష ప్రణాళిక (2007–12)లో రాష్ట్రాలలో నిర్మించే బహుళార్థక సాధక ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇవ్వాలని నాటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ నాయకత్వంలో నిర్ణయం తీసుకున్నారు. ఈ హోదా కల్పించబడిన ప్రాజెక్టులకు 90 శాతం నిధులను కేంద్ర ప్రభుత్వం సమకూరుస్తుంది. మిగిలిన 10 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలి. ఇందులో భాగంగా యూపీఏ ప్రభుత్వం దేశంలో 16 ప్రాజెక్టులకు జాతీయహోదా కల్పించింది. ప్రతి రాష్ట్రంలో కనీసం ఒక ప్రాజెక్టుకైనా జాతీయ హోదా ఇవ్వాలనేది నాటి కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పం. 2014లో నరేంద్ర మోదీ నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం తమకు ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇచ్చే ఉద్దేశం లేదని ప్రకటించింది. ఇక 2022లో ప్రధానమంత్రి కృషి సించాయి యోజన (పీఎమ్‌కేఎస్‌వై) కింద ప్రాజెక్టుల గుర్తింపు నిధుల కేటాయింపునకు సంబంధించి కొత్త నిబంధనలను జారీ చేసింది బీజేపీ ప్రభుత్వం. దీని ద్వారా దేశంలో ఇకపై ఏ సాగునీటి ప్రాజెక్టుకైనా జాతీయహోదా లభిస్తే 90శాతం బదులు 60శాతం నిధులను మాత్రమే కేంద్రం ఇస్తుంది. మిగిలిన 40శాతాన్ని రాష్ట్రాలు భరించాలి. దీనిని బట్టి వ్యవసాయ రంగం సాగు, తాగు నీటి రంగాలపై బీజేపీ దృష్టికోణం ఏమిటో అర్థమవుతున్నది.



కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ పార్లమెంట్ సాక్షిగా కొత్తగా ఏ రాష్ట్రానికి జాతీయ హోదా ప్రాజెక్టు ఇవ్వమని ప్రకటించారు. తెలంగాణ ప్రాజెక్టు జాతీయ హోదా విషయంలో ప్రత్యేకించి దక్షిణ తెలంగాణకు చెందిన కేంద్ర క్యాబినెట్ మంత్రి కిషన్‌రెడ్డి తన సొంత జిల్లా రంగారెడ్డిలో పాలమూరు – రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా 5 లక్షల ఎకరాలకు సాగునీరు, వందల గ్రామాలకు తాగునీరు అందుతుందని తెలిసి తనే ముందుండి జాతీయ హోదా సాధించుకురావల్సింది పోయి దేశంలో తెలంగాణ కంటే పేద రాష్ట్రాలు చాలా ఉన్నాయనీ, ఒకవేళ దేశంలో ఏ రాష్ట్రానికైనా జాతీయ హోదా ఇస్తే తెలంగాణ ప్రాజెక్టు తీసుకువస్తానని మీడియా సాక్షిగా ప్రకటించారు. మరి సరిగ్గా కర్ణాటక ఎన్నికలకు కొన్ని నెలల ముందు కర్ణాటక రాష్ట్రంలోని అప్పరభద్ర ప్రాజెక్టుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జాతీయ హోదా ఇవ్వడమే కాకుండా 2023–2024 బడ్జెట్‌లో రూ.5300కోట్లు కేటాయించింది. మిగతా రాష్ట్రాల అభ్యంతరాలు పట్టించుకోకుండా కేంద్ర జల సంఘం వెంటనే అనుమతి ఇచ్చేసింది. ఆ వెంటనే కేంద్రంలో మంత్రిత్వశాఖ ఆమోదం తెలిపేసింది. ఇన్ని జరుగుతున్నా ఈ రాష్ట్ర బీజేపీ నాయకులు తమ ప్రాంత హక్కుల కోసం ఎందుకు నోరు మెదపలేదో ప్రజలకు సమాధానం చెప్పాలి.

తెలంగాణ ఏర్పడిన తరువాత 2015లో మొదలైన పాలమూరు రంగారెడ్డి ఇప్పటి వరకు పూర్తి కాలేదు. ఒక్క ఎకరాకు కూడా నీరు అందలేదు. కాని 2017లో మొదలైన కాళేశ్వరాన్ని అంతకు మూడింతలు నిధులు వెచ్చించి పూర్తి చేశారు. కరువు, వలసలు, ఫ్లోరైడ్‌తో బాధపడే ప్రాంతాన్ని పక్కకు పెట్టి కాళేశ్వరాన్ని పూర్తిచేయడాన్ని చూసి ఈ ప్రాంత ప్రజల్లో బీఆర్ఎస్ ప్రభుత్వంపై నమ్మకం పోయింది. ఫలితంగా దక్షిణ తెలంగాణలో ఆ పార్టీ ఆనవాళ్ళు లేకుండా పోయింది.

అత్యంత వెనుకబడ్డ పాలమూరు జిల్లాలో రాష్ట్రం ఏర్పడి పదేళ్ళయినా బీమా, నెట్టెంపాడు చివరి ఆయకట్టుకు నీళ్ళు ఇవ్వలేకపోవడం సిగ్గుచేటు. ఆర్‌డీఎస్‌లో తెలంగాణ వాటా 15.9 టీఎంసీలను పూర్తిగా ఇప్పటికీ ఉపయోగించుకోలేకపోతున్నాము. కాని ఈ ప్రాంత మంత్రికి మాత్రం నీళ్ళమంత్రి అని బిరుదు వచ్చింది. ఇక బీజేపీ నాయకులు 2014 ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలన్నీ పూర్తిగా విస్మరించారు. 2014 ఎన్నికల ప్రచారంలో మోదీ మొదలుకొని దివంగత సుష్మాస్వరాజ్ వరకు అందరూ హామీ ఇచ్చారు కాని జాతీయహోదా రాలేదు. పదేళ్ళయినా పాలమూరు నుండి ముంబైకి బస్సులు పోతూనే ఉన్నాయి. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, చేవెళ్ళ, నల్లగొండ, హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజల ఓట్ల కోసం వచ్చే బీజేపీ నాయకులను పాలమూరు – రంగారెడ్డికి జాతీయహోదా ఎందుకు ఇవ్వలేదు అని నిలదీయాల్సిన అవసరం ఉంది.

– రాగి శ్రీనివాస్ రెడ్డి

శక్తిమంతమైన దేశం బీజేపీ లక్ష్యం

అభివృద్ధి పేరిట అవినీతిని ప్రోత్సహించిన ఘనత కాంగ్రెసుది.. అభివృద్ధి పేరుతో ఈ దేశానికి కొత్త నగిషీలు చెక్కింది బీజేపీ. కాశ్మీరం నుంచి కన్యాకుమారి వరకు దేశాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టించింది. బీజేపేయేతర ప్రభుత్వాలకు కూడా ఎలాంటి వివక్షకు తావులేకుండా కేంద్ర నిధులను ఇచ్చింది. సమాఖ్య స్ఫూర్తిని చాటింది. మేకిన్ ఇండియా, స్టార్టప్ ఇండియా, డిజిటల్ ఇండియా, వోకల్ ఫర్ లోకల్ పేరుతో ప్రాంతీయ ఉత్పత్తులకు పెద్దపీట వేయడం వంటి నిర్ణయాలతో దేశాన్ని బలమైన పునాదుల మీద నిర్మాణం చేస్తున్నది. పునాది సామర్థ్యం మీదే భవన బలం ఆధారపడి ఉంటుంది.. అలాగే ఈ దేశం శక్తిమంతమైన దేశంగా ఆవిర్భవించాలంటే బలమైన పునాదులు అవసరం. ఆ కార్యాన్ని నరేంద్రుడు భుజానికెత్తుకున్నాడు. దేశాన్ని తిరుగులేని శక్తిగా నిలుపుతున్నాడు.

పదేళ్లలో వినూత్నమైన మార్పులు తీసుకొచ్చింది బీజేపీ. వివాదాస్పద 370 ఆర్టికల్‌ను కాంగ్రెస్ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకొని జమ్మూ–కాశ్మీర్‌ను రావణకాష్టంలా మార్చింది. అందుకే ఆ ఆర్టికల్ రద్దు చేసి ఒకే దేశం–ఒకే రాజ్యాంగం–ఒకే జెండా అనే విధానాన్ని అమలు చేసింది. పొద్దున లేస్తే మేధావుల పేరిట బీజేపీని వ్యతిరేకించేవారు సైతం ట్రిపుల్ తలాక్ విషయంలో బీజేపీ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతించక తప్పని పరిస్థితిని కల్పించింది. బీజేపీ ముస్లింలకు వ్యతిరేకమని చెప్పుకునేవారు. కానీ, ట్రిపుల్ తలాక్ రద్దు తర్వాత ముస్లిం మహిళలు బీజేపీ జెండాను ఆయా చోట్ల గుండెలకు హత్తుకున్నారు. ఏళ్లనాటి కల సాకారం అయిందని ఉద్వేగాన్ని ప్రదర్శించారు. కాంగ్రెస్ ఓటు బ్యాంక్ రాజకీయాలతో మహిళా రిజర్వేషన్ బిల్లు కూడా చెత్తబుట్టలో వేసింది. అవసరమైనప్పుడు కదిలించి.. ఎన్నికలయ్యాక దానిని పక్కన పెట్టడం కాంగ్రెస్‌కు షరామామూలే. కానీ, దశాబ్దాల ఆకాంక్షయిన మహిళా బిల్లును ప్రవేశపెట్టి మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించింది బీజేపీ. ఈ బిల్లును అడ్డుకునేందుకు కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు నానా యాగీ చేసినా, ఆ అవాంతరాలను కూడా దాటుకొని మహిళా రిజర్వేషన్ బిల్లును పాస్ చేయించిన ఘనత బీజేపీది.

పదేళ్ల నరేంద్రుని పాలన ఈ దేశానికి ఓ మార్గం చూపింది. ఇప్పుడు ఆ తోవలో మరిన్ని విజయాలను అందుకునేందుకు దేశమంతా బీజేపీ విజయం కోసం వెయ్యికళ్ళతో ఎదురు చూస్తోంది. ఇప్పటికే విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే యూసీసీ (యూనిఫామ్ సివిల్ కోడ్), ఒకే దేశం–ఒకే ఎన్నిక, ఎన్నార్సీ వంటి కీలక బిల్లులను తీసుకురానుంది. ఇదంతా సుస్థిరమైన, సమర్థవంతమైన నాయకత్వంతోనే సాధ్యం.

– **కిరణ్ చింతపల్లి,** ఉస్మానియా యూనివర్సిటీ

ఆట ఓ యుద్ధతంత్రం

వాడు బరిలో లేడు
అయినా../ వాడితోనే ఆట మొదలైంది
ఎవడు కూత పెడుతున్నాడో
ఎవడు పట్టుబడుతున్నాడో/ అంతా గందరగోళమే
పొంచి పొంచి/ పంజా విసురుతూ
పరుగుకాళ్ళకు సంకెళ్ళేస్తూ..
గీత కివతలి వైపే మూసేస్తున్నారు
కూత కంఠాన్ని ఆపేస్తున్నారు
పంపేవాడొకడు... వచ్చేవాడొకడు
వొక్క పాయింటన్నా తెస్తాడనీ
'కోటి' ఆశల సూటు 'కేసు' లెన్నో
ఒకరి ఆట ఇంకెవ్వరో ఆడేస్తున్నారు
మరెవడో అవుటై పోతున్నాడు
బలాల బలగాల కలగాపులగాలకు
ఎంపైర్లూ దోషులవుతున్నారు
ప్రత్యక్షదృశ్యాలన్నీ పరదా చాటుకు వెళుతున్నాయి
పొట్టి క్రికెట్ ఆటలా/ గెలుపు ఓటములు
చివరి బంతి వరకూ ఓ సందిగ్ధం
ఆట ముగియకముందే
గెలుపు మీసం మెలేస్తున్నాడొకడు
ప్రచారహోరులో మాటల తూటాలు
దూసుకొస్తున్నాయి../ దుమ్ము రేపుతున్నాయి
ఇప్పుడు ఆటంటే..!/ ఆనందాల వినోదం కాదు
గెలుపు దృశ్యమంటే/ ఆట ముగింపు అంతకన్నా కాదు
శకుని పాచికలాట/ రాజ్యాలను కూల్చే కుతంత్రం
ఎత్తుకు పై ఎత్తుల తంత్రం
ప్రతీ రంగంలోనూ
శత్రువుంటాడు... మిత్రుడూ ఉంటాడు
పరోక్షంగా ఓ యుద్ధం దాగుంటుంది.
ఇప్పుడు యుద్ధమంటే..!
శత్రువుతో పోరాటం కాదు
మిత్రుడి వెన్నుపోటును గుర్తించటమే

– డా. కటుకోఝ్వల రమేష్

కమీషన్ల కాళేశ్వరాన్ని ఎంతకని సమర్థిస్తారు?

ఏప్రిల్ 25, 2024 రోజున ఆంధ్రజ్యోతి దినపత్రికలో వీరమల్ల ప్రకాష్ రాసిన వ్యాసం 'కాళేశ్వరంపై అకారణంగా విషం చిమ్ముతారు ఎందుకు?' శీర్షికన ప్రచురితమైంది. ఈ వ్యాసంలో ప్రకాష్ తెలంగాణలో ఎత్తిపోతల ప్రాజెక్టును నేను వ్యతిరేకిస్తున్నట్టు ప్రస్తావించడం చూస్తే కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టులో జరిగిన అవకతవకల పైనుంచి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నట్టు స్పష్టమవుతుంది. అదేవిధంగా కేవలం ఖర్చులు – ప్రయోజనాల నిష్పత్తి కోణంలో కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టును నేను వ్యతిరేకిస్తున్నట్టుగా ప్రకాష్ చెప్పడం పూర్తిగా అవాస్తవం. నేను రాసిన వ్యాసాల్లో కేవలం ఖర్చులు – ప్రయోజనాల నిష్పత్తి ఆధారంగా ఈ ప్రాజెక్టు నుంచి తప్పుకోవాలని చెప్పలేదు. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వ సంస్థ అయిన కంట్రోలర్ అండ్ ఆడిట్ జనరల్ (కాగ్) తన నివేదికలో స్పష్టంగా చెప్పింది. ఈ ప్రాజెక్టుపై ఖర్చు పెట్టే ప్రతి వంద రూపాయలకు కేవలం 52 రూపాయల ప్రయోజనం మాత్రమే లభిస్తుందని వెల్లడించింది. నేను ఇంతకుముందు రాసిన వ్యాసాల్లో సాంకేతిక సంక్లిష్టత, పర్యావరణ ముప్పు, నిర్మాణంలో నాణ్యత లోపం, ఉద్దేశపూర్వకంగా స్వప్రయోజనాల కోసం ప్రాజెక్టు ఖర్చును విపరీతంగా పెంచడం, ఈ ప్రాజెక్టు ద్వారా వచ్చే ప్రయోజనాలకు మించి నిర్వహణ ఖర్చులు ఎక్కువగా ఉండి అవి తెలంగాణ అభివృద్ధికి అడ్డుగోడగా నిలిచే పరిస్థితి.. ఈ వాస్తవాలను ప్రస్తావించాను. భవిష్యత్తులో ఈ కాళేశ్వరం ప్రాజెక్టును ఇక ముందుకు తీసుకోకపోవడం ఆపి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నాను.

ప్రకాష్ తన వ్యాసంలో అమెరికాలోని కొలరాడో నదిపై కట్టిన హూవర్ డ్యాము, ఈజిప్టులో నైలు నదిపై నిర్మించిన అస్వాన్ డ్యాము, చైనాలో యాంగ్జీ నదిపై నిర్మించిన త్రీ గార్జెస్ డ్యామ్‌లను ప్రస్తావిస్తూ కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టును సమర్థించే ప్రయత్నం చేశాడు. ఒక మామిడిపండును రేగుపండుతో పోల్చినట్టు ఉంది ప్రకాష్ చేసిన ప్రయత్నం. ఎందుకంటే చైనా, ఈజిప్టు, అమెరికాల్లో నిర్మించిన ఈ ప్రాజెక్టులు గ్రావిటీ ఆధారంగా కేవలం ఉపరితల కాలువల ద్వారా వ్యవసాయానికి నేరుగా నీరు అందించే ప్రాజెక్టులు. అంటే ప్రస్తుతం మన నాగార్జునసాగర్ ప్రాజెక్టు, జూరాల ప్రాజెక్టు వంటివి. ఇక కాళేశ్వరం ప్రాజెక్టు విషయానికొస్తే ఇది పూర్తిగా ఎత్తిపోతల ద్వారా పనిచేసే ప్రాజెక్టు. ప్రకాష్ ఇలా ఏ విధంగా పొంతన లేని పోలికతో నేను భారీ నీటిపారుదల ప్రాజెక్టులకు వ్యతిరేకమనే భావన కలిగించే ప్రయత్నం చేశాడు. అంతేకాకుండా మన దేశంలో, మన రాష్ట్రంలో ఉన్న గ్రావిటీ ఆధారిత ప్రాజెక్టులైన బాక్రానంగల్, తుంగభద్ర, హిరాకుడ్, నాగార్జునసాగర్ లాంటి ప్రతిష్ఠాత్మకమైన ప్రాజెక్టులను ప్రస్తావించకుండా, తెలంగాణ ప్రజలకు చైనా అమెరికా ఈజిప్టులలో నిర్మించిన ప్రాజెక్టులపై అవగాహన లేదని భావించి, ఉద్దేశపూర్వకంగా ఏ మాత్రం పోలిక లేకుండానే ఈ భారీ నీటిపారుదల ప్రాజెక్టులతో కాళేశ్వరం ప్రాజెక్టును పోల్చారు. ఇంకా తెలంగాణ ప్రజలు అమాయకులనే భావనలోనే కేసీఆర్ భజన మండలి ఉన్నట్టు దీన్నిబట్టి అర్థమవుతుంది.

ఏప్రిల్ 11, 2024న ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన నా వ్యాసం 'కాళేశ్వరానికి ఒక పాత రష్యన్ ప్రాజెక్టు గుణపాఠం'లో రెండు ఎత్తిపోతల ప్రాజెక్టుల మధ్య ఉన్న పోలికలను ప్రస్తావించాను. పూర్వపు సోవియట్ యూనియన్ తలపెట్టిన భారీ నదీ జలాల మరలింపు ప్రాజెక్టును నిలిపివేయడానికి ఆనాటి సోవియట్ యూనియన్ ప్రణాళిక సంఘం స్పష్టంగా చెప్పిన మూడు కారణాలు ఏమిటంటే– సాంకేతికంగా ఈ ప్రాజెక్టు చాలా సంక్లిష్టమైనదని, పర్యావరణానికి పెద్ద ముప్పని, ఇంకా ఆర్థికంగా భారమని. కానీ ప్రకాష్ ఏప్రిల్ 25, 2024న ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన తన వ్యాసంలో ఈ రష్యన్ నదీ జలాల మరలింపు ప్రాజెక్టును రాజకీయ కారణాలవల్ల మూసివేసినట్టుగా తన ఊహాగానంతో సృష్టించిన కారణాలను చెప్పుకొస్తూ, ఆ అనుభవాలు కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టుకు వర్తించవని చెప్పే ప్రయత్నం చేశారు. ఇది ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమే తప్ప మరొకటి కాదు. అంతేగాక నా వ్యాసంలో స్పష్టంగా తెలిపినట్టు ఈ పూర్వపు సోవియట్ యూనియన్ భారీ నది జలాల మరలింపు ప్రాజెక్టు 1986లో పూర్తిగా మూసివేసిన తర్వాత ప్రపంచంలో ఏ దేశంలో కూడా ఇలాంటి భారీ ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణానికి పూనుకోలేదు. దీనికి ప్రధాన కారణం సోవియెట్ యూనియన్ అనుభవాలు. కానీ ఈ విషయాన్ని పక్కదోవ పట్టించే ప్రయత్నంలో భాగంగా ప్రకాష్ పోలిక లేని అమెరికా, ఈజిప్ట్, చైనాల్లోని గ్రావిటీ ఆధారిత భారీ ఇరిగేషన్ ప్రాజెక్టులను కాళేశ్వరం ఎత్తిపోతల పథకంతో పోల్చారు.

ఈ సందర్భంగా నీటిపారుదల ప్రాజెక్టులలో భారతదేశం ఇతర ఆసియా దేశాలకు ఏ విధంగా దిక్సూచి అయిందో తెలుసుకోవడం అవసరం. 1947లో స్వాతంత్ర్యం అనంతరం మన దేశంలో మొత్తం నీటిపారుదల కింద ఉన్న నికర విస్తీర్ణం కేవలం ఐదు కోట్ల ఎకరాలు మాత్రమే. ఈ విస్తీర్ణం కూడా దాదాపు ఎక్కువ శాతం చెరువులు, బావుల కింద ఉండేది. స్వాతంత్రానంతరం భారతదేశం పేదరికం, ఆహార కొరత, కరువు, నిరుద్యోగం లాంటి సమస్యలతో కొట్టుమిట్టాడుతూ ఉండేది. వీటి పరిష్కారంలో భాగంగా తొలి ప్రధాని నెహ్రూ మొదటి మూడు పంచవర్ష ప్రణాళికలలో (1951–1966) భారీ నీటిపారుదల ప్రాజెక్టులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి 1960వ దశకంలోనే ఏడు భారీ ఇరిగేషన్ ప్రాజెక్టులను నిర్మించి దేశానికి అంకితం చేసిన సంగతి తెలిసిందే. ఆ తదనంతరం ఇదే పరంపరని కొనసాగిస్తూ వివిధ భారీ ఇరిగేషన్ ప్రాజెక్టులను 1985 వరకు నిర్మించారు. మొత్తం దేశంలో ఉన్న జాతీయ హోదాతో కూడిన 16 భారీ నీటిపారుదల ప్రాజెక్టులు, మరో వంద మధ్యతరహా నీటిపారుదల ప్రాజెక్టులన్నీ దాదాపుగా 1951 నుండి 1980 మధ్యకాలంలో నిర్మించినవే. ఇవేగాక దాదాపుగా మరో 4000 చిన్న తరహా ఇరిగేషన్ ప్రాజెక్టులను వివిధ రాష్ట్రాలలో ఇదే కాలంలో నిర్మించారు. వీటి ఫలితంగా దేశంలో నికరంగా నీటిపారుదల విస్తీర్ణం 2014 నాటికి 17 కోట్ల ఎకరాలకు చేరింది. ఆహార ధాన్యాలు ఉత్పత్తి 6 రెట్లు పెరిగి, పేదరికం గణనీయంగా తగ్గి, ఆహార భద్రతను సాధించాం. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావడం ప్రత్యక్షంగా చూసాం. నెహ్రూ అభివృద్ధి విధానంలో భాగంగా నిర్మించిన భారీ ఇరిగేషన్ ప్రాజెక్టుల ప్రయోజనాలను చూసి 1965 తరువాత ఆసియా ఖండంలో వివిధ దేశాలు నీటిపారుదల ప్రాజెక్టులపై దృష్టి సారించి కొత్త ప్రాజెక్టులు నిర్మించారు. ఉదాహరణకు థాయిలాండ్, వియత్నాం, ఇండోనేషియా లాంటి ఆగ్నేయ ఆసియా దేశాల్లోనూ, ప్రకాష్ ప్రస్తావించిన చైనాలోని యాంగ్జీ నదిపై త్రీ గార్జెస్ డ్యాము (1994 నుండి 2003), ఈజిప్ట్‌లో నైలు నదిపై అస్వాన్ డ్యాము (1960 నుండి 1970) లాంటివి నిర్మించారు. ఈ విధంగా మన దేశంలోనూ, ఇతర దేశాల్లోనూ నిర్మించిన అన్ని భారీ ఇరిగేషన్ ప్రాజెక్టులు గ్రావిటీ ఆధారిత భూమి ఉపరితల కాలువల ద్వారా నేరుగా వ్యవసాయానికి నీరు అందించే విధంగా మాత్రమే నిర్మించారు. ప్రపంచంలో ఎక్కడ కూడా కాళేశ్వరం లాంటి భారీ ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మించలేదు.

ఇలా మన దేశంలోనూ, ఇతర దేశాల్లోనూ ఉన్న పూర్వ అనుభవాలను పరిగణించకుండా, ముఖ్యంగా పూర్వపు సోవియట్ భారీ నది జలాల మరలింపు ప్రాజెక్టు గుణపాఠాలను పూర్తిగా విస్మరించి, సొంత ఇంజనీర్ల నిపుణుల కమిటీ సిఫార్సులను తుంగలో తొక్కి, కేవలం స్వప్రయోజనాలు, కమీషన్ల కోసం మాత్రమే ఈ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారు. ఈ ప్రాజెక్ట్ భవిష్యత్తులో తెలంగాణ అభివృద్ధికి పెద్ద అడ్డు గోడగా మారే ప్రమాదం ఉంది. ఈ అడ్డుగోడను ఎంత త్వరగా తొలగించుకుంటే తెలంగాణ అభివృద్ధికి అంత ఆర్థిక వనరుల కొరత తగ్గుతుంది.

> ఇతర దేశాల్లోనూ ఉన్న పూర్వ అనుభవాలను పరిగణించకుండా, ముఖ్యంగా పూర్వపు సోవియట్ భారీ నదీజలాల మరలింపు ప్రాజెక్టు గుణపాఠాలను పూర్తిగా విస్మరించి, సొంత ఇంజనీర్ల నిపుణుల కమిటీ సిఫార్సులను తుంగలో తొక్కి కేవలం స్వప్రయోజనాలు, కమీషన్ల కోసం మాత్రమే ఈ కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారు. ఈ అడ్డుగోడను ఎంత త్వరగా తొలగించుకుంటే భవిష్యత్తు తెలంగాణ అభివృద్ధికి అంత ఆర్థిక వనరుల కొరత తగ్గుతుంది.



■ **ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య**
వ్యవసాయ ఆర్థికవేత్త



బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 40.4 కనిష్ఠం 21.9



- ప్రభుత్వ విభాగాల నిర్లక్ష్యంతో నగరం.. ఆగమాగం
- క్షేత్రస్థాయిలో కనిపించని ప్రత్యేక బృందాలు
- కాలు కదపని అధికారులు
- ఎక్కడికక్కడ నిలిచిన వరద నీరు
- రహదారులపై జామ్‌జాటం
- నాలుగు నుంచి 26 గంటలకుపైగా కరెంట్ కట్

ముందస్తు సూచన ఉన్నా..

ఎందుకీ దుస్థితి?

'మోకాలిలోతు వరద నీరు.. ప్రధాన రహదారులపై గంటల తరబడి జామ్ జాటం.. నాలుగు నుంచి 26 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం.. 12 మంది మృతి'

- అంతర్జాతీయ స్థాయి నగరమని గొప్పగా చెప్పుకునే హైదరాబాద్‌లో ఒక్కవానతో ఏర్పడిన దురవస్థ ఇది.

హైదరాబాద్ సిటీ, మే 8 (ఆంధ్రజ్యోతి): వాన పడుతుందని ముందస్తు సూచన ఉన్నా సర్కారీ శాఖలు అప్రమత్తం కాలేదు. అకాల వర్షమే అయినా.. మంగళవారం అకస్మాత్తుగా భారీ వర్షం కురవలేదు. సాయంత్రం నాలుగు గంటల నుంచే దట్టంగా మేఘాలు కమ్ముకున్నాయి. 5.40 నుంచి 6 గంటల ప్రాంతంలో (ఒక్కో ఏరియాలో ఒక్కో సమయం) వాన మొదలైంది. రాత్రి 10 గంటల వరకు మియాపూర్‌లో అత్యధికంగా 13.3 సెం.మీల వర్షపాతం నమోదైంది. మొత్తంగా జీహెచ్ఎంసీ పరిధిలో నమోదైన సగటు వర్షపాతం 3.8 సెం.మీలు మాత్రమే. అయినా నగరం ఆగమాగమైంది. ఆఫీస్‌ల నుంచి ఇళ్లకు వెళ్లే క్రమంలో రోడ్లపై, కరెంట్ లేక ఇంట్లో జనం ఇబ్బందులు పడ్డారు. కొందరు నగరవాసులు రాత్రి కంటి మీద కునుకులేకుండా గడిపారు. ఎండల తీవ్రత నుంచి ఉపశమనం పొందడం కంటే.. వర్షం వల్ల పడిన అవస్థలు వర్ణనాతీతమని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. నగరవాసులు అల్లాడుతున్నా.. జీహెచ్ఎంసీ, ట్రాఫిక్, టీఎస్ఎస్‌పీడీసీఎల్, వాటర్‌బోర్డు ఉన్నతాధికారులు

మిగతా 6వ పేజీలో..

పాడువానకు 12 మంది బలి

హైదరాబాద్‌సిటీ/నిజాంపేట/కుత్బుల్లాపూర్, మే8 (ఆంధ్రజ్యోతి) : పాడువాన పన్నెండు మందిని బలితీసుకుంది. మంగళవారం సాయంత్రం అకస్మాతుగా కురిసిన భారీ వర్షం పలు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ఇతర రాష్ట్రాల నుంచి పొట్ట చేతబట్టుకొని నగరానికి ఉపాధికి వచ్చిన వలస కూలీలను చిదిమేసింది. బాచుపల్లిలో గోడ కూలిన ఘటనలో ఓ బాలుడితో పాటు ఏడుగురు మృతి చెందారు. వీరంతా ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌కు

మిగతా 6వ పేజీలో..

అంధకారం.. జాగారం

ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడంలో విద్యుత్ వ్యవస్థ విఫలం

- నీళ్లు లేక.. మొబైల్ ఫోన్లలో చార్జింగ్ లేక అవస్థలు



చందానగర్‌లో కూలిన చెట్టు, విద్యుత్ స్తంభం

భారీ వర్షానికి విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తమైంది. కొన్ని ప్రాంతాల్లో ప్రజలు రాత్రంతా జాగారం చేశారు. కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, మియాపూర్ పరిసరాల్లో పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. విద్యుత్ స్తంభాలు, తీగలు తెగిపోతే ప్రత్యామ్నాయ ఫీడర్ల నుంచి సరఫరా పునరుద్ధరించాల్సిన అధికారులు అలాంటి చర్యలేవి తీసుకోలేదు. ఫలితంగా ఇళ్లల్లో గాలి ఆడక చిన్నారులు చీకట్లో గగ్గోలు పెట్టారు. వారిని ఓదార్చలేక తల్లిదండ్రులు అవస్థలు పడ్డారు. బుధవారం ఉదయం 10 గంటల వరకు కరెంట్ రాకపోవడంతో ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు నీళ్లు లేక, మోటర్లు పనిచేయక ఇబ్బందులు పడ్డారు. చార్జింగ్ లేక ఫోన్లు మూగబోయాయి.


ఎండను గుర్తించి.. వర్షాన్ని మరవడంతో సమస్యలు...

ఎండాకాలం రికార్డుస్థాయిలో పెరిగిన విద్యుత్‌పై దృష్టిపెట్టిన విద్యుత్‌శాఖ వర్షాలు కురిస్తే తీసుకోవాల్సిన చర్యలను గాలికి వదిలేసింది. డిజాస్టర్ టీమ్‌లు, సిబ్బంది లేకపోవడంతో మరమ్మతు పనుల్లో జాప్యం జరిగింది. విద్యుత్‌స్తంభాలు విరిగిన ప్రాంతాల్లో కవర్ కండక్టర్ కేబుల్‌తో ప్రత్యామ్నాయ ఫీడర్ల నుంచి విద్యుత్‌సరఫరా అందించే అవకాశాలున్నా ఆ దిశగా అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టలేదనే విమర్శలున్నాయి.

గంటల కొద్దీ విద్యుత్ లేని కొన్ని ప్రాంతాలు

గంటలు	ప్రాంతం
26 గంటలు	కేపీహెచ్‌బీ ఎస్ఎస్‌కాలనీ, ధర్మారెడ్డి ఫేజ్-2లో మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి బుధవారం రాత్రి 7 గంటల వరకు..
22 గంటలు	కూకట్‌పల్లి బాలాజీనగర్‌లోని కొన్నిచోట్ల మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి బుధవారం మధ్యాహ్నం 3 గంటల వరకు..
16 గంటలు	ఉప్పల్ రామంతాపూర్‌లో మంగళవారం సాయంత్రం 6 గంటల నుంచి బుధవారం ఉదయం 10 గంటల వరకు..
15 గంటలు	మియాపూర్ అంబేడ్కర్‌నగర్‌లో మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి బుధవారం ఉదయం 8 గంటల వరకు..
9 గంటలు	యూసుఫ్‌గూడ గణపతి కాంప్లెక్స్, ఎల్లారెడ్డి గూడ ప్రాంతాల్లో మంగళవారం సాయంత్రం 6 గంటల నుంచి బుధవారం తెల్లవారుజాము 3 వరకు..

పనిచేస్తారా.. వెన్నుపోటు పొడుస్తారా?



హైదరాబాద్ సిటీ, మే7 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్‌లోని పలు నియోజకవర్గాల్లోని బస్తీ, డివిజన్ స్థాయి నేతలు కాంగ్రెస్‌లో పెద్దత్తున చేరుతున్నారు. వారిని బూత్‌స్థాయిలో సర్దుబాటు చేయడం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జిలకు తలకు మించిన భారంగా మారుతోంది. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో కాంగ్రెస్‌కు ఒక్క ఎమ్మెల్యే సీటూ లేదు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంలో కొన్ని నియోజకవర్గాల్లో బూత్‌స్థాయి లీడర్లు దొరకడం గగనంగా మారింది. ప్రస్తుతం ఆ పార్టీకి లోకల్ లీడర్ల కొరతలేదు. ఆ లీడర్లతో ఇటీవల అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమావేశాలు జరిపారు. ఈ సందర్భంలో ఒక్కో పోలింగ్ బూత్‌కు బాధ్యతలను అప్పగించే ప్రక్రియను చేపట్టారు. అంబర్‌పేట, ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నాంపల్లి, ముషీరాబాద్, సికింద్రాబాద్, సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ బూత్‌ల బాధ్యతల కోసం స్థానికులు పోటీపడ్డారు. ఎన్నికల సందర్భంలో బూత్‌ల ఇన్‌చార్జిలు కీలకంగా పని చేయాల్సి ఉంటుంది. అయితే వారిలో చాలా మంది ఇటీవలే కాంగ్రెస్ చేరిన వారు ఉన్నారు. వారికి బాధ్యతలు అప్పగిస్తే పార్టీకి నమ్మినట్లుగా పని చేస్తారా? లేకుంటే ప్రత్యర్థులకు లీకులిస్తారా? అనే అనుమానాలు కాంగ్రెస్ నేతలను వెంటాడుతున్నాయి. వారిని సమన్వయం చేసుకుంటూ పోల్ మేనేజ్‌మెంట్ చేయడం సవాల్‌గా మారిందని కాంగ్రెస్ నేత ఒకరు అభిప్రాయపడ్డారు.

ఎవరికి ఓటేశామో తెలుసుకోవచ్చు



అల్వాల్, మే8 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు ఈ నెల 13వ తేదీన నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈవీఎంలో ఓటు వేసిన తరువాత తమ ఓటు అభ్యర్థికి పడిందో లేదో వీవీప్యాట్ యంత్రంలో ఓటర్లు పరిశీలించవచ్చు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్(ఈవీఎం)లోని ఒక భాగమే ఓటర్ వెరిఫైయబుల్ పేపర్ అడిట్ ట్రయల్(వీవీప్యాట్). ఈవీఎంలో అభ్యర్థుల పేర్లు, ఫొటో, గుర్తు, సీరియల్ నంబర్ కనిపిస్తాయి. ఓటు వేసిన తర్వాత వీవీప్యాట్‌లో అభ్యర్థి పేరు, గుర్తు సీరియల్ నంబర్‌తో స్లిప్ ప్రింట్ అవుతుంది. దానికి అమర్చిన ట్రాన్స్‌పరెంట్ స్క్రీన్ మీద పేపర్ కేవలం 7 సెకన్లు ఉంటుంది. ఓటు నమోదైనట్లు ధ్రువీకరించుకోవడానికి వీవీప్యాట్ దోహదపడుతుంది. ఈ వ్యవస్థలో ఓట్లను మార్చడానికి లేదా లెక్కలు తారుమారు చేయడానికి వీలు లేదు. రీకౌంటింగ్ అవసరమైతే మాన్యువల్‌గా ఓట్ల లెక్కింపు మార్గాన్ని కూడా చూపుతుంది. ఈవీఎం, వీవీప్యాట్‌తో పాటు కంట్రోల్ యూనిట్, బ్యాలెటింగ్ యూనిట్‌లు ఉంటాయి. కంట్రోల్ యూనిట్ పోలింగ్ అధికారి దగ్గర, బ్యాలెట్ యూనిట్, వీవీప్యాట్ ఓటు వేసే దగ్గర ఉంటాయి. పోలింగ్ అధికారి కంట్రోల్ యూనిట్‌ను యాక్టివేట్ చేస్తేనే ఓటు వేసే అవకాశం ఉంటుంది.

డీఆర్‌సీ బృందాలు సమర్థవంతంగా పని చేయాలి





శిక్షణలో మాట్లాడుతున్న రోనాల్డ్‌రోస్

హైదరాబాద్ సిటీ, మే 8 (ఆంధ్రజ్యోతి): డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాల్లో (డీఆర్‌సీ) పనిచేసే బృందాలు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ సూచించారు. బంజారాహిల్స్‌లోని కొమురం భీమ్ ఆదివాసీ భవన్‌లో డీఆర్‌సీ బృందాలకు బుధవారం శిక్షణా తరగతులు నిర్వహించారు. ఎన్నికల సంఘం నిబంధనలు.. డీఆర్‌సీ కేంద్రాల్లో నిర్వర్తించాల్సిన విధులు, బాధ్యతలు, పరిశీలించాల్సిన అంశాలను అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా రోనాల్డ్ మాట్లాడుతూ.. గత ఎన్నికల అనుభవాలు దృష్టిలో ఉంచుకొని డీఆర్‌సీ కేంద్రాల్లో ఎలాంటి సమస్యలు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు.

బైండోవర్ అంటే..?



అల్వాల్, మే8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు వచ్చాయంటే పాత నేరస్తులను, రౌడీషీటర్లను బైండోవర్ చేయడం సహజం. దీని అర్థం చాలామందికి తెలియదు. ఒక వ్యక్తి వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని భావించినా, అతడి చర్యలు అనుమానాలకు తావిచ్చినా పోలీసులు సదరు వ్యక్తిని తహసీల్దార్ లేదా ఆర్డీవో ఎదుట హాజరు పరుస్తారు. చట్ట వ్యతిరేక పనులు, చర్యలు చేపట్టనని బాండ్ పేపర్లపై లిఖితపూర్వకంగా హామీ తీసుకుని సొంత పూచీకత్తుపై విడుదల చేస్తారు. ఈ ప్రక్రియనే బైండోవర్(బాండ్ ఫర్ గుడ్ బిహేవియర్) అంటారు. హామీ తర్వాత కూడా తప్పు చేస్తే 24 గంటల్లో సదరు వ్యకిని అరెస్ట్ చేసి ఐపీసీ 107, 108, 109, 110 సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేస్తారు.

దానం.. ప్రచారపర్వం

కాంగ్రెస్ బీఆర్ఎస్ అభ్యర్థి దానం నాగేందర్ ప్రచారంలో దూసుకెళ్తున్నారు. బుధవారం రాత్రి సీతాఫల్‌మండీలో ప్రచారం నిర్వహించి తనను గెలిపించాలని ప్రజలను కోరారు.


14 ఏళ్ల బాలికతో బలవంతంగా వ్యభిచారం

- పెంపుడు తల్లి దాష్టీకం

8

పోల్..టెన్షన్..!

పోలింగ్ శాతంపై అధికారుల హైరానా



- వెంగళరావునగర్‌లో ఉంటున్న ఉమామహేశ్వర్‌రావుది సొంతూరు ఏపీలోని పల్నాడు జిల్లా గురజాల. నగరంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్న ఈయన 20 ఏళ్లుగా వెంగళరావునగర్‌లో నివాసముంటున్నారు. ఉమామహేశ్వర్‌రావుతో పాటు ఆయన భార్యకు నగరంలో, అటు స్వగ్రామంలో కూడా ఓటు హక్కు ఉన్నది. గత అసెంబ్లీ ఎన్నికల్లో భార్యభర్తలిద్దరూ నగరంలోనే ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. కానీ, మే 13న జరుగుతున్న పోలింగ్‌కు ఏపీలోని స్వగ్రామానికి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.

- సికింద్రాబాద్‌లోని వారాసిగూడలో ఉంటున్న ప్రైవేట్ ఉద్యోగి వంశీకృష్ణ కూడా రెండు చోట్ల ఓటరుగా నమోదై ఉన్నాడు. నగరంలోను, స్వగ్రామం హన్మకొండలోను జాబితాలో పేరుంది. గత అసెంబ్లీ, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో నగరంలోనే ఓటు హక్కును వినియోగించుకున్న వంశీకృష్ణ.. ఈసారి భార్య, పిల్లలతో కలిసి హన్మకొండకు వెళ్లి ఓటు వేస్తానని చెబుతున్నాడు. స్థానికంగా గట్టి పోటీ ఉండడం, స్నేహితులు ఓటు వేసేందుకు రావాలని కోరుతుండడంతో తప్పనిసరిగా హన్మకొండకు వెళ్లాల్సి వస్తోందంటున్నాడు. తెలంగాణ, ఏపీలో జరుగుతున్న ఎన్నికలు ప్రతిష్ఠాత్మకంగా మారడంతో నగరంలోని గ్రామీణ ఓటర్లు సొంతూర్లకు వెళ్లేందుకే ఆసక్తి చూపిస్తున్నారని తెలుస్తోంది.

- అసెంబ్లీ ఎన్నికల్లో పలు చోట్ల 50 శాతం దాటని ఓటింగ్
- సొంతూళ్లకు వెళ్లి ఓటేసిన గ్రామీణ ఓటర్లు
- తాజాగా అదే ఆసక్తిని చూపిస్తున్న పరిస్థితి
- అదే.. జరిగితే పోలింగ్‌శాతంపై ప్రభావం

హైదరాబాద్ సిటీ, మే 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో గ్రేటర్ పోలింగ్‌పై అధికారులు హైరానా పడుతున్నారు. ఎండ వేడితో పాటు నగరంలో నివాసముంటున్న చాలామంది గ్రామీణ ప్రజలు తమ సొంతూరిలోనే ఓటు వేయాలని చూస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. నగరంలోనే ఓటు హక్కును సద్వినియోగం చేసుకునేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ ఆశించిన స్పందన కనిపించడం లేదని పలువురు వాపోతున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, మియాపూర్, పటాన్‌చెరు, తదితర ప్రాంతాల్లో నివాసముంటున్న పొరుగు ప్రాంతాలకు చెందిన ప్రజలకు పది రోజులుగా సొంతూళ్లకు చెందిన నాయకులు,

మిగతా 6వ పేజీలో..

రైళ్లు, బస్సుల్లో రిజర్వేషన్లు ఫుల్

ఓటు వేసేందుకు సొంతూళ్లకు వెళ్లాలని శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఎల్‌బీనగర్, మేడ్చల్, తదితర ప్రాంతాలకు చెందిన కొంతమంది ఇప్పటికే రైళ్లు, బస్సుల్లో రిజర్వేషన్ చేసుకున్నారు. దీంతో పోలింగ్‌కు ముందు రోజుల్లో ఆ రూట్లలోని రైళ్లల్లో రిజర్వేషన్ సీట్లు అయిపోయాయి. మరికొందరు సొంత వాహనాల్లో బయలుదేరి సొంతూరిలోనే ఓటు వేయాలని భావిస్తున్నారు. ఏపీలో జరుగుతున్న ఎన్నికలను అక్కడి నేతలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని.. నగరంలో ఉంటున్న ఓటర్లకు రవాణా చార్జీలు, తాయిలాలు కూడా సమకూర్చుతున్నారు. ఓటుకు రూ.3వేలు, రవాణా ఛార్జీల కింద రూ.2వేల చొప్పున ఇస్తున్నట్లు సమాచారం. కాగా, అక్కడి స్థానిక నేతలను నగరానికి పంపిస్తూ ఓటరు జాబితా, ఫోన్ నంబర్ల ఆధారంగా వారిని ఊరికి రావాలని విజ్ఞప్తి చేస్తున్నారు. నగరంలో ఉండే గ్రామీణ ప్రజలు సొంతూరులో ఓటు హక్కు వినియోగించుకుంటే అది నగరంలో పోలింగ్‌పై తీవ్ర ప్రభావం చూపే అవకాశాలున్నాయి.

ప్రచారంలో శ్రమ దోపిడీ

పేట్‌బషీరాబాద్, మే8 (ఆంధ్రజ్యోతి): ప్రచారం కోసం వెళ్తున్న అడ్డాకూలీలకు ఇస్తున్న నగదులో కొందరు దోపిడీకి పాల్పడుతున్నారు. జగద్గిరిగుట్టకు చెందిన అడ్డా కూలీలు శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ప్రచారానికి వెళ్లారు. వారికి రూ.500, బిర్యానీ ఇచ్చారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో మరో అభ్యర్థి ప్రచారానికి వెళ్లిన అడ్డాకూలీలకు రూ.300లే ఇచ్చారు. నాయకుల వద్ద కార్మికుల కోసమని రూ.500 చొప్పున తీసుకుని, గల్లీ లీడర్లు రూ. 200లు తీసుకున్నట్లు కూలీలు ఆరోపిస్తున్నారు. మండుటెండలో ప్రచారం చేస్తున్న తమ వద్ద దోచుకోవడం అన్యాయమని వాపోతున్నారు.



అందం.. అభినయం

హైదరాబాద్ సిటీ, మే 8 (ఆంధ్రజ్యోతి): సోమాజిగూడలోని విల్లా మేరీ మహిళా డిగ్రీ కళాశాల ఫేర్‌వెల్ పార్టీ బుధవారం సాయంత్రం జరిగింది. శుభం-లివింగ్ ఏ లెగసీ పేరుతో నిర్వహించిన ఈ వేడుకలలో మిస్ రుపాంజనల్, రైజింగ్ స్టార్, జార్జియస్ టైటిల్స్‌తో ఉత్సాహపూరితంగా పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల ఫౌండర్ డాక్టర్ ఫెలోమినా, ప్రిన్సిపాల్ రేవతి తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థకు చేరిన ఇళ్లపై సర్వే చేయాలి

హైదరాబాద్ సిటీ, మే 8 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో శిథిలావస్థకు చేరిన ఇళ్లపై సర్వే చేసి నివేదిక ఇవ్వాలని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్ టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఈమేరకు బుధవారం ఆయన వర్షాకాల సన్నద్ధతపై అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాల కారణంగా ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉండేందుకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్కిళ్ల వారీగా శిథిలావస్థలో ఉన్న నిర్మాణాలను వెంటనే గుర్తించి, తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పోల్.. టెన్షన్..!

(5వ పేజీ తరువాయి)

కార్యకర్తలు ఫోన్లు చేస్తున్నారు. మే 13న జరిగే పోలింగ్ రోజున ఊరికి తప్పకుండా వచ్చి ఓటేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో తగ్గిన పోలింగ్..

2023 నవంబర్‌లో జరిగిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో నగరంలో నివాసముండే వివిధ జిల్లాలకు చెందిన ప్రజలు తమ సొంతూరికి వెళ్లి ఓటు వేశారు. దీంతో పలు నియోజకవర్గాల్లో పోలింగ్ శాతం భారీగా తగ్గింది. గ్రేటర్‌లోని ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో మొత్తం 5,93,762 ఓటర్లుండగా 2,95,131 ఓట్లు (49.71 శాతం) పోలయ్యాయి. అంటే మొత్తం ఓట్లలో సగం మాత్రమే పోలైన పరిస్థితి నెలకొంది. ఇక్కడ నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్ ప్రాంతాలకు చెందిన ప్రజల్లో కొంత మందికి నగరంలోను, తమ సొంత ఊరిలోను ఓటు హక్కు ఉన్నది. వారిలో ఎక్కువ మంది ఓటుహక్కును స్వగ్రామంలోనే వినియోగించుకున్నారు. ఇది పోలింగ్ శాతంపై ప్రభావం చూపిందని అధికారులు భావిస్తున్నారు. అలాగే శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మొత్తం 7,32,560 ఓటర్లు ఉండగా.. ఎన్నికల్లో 3,57,830 ఓట్లు (48.85 శాతం) పోలయ్యాయి. ఇక్కడ కూడా పోలింగ్ పర్సంటేజీ 50 శాతం దాటకపోవడంతో అధికారులు ఆశ్చర్యానికి లోనయ్యారు.

వారు ఓటేసేది ఎక్కడ?

మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని మల్కాజిగిరి, ఎల్‌బీనగర్, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లిలోని ఓటర్లలో దాదాపు 30 శాతం మందికి నగరంతో పాటు తెలంగాణ, ఏపీలోని తమ సొంతూళ్లలో కూడా ఓటు హక్కు ఉన్నది. చేవెళ్ల సెగ్మెంట్‌లోని శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, మహేశ్వరం, సికింద్రాబాద్ పార్లమెంట్‌లోని జూబ్లీహిల్స్, ముషీరాబాద్, అంబర్‌పేట్‌లోని 20 శాతం మందికి కూడా రెండు చోట్లా ఓటు హక్కు ఉన్నది. ఇందులో చాలామంది 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగానే.. ఎంపీ ఓటును పుట్టిన ఊరులో వేసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ఏపీలో అసెంబ్లీ ఎన్నికలు కూడా జరుగుతున్న నేపథ్యంలో నగరంలో ఉంటున్న ఏపీవాసుల్లో కొందరు ఓటును తప్పనిసరిగా సొంతూరులో వేయాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఊరి నుంచి పెద్ద ఎత్తున ఫోన్లు వస్తుండడంతో అక్కడికే వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.

2014లో ఆయా పార్లమెంట్ స్థానాల్లో నమోదైన ఓటింగ్

స్థానం	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	శాతం
సికింద్రాబాద్	18,93,741	10,03,769	53.04
హైదరాబాద్	18,23,217	9,71,421	53.03
మల్కాజిగిరి	31,83,083	16,20,444	50.09
చేవెళ్ల	21,85,164	13,15,862	60.02

2019లో ఆయా పార్లమెంట్ స్థానాల్లో నమోదైన ఓటింగ్

స్థానం	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	శాతం
సికింద్రాబాద్	19,68,276	9,15,106	48.09
హైదరాబాద్	19,57,931	8,77,872	45.08
మల్కాజిగిరి	31,50,313	15,63,063	53.04
చేవెళ్ల	24,43,112	13,00,194	56.09

పాడువానకు 12 మంది బలి

(5వ పేజీ తరువాయి)

చెందినవారే. మృతిచెందిన వారిలో రామ్‌యాదవ్ (44), ఆయన సతీమణి గీతబల్ (40), వారి కుమారుడు హిమాన్షు (4), సంకదేబ్‌గౌడ్ (18), మహారాష్ట్రకు చెందిన బింద్రేష్ భవానీ చౌహాన్ (30), ఆయన సతీమణి ఖుషి (20), ఒడిశాకు చెందిన శ్రీపతి మాగి (23) అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాద స్థలాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు సందర్శించారు. బాధితులకు అండగా ఉంటామని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి ఆకుల సతీష్ తదితరులు తెలిపారు. అదేవిధంగా ఉపాధి కోసం నగరానికి వచ్చిన ఒడిశా రాష్ట్రానికి చెందిన చంద్ర పాండా (38), మనోజ్ దాస్ (45) ఓ హోటల్‌లో పని చేస్తూ బేగంపేటలోని ఓల్డ్ కష్టమ్స్ బస్తీలో రూం అద్దెకుంటున్నారు. వర్షంతో వరద నీటి నుంచి తప్పించుకునేందుకు రైలు పట్టాలపై నడుస్తుండగా ప్రమాదవశాత్తు ఇద్దరూ నాలాలో పడిపోయారు. మరునటిరోజు బేగంపేట నాలాలో కొట్టుకొచ్చిన మృతదేహాలను చూసి వారిని గుర్తించారు. అదేవిధంగా బహదూర్‌పురాలో వర్షం కారణంగా ఓ వ్యక్తి విద్యుత్ స్తంభాన్ని పట్టుకోవడంతో షాక్ కొట్టింది. దాంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దాంతో పాటు పశ్చిమ గోదావరి జిల్లా ఆచంటకు చెందిన నాగబాల గంగాధరరావు (38), తూర్పు గోదావరి జిల్లా కడియంకు చెందిన చింతపల్లి సుబ్రమణ్యం (40) నగరానికి ఉపాధికి వచ్చి కొంపల్లిలో తాపీమేస్త్రీలుగా పని చేస్తున్నారు. రాయిలాపూర్‌లోని ఓ ఫాంహౌజ్‌లో పని చేస్తుండగా వర్షం కురవడంతో గోడ పక్కన నిల్చోగా అది కూలీ ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు.

మృతుల కుటుంబాలకు కార్మికశాఖ ఆర్థిక సాయం

చిక్కడపల్లి, మే 8(ఆంధ్రజ్యోతి): బాచుపల్లి ఘటనలో మృతి చెందిన బాధితుల కుటుంబానికి కార్మికశాఖ బుధవారం ఆర్థిక సాయం అందజేసినట్లు రంగారెడ్డి జోన్ కార్మికశాఖ సంయుక్త కమిషనర్ ఎల్. చతుర్వేది తెలిపారు. ఈ సంఘటనలో మరో ముగ్గురు కార్మికులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని వివరించారు. ఒక్కొక్కరికి 80 వేల చొప్పున 3.20లక్షలు వారి వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశామమన్నారు. నిబంధనలను ఉల్లంఘించిన యజమానికి నోటీసులు జారీ చేసి కార్మిక చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మ్యాన్‌హోల్స్ ఓవర్ ఫ్లో కాకుండా చర్యలు చేపట్టాలి : వాటర్‌బోర్డు ఎండీ

హైదరాబాద్ సిటీ, మే 8 (ఆంధ్రజ్యోతి): వర్షం కారణంగా మ్యాన్‌హోల్స్ ఓవర్‌ఫ్లో గాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని వాటర్‌బోర్డు ఎండీ సుదర్శన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మరో మూడు రోజులు వర్షాలు పడే అవకాశముందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో.. అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆపరేషన్స్ డైరెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. నీటి కలుషిత నివారణ చర్యలు చేపట్టాలన్నారు. బోర్డు పరిధిలోని పలు వాటర్ ఫిల్లింగ్‌స్టేషన్లను ఎండీ సుదర్శన్‌రెడ్డి బుధవారం సందర్శించారు. కొండాపూర్, మాదాపూర్, అయ్యప్ప సొసైటీ, బంజారాహిల్స్, సోమాజిగూడ ఫిల్లింగ్ స్టేషన్లను పరిశీలించి.. ట్యాంకర్ ద్వారా సరఫరా చేస్తున్న నీటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ట్యాంకర్ బుకింగ్, డెలివరీ టైమింగ్స్‌ను కచ్చితంగా లాగ్ బుక్‌లో రాయాలన్నారు. కార్యక్రమంలో సీజీఎం టీవీ శ్రీధర్, జీఎం హరిశంకర్ పాల్గొన్నారు.

ఎందుకీ దుస్థితి ?

(5వ పేజీ తరువాయి)

టెలీకాన్ఫరెన్స్ కూడా నిర్వహించలేదు. క్షేత్రస్థాయిలో అధికారులనూ అప్రమత్తం చేయకుండా ఉదాసీనంగా వ్యవహరించారు.

జామ్‌జాటం..

భారీ వర్షంతో మంగళవారం ట్రాఫిక్ పూర్తిగా అదుపు తప్పింది. అయినా చాలా ప్రాంతాల్లో పోలీసులు కనిపించలేదు. గతంలో వర్షం కురిస్తే ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించే వారు. దగ్గరుండి వాహనాల రాకపోకలు క్రమబద్ధీకరించే వారు. ట్రై కమిషనరేట్లలో ఎక్కడా ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించలేదు. కొన్ని ఏరియాల్లో మాత్రం సిబ్బంది రోడ్లపై నిలిచిన వరద నీటిని తొలగించారు. ఐకియా- హైటెక్‌సిటీ, ఇనార్బిట్ మాల్- గచ్చిబౌలి, లింగంపల్లి- మాదాపూర్ ప్రాంతాల్లో వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరాయి. లింగంపల్లి నుంచి మాదాపూర్‌కు ద్విచక్ర వాహనంపై రావడానికి మూడు గంటలు పట్టిందని జీహెచ్ఎంసీ కేంద్ర కార్యాలయంలో పనిచేసే ఓ ఉద్యోగి పేర్కొన్నారు.

పొంగిపొర్లిన మ్యాన్‌హోళ్లు

భారీ వర్షానికి నగరంలోని పలు ప్రాంతాల్లో పెద్దఎత్తున మ్యాన్‌హోల్స్ పొంగిపొర్లాయి. ఒక్కసారిగా వచ్చిన వరద మొత్తం మ్యాన్‌హోళ్లలోకి చేరడంతో ప్రవాహ పరిమితి మించింది. దాంతో నగరంలోని అనేక ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్ పొంగాయి. వీధులన్నీ అధ్వాన్నంగా మారాయి. బుధవారం ఉదయం కూడా వీధుల్లో మురుగు ప్రవహించింది. పాదచారులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రధానంగా ఐడీఏ జీడిమెట్లలోని సుభాష్‌నగర్‌లోని, చైతన్యపురి న్యూమారుతీ నగర్ రోడ్డులో, బంజారాహిల్స్‌లోని రోడ్ నం.10లో, ఆనంద్‌నగర్‌లో, శ్రీనగర్‌కాలనీలో, అమీర్‌పేటలో, పంజాగుట్ట మెట్రోస్టేషన్ వద్ద ఇలా నగరంలోని పలు ప్రాంతాల్లో పెద్దఎత్తున మురుగు ప్రవహించింది. భారీ వర్షం కురిసిన సందర్భంలో అత్యవసరంగా సేవలందించాల్సిన ఎయిర్‌టెక్ మిషన్లు మంగళవారం రాత్రి ఎక్కడా పని చేయలేదు. బుధవారం పది గంటల వరకు రోడ్డెక్కలేదు. వర్షానికి సీవరేజ్ ఓవర్ ఫ్లోతో ఇళ్ల మధ్య ఇబ్బందులు పడుతున్నామని ఫోన్ చేసినా స్పందించలేదని ఆనంద్‌నగర్ కాలనీ నివాసితులు తెలిపారు. వాటర్‌బోర్డు కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఈ పరిస్థితి ఉంటే ఇక ఇతర ప్రాంతాల్లో పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

ఇంజనీర్స్ కాలనీలో వ్యక్తి హత్య

యూసుఫ్‌గూడ, మే 8 (ఆంధ్రజ్యోతి): యూసుఫ్‌గూడ ఇంజనీర్స్ కాలనీలో బుధవారం సాయంత్రం ఓ వ్యక్తిని దుండగులు హత్య చేశారు. ఈ ఘటన మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంజనీర్స్ కాలనీలోని ఫ్రిడ్జ్ రెసిడెన్సీలో నివాసం ఉంటున్న రవికుమార్ సాఫ్ట్‌వేర్ ఫ్యాకల్టీగా పని చేస్తున్నాడు. బుధవారం సాయంత్రం 4గంటలకు అతని భార్య బయటకు వెళ్లి తిరిగి 5 గంటలకు ఇంటికి చేరుకుంది. అప్పటికే తన భర్త రవికుమార్ మృతిచెంది విగతజీవిగా పడి ఉన్నాడు. భయాందోళనకు గురైన ఆమె మధురానగర్ పోలీసులకు సమాచారం అందించటంతో వారు సంఘటనా స్థలానికి వచ్చి పంచనామా నిర్వహించారు. హత్య జరిగిన ప్రదేశంలో కారం, పసుపు చల్లినట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్‌తోనే మహిళా సాధికారత సాధ్యం

సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్



మాట్లాడుతున్న సికింద్రాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్, పక్కన అల్ ఇండియా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు అల్కాలాంబ

బంజారాహిల్స్, మే 8(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారత కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతోందని సికింద్రాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. బంజారాహిల్స్ లేక్‌వ్యూ గెస్టుహౌస్‌లో బుధవారం నిర్వహించిన సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గస్థాయి మహిళా న్యాయ సమ్మేళనానికి దానం నాగేందర్‌తోపాటు ఆల్ ఇండియా మహిళా అధ్యక్షురాలు అల్కాలాంబ, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రతి నెలా రూ.2,500 అందజేస్తోందని గుర్తుచేశారు. రాజకీయంగా కూడా కాంగ్రెస్‌లోనే మహిళలకు తగిన ప్రాధాన్యం లభించిందన్నారు. అల్కాలాంబ మాట్లాడుతూ.. దేశానికి తొలి మహిళ ప్రధాని ఇందిరాగాంధీని అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు. మొదటి నుంచి మహిళలకు తగిన ప్రాధాన్యమిచ్చే కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో దానం నాగేందర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయారెడ్డి, మాజీ కార్పొరేటర్ భారతీ నాయక్, ఖైరతాబాద్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఉషశ్రీ, సికింద్రాబాద్ మహిళా అధ్యక్షురాలు పుస్తకాల కవిత తదితరులు పాల్గొన్నారు.

దానం సమక్షంలో కాంగ్రెస్‌లో పలువురి చేరిక

దానం నాగేందర్ సమక్షంలో బంజారాహిల్స్‌లోని క్యాంప్ కార్యాలయంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్ కార్వాన్ అసెంబ్లీ ఇన్‌చార్జి ఠాకూర్ జీవన్‌సింగ్, నాయకులు నిహాల్‌సింగ్, శ్రీకాంత్, అశోక్‌తేజ, రాజేందర్ యాదవ్, నర్సింగరావు తదితరులు పార్టీలో చేరారు. వారికి దానం నాగేందర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అందరూ కాంగ్రెస్ వైపే...: మామిడి నర్సింగరావు



బస్తీలలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు రవీందర్ గౌడ్

బస్తీలు, కాలనీలు తేడాలేకుండా అందరూ కాంగ్రెస్‌తోనే ఉన్నారని, రాబోయే ఎన్నికల్లో దానం నాగేందర్‌కు ఓటేసి భారీ మెజారిటీతో గెలిపిస్తారని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మామిడి నర్సింగరావు అన్నారు. ఇందిరానగర్‌లో మంగళవారం రాత్రి దానం తరఫున ఆయన ఎన్నికల ప్రచారం చేశారు.

సికింద్రాబాద్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం

సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామని ఆ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ రవీందర్‌గౌడ్ అన్నారు. సికింద్రాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి దానం నాగేందర్‌కు మద్దతుగా బుధవారం రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలోని మహంకాళి స్ట్రీట్, సుభాష్ రోడ్డు, కంచరిబజార్ తదితర ప్రాంతాలలో కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ హవా కొనసాగుతుందని, ఈ హవా మరో 10 ఏళ్ల పాటు ఉండడం ఖాయమన్నారు. ప్రజలందరూ కాంగ్రెస్ వైపు ఉన్నారనడానికి నిదర్శనమే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టడం అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లోనూ అత్యధిక స్థానాలను సాధించడం ఖాయమన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో దానం నాగేందర్ లక్ష ఓట్ల మెజారిటీతో గెలవడం ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. ప్రచారంలో కాంగ్రెస్ సనత్‌నగర్ నియోజకవర్గ ఏ-బ్లాక్ ప్రెసిడెంట్ త్రికాల మనోజ్‌కుమార్, మల్లికార్జున్, సీనియర్ నాయకులు శ్రీనివాస్, శ్రీకాంత్‌తోపాటు కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.



సనత్‌నగర్‌లో దానంకు మద్దతుగా ప్రచారం చేస్తున్న కోట నీలిమ

మానవత్వాన్ని నమ్మే వ్యక్తిని ఎన్నుకోవాలి : కోట నీలిమ

రాంగోపాల్‌పేట్, మే 8 (ఆంధ్రజ్యోతి): దేశానికి, మనకు మంచి భవిష్యత్తు ఉండాలంటే మానవత్వాన్ని నమ్మే వ్యక్తిని ఎన్నుకోవాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ పిలుపునిచ్చారు. బుధవారం రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలోని మేకలబండ, ఓల్డ్‌గాస్మండి, విక్టోరియాగంజ్, ఓల్డ్‌బోయిగూడ, పాన్ బజార్ తదితర ప్రాంతాల్లో నాగేందర్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వంద రోజుల్లోనే అమలు చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ధర్మం పేరిట రాజకీయం చేయదని, కక్షపూరిత రాజకీయాలు చేయదని, కేవలం సమాజంలో ప్రేమాభిమానాలు ఉండాలని, సమాజం అభివృద్ధి చెందాలని రాజకీయం చేస్తుందన్నారు. మీ పిల్లల భవిష్యత్తు ఉండాలన్నా, సమాజం అభివృద్ధి చెందాలన్నా కాంగ్రెస్‌కు ఓటువేయాలన్నారు. పాదయాత్రలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాగేందర్ రాజు, డివిజన్ అధ్యక్షుడు మల్లిఖార్జున్‌లతో పాటు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

డబ్బు లేకున్నా సాయం చేసే గుణం ఉంది

చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి



మీర్‌పేట్‌లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న రంజిత్‌రెడ్డి

సరూర్‌నగర్, మే 8(ఆంధ్రజ్యోతి): 'నా దగ్గర ప్రత్యర్థి పార్టీల అభ్యర్థుల దగ్గర ఉన్నంత డబ్బు లేకపోవచ్చు.. కానీ అడిగిన వారికి సాయం చేసే గుణం ఉంది' అని కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం రాత్రి మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డితో కలిసి మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని లెనిన్‌నగర్ చౌరస్తా నుంచి ప్రశాంతిహిల్స్ మీదుగా నందిహిల్స్ వరకు రోడ్ షో నిర్వహించి, అనంతరం ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. గతంలో తాను ఎంపీగా, తీగల ఎమ్మెల్యేగా ఉండి మీర్‌పేట్ ప్రాంతాన్ని అభివృద్ధి చేశామన్నారు. తనను మరోసారి గెలిపిస్తే మున్ముందు మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. ఇక్కడి సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. బీజేపీ అభ్యర్థిని కలవాలంటే అపాయింట్‌మెంట్ తీసుకోవాల్సిన పరిస్థితి ఉన్నదని, తాను నిరంతరం అన్నివర్గాల వారికి అందుబాటులో ఉంటానని, తన వద్దకు వచ్చిన వారిని ఆదుకుంటానని రంజిత్‌రెడ్డి అన్నారు. ఈ ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటు వేసి తనను భారీ మెజారిటీతో గెలిపించి మరోసారి అభివృద్ధి చేసే అవకాశం కల్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చేవెళ్లలో రంజిత్‌రెడ్డిని గెలిపించాలి

రాజేంద్రనగర్: పేద, మధ్యతరగతి ప్రజలకు కాంగ్రెస్ పార్టీతోనే న్యాయం జరుగుతుందని, పార్లమెంట్ ఎన్నికలలో చేవెళ్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డిని గెలిపించాలని మైలార్‌దేవుపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ధనుంజయ్ అన్నారు. రంజిత్‌రెడ్డికి మద్దతుగా మైలార్‌దేవుపల్లి డివిజన్ బృందావన్ కాలనీలో కాంగ్రెస్ నాయకుడు సానెం జీవన్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఓటర్లనుద్దేశించి ధనుంజయ్ ప్రసంగించారు.

కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలి

రాజేంద్రనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్ పలుగుచెరువు మహేశ్ ఆధ్వర్యంలో ఉప్పర్‌పల్లి పరిసర బస్తీలలో ఇంటింటికి తిరిగి బుధవారం ఓటరు స్లిప్పులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ రంజిత్‌రెడ్డిని గెలిపించాలని వారు విజ్ఞప్తి చేశారు.హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగాలంటే కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని ఆయన అన్నారు.

బడంగ్‌పేటలో చిగిరింత నర్సింహారెడ్డి ప్రచారం

పహాడిషరీఫ్: కాంగ్రెస్ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్ రెడ్డిని గెలిపించాలని బడంగ్‌పేట్ నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం మహేశ్వరం నియోజకవర్గం మామిడిపల్లి రంగానాయకుల కాలనీకి చెందిన బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు కొండల్ యాదవ్ ఆధ్వర్యంలో మల్లాపూర్‌లోని పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ చేరారు. వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి ఆయన పార్టీలోకి ఆహ్వానించారు.

రంజిత్‌రెడ్డికి మద్దతుగా మజ్లిస్ నాయకుల ప్రచారం

జలపల్లి మున్సిపాలిటీలో రంజిత్‌రెడ్డికి మద్దతుగా మజ్లిస్ నాయకులు ప్రచారం చేశారు. బిస్మిల్లా కాలనీ, వాదీ ఏ సాలెహిన్ కాలనీలలో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి వారు ఇంటింటికి ప్రచారం చేశారు. చేతి గుర్తుకు ఓటేసి కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.

మేయర్ పారిజాతానర్సింహారెడ్డి...

సరూర్‌నగర్: చేవెళ్ల ఎంపీగా కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్న గడ్డం రంజిత్‌రెడ్డిని గెలిపించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి ఓటర్లను కోరారు. బుధవారం బడంగ్‌పేట్ కార్పొరేషన్ 29వ డివిజన్‌లోని పలు కాలనీల్లో రంజిత్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

బడంగ్‌పేట్ కార్పొరేషన్ 12వ డివిజన్‌లోని రంగనాయకులకాలనీకి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బుధవారం బడంగ్‌పేట్ మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి సమక్షంలో హస్తం గూటికి చేరారు. ఆయన వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి విజయానికి నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని సూచించారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు

రాజేంద్రనగర్, మే8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూరుతుందని మైలార్‌దేవుపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కో-ఆర్డినేటర్ సామ ఇంద్రపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 13న జరగనున్న పార్లమెంట్ ఎన్నికలలో చేతి గుర్తుకు ఓటేసి చేవెళ్ల నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. బుధవారం ఆయన లక్ష్మీగూడ వాంబే కాలనీలో ఆ పార్టీ నాయకులతో రంజిత్‌రెడ్డిని గెలిపించాలని ఎన్నికల ప్రచారం చేశారు.



లక్ష్మీగూడ వాంబే కాలనీలో ప్రచారం చేస్తున్న సామ ఇంద్రపాల్‌రెడ్డి

చేవెళ్ల గడ్డపై కాషాయ జెండా ఎగురవేయడం ఖాయం: బీజేపీ అభ్యర్థి సతీమణి సంగీతారెడ్డి



చిలుకూరు బాలాజీ ఆలయ పరిసరాల్లో బీజేపీకి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న సంగీతారెడ్డి

మొయినాబాద్ రూరల్, మే 8 (ఆంధ్రజ్యోతి): చిలుకూరు బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులతో చేవెళ్ల గడ్డపై కాషాయపు జెండా ఎగురవేయడం ఖాయమని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి సంగీతారెడ్డి ధీమా వ్యక్తంచేశారు. బుధవారం ఆమె చిలుకూరు బాలాజీ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం గ్రామంలో ఇంటింటికి ఎన్నికల ప్రచారం చేశారు. బీజేపీకి ఓటు వేసి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. చిలుకూరుకు వచ్చిన భక్తులను సైతం ఆమె ఓట్లను అభ్యర్థించారు. ఆలయం పరిసరాల్లోని వీధి వ్యాపారులతోనూ మాట్లాడారు. కోరిన కోర్కెలు తీర్చే భక్తుల ఇలవెల్పు శ్రీ చిలుకూరు బాలాజీ వెంకటేశ్వరస్వామి ఆశీస్సులతో గెలుపు ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గున్నాల గోపాల్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సహదేవ్‌గౌడ్, శ్రీరాములు ముదిరాజ్, గున్నాల మల్లారెడ్డి, దర్గా మహేందర్, రాజమల్లేష్, విక్రమ్‌రెడ్డి, రమేష్ చారి, కుమ్మరి మహేందర్, షాబాద్ కిషన్ పాల్గొన్నారు.

మోదీని మరోసారి ప్రధానిని చేద్దాం

పహాడిషరీఫ్ మే 8 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పార్లమెంట్ నుంచి బీజేపీ అభ్యర్థి విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించి మోదీని మూడోసారి ప్రధాని చేద్దామని జల్‌పల్లి మాజీ ఎంపీటీసీ కపిల్‌గౌడ్ అన్నారు, బుధవారం జల్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరామ్‌కాలనీలో ఆయన రంజిత్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటికి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రధాని అయిన తర్వాత భారత్ ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలిచిందన్నారు, దేశంలో మత కల్లోలలూ తగ్గాయాని, ఉగ్రవాదం నక్సలిజం, తగ్గిందని అన్నారు. ప్రచారంలో ఆయన వెంట స్థానిక బీజేపీ కౌన్సిలర్ ప్రశాంతిశ్రీధర్ గౌడ్,బీజేపీ మనోజ్, శ్రీను, సంతోష్, రాహుల్, సునీల్‌శర్మ, నరేష్ , గణేష్, ఆకాష్, శివ తదితరులు ఉన్నారు.



శ్రీరామ్ కాలనీలో ప్రచారం చేస్తున్న కపిల్‌గౌడ్

మూడోసారి మోదీ ప్రధాని కావడం ఖాయం: జి. కిషన్‌రెడ్డి



నాంపల్లి నియోజకవర్గంలో బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న కిషన్‌రెడ్డి

కార్వాన్, మే 8 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ అత్యధిక స్థానాలు గెలిచి మూడోసారి నరేంద్రమోదీ ప్రధాని కావడం ఖాయమని ఆ పార్టీ సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన బైక్ ర్యాలీ నిర్వహించారు. దారిపొడవునా స్వాగత వేదికలు ఏర్పాటు చేసిన కాలనీ, బస్తీ వాసులు కిషన్‌రెడ్డికి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బీజేపీ 400 పైగా సీట్లు సాధించి, కేంద్రంలో మూడోసారి నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని అన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో ప్రజలు తనకు బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ యువనాయకులు దేవర వంశీ, హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధికార ప్రతినిధి అన్నపూర్ రమేశ్, బీజేపీ నాయకులు బలయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అమలు చేసిన సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి: గడ్డం శ్రీనివాస్‌యాదవ్

చాంద్రాయణగుట్ట/అఫ్జల్‌గంజ్, మే 8 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం రాత్రి పాతబస్తీలోని గౌలిపూరా డివిజన్‌లో బైక్ ర్యాలీ నిర్వహించారు. లాల్‌దర్వాజ మహంకాళి దేవాలయం, గౌలిపురా, బాలాగంజ్, హనుమాన్ నగర్, చత్రినాక తదితర ప్రాంతాల్లో భారీ వర్షంలోనే ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు పుస్తె శ్రీకాంత్, తిరుపతి నాగరాజ్, మణికొండ విజయ్ కుమార్, రాధాకృష్ణ, సంతోష్‌కుమార్ తదతరులు ఆయనను భారీ గజమాలతో సత్కరించారు. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి, మాజీ సీఎం కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ, కారు గుర్తుకు ఓటేసి తనను భారీ మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ తాను గెలవగానే పాతబస్తీని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలే తనను గెలిపిస్తాయని అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా హైదరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి గడ్డం శ్రీనివాస్ యాదవ్ బుధవారం గోషామహల్ నియోజకవర్గంలోని బేగంబజార్, గోషామహల్, జాంబాగ్ డివిజన్లతో నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వృద్ధులు, మహిళలకు వివరిస్తూ కారు గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు.



శ్రీనివాస్ యాదవ్‌ను ఆశీర్వదిస్తున్న వృద్ధురాలు

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/ZezsfPcలో చదవండి.

Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.

నోట్: htpps://epaper.andhrajyothy.comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను ప్రజలు నమ్మడం లేదు



తాళ్ళబస్తీలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

ముషీరాబాద్/చిక్కడపల్లి, మే 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రజాదరణ కోల్పోయని కాంగ్రెస్, బీజేపీని ప్రజలు నమ్మేస్థితిలో లేరని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ఎంపీ ఎన్నికల్లో సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావును గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు. బుధవారం భోలక్‌పూర్ డివిజన్‌లోని తాళ్ళబస్తీ, ఎస్‌బీఐ కాలనీ తదితర ప్రాంతాల్లో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావుకు మద్దతుగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు బీఆర్ఎస్ అభ్యర్థి కంటే ప్రచారంలో వెనుకబడ్డారని, అన్ని వర్గాల ప్రజలు పద్మారావుకు సంపూర్ణంగా మద్దతు ఇస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రేటర్ యువజన కమిటీ సీనియర్ నాయకుడు ముఠా జైసింహ, డివిజన్ ఎన్నికల ఇన్‌చార్జిలు దీన్‌దయాల్‌రెడ్డి, సయ్యద్ అస్లాం, శ్రీశైలం యాదవ్, బీఆర్ఎస్ మైనార్టీ కమిటీ రాష్ట్ర నాయకులు షరీఫ్, రహీం, డివిజన్ ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్, బీసీసెల్ అధ్యక్షుడు ఉమాకాంత్, డివిజన్ మైనార్టీ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మగ్బూల్, జబ్బార్ పాల్గొన్నారు.

పజ్జన్న గెలుపు తథ్యం: ముఠా గోపాల్

సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి తీగుళ్ళ పద్మారావు(పజ్జన్న) గెలుపు తథ్యమని ముఠా గోపాల్ అన్నారు. బుధవారం సాయంత్రం గాంధీనగర్ డివిజన్‌లోని వైజంక్షన్, హెబ్రోన్ చర్చ్ ఐబీ ప్లాట్స్, ఆంధ్రాకేఫ్, ప్రియా అపార్ట్‌మెంట్స్ ప్రాంతాల్లో పార్టీ యువనేత ముఠా జైసింహ, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ముచ్చకుర్తి ప్రభాకర్, పార్టీ ప్రధాన కార్యదర్శి రాకేష్‌కుమార్‌తో కలిసిఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

డమ్మీ ఈవీఎం ప్యాడ్‌లతో ప్రచారం

ముషీరాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి పద్మారావుకు మద్దతుగా భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ కమిటీ ఆధ్వర్యంలో డమ్మీ ఈవీఎం ప్యాడ్‌లతో ప్రచారం చేశారు. బుధవారం భోలక్‌పూర్‌లోని ఇందిరానగర్, మహాత్మానగర్, రంగానగర్ తదితర ప్రాంతాలలో ప్రత్యేకంగా రూపొందించిన డమ్మీ ఈవీఎం ప్యాడ్‌లను ప్రదర్శిస్తూ ప్రచారం చేశారు. సికింద్రాబాద్‌లో పద్మరావు గౌడ్ గెలుపు ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భోలక్‌పూర్ డివిజన్ ఉపాధ్యక్షుడు శంకర్‌గౌడ్, డివిజన్ మాజీ అధ్యక్షుడు మహ్మద్‌అలీ, మైనార్టీ కమిటీ నాయకుడు ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



భోలక్‌పూర్‌లో డమ్మీ ఈవీఎం ప్యాడ్‌లతో ప్రచారం చేస్తున్న శీనివాస్‌రావు తదితరులు

కాంగ్రెస్ గ్యారెంటీలకు కాలం చెల్లింది

ఎంపీ ఎన్నికలో ప్రజలు కర్రుకాల్చి వాతపెట్టడం ఖాయం: సబితారెడ్డి



మాట్లాడుతున్న సబితారెడ్డి, పక్కన బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్

ఎల్‌బీనగర్, మే 8(ఆంధ్రజ్యోతి): అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అయిదు నెలల్లోనే ప్రజలకు సినిమా చూపిస్తోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆరోపించారు. బుధవారం సాయంత్రం సరూర్‌నగర్‌లోని ఏఎస్ గార్డెన్‌లో జరిగిన సమావేశంలో చేవెళ్ల బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్‌లతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల ద్వారా కాంగ్రెస్ మరోమారు ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమైనదన్నారు. కాంగ్రెస్ చేసిన మోసాన్ని గుర్తించిన ప్రజలు మే 13న జరిగే ఎంపీ ఎన్నికల్లో కర్రుకాల్చి వాతపెట్టనున్నారని అన్నారు. కాంగ్రెస్ గ్యారెంటీలకు కాలం చెల్లిందన్నారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమన్న విషయాన్ని ప్రజలు గుర్తించారని, ఎన్నికల్లో కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను చూసి ఓటు వేయాలని కోరారు. హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని స్వామిగౌడ్ విమర్శించారు. బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను ఎంపీగా గెలిపించాలని ఆయన కోరారు. సమావేశంలో సరూర్‌నగర్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షులు ఆకుల అరవింద్‌కుమార్, ఇంటూరి అంకిరెడ్డి, సుశీలరెడ్డి, యువజన విభాగం మాజీ అధ్యక్షుడు లోకసాని కొండల్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ దర్పలి అశోక్, ప్రజాసమస్యల పరిష్కార సమితి అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ ఆర్. గోపాల్, రమేష్‌గౌడ్, నరేష్‌గౌడ్, కేశవరెడ్డి, ఇస్మాయిల్, జహీర్, సలీం, ఉషాగౌడ్, ప్రత్యూష్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్, శృతి, సాలెమ్మ, వసంత, శ్వేత, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించండి

రాజేంద్రనగర్, మే8(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీలో ఉన్న బడుగు, బలహీన వర్గాల నాయకుడు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గెలిపించాలని అత్తాపూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వనం శ్రీరాంరెడ్డి కోరారు. కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా బుధవారం అత్తాపూర్ డివిజన్ పరిధిలోని శివాజీనగర్, హుడాకాలనీ పరిసర బస్తీలలో పార్టీ నాయకులతో కలసి ఆయన ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ హయాంలో విద్యుత్ కోతలు లేవన్న ఆయన, కాంగ్రెస్ ప్రభుత్వంలో చిన్నపాటి గాలులకే గంటల తరబడి కరెంట్ కోతలు విధిస్తున్నారని శ్రీరాంరెడ్డి విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికలలో కారు గుర్తుకు ఓటేసి బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు చెబుతున్న మాయమాటలకు మోసపోవద్దన్నారు. ప్రచారంలో నాయకులు మహేశ్ ముదిరాజ్, శివకుమార్, జైహింద్‌రెడ్డి, నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు



హుడా కాలనీలో ప్రచారం చేస్తున్న శ్రీరాంరెడ్డి తదితరులు

బీఆర్ఎస్ గెలుపునకు పని చేయాలి : చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల, మే 8 (ఆంధ్రజ్యోతి): ఎంపీ ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకులు బీఆర్ఎస్ గెలుపుననకు పనిచేయాలని చేవెళ్ల ఎమ్మెల్యే కాలేరు యాదయ్య సూచించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం చేవెళ్ల మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా పార్టీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిసి బీఆర్ఎస్ పార్టీకి ఓటేసి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలేరు యాదయ్య మాట్లాడుతూ గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజల మద్దతు ఉందన్నారు. చేవెళ్ల పార్లమెంట్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ భారీ మెజార్టీతో గెలుస్తారని ఆయన అన్నారు. ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు ప్రజలు కచ్చితంగా ఓటు ద్వారా బుద్ధి చెబుతారని చెప్పారు. ప్రజలందరు కారుగుర్తుకు ఓటువేసి గెలిపించాలనిప్రజలను కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ప్రభాకర్, మండల సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు శేరి శివారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్లు నర్సింలు, బి. నర్సింలు, మండల యూత్ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ నర్సింహరెడ్డి, సీనియర్ నాయులు కచిరే వెంకటేశ్, చింటు, మాదవ గౌడ్, వెంకటేశ్, మాదవగౌడ్, కృష్ణ, చింటు, మహేశ్, వెంకటేశ్, గణేశ్, సత్యం, మాణిక్యరెడ్డి, చందు, పురుషోత్తం, జాఫర్, పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.



మల్కాపూర్‌లో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే

ప్రియురాలితో మనస్పర్థలు... ప్రియుడి ఆత్మహత్య

రాజేంద్రనగర్, మే8(ఆంధ్రజ్యోతి): ప్రేమించిన యువతితో మనస్పర్థల కారణంగా ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ మౌనిక తెలిపిన వివరాల ప్రకారం.. తాండూరుకు చెందిన ఇమ్రోజ్ పటేల్ (28) సాఫ్ట్‌వేర్ ఇంజనీరు. అతడు రాజేంద్రనగర్ సర్కిల్‌లోని పరమారెడ్డి హిల్స్‌లో అద్దెకు ఉంటున్నాడు. అతడికి అత్తాపూర్‌కు చెందిన ఓ యువతితో పరిచయం ఏర్పడి ప్రేమించుకున్నారు. ఇద్దరు పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. అయితే ఇమ్రోజ్ పటేల్ ఎవరితో మాట్లాడినా అనుమానిస్తుండేది. బుధవారం ఇమ్రోజ్‌పటేల్ ఆమెకు ఫోన్ చేయగా ఇద్దరి మధ్య గొడవ జరిగింది. మనస్తాపానికి గురైన ఇమ్రోజ్ పటేల్ తాను ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి ఫోన్ పెట్టేశాడు. కాంతారెడ్డినగర్‌లో ఉంటున్న స్నేహితుడు కృష్ణకాంత్‌కు ఫోన్‌చేసి ఆ యువతి విషయం చెప్పింది. ఒకసారి ఇమ్రోజ్ ఇంటికి వెళ్లి చూడమని చెప్పడంతో అతడు ఇమ్రోజ్ ఇంటికి వెళ్లాడు. అప్పటికే అతడు లోపలి నుంచి గడియ పెట్టుకున్నాడు. కృష్ణకాంత్ గట్టిగా డోర్‌ను తోయడంతో తెరుచుకుంది. లోపలకు వెళ్లి చూడగా ఇమ్రోజ్ ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. స్థానికుల సహకారంతో కృష్ణకాంత్ రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించగా, వారు వచ్చి మృతదేహాన్ని కిందకు దించి ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఇమ్రోజ్ సోదరుడు సాజిద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మౌనిక తెలిపారు.

భవనంపై నుంచి పడి పెయింటర్ మృతి

రాజేంద్రనగర్, మే8(ఆంధ్రజ్యోతి): ఐదంతస్తుల భవనంపై నుంచి పడి పెయింటర్ మృతిచెందాడు. ఈ ఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలలోకి వెళితే... మెహరాజ్ ఖానే అనే వ్యక్తి ఐదంతస్తుల భవనం నిర్మాణం చేస్తున్నాడు. భవనానికి రంగులు వేయడానికి పెయింటర్ రజాక్‌తో అగ్రిమెంట్ చేసుకున్నాడు. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్ద కరపాములకు చెందిన పెయింటర్ రాములుతోపాటు మరో ముగ్గురిని పనిలో పెట్టుకుని రజాక్ భవనానికి రంగులు వేయిస్తున్నాడు. బుధవారం ఐదో అంతస్తు గోడపై నిలబడి పెయింట్ వేస్తుండగా ప్రమాదవశాతు కాలుజారి రాములు కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల ఫిర్యాదు మేరకు అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకట్రామిరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణలోనూ ఉత్తరాది ఫలితాలు

రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ



రాజస్థాన్ ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ, (ఇన్‌సెట్‌లో) మాట్లాడుతున్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

రాజేంద్రనగర్, మే 8 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణతో పాటు దక్షిణాది రాష్ట్రాల్లోనూ బీజేపీ ప్రభంజనం కొనసాగుతుందని రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ అన్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ గగన్‌పహాడ్‌లోని సెలబ్రిటీ కన్వెన్షన్‌లో చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో 'ప్రవాసీ సమ్మేళనం' పేరిట నిర్వహించిన చాయ్ పే చర్చ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. తెలంగాణలోనూ బీజేపీ అత్యధిక స్థానాలను గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని రాజస్థాన్ యువకులు, వ్యాపారులను కోరారు. రాజస్థాన్‌లో డబుల్ ఇంజన్ సర్కార్ వచ్చిందని, అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నదని అన్నారు. తెలంగాణలోనూ అలాంటి పరిస్థితులే కనిపిస్తున్నాయని తెలిపారు.

అభివృద్ధిలో ఉత్తరాది భాగస్వామ్యం : కొండా

హైదరాబాద్ అభివృద్ధిలో ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన ప్రజల భాగస్వామ్యం ఎంతో ఉందని కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఉత్తరాది రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చి తెలంగాణ సంస్కృతిలో భాగమై భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. తమ పెట్టుబడులు, వ్యాపారాలతో తెలంగాణ యువతకు ఉపాధి కల్పించడంలో రాజస్థానీయుల పాత్ర ఎంతగానో ఉందన్నారు. నరేంద్రమోదీ సర్కార్ అందిస్తున్న సంక్షేమ పథకాలు గ్రామ గ్రామానికి చేరాయని, వాటిని ప్రత్యక్షంగా అందుకుంటున్న లక్షలాది మంది ప్రజలు మరోసారి మోదీని ప్రధానమంత్రిని చేసేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజస్థాన్‌కు చెందిన రాజ్యసభ మాజీ సభ్యుడు నారాయణలాల్ పంచారియా, ఆహోర్ ఎమ్మెల్యే చంగన్‌సింగ్ రాజ్పుతోహి, చేవెళ్ల పార్లమెంట్ బీజేపీ నాయకులు బొక్క నర్సింహారెడ్డి, డాక్టర్ ప్రేంరాజ్‌యాదవ్, టి.అంజన్‌కుమార్‌గౌడ్, వై.శ్రీధర్, పి.మల్లేశ్‌యాదవ్, ఎస్.మల్లారెడ్డి, జోగి రవి పాల్గొన్నారు.

తెలంగాణ బతుకుల్లో మార్పు రాలేదు

● తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు అన్నామలై


ఫైట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అన్నామలై, చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, మే 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజల బతుకుల్లో ఎలాంటి మార్పు రాలేదని భారతీయ జనతా పార్టీ తమిళనాడు అధ్యక్షుడు అన్నామలై అన్నారు. గచ్చిబౌలి సంధ్య కన్వెన్షన్ సెంటర్లో ఫోరం ఫర్ ఐటీ ఎంప్లాయిస్(ఫైట్) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి ఆయన హాజరయ్యారు. 'లెట్స్ యునైట్ వికసిత్ భారత్' పేరుతో అన్నామలై సాఫ్ట్‌వేర్ ఉద్యోగులతో ముఖాముఖి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ ముందు చూపు, దార్శనికతతో దేశాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. దేశంలో అవినీతికి తావు లేకుండా పాలన అందిస్తున్న ఘనత భారతీయ జనతా పార్టీకి మాత్రమే దక్కిందన్నారు. చేవెళ్ల పార్లమెంట్ ప్రజలు సేవ చేయాలనే తపన ఉన్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని అన్నామలై కోరారు. మోదీ తీసుకొచ్చిన ఆర్థిక సంస్కరణలతో ప్రభుత్వరంగ బ్యాంకులన్నీ లాభాల బాటలో పయనిస్తున్నాయని కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. త్వరలోనే భారత ఆర్థిక వ్యవస్థ ప్రపంచంలో మూడో స్థానానికి చేరుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ శేరిలింగంపల్లి కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్, విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి సంగీతారెడ్డి, సోదరి అనితారెడ్డి, బీజేపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రధాని మోదీతో డాక్టర్ రఘురాం, డా.వైజయంతి

ప్రధాని మోదీని కలిసిన డాక్టర్ రఘురాం

● 'ఎక్స్' లో ప్రస్తావన

హైదరాబాద్ సిటీ, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీని రాజ్‌భవన్‌లో కిమ్స్ - ఉషాలక్ష్మీ సెంటర్ ఫర్ బ్రెస్ట్ డిసీజెస్ వ్యవస్థాపక డైరెక్టర్, సీఈఓ డాక్టర్ పి.రఘురాం మంగళవారం రాత్రి కలిశారు. డాక్టర్ రఘురాం, డాక్టర్ ఎస్.వైజయంతిలను కలిసిన విషయాన్ని బుధవారం మోదీ తన 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. రొమ్ము కేన్సర్‌ను నయం చేయడంలో మార్గదర్శక కృషి చేస్తున్నారని, తాము దేశంలోని ఆరోగ్య రంగంలో మౌలిక సదుపాయాల గురించి చర్చించామని, ఈ విషయంలో తమ ప్రభుత్వ కృషిని రఘురాం అభినందించారని పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్లకు ఆయుష్మాన్ భారత్ సౌకర్యాలను విస్తరించేందుకు మైలురాయి నిర్ణయం తీసుకున్నందుకు ప్రధానిని అభినందించినట్లు డాక్టర్ రఘురాం 'ఆంధ్రజ్యోతి'తో తెలిపారు. దేశంలో మహిళలను ప్రభావితం చేసే రొమ్ము కేన్సర్ నుంచి సంరక్షణ, సంరక్షణ సౌకర్యాలను మెరుగుపర్చే మార్గాల గురించి, జాతీయ ఆరోగ్య మిషన్(ఎన్‌హెచ్‌ఎం) ఆధ్వర్యంలో అమలు చేస్తున్న కేన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమం మరింత పటిష్టంగా ఉండేలా చూసుకోవడం, రొమ్ము కేన్సర్ రిజిస్ట్రీలను ప్రత్యేకించి గ్రామీణ ప్రాంతాల్లో విస్తరించడంపై చర్చించినట్లు డాక్టర్ రఘురాం చెప్పారు. తొలి త్రైమాసిక సంచిక ఎడిటోరియల్ పేజీకి కూడా మోదీ ఆటోగ్రాఫ్ చేశారని చెప్పారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఓటు వేయడం వృథా

● నాంపల్లి ప్రచారంలో కిషన్‌రెడ్డి

హైదరాబాద్ సిటీ, మే 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పదేళ్లు బీఆర్ఎస్ దోచుకుంటే.. ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ మోసం చేసిందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఓటు వేసినా వృథానే, ఎందుకంటే కేంద్రంలో మళ్లీ వచ్చేది మోదీ ప్రభుత్వమే అని ఆయన పేర్కొన్నారు. సికింద్రాబాద్ ఎంపీగా తనను ఆశీర్వదించాలని, మోదీని మరోసారి ప్రధానిగా గెలిపించాలని ఆయన కోరారు. బుధవారం నాంపల్లి నియోజకవర్గంలో ప్రచారం నిర్వహించారు. జైన్‌మందిర్ తాళ్లగడ్డ వద్ద ప్రారంభమైన ప్రచార యాత్ర శారదనగర్, నవోదయకాలనీ, హుండాకాలనీ, శ్రీరామ్‌నగర్, రేతిబౌలి, మిలాన్ టాకీస్, కుమ్మరవాడి మీదుగా ఇందిరానగర్, బోయగూడ కమాన్, బజార్‌ఘాట్, గోకుల్ నగర్, గోల్కొండ హోటల్, పెన్షన్ ఆఫీస్, శ్రీరామ్‌టెంపుల్, హైమద్‌నగర్ వరకు సాగింది. యువత బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని, పోలింగ్ శాతాన్ని పెంచాలని పిలుపునిచ్చారు. సాయంత్రం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని పలు బస్తీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

ఎన్నికల విధులకు రాని 40 మంది సస్పెన్షన్

● నేడు, రేపు ట్రైనింగ్.. గైర్హాజరైతే అవే చర్యలు : రోనాల్డ్‌రోస్

హైదరాబాద్ సిటీ, మే 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధుల శిక్షణకు గైర్హాజరైన 40 మంది ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులను సస్పెండ్ చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రోస్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ విధుల నిర్వహణ డ్యూటీలు కేటాయించిన వివిధ శాఖలకు చెందిన 40 మంది పీఓ, ఏపీఓలు శిక్షణా తరగతులకు రాకపోవడంతోపాటు.. పలుమార్లు వారి మొబైల్ నెంబర్లకు సందేశాలు పంపినా స్పందించలేదని పేర్కొన్నారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం(ఆర్‌పీ యాక్ట్)-1951 ఉల్లంఘన కింద వారిని సస్పెండ్ చేసినట్టు తెలిపారు. నేడు, రేపు మరికొందరు పీఓ, ఏపీఓలకు శిక్షణ ఉందని, గైర్హాజరైన వారి విషయంలో ఇదే చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

మాధవీలత కొంపెల్లకు శివసేన మద్దతు


మాధవీలత కొంపెల్లను కలిసిన శివసేన పార్టీ నాయకులు

హైదరాబాద్ సిటీ, మే 8 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర ముఖ్యమంత్రి శివసేన పార్టీ అధినేత ఏక్‌నాథ్ షిండే పిలుపు మేరకు హైదరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి మాధవీలతకు సంపూర్ణ మద్దతు శివసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ ప్రకటించింది. శివసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సింకారు శివాజీ అభ్యర్థి మాధవీలతని కలిసి తమ మద్దతును తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓవైసి బ్రదర్స్‌కు ఓటమి భయం పట్టుకున్నది.. పాతబస్తీ ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు. ఈసారి కాషాయ జెండా భాగ్యనగరంలో విజయం సాధిస్తుందన్నారు. మాధవీలతని కలిసిన వారిలో.. శివసేన పార్టీ హైదరాబాద్ పార్లమెంట్ కన్వీనర్ సూర్యవంశీ రమేష్, యువసేన రాష్ట్ర నాయకులు విష్ణు, మారుతి, ముని, రాహుల్, రాజు, అఖిల్, కార్యకర్తలు ఉన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కట్టుబడే వారికే ఓటేయండి

- తెలంగాణ, ఏపీ ఓటర్లకు పీఠాధిపతుల పిలుపు


పీఠాధిపతుల సమావేశంలో మాట్లాడుతున్న కమలానంద భారతిస్వామి

సైదాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ, ఏపీతో పాటు దేశవ్యాప్తంగా సనాతన హిందూ ధర్మ పరిరక్షణకు కట్టుబడే వ్యక్తులు, పార్టీలకే ఓటు వేయాలని భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతిస్వామి, గాయత్రి పీఠం కాంతేంద్రస్వామి, ధర్మ సంవర్ధన కాలజ్ఞాన పీఠం సాదువు వెంకటేశ్వరాచార్యస్వామి, శివపార్వతి మాతాజీలు ఓటర్లకు పిలుపునిచ్చారు. బుధవారం సైదాబాద్ వినయ్‌నగర్‌కాలనీలోని శ్రీ విజయ వినాయకస్వామి ఆలయ కమ్యూనిటీ హాల్లో రాష్ట్రీయ వానరసేన ఆధ్వర్యంలో పీఠాధిపతులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తెలుగు రాష్ట్రాల్లో హిందూ సనాతన ధర్మంపై దాడులు జరుగుతున్నాయని, వాటిని సమష్టిగా తిప్పికొట్టాల్సిన అవసరమున్నదని చెప్పారు. దేవాలయ భూములు కబ్జా చేసిన నేతలు పార్టీలు మారుతూ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని వారికి గుణపాఠం చెప్పాలని కోరారు. దేశంలో సుస్థిర పాలనకు హిందూ సమాజం ఐక్యం కావాల్సిన అవసరమున్నదని తెలిపారు. ఓటు ప్రజాస్వామ్యంలో బ్రహ్మాస్త్రం లాంటిదని, నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. దేశం కోసం, ధర్మం కోసం పాటుపడుతున్న పార్టీలకు ఓటు వేయాలని కోరారు. సమావేశంలో వానరసేన జాతీయ అధ్యక్షుడు నామ్ రాంరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు మాధవరెడ్డి, బీజేపీ ధార్మిక సెల్ రాష్ట్ర సంయుక్త కన్వీనర్ కరాటే కళ్యాణి పాల్గొన్నారు.

మెట్‌గాలాలో మెరిసిన సుధారెడ్డి



హైదరాబాద్ సిటీ, మే 8 (ఆంధ్రజ్యోతి): మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ గ్రూప్ డైరెక్టర్ సుధారెడ్డి న్యూయార్క్‌లో జరిగిన మెట్‌గాలా ఈవెంట్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. స్లీపింగ్ బ్యూటీస్ రీఏవేకనింగ్ ఫ్యాషన్ నేపథ్యంలో మెట్రోపాలిటన్ మ్యూజియం ఆఫ్ ఆర్ట్ ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో తరుణ్ తహ్లియానీ రూపొందించిన వస్త్రాలతో పాటుగా ఫరాఖాన్ అలీ తీర్చిదిద్దిన వజ్రాభరణాలను ధరించి రెడ్‌కార్పెట్‌పై మెరిశారు. భారతీయ పనితనం, డిజైన్‌లను వైభవంగా ప్రదర్శించారు. సుమారు 80 మంది కళాకారులు 4,500 గంటలు కష్టపడి ఈ ఐవరీ కలర్ సిల్క్ గౌన్‌ను రూపొందించడం విశేషం. ఆమె ధరించిన అమోర్ ఎటెర్నో నెక్లెస్ 180 కేరట్ వజ్రాలతో రూపుదిద్దుకుంది. దీనిలో 25 కేరట్ డైమండ్ తన భర్త కృష్ణారెడ్డికి ప్రతీకగా నిలుస్తుందని, కల్చర్, కమ్యూనిటీ, క్రియేటివిటీని వేడుక చేసుకునే అవకాశం తనకు లభించడం సంతోషంగా ఉందని సుధ వెల్లడించారు.

సందడే.. సందడి


చిన్నారుల కోలాహలం





మ్యాచ్‌లో దృశ్యం


రోనాల్డ్‌రోస్


సాయికుమార్


మ్యాచ్ వీక్షిస్తున్న సీఎం రేవంత్ కుమార్తె నైమిషారెడ్డి


మ్యాచ్‌లో అనాథ బాలల సందడి

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఉప్పల్ స్టేడియం మరోసారి అభిమానుల కేరింతలతో హోరెత్తింది. బుధవారం లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ ఆతిథ్య సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) జట్ల మధ్య జరిగిన మ్యాచ్ ఫ్యాన్స్‌ను అలరించింది. 36వేల మందికిపైగా ప్రత్యక్షంగా వీక్షించిన ఈ మ్యాచ్‌లో స్టేడియం మొత్తం సన్‌రైజర్స్ జెర్సీలు, జెండాలతో సందడి.. సందడిగా మారింది. సన్‌రైజర్స్ గెలిచిన ఈ మ్యాచ్‌కు సెలెబ్రిటీలు హాజరయ్యారు. నటులు సాయికుమార్, హీరో అశ్విన్, సంగీత దర్శకుడు తమన్, సింగర్ రాహుల్ సిప్లిగంజ్, ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ మెంబర్ చాముండేశ్వరీనాథ్, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రోస్, తదితరులు విచ్చేశారు.

అనాథ పిల్లలతో వీక్షించిన సీఎం కుమార్తె

సీఎం రేవంత్‌రెడ్డి కుమార్తె నైమిషారెడ్డి 30 మంది అనాథ పిల్లలతో కలిసి ఈ మ్యాచ్‌ను వీక్షించారు. బీఎన్ రెడ్డినగర్, ఎల్బీనగర్‌లోని అనాథ పిల్లల వసతి గృహాలకు చెందిన వీరికి రేవంత్‌రెడ్డి ఆదేశాలతో ఉచితంగా మ్యాచ్ తిలకించే అవకాశం కల్పించారు.

అర్ధరాత్రి వరకు మెట్రో రైళ్లు

హైదరాబాద్ సిటీ, మే 8 (ఆంధ్రజ్యోతి): ఉప్పల్ స్టేడియంలో బుధవారం సన్‌రైజర్స్ హైదరాబాద్-లక్నో సూపర్ జెయింట్స్ మధ్య ఐపీఎల్ మ్యాచ్ జరిగింది. ఈ నేపథ్యంలో అర్ధరాత్రి వరకు మెట్రో రైళ్లను నడిపించారు. చివరి రైలు రాత్రి 12.15 గంటలకు బయలు దేరి అర్ధరాత్రి 1.10 గంటలకు చివరి స్టేషన్‌కు చేరింది. కాగా, మ్యాచ్‌ను వీక్షించిన ప్రేక్షకుల కోసం ఉప్పల్, స్టేడియం, ఎన్‌జీఆర్ఐ స్టేషన్లలో మాత్రమే రాత్రి 11 గంటలు దాటిన తర్వాత ప్రవేశం కల్పించి, ఇతర స్టేషన్లలో దిగేందుకు అవకాశమిచ్చారు.


అంతర్జాతీయ మాతృ దినోత్సవంలో అధికారులు, మాతృమూర్తులు, విద్యార్థులు

రాష్ట్రపతి నిలయంలో ఘనంగా మాతృ దినోత్సవం

అల్వాల్, మే 8 (ఆంధ్రజ్యోతి): బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో అంతర్జాతీయ మాతృ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్, మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని వృద్ధాశ్రమాలు, అనాథ ఆశ్రమంలోని వృద్ధులను ఈ సందర్భంగా రాష్ట్రపతి నిలయం నిర్వహణ అధికారి డాక్టర్.కె.రజనీప్రియ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. బాలసదనంలోని బాలికలతో పెద్దలకు ఫ్లవర్‌బొకేలను అందించి అభినందనలు తెలిపారు. ముఖ్య అతిథులుగా ఆయా జిల్లాల సంక్షేమ అధికారులు అక్వేశ్వర్‌రావు, కృష్ణారెడ్డి, పద్మజ, రమణ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాతృమూర్తి గొప్పతనాన్ని అధికారులు వివరించారు. తల్లి లేనిది జీవితం లేదన్న విషయాన్ని యువత గమనించాలన్నారు. అంతకుముందు పలు పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

బలహీనపరిచే రక్త రుగ్మత తలసీమియా



తలసీమియాపై అవగాహన కార్యక్రమంలో ఆర్‌వీ కర్ణన్, డాక్టర్ ఏవీ గురవారెడ్డి, డాక్టర్ ఉషారాణి, డాక్టర్ మంజుల అనగాని

హైదరాబాద్ సిటీ, మే 8 (ఆంధ్రజ్యోతి): తలసీమియా అనేది బలహీనపరిచే రక్త రుగ్మత అని, హిమోగ్లోబిన్ అణువులు సరిగ్గా ఏర్పడవని, మైనర్ తలసీమియాలో తేలికపాటి రక్తహీనత ఉంటుందని కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ పేర్కొన్నారు. రిజల్యూషన్ సెంటర్ ఆఫ్ ఫీటల్ మెడిసిన్, మార్గం ఫౌండేషన్ సహకారంతో తలసీమియా డే సందర్భంగా బుధవారం కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి ఆడిటోరియంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కర్ణన్ మాట్లాడుతూ ప్రధాన తలసీమియాలో తీవ్రమైన రక్తహీనతతో జీవితాంతం రక్త మార్పిడి అవసరమన్నారు. టి-డయాగ్నస్టిక్ సెంటర్లలో ఉచితంగా తలసీమియా స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నారని తెలిపారు. కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఏవీ గురవారెడ్డి మాట్లాడుతూ తలసీమియా వల్ల కలిగే హిమోగ్లోబినోపతి, రక్తహీనత గురించి వైద్యులందరూ తెలుసుకోవాలని, ప్రతి ఒక్కరూ తలసీమియా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకునేలా ప్రోత్సహించాలని అన్నారు. డాక్టర్ మంజుల అనగాని మాట్లాడుతూ తలసీమియా నిర్మూలనపై ప్రజలకు లోతుగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పీడియాట్రిక్ హెమటో-అంకాలజిస్ట్ డాక్టర్ రమణ దండమూడి మాట్లాడుతూ తలసీమియాతో బాధపడుతున్న పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. తలసీమియా వ్యాధిగ్రస్తులు ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి నిలోఫర్ ఆస్పత్రి డాక్టర్ ఉషారాణి వివరించారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని తెలంగాణ ఐఏపీ కోశాధికారి డాక్టర్ ఆర్ఎస్‌వీ శ్రీకృష్ణ తెలిపారు. నెల రోజులుగా వైద్యులు పలు విద్యాసంస్థలకు వెళ్లి తలసీమియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించినట్లు రిజల్యూషన్ సెంటర్ ఆఫ్ ఫీటల్ మెడిసిన్ డైరెక్టర్ డాక్టర్ చిన్మయి రాత తెలిపారు. కార్యక్రమంలో మార్గం ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ నాబాత్ లక్ష్మాన్ని తదితరులు పాల్గొన్నారు.

14 ఏళ్ల బాలికతో

బలవంతంగా వ్యభిచారం

● పెంపుడు తల్లి దాష్టీకం

● బాధితురాలికి విముక్తి కల్పించిన పోలీసులు

బంజారాహిల్స్, మే 8(ఆంధ్రజ్యోతి): జన్మనివ్వకపోయినా పెంచి పెద్ద చేసిన కుమార్తె పట్ల పెంపుడు తల్లి అమానుషంగా వ్యవహరించింది. బాలిక రజస్వల కాగానే ఆ చిన్నారిని బలవంతంగా వ్యభిచార కూపంలోకి నెట్టింది. చెప్పినమాట వినకపోతే చిత్రహింసలకు గురి చేసి నరకయాతన పెట్టింది. పెంపుడు తల్లి దాష్టీకంతో వ్యభిచారం కూపంలో నలిగిపోతున్న ఆ బాలికకు పోలీసులు విముక్తి కల్పించారు. హైదరాబాద్, జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్ పరిధిలోని శ్రీకృష్ణనగర్‌లో వ్యభిచారం జరుగుతుందనే సమాచారంపై పశ్చిమ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు రెండ్రోజుల క్రితం దాడి చేశారు. ఇద్దరు యువతులు, విటులు, వ్యభిచార గృహ నిర్వాహకురాలిని అరెస్టు చేశారు. అక్కడే ఉన్న ఓ బాలిక(14)ను శిశు సంరక్షణాధికారులకు అప్పగించారు. వివరాల సేకరణలో భాగంగా ఆ బాలిక వ్యభిచార గృహంలోకి ఎలా వచ్చింది అనే దానిపై శిశు సంక్షేమ అధికారులు దృష్టి సారించారు. వ్యభిచార గృహ నిర్వాహకురాలే తనని చిన్న వయసులో తీసుకువచ్చి పెంచుకుందని, తాను పుష్పవతి అవ్వగానే బలవంతంగా వ్యభిచారం చేయిస్తున్నదని బాధిత బాలిక వారికి తెలిపింది. ఆమెకు ఎదురుచెబితే దారుణంగా హింసించేదని వాపోయింది. రెండు నెలల క్రితం పెంపుడు తల్లి తనకు గుండు గీయించి ఇల్లు వదిలి వెళ్లకుండా చేసిందంటూ తనకు జరిగిన అన్యాయం చెబుతూ బాధిత బాలిక కంటతడి పెట్టుకుంది. ఈ సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు బాధిత బాలికను వెంటనే భరోసా కేంద్రానికి తరలించారు. కాగా, వ్యభిచార గృహ నిర్వాహకురాలితో పాటు మరికొందరిపై అత్యాచారం, బలవంతంగా వ్యభిచారంలోకి దింపడం వంటి కారణాలతో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

మొక్కజొన్న పరిశోధనా కేంద్రాల వార్షిక సదస్సు


సమావేశంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు

రాజేంద్రనగర్, మే 8 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, లుధియానాలోని భారత మొక్కజొన్న పరిశోధనా సంస్థలు సంయుక్తంగా బుధవారం 67వ మొక్కజొన్న పరిశోధన కేంద్రాల వార్షిక సదస్సును రాజేంద్రనగర్‌లో ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే సదస్సులో భారతదేశంలోని వివిధ మొక్కజొన్న పరిశోధనా సంస్థల్లో పనిచేస్తున్న శాస్త్రవేత్తలు గత సంవత్సరం చేపట్టిన పరిశోధనా ఫలితాలు, భవిష్యత్తులో చేపట్టాల్సిన పరిశోధనా ప్రణాళికలపై చర్చించారు. కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిశోధనా సంచాలకులు డాక్టర్ పి.రఘురామిరెడ్డి, శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్‌కే ప్రధాన్, డాక్టర్ సైందాస్, డాక్టర్ హెచ్ఎస్ జాట్, భారత వ్యవసాయ పరిశోధనా మండలి అధికారులు, 32 పరిశోధనా సంస్థల నుంచి 140 మంది అఖిల భారత మొక్కజొన్న శాస్త్రవేత్తలు, వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అదనపు డీజీ మహేష్ భగవత్ టీం పర్యవేక్షణలో

13 మందికి ఐఎఫ్ఎస్

హైదరాబాద్ సిటీ, మే 8 (ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ 2023 పరీక్షల్లో, తాను మెంటార్‌గా వ్యవహరించిన బృందంలో 13 మంది అభ్యర్థులు ఇండియన్ ఫారెస్ట్ సర్వీసులకు ఎంపికయ్యారని అదనపు డీజీ మహేష్ భగవత్ తెలిపారు. ఫారెస్ట్ సర్వీసులకు ఎంపికైన ఆలిండియా టాప్ ర్యాంకర్ రిత్వికా పాండే, రెండో ర్యాంకర్ ప్రతీక్ష కాల, మూడో ర్యాంకర్ స్వస్తిక్ యశస్విని, ఏడో ర్యాంకర్ కావ్య, పదో ర్యాంకర్ శశాంక్ భరద్వాజ్, 11వ ర్యాంకర్ మయూర్ బరోత్, 13వ ర్యాంకర్ మేధాసిన్హా, 15వ ర్యాంకర్ ప్రిన్స్ కుమార్ సింగ్, 16వ ర్యాంకర్ ప్రాచీ గుప్తా, 22వ ర్యాంకర్ పి.భార్గవ్, 130వ ర్యాంకర్ లవకుమార్‌ను అదనపు డీజీ మహేష్ భగవత్ బుధవారం అభినందించారు. కొంతకాలంగా యూపీఎస్సీ పరీక్షలకు హాజరవుతున్న అభ్యర్థులకు మహేష్ భగవత్ సమయం కేటాయించి సూచనలు, సలహాలు అందిస్తూ మెంటార్‌గా వ్యవహరిస్తున్నారు.



అబ్ కీ బార్?

ఐదో దశలో 695 మంది అభ్యర్థులు

న్యూఢిల్లీ, మే 8(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఐదో దశ ఎన్నికలలో 695 మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు ఎన్నికల సంఘం బుధవారం తెలిపింది. 8 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలోని 49 లోక్‌సభ స్థానాలకు ఐదో దశలో మే 20న ఎన్నికలు జరుగనున్నాయి. తొలుత 749 మంది అభ్యర్థుల నామినేషన్లను ఈసీ ఆమోదించింది. అయితే, పలువురు అభ్యర్థుల నామినేషన్ల విత్‌డ్రా తర్వాత తుదిపోరులో 695 మంది అభ్యర్థులున్నారని పేర్కొంది. ఐదో దశలో అత్యధికంగా యూపీలో 14, మహారాష్ట్రలో 13 స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. పశ్చిమబెంగాల్(7), ఒడిశా, బిహార్(5), జార్ఖండ్(3), జమ్మూకశ్మీర్, లడఖ్‌లలో ఒక్కో స్థానానికి పోలింగ్ జరుగుతుంది.

అంబానీ, అదానీలపైకి సీబీఐ, ఈడీని పంపండి!

- వారు డబ్బులు టెంపోల్లో పంపుతారన్నది.. మీ స్వీయానుభవమా మోదీజీ?: రాహుల్



న్యూఢిల్లీ, మే 8: కాంగ్రెస్ పార్టీకి అంబానీ, అదానీల నుంచి డబ్బులు అందాయని, అందుకే వారి పేర్లు ఎత్తడం మానేసిందన్న ప్రధాని మోదీ వ్యాఖ్యలకు రాహుల్‌గాంధీ అంతే స్థాయిలో బదులిచ్చారు. ఆ ఇద్దరు వ్యాపారవేత్తలపై సీబీఐ, ఈడీలతో విచారణ జరిపించాలని ప్రధానికి సూచించారు. ఈ మేరకు రాహుల్ బుధవారం ఓ వీడియో మెసేజ్‌ను 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. "మోదీజీ.. భయపడ్డారా? అంబానీ, అదానీల గురించి సాధారణంగా మీరు గడియ వేసుకొని మాట్లాడతారు. మొట్టమొదటిసారి వారి గురించి బహిరంగంగా మాట్లాడారు. వారు వాహనాల్లో (టెంపోల్లో) డబ్బు పంపిస్తారని కూడా మీకు తెలుసునన్నమాట! ఇది మీ స్వీయానుభవమా?" అని రాహుల్ వ్యాఖ్యానించారు. వారిద్దరికి భయపడకుండా సీబీఐ, ఈడీలతో విచారణ జరిపించాలని సూచించారు. ఆ వ్యాపారవేత్తలకు మోదీ ఇచ్చే డబ్బును.. కాంగ్రెస్ పార్టీ వివిధ పథకాల ద్వారా దేశంలోని పేదలకు ఇస్తుందన్నారు. బీజేపీ 22 మంది కోటీశ్వరులను చేస్తే.. తాము కోట్ల మందిని కోటీశ్వరులను చేస్తామన్నారు. మరోవైపు మోదీకి ఓటమి కళ్ల ముందు కనిపిస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. దీంతో మోదీ తన నీడను చూసుకుని కూడా భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. మోదీ నీడతో కూడిన ఫొటోను 'ఎక్స్'లో జైరాం పోస్ట్ చేశారు.

మోదీ.. ప్రధాని పీఠం కదులుతోంది: ఖర్గే

న్యూఢిల్లీ, మే 8: మోదీ ప్రధాని పీఠం కదులుతోందని అందుకే ఆయన తన సొంత స్నేహితులపై కూడా మాటల దాడి చేయడం మొదలుపెట్టారని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే వ్యాఖ్యానించారు. దేశంలో మూడు దశల పోలింగ్ ముగిసిన తర్వాత మోదీలో భయం మొదలైందని అన్నారు. కాలం మారుతోందని ఇక స్నేహితులెప్పుడూ స్నేహితులు కాదని, ఇది రాబోయే ఫలితాలకు నిదర్శనం అని ఖర్గే బుధవారం ఎక్స్‌లో పేర్కొన్నారు. బుధవారం మోదీ అదానీ, అంబానీ, రాహుల్ గాంధీలపై చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు.

ఈవీఎంలను తీసుకెళ్తున్న బస్సులో మంటలు

బేతుల్(మధ్యప్రదేశ్), మే 8: మధ్యప్రదేశ్‌లో ఎన్నికల సిబ్బందిని, ఈవీఎంలను తీసుకువెళుతోన్న బస్సు అగ్నిప్రమాదానికి గురవడంతో నాలుగు ఈవీఎంలు పాడయ్యాయి. మధ్యప్రదేశ్‌లోని బేతుల్ జిల్లాలో ఈ ఘటన చోటు చేసుకుంది. అయితే ఎన్నికల సిబ్బంది, బస్సు డ్రైవర్‌కు ఎటువంటి ప్రమాదం జరగలేదని బేతుల్ కలెక్టర్ నరేంద్ర సూర్యవంశి చెప్పారు. గోల గ్రామంలో మంగళవారం ఉదయం 11 గంటలకు ఈ ఘటన జరిగింది. కాలిపోయిన నాలుగు ఈవీఎంలలో నమోదైన ఓట్ల పరిస్థితి ఏమిటన్న ప్రశ్నకు కలెక్టర్ సమాధానమిస్తూ... ఎన్నికల సంఘానికి తాను నివేదిక పంపుతానని, రీపోలింగ్ నిర్వహించాలా... లేదా ఏం చేయాలన్న దానిపై ఎన్నికల సంఘమే నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు.

ఆస్ట్రాజెనికా కొవిడ్ వ్యాక్సిన్ ఉపసంహరణ

న్యూఢిల్లీ, మే 8: ప్రముఖ ఫార్మా కంపెనీ ఆస్ట్రాజెనికా ప్రపంచ మార్కెట్ నుంచి తన కొవిడ్ వ్యాక్సిన్ వ్యాక్స్‌జెవ్రియా (కొవీషీల్డ్)ను ఉపసంహరించుకుంది. మార్కెట్‌లోకి అనేక కొత్త ఉత్పత్తులు రావడంతో తమ వ్యాక్సిన్‌కు డిమాండ్ తగ్గడం వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఆ కంపెనీ బుధవారం ప్రకటించింది. యూరోపియన్ యూనియన్‌లో ఈ వ్యాక్సిన్ కోసం మార్కెటింగ్ అనుమతిని ఈ కంపెనీ స్వచ్ఛందంగా ఉపసంహరించుకుంది. ఇతర దేశాలలోనూ ఈ సంస్థ ఇలాగే చేయొచ్చని భావిస్తున్నారు. భారత్‌తోపాటు ఇతర అల్ప, మధ్య ఆదాయ దేశాల్లో ఈ వ్యాక్సీన్‌ను కొవీషీల్డ్‌గా పిలుస్తున్నారు. తమ టీకా వల్ల అరుదైన సందర్భాల్లో రక్తం గడ్డకట్టే ప్రమాదం ఉందని ఇటీవలే ఆస్ట్రాజెనెకా అంగీకరించింది. ఈ నేపథ్యంలోనే వ్యాక్సిన్‌ను ఉపసంహరించుకోవడం చర్చనీయాంశమైంది.

ట్రంప్‌తో శృంగారం నిజమే: పోర్న్‌స్టార్ స్టార్మీ

న్యూయార్క్, మే 8: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో తాను శృంగారంలో పాల్గొన్నది నిజమేనని పోర్న్‌స్టార్ స్టార్మీ డేనియల్ వెల్లడించారు. మంగళవారం ఈ మేరకు న్యూయార్క్ కోర్టులో వాంగ్మూలమిచ్చారు. ట్రంప్ హష్‌మనీ కేసులో కోర్టు వాదనలను నమోదు చేసుకుంటున్న విషయం తెలిసిందే. మంగళవారం 13వరోజు విచారణలో భాగంగా స్టార్మీ డేనియల్ కోర్టుకు హాజరయ్యారు. అసలేం జరిగింది? అనే విషయాన్ని ఆమె పూసగుచ్చినట్లు కోర్టుకు వివరించారు. "2006లో జరిగిన ఓ గోల్ఫ్ టోర్నమెంట్‌లో తొలిసారి ట్రంప్‌ను కలిశా. ఆ తర్వాత ఆయన నన్ను డిన్నర్‌కు ఆహ్వానించారు. ఆయన హోటల్‌సూట్(పెంట్‌హౌస్)కు తీసుకెళ్లారు. అక్కడ డిన్నర్ చేస్తుండగా.. సుఖవ్యాధులు రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటానో అడిగి తెలుసుకున్నారు. నన్ను డిన్నర్‌కు పిలవగానే ట్రంప్ ఉద్దేశం అర్థమైంది. ట్రంప్‌తో శృంగారంలో పాల్గొన్నప్పుడు ఆయన కండోమ్ వాడలేదు" అని ఆమె వివరించారు. 2016 అధ్యక్ష ఎన్నికల సమయంలో ఈ అంశాన్ని బయటపెట్టొద్దంటూ ట్రంప్ తనకు 1.3 లక్షల డాలర్లు ఇచ్చినట్లు స్టార్మీ వెల్లడించారు.

దక్షిణాదివారు ఆఫ్రికన్లలా కనిపిస్తారు

ఉత్తరాదివారు శ్వేతజాతీయుల్లా.. ఈశాన్యంలో చైనీయుల్లా.. పశ్చిమ రాష్ట్రాలవారు అరబ్బుల్లా ఉంటారు

- కాంగ్రెస్ నేత శామ్‌పిట్రోడా వ్యాఖ్యలు
- శరీర వర్ణం ఆధారంగా అవమానిస్తే సహించేది లేదు: ప్రధాని మోదీ
- పార్టీ పదవికి పిట్రోడా రాజీనామా

న్యూఢిల్లీ, మే 8: ఎన్నికల వేళ.. కాంగ్రెస్ సీనియర్ నేత శామ్‌పిట్రోడా ఆ పార్టీకి పెద్ద తలనొప్పిగా మారారు! వారసత్వ పన్ను వ్యాఖ్యలతో కాంగ్రెస్‌కు ఇప్పటికే ఒకసారి తిప్పలు తెచ్చిపెట్టిన ఆయన.. తాజాగా మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. భారతదేశాన్ని ఎన్నో వైవిధ్యాలున్న దేశంగా అభివర్ణించే క్రమంలో.. దక్షిణభారతీయులు ఆఫ్రికన్లలా కనిపిస్తారని.. పశ్చిమ రాష్ట్రాలవారు అరబ్బుల్లా, ఈశాన్య రాష్ట్రాల వారు చైనీయుల్లా, ఉత్తరాది వారు తెల్లవారిలా ఉంటారని వ్యాఖ్యానించారు. 'ద స్టేట్స్‌మన్' వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన.. "మన స్వాతంత్ర్య సమరయోధులు బ్రిటిష్‌వారితో పోట్లాడింది హిందూ దేశం కోసం కాదు.. లౌకిక దేశం కోసం. మతం ఆధారంగా ఏర్పడిన పాకిస్థాన్ పరిస్థితి ఏమిటో ఇప్పుడు మనం చూస్తున్నాం. మనమేమో ప్రపంచంలోనే గొప్ప ప్రజాస్వామ్యానికి ఉదాహరణగా నిలిచాం. చిన్నచిన్న విభేదాలున్నా మనం ఈ 75 ఏళ్లు చాలా సంతోషకరమైన వాతావరణంలో మనగలిగాం. ఎన్ని తేడాలున్నా మనందరం సహోదరులం. విభిన్న భాషలు, మతాలు, ఆచారాలు, ఆహారాన్ని పరస్పరం గౌరవించుకుంటాం" అని పేర్కొంటూ.. దేశ వైవిధ్యం గురించి చెప్పే క్రమంలో ఆఫ్రికన్లు, చైనీయులతో భారతీయులను పోల్చారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు క్షణాల్లో వైరల్ అయ్యాయి. ఈ వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా తీవ్ర వ్యతిరేకత రావడంతో కాంగ్రెస్ పార్టీ అప్రమత్తమైంది. భారతదేశ భిన్నత్వం గురించి చెప్పడానికి శామ్‌పిట్రోడా పోల్చిన తీరు పూర్తిగా తప్పు అని, ఆ పోలికలు ఆమోదయోగ్యం కానివని కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేశ్ ట్వీట్ చేశారు. ఆయన వ్యాఖ్యలతో కాంగ్రెస్ పార్టీకి సంబంధం లేదన్నారు. పిట్రోడా వ్యాఖ్యలపై ప్రధాని మోదీ తీవ్రంగా స్పందించారు. శరీర వర్ణం ఆధారంగా అవమానించడాన్ని ఈ దేశం సహించదని.. తాను అస్సలు సహించబోనని మోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ద్రౌపది ముర్ము శరీర వర్ణం కారణంగానే.. కాంగ్రెస్ పార్టీ అప్పట్లో రాష్ట్రపతి పదవికి ఆమె అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించిందనే విషయం తనకు ఇప్పుడు అర్థమవుతోందని... ముర్ము చర్మం రంగు నల్లగా ఉంది కాబట్టి కాంగ్రెస్ నేతలు ఆమెను ఆఫ్రికన్‌గా భావించారని వ్యాఖ్యానించారు.



ఆలోచన విధానాన్ని బయటపెట్టుకొన్నారు

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 'ఎక్స్'లో శామ్ పిట్రోడా వ్యాఖ్యల వీడియోను పోస్ట్ చేసి.. "నేను దక్షిణాదికి చెందిన దాన్నే. నేను ఇండియన్‌లాగానే కనపడతాను. మా బృందంలో ఈశాన్య రాష్ట్రాలకు చెందినవారున్నారు. వాళ్లు భారతీయుల్లాగానే ఉంటారు. పశ్చిమభారతదేశానికి చెందిన నా కొలీగ్స్ కూడా భారతీయుల్లాగానే ఉంటారు. కానీ.. రాహుల్‌గాంధీ సలహాదారు, జాత్యహంకారి అయిన వ్యక్తికి మాత్రం మేమందరం ఆఫ్రికన్లలా, చైనీయుల్లా, అరబ్బుల్లా, తెల్లవారిలా కనపడతాం. మీ ఆలోచనాధోరణిని, వ్యక్తిత్వాన్ని బయటపెట్టుకున్నందుకు కృతజ్ఞతలు. ఇండీ కూటమీ.. సిగ్గుచేటు" అని తీవ్రస్థాయిలో దుయ్యబట్టారు. అసోం సీఎం హిమంత ట్విటర్‌లో శామ్‌పిట్రోడాను ఉద్దేశించి.. "శామ్ భాయ్, నేను ఈశాన్య రాష్ట్రానికి చెందినవాడినే. నేను భారతీయుడిలాగానే ఉంటాను" అని వ్యాఖ్యానించారు. కొందరు నెటిజన్లేమో.. 'దక్షిణాది ప్రజలు నల్లగా ఉంటారు' అంటూ గతంలో బీజేపీ నేత తరుణ్ విజయ్ చేసిన వ్యాఖ్యలను గుర్తుచేస్తున్నారు. అయితే.. తన వ్యాఖ్యలు ఎన్నికల వేళ పార్టీకి ఇబ్బందికరంగా మారడంతో 'ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్' చైర్మన్ పదవికి పిట్రోడా రాజీనామా చేశారు. ఆయన రాజీనామాను కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఆమోదించినట్టు జైరామ్ రమేశ్ తెలిపారు.

బీజేపీ పోస్టుపై వివాదం

బెంగళూరు, మే 8(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సోషల్ మీడియా వేదికగా ఇటీవల బీజేపీ పెట్టిన ఓ పోస్టు వివాదాస్పదమైంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్‌లను ముస్లింలకు అనుకూలంగా కాంగ్రెస్ మార్చనుందని అందులో పేర్కొన్నారు. ఆ పోస్ట్‌ను తక్షణమే తొలగించాలని కర్ణాటక బీజేపీని రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ మనోజ్ కుమార్ మీనా ఆదేశించారు. మరోవైపు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాకు, పార్టీ ఐటీసెల్ హెడ్ అమిత్ మాలవీయకు పోలీసులు బుధవారం నోటీసులు జారీ చేశారు. సోషల్ మీడియాలో పెట్టిన వివాదాస్పద పోస్టుపై హైగ్రౌండ్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఆ పోస్టును తొలగించాలని ఎన్నికల కమిషన్ సూచించినా కర్ణాటక బీజేపీ స్పందించలేదు. దీంతో 'ఎక్స్' సంస్థకు ఎన్నికల కమిషన్ మంగళవారం నోటీస్ ఇచ్చింది. ఐటీ యాక్ట్ 79(3)(బీ) ప్రకారం వివాదాస్పద పోస్ట్‌ను తొలగించాలని ఈ నెల 5న ఈసీ సూచించింది.

మోదీపై ఆరేళ్లపాటు అనర్హత వేటు వేయాలి

- సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు

న్యూఢిల్లీ/చెన్నై, మే 8(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ప్రజలను రెచ్చగొట్టేలా, మతాల మధ్య చిచ్చుపెట్టేలా ఉద్విగ్న, ఉద్రేకపూరిత ప్రసంగాలు చేస్తున్న మోదీపై ఆరేళ్ల పాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హత వేటు వేయాలని సుప్రీంకోర్టులో బుధవారం రిట్ పిటిషన్ దాఖలైంది. దీనిని ఫాతిమా అనే మహిళ దఖలు చేశారు. మతం, దేవుళ్ల, ప్రార్థనా స్థలాల పేర్లు చెప్పి మోదీ ఓట్లు అడుగుతున్నారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనికి గత నెల 9న యూపీలోని ఫిలిభిత్‌లో, 21న రాజస్థాన్‌లోని బన్స్‌వారాలో మోదీ చేసిన ప్రసంగాలను ఆమె ఉదాహరణగా చూపారు. దీనిపై విచారణ జరిపి ప్రజా ప్రాతినిధ్య చట్టం కింద ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. మోదీపై ఎన్నికల కమిషన్ కూడా చర్యలు తీసుకోవాల్సిందిగా ఆమె విజ్ఞప్తి చేశారు. మరోవైపు, ఎన్నికల ప్రచారంలో మోదీ మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా ఉపన్యాసాలిస్తున్నారని, ఆయనపై చర్యలు తీసుకునేలా ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ తమిళనాడు కాంగ్రెస్ అధ్యక్షుడు సెల్వపెరుందగై మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు.

రెండేళ్లలో పలు పార్టీలు కాంగ్రెస్‌లో విలీనం: పవార్

న్యూఢిల్లీ, మే 8: రాబోయే రెండేళ్లలో పలు ప్రాంతీయ పార్టీలు కాంగ్రెస్‌లో విలీనమవుతాయని లేదా ఆ పార్టీకి మరింత దగ్గరవుతాయని ఎన్సీపీ అధినేత శరద్ పవార్ పేర్కొన్నారు. ఎన్సీపీ కూడా అదే బాటలో ఉందా అన్న ప్రశ్నకు ఆయన బదులిస్తూ తమ పార్టీకి, కాంగ్రెస్‌కు ఎలాంటి తేడా లేదని వ్యాఖ్యానించారు. రెండు పార్టీల సిద్ధాంతాలు ఒకటేనని, రెండూ గాంధీ-నెహ్రూ సూత్రాలను ఆచరించేవేనని పేర్కొన్నారు. శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే కూడా భావ సారూప్య పార్టీలతో కలిసి పనిచేయడానికి సుముఖంగా ఉన్నారని చెప్పారు. 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పవార్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. దీనిపై విత్రపక్షమైన శివసేన (యూబీటీ) ఆచితూచి స్పందిస్తూ పవార్ వ్యాఖ్యలు వ్యక్తిగత అభిప్రాయమని పేర్కొంది. ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలైన ఆప్, సీపీఐ స్పందిస్తూ అది ఆయన సొంత అంచనా మాత్రమేనని వ్యాఖ్యానించాయి.

కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్‌పై రేపు తీర్పు..

- జైలు నుంచి పాలన సాగించేందుకు సౌకర్యాలు కల్పించాలన్న పిల్ కొట్టివేత

న్యూఢిల్లీ, మే 8: మద్యం కుంభకోణానికి సంబంధించి మనీ ల్యాండరింగ్ కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్‌పై తీర్పును సుప్రీంకోర్టు శుక్రవారానికి రిజర్వ్ చేసింది. ఈ పిటిషన్‌పై మంగళవారం విచారణ చేపట్టిన జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలో ధర్మాసనం.. ఇరు పక్షాల వాదనలు నమోదు చేసింది. 'ఈ నెల 10వ తేదీన మధ్యంతర ఉత్తర్వులను వెలువరిస్తాం. అరెస్టును సవాల్ చేస్తూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పైనా అదే రోజు విచారిస్తాం' అని ధర్మాసనం బుధవారం వెల్లడించింది. ఒకవేళ ఈ కేసులో మధ్యంతర బెయిల్ ఇస్తే ప్రభుత్వ అధికారిక విధులు నిర్వర్తించేందుకు అనుమతించబోమని.. ఫైళ్లపై సంతకాలు చేయకూడదని మంగళవారం విచారణ సందర్భంగా కోర్టు తెలిపింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఓ పార్టీ అధినేతగా ప్రచారం చేసుకోవచ్చని సూచించింది. ఇదిలా ఉండగా, తిహాడ్ జైలు నుంచే ప్రభుత్వాన్ని నడిపేందుకు సీఎం కేజ్రీవాల్‌కు సౌకర్యాలు కల్పించాలంటూ వేసిన పిల్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టేసింది. అంతేకాకుండా పిటిషనర్‌కు రూ.లక్ష జరిమానా కూడా విధించింది. న్యాయవాది శ్రీకాంత్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. దీనిని పరిశీలించిన తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి మన్మోహన్ నేతృత్వంలోని ధర్మాసనం.. 'మేం ఎమర్జెన్సీ విధించాలా? సెన్సార్‌షిప్ లేదా మార్షల్ చట్టాన్ని అమలు చేయాలా? మీడియాకు, రాజకీయ ప్రత్యర్థులకు వ్యతిరేకంగా మేమేలా ఆదేశాలిస్తాం?' అంటూ పిటిషనర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది.

మోదీ ఒక్క పథకమైనా తీసుకొచ్చారా?

- పదేళ్లలో ఒక్క సంస్థనైనా ప్రారంభించారా?
- బీజేపీ అంచనాలు తలకిందులవుతున్నాయి
- పీటీఐ ఇంటర్వ్యూలో ప్రియాంకాగాంధీ

రాయ్‌బరేలీ, మే 8: ప్రధాని మోదీ తన పదేళ్ల హయాంలో ఒక్క పథకాన్నైనా ప్రారంభించారా, ఒక్క సంస్థనైనా నెలకొల్పారా అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రారంభించిన వాటిని పేరు మార్చి అమలు పరిచినవి కాకుండా, మోదీ స్వయంగా మొదలుపెట్టిన ఒక్క పథకమైనా ఉంటే అదేమిటో చెప్పాలని ప్రధానికి సవాల్ విసిరారు. మూడు దశల ఎన్నికల తర్వాత దేశంలో మార్పు పవనాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని, ప్రజలు మార్పు కోరుకుంటున్నారని తెలిపారు. బుధవారం ఆమె పీటీఐ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వివిధ అంశాలపై మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీసీ, ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లను తొలగించి వాటిని ముస్లింలకు ఇస్తుందని, అయోధ్యపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తిరగరాస్తుందని మోదీ చేస్తున్న ఆరోపణలపై స్పందిస్తూ.. వాస్తవాలను పట్టించుకోకుండా, ఊహాలోకంలో విహరిస్తూ ఆయన మాట్లాడుతున్నట్లు ఉందన్నారు. 'గత పది రోజులుగా గమనిస్తున్నా.. ఆయన ప్రసంగాలు ఊహాజనిత అంశాల చుట్టూ తిరుగుతున్నాయి. దేశ ప్రజలంటే అతడికి గౌరవం లేదు. అందుకనే వాస్తవాలతో సంబంధం లేకుండా మాట్లాడుతున్నారు. మేం ప్రజల్నించి బర్రెలను గుంజుకుంటామని, వారి ఇళ్లలో ఆభరణాలు, సంపదను గుర్తించటానికి ఎక్స్‌రే మిషన్లను పెడతామని ఏదేదో చెబుతున్నారు. ప్రధానమంత్రి అంతటి అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తి కాకుండా మరెవరైనా ఇటువంటి మాటాలు మాట్లాడితే నవ్వుకుంటాం. కానీ, స్వయంగా ప్రధానే ఈ అబద్ధాలను నిజాలుగా ప్రజల్ని నమ్మించాలని చూస్తున్నారు' అని పేర్కొన్నారు.



రాయ్‌బరేలీలో ప్రియాంక ఎన్నికల ప్రచారం

రాజ్యాంగాన్ని మారుస్తామని వారే చెప్పారు

బీజేపీకి 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మారుస్తామని మీరట్ బీజేపీ అభ్యర్థి, కొందరు కేంద్రమంత్రులు బహిరంగంగా చెప్పారని ప్రియాంక గుర్తు చేశారు. 'రాజ్యాంగం వల్లనే దేశంలో ప్రజాస్వామ్యం ఉంది. రిజర్వేషన్లు ఉన్నాయి. ఓటు హక్కు ఉంది. అటువంటి రాజ్యాంగాన్ని మార్చి ప్రజల హక్కులను బీజేపీ బలహీనపరచాలని చూస్తే ఊరుకోబోము. బీజేపీని ఆ పని చేయనివ్వం' అని ప్రియాంక స్పష్టం చేశారు. దేశంలో మార్పు పవనాలు కనిపిస్తున్నాయని.. అందుకనే 400 సీట్లకుపైగా అనే బీజేపీ అంచనాలు క్రమేణా తగ్గుతున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రజానుకూల గ్యారెంటీలతో సాధారణ ప్రజలు ఎలా లబ్ధి పొందుతున్నారో చెప్పటానికి తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలే ఉదాహరణ అని ప్రియాంక పేర్కొన్నారు.

బ్రిటిష్ రాజ్‌ను తలపిస్తున్న మోదీ పాలన

కేంద్రంలో బీజేపీ పాలన 'బ్రిటిష్ రాజ్'ను తలపిస్తోందని ప్రియాంక గాంధీ అన్నారు. మోదీ పాలనతో ప్రభుత్వ విధానాలను కేవలం కోటీశ్వరులను దృష్టిలో పెట్టుకొని రూపొందిస్తున్నారని, పేదలను, రైతులను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బుధవారం ప్రియాంక రాయ్‌బరేలీలో తన సోదరుడు రాహుల్ తరఫున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. "ఐదేళ్లుగా అదానీ, అంబానీల గురించి మాట్లాడిన రాహుల్ గాంధీ.. ఎన్నికల ప్రచారంలో మాత్రం వారి పేర్లు తీయడం లేదు" అన్న మోదీ వ్యాఖ్యలపైనా ప్రియాంక స్పందించారు. "బడా పారిశ్రామికవేత్తలతో కుమ్మక్కై వారి రూ.16లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసిందే బీజేపీ" అంటూ ఎదురుదాడి చేశారు. బీజేపీ పరివారమంతా రాహుల్‌పై అబద్ధాలు ప్రచారం చేయడంలో బిజీగా ఉందన్నారు.

మూకుమ్మడి సెలవులతో 90 విమానాలు రద్దు

- ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్‌లో 300 మంది సిక్‌లీవ్.. వివరణ కోరిన డీజీసీఏ



న్యూఢిల్లీ, మే8: టాటాగ్రూప్ టేకోవర్ చేసిన విమానయాన సంస్థ ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సిబ్బంది మూకుమ్మడి సెలవులు పెట్టడంతో మంగళవారం అర్ధరాత్రి నుంచి దేశవ్యాప్తంగా 90కిపైగా విమానాలు రద్దయ్యాయి. వీటిలో అంతర్జాతీయ విమానాలూ ఉన్నాయి. కేరళ నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లే ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానాలన్నీ రద్దవడంతో మళయాలీలు ఆయా విమానాశ్రయాల్లో ఆందోళన చేశారు. అక్కడి ప్రయాణికులతో తమ సిబ్బంది సమ్మెలో ఉండడంవల్ల ఈ పరిస్థితి నెలకొందని అధికారికంగా చెప్పిన ఎయిరిండియా.. ఆ తర్వాత ఓ పత్రికా ప్రకటనలో సిబ్బంది మూకుమ్మడి సెలవులే కారణమని పేర్కొంది. "విమానాల్లో ప్రయాణికులకు సేవలందించే 300మంది వరకు సిబ్బంది మూకుమ్మడిగా సిక్‌లీవ్‌లు పెట్టారు. దీంతో పలు సర్వీసులను రద్దు చేయాల్సి వచ్చింది. ప్రయాణికుల టికెట్ ధరను పూర్తిగా రిఫండ్ చేస్తాం. లేదా వారు కోరుకున్న తేదీకి ప్రయాణాన్ని రీషెడ్యూల్ చేస్తాం" అని ఎయిరిండియా అధికార ప్రతినిధి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానాల రద్దు ప్రభావం కేరళీయులపై ఎక్కువగా పడింది. కేరళ నుంచి గల్ఫ్ దేశాలకు వెళ్లే విమానాలన్నీ రద్దవడంతో ప్రయాణికులు గగ్గోలు పెట్టారు. "సెక్యూరిటీ, బ్యాగేజ్ చెకిన్, ఇమిగ్రేషన్ పూర్తయ్యాక.. విమానం రద్దు సందేశం వచ్చింది. నేను గురువారమే నా ఉద్యోగంలో చేరాలి. లేకుంటే నా కొలువు ఊడిపోతుంది" అని కన్నూరుకు చెందిన ఓ మహిళ వాపోయారు. కొందరు ప్రయాణికులకు ఈ నెల 14 నుంచి 17 తేదీల్లో విమాన ప్రయాణాన్ని రీషెడ్యూల్ చేస్తున్నట్లు ఎయిరిండియా ప్రకటించింది. సిబ్బంది సమ్మెకు వెళ్తున్న విషయం తమకు 2 గంటల ముందే తెలిసిందని పేర్కొంది. కాగా ఆ తేదీల్లోగా తమ వర్క్‌వీసా గడువు ముగిసిపోతుందని, అదే జరిగితే తమకు ఆత్మహత్య తప్ప మరో మార్గం ఉండదని పలువురు ప్రయాణికులు వాపోయారు. కొందరు దుబాయ్, బహ్రెయిన్, సౌదీల్లో ఉద్యోగాల కోసం షెడ్యూల్ ఇంటర్వ్యూకు హాజరు కావాల్సి ఉంది. ప్రయాణికుల అవస్థలు చూసిన కేరళ సర్కారు. విపక్ష పార్టీలు కేంద్ర విమానయాన మంత్రికి లేఖలు రాశాయి. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరాయి.

వివాదంగా ఎందుకు మారింది?

అప్పుల్లో ఉన్న ఎయిరిండియాను టాటాగ్రూప్ కొనుగోలు చేసింది. అప్పటికే టాటాగ్రూప్ విస్తారా విమానయాన సంస్థను నిర్వహిస్తోంది. తాజాగా ఎయిరిండియాలో ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ (ఏఐఎక్స్ కనెక్ట్– గతంలో ఎయిర్‌ఏషియా ఇండియా), విస్తారాను విలీనం చేయాలని నిర్ణయించింది. అప్పటి నుంచి టాటాగ్రూప్ ఆయా విమానయాన సంస్థల్లోని సిబ్బంది, ఉద్యోగుల నుంచి వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. గత నెల్లో విస్తారాలో పైలట్లు మూకుమ్మడిగా సెలవులు పెట్టడంతో పలు విమానాలు రద్దుచేయాల్సి వచ్చింది.! తాజాగా ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ ఉద్యోగులు సహాయ నిరాకరణ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకనేక కారణాలున్నాయని ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ ఉద్యోగుల సంఘం వివరించింది. ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ ఉద్యోగుల పట్ల టాటాగ్రూప్ అసమానతలను చూపుతోందని ఆరోపించింది. కాగా.. బుధవారం ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమానాల రద్దుతో తానూ బాధితుడిగా మారానని జమ్మూకశ్మీర్‌కు చెందిన డీపీఏపీ చీఫ్ గులామ్ నబీ ఆజాద్ అన్నారు.

హిందూ జనాభా తగ్గుముఖం

- 1950-2015 మధ్య 8% తగ్గుదల
- మైనారిటీల జనాభాలో పెరుగుదల
- ప్రధాని సలహామండలి అధ్యయనం

న్యూఢిల్లీ, మే8: దేశంలో మెజారిటీ జనాభాగా ఉన్న హిందువుల సంఖ్య తగ్గుముఖం పట్టిందని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి వెల్లడించింది. 1950-2015 మధ్యకాలంలో 7.8% హిందువులు తగ్గిపోయినట్టు తెలిపింది. కానీ, మైనారిటీ జనాభా పెరిగినట్టు పేర్కొంది. పెరిగిన వారిలో ముస్లింలు, క్రిస్టియన్లు, బౌద్ధులు, సిక్కుల జనాభా ఉన్నట్టు తెలిపింది. జైనులు, పార్సీల జనాభా తగ్గుముఖం పట్టినట్టు పేర్కొంది. ఇదే సమయంలో పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లలో అక్కడి మెజారిటీ జనాభా పెరిగినట్టు తమ అధ్యయనంలో తెలిపింది. 1950-2015 మధ్య ముస్లిం జనాభా వాటా 43.15% పెరగ్గా, క్రిస్టియన్ జనాభా5.38%, సిక్కులు6.58% పెరిగినట్టు పేర్కొంది. బౌద్ధుల జనాభాలోనూ కొంత పెరుగుదల నమోదైనట్టు తెలిపింది. హిందూ జనాభా విషయానికివస్తే 1950లో 84శాతం ఉన్న వీరు 2015నాటికి 78శాతానికి చేరినట్టు పీఎం సలహా మండలి పేర్కొంది. గత 65ఏళ్లలో 9.84% నుంచి 14.09శాతానికి ముస్లిం జనాభా పెరిగినట్టు తెలిపింది. మెజారిటీ జనాభా తగ్గుదలలో మయన్మార్ తొలి స్థానంలో ఉందని, ఇక్కడ 10% మెజారిటీ జనాభా తగ్గిందని, తర్వాత స్థానంలో భారత్ ఉందని తెలిపింది. మూడో స్థానంలో ఉన్న నేపాల్‌లో మెజారిటీ హిందూ జనాభా 3.6% తగ్గినట్టు పేర్కొంది. 167 దేశాల్లోని మెజారిటీ జనాభాపై చేసిన అధ్యయన వివరాలను పీఎం సలహా మండలి ఈ నెలలో విడుదల చేసింది. "భారత్‌లో మైనారిటీలకు రక్షణే కాకుండా వారి అభివృద్ధికీ ప్రభుత్వాలు దోహదపడుతున్నాయి"అని నివేదిక పేర్కొంది. భారత్‌లో హిందూ జనాభా తగ్గడం, మైనారిటీ జనాభా పెరగడానికి కారణాలు తెలియదని, కేవలం సంఖ్యాపరంగానే అధ్యయనం చేసినట్టు తెలిపింది.

మాల్.. ధమాల్

- దేశంలోని నగరాల్లో పెరుగుతున్న ఘోస్ట్ మాల్స్
- ఆన్‌లైన్ షాపింగ్‌కు పెరుగుతున్న ఆదరణ వల్లే

న్యూఢిల్లీ, మే 8: దేశంలోని మెట్రో నగరాల్లో ఘోస్ట్ మాల్స్ అధికమవుతున్నాయి. ఓ షాపింగ్ మాల్‌లో అందుబాటులో ఉన్న మొత్తం స్థలంలో 40% చోటు నిరుపయోగంగా మిగిలిపోతే దానిని ఘోస్ట్ మాల్ అంటారు. ఇలాంటి మాల్స్ సంఖ్య రోజురోజుకి పెరిగిపోతోంది. 2022లో దేశవ్యాప్తంగా 57 ఘోస్ట్ మాల్స్ ఉండగా 2023 నాటికి అది 64కు పెరిగింది. నైట్ ఫ్రాంక్ ఇండియా అనే స్థిరాస్తి సంస్థ చేసిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. ఈ అధ్యయనం ప్రకారం.. ఘోస్ట్ మాల్స్‌గా మారిన 64 షాపింగ్ మాల్స్ విస్తీర్ణం సుమారు 1.33 కోట్ల చదరపు అడుగులు ఉంటుంది. ఆయా మాల్స్ వల్ల రూ.6,700 కోట్ల మేర నష్టం వాటిల్లిందని ఆ నివేదిక పేర్కొంది. ఇక, 64 ఘోస్ట్ మాల్స్‌లో 21 దేశ రాజధాని ఢిల్లీ ప్రాంతంలోనే ఉన్నాయి. తర్వాతి స్థానంలో బెంగళూరు(12 మాల్స్) ఉంది. హైదరాబాద్‌లో 4 ఘోస్ట్ మాల్స్ ఉన్నాయి. ఆన్‌లైన్ షాపింగ్‌కు ఆదరణతోనే ఈ మాల్స్ పెరుగుతున్నట్లు నివేదిక తెలిపింది.

సౌర విద్యుత్‌లో జపాన్‌ను దాటేసిన భారత్

న్యూఢిల్లీ, మే 8: సోలార్ విద్యుత్ ఉత్పత్తిలో భారత్ గణనీయ వృద్ధి సాధించింది. ప్రముఖ గ్లోబల్ ఎనర్జీ సంస్థ ఎంబర్ నివేదిక ప్రకారం 2023లో ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా సోలార్ పవర్‌ను ఉత్పత్తి చేస్తున్న దేశాల్లో జపాన్‌ను అధిగమించి మూడో స్థానానికి చేరుకుంది. 2015లో భారత్ తొమ్మిదో స్థానంలో ఉంది. ఎంబర్ బుధవారం విడుదల చేసిన గ్లోబల్ ఎలక్ట్రిసిటీ రివ్యూ-2024లో ఈ వివరాలు వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా 225 దేశాల నుంచి సేకరించిన డేటా ఆధారంగా ఈ నివేదిక రూపొందించారు. 2023లో చైనా 156 టెరావాట్ హవర్ల సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేయగా, అమెరికా 33, భారత్ 18 టెరావాట్ హవర్ల సౌర విద్యుత్‌ను ఉత్పత్తి చేశాయి. సోలార్ విద్యుత్ ఉత్పత్తి అనూహ్యంగా పెరుగుతోందని ఎంబర్ ఆసియా ప్రోగ్రామ్ డైరెక్టర్ ఆదిత్య లొల్లా చెప్పారు. 2015తో పోలిస్తే ప్రపంచ సౌర విద్యుత్ ఉత్పత్తి 2023లో 6 రెట్లు పెరిగింది. ఇదే సమయంలో భారత్‌లో ఇది 17 రెట్లు పెరిగింది. 2015లో భారత విద్యుత్ ఉత్పత్తిలో సౌరశక్తి వాటా 0.5 శాతం ఉండగా.. 2023లో అది 5.8 శాతానికి ఎగబాకింది.

లోకం తీరు



ఉప్పు 5 గ్రాములు మించొద్దు!



- ప్యాకెట్లలో లభించే ఫుడ్ తినొద్దు
- కృత్రిమ ప్రొటీన్ పొడర్లు వాడొద్దు
- కేకులు, ఫాస్ట్ ఫుడ్ జోలికి పోవద్దు
- సంతులన ఆహారంతోనే ఆరోగ్యం
- రోజుకు మూడుసార్లు తీసుకోండి
- పప్పు, తృణధాన్యాలు, కూరగాయలు, పండ్లు, డ్రైఫ్రూట్స్ ఆహారంలో ఉండాలి
- తాజా మార్గదర్శకాలు విడుదల చేసిన జాతీయ పోషకాహార సంస్థ

హైదరాబాద్, మే 8: అసాంక్రమిక వ్యాధులు దరిచే రకుండా ఆరోగ్యంగా జీవించేందుకు సంతులన ఆహారం తీసుకోవడంతో పాటు జీవనశైలిలో ఎలాంటి మార్పులు చేసుకోవాలనే అంశంపై హైదరాబాద్‌లోని జాతీయ పోషకాహార సంస్థ (ఎన్ఐఎన్) 17 మార్గదర్శకాలు విడుదల చేసింది. అన్ని వయసుల వారు పాటించేందుకు వివిధ రంగాల్లో నిపుణులైన శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో ఈ మార్గదర్శకాలు రూపొందించినట్లు కమిటీకి సారథ్యం వహించిన ఎన్ఐఎన్ డైరెక్టర్ డాక్టర్ హేమలత తెలిపారు. రోజుకి 5 గ్రాములకు మించి ఉప్పును ఉపయోగించవద్దని ఎన్ఐఎన్ ఓ ముఖ్య సూచన చేసింది. మారుతున్న ఆహారపు అలవాట్లకు అనుగుణంగా ఎన్ఐఎన్ తరచూ ఆహార మార్గదర్శకాలు విడుదలచేస్తూ ఉంటుంది.

ఏది సంపూర్ణ ఆహారం?

నిత్యం ఆహారంలో కూరగాయలు 400 గ్రాములు, పండ్లు 100 గ్రాములు, 85 గ్రాముల పప్పుధాన్యాలు లేదా మాంసాహారం, పోషక విలువలు ఉన్న బాదం వంటి డ్రైఫ్రూట్స్ 35 గ్రాములు, 27 గ్రాముల కొవ్వుపదార్థాలు, నూనెలు, 250 గ్రాముల తృణధాన్యాలు ఉంటే అది సమతుల ఆహారమని ఎన్ఐఎన్ ఆ నివేదికలో స్పష్టం చేసింది. సంతులన ఆహారం తీసుకున్నప్పుడే వివిధ ఆరోగ్య సమస్యల నుంచి బయటపడగలమని డాక్టర్ హేమలత తెలిపారు.

ఫాస్ట్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలి

సంతులన ఆహారాన్ని రోజుకు మూడుసార్లు తీసుకోవాలి. ప్యాకెట్లలో లభించే ఆహార పదార్థాలు, కృత్రిమ పానీయాలకు దూరంగా ఉండాలి. గర్భిణీలు, పిల్లలకు పాలిచ్చే బాలింతలకు ఆరోగ్యకరమైన ఆహారం అందిస్తే పిల్లలు ఆరోగ్యంగా ఎదుగుతారు. బిడ్డ పుట్టిన ఆరు నెలల వరకు తల్లి పాలు తప్పక ఇవ్వాలి. రెండేళ్ల వరకు తల్లిపాలు కొనసాగించవచ్చు. ఎదిగే పిల్లలకు పోషక విలువలు ఉన్న ఆహారం ఇవ్వాలి. ఉప్పు, నూనెలు పరిమితంగా తీసుకోవాలి. ఫాస్ట్ ఫుడ్స్ కృత్రిమ ప్రొటీన్ పొడర్లకు దూరంగా ఉండాలి. ఆహారంలో తృణధాన్యాలు, పప్పు ధాన్యాలు 3:1 నిష్పత్తిలో ఉండాలి. పాలు, పెరుగు, మజ్జిగ ఆహారంలో తప్పక ఉండాలి. వేపుళ్లు, నూనెలు, అధిక మోతాదులో కొవ్వు ఉండే పదార్థాలకు దూరంగా ఉండాలి. పండ్లు, పండ్ల రసాలు అధికంగా తీసుకోవాలి. నిత్యం 30 నుండి 45 నిమిషాల పాటు నడవాలి. చిన్నారులకు గంటసేపు ఆటల వంటి శారీరక శ్రమ అవసరం. నిత్యం పుష్కలంగా నీరు తాగాలి. ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలను వదిలేసి తాజా ఆహారం తీసుకోవాలి. బిస్కెట్లు, సోడాలు, కూల్‌డ్రింక్స్, సాస్‌లు, కేక్, పేస్ట్రీలకు దూరంగా ఉండాలి. ఏ వయసు వారు ఏ మోతాదులో ఆహారం తీసుకోవాలనే వివరాలను https://nin.res.in/dietaryguidelines/index.html లో తెలుసుకోవచ్చు.

కూలిన బతుకులు!

బాచుపల్లిలో కుప్పకూలిన అపార్ట్‌మెంట్ రిటైనింగ్ వాల్ .. నాలుగేళ్ల బాలుడు సహా ఏడుగురి దుర్మరణం

నిజాంపేట/అడ్డగుట్ట, మే 8 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ బాచుపల్లిలో ఘోరం జరిగింది. మంగళవారం రాత్రి నిర్మాణంలో ఉన్న ఓ అపార్ట్‌మెంట్ రిటైనింగ్ వాల్ కూలిపోయింది! శిథిలాలన్నీ నేరుగా ఆ పక్కనే గుడిసెల్లో ఉంటున్న కూలీలపై పడ్డాయి. ఈ ఘటనలో నాలుగేళ్ల బాలుడు, అతడి తల్లిదండ్రులు, మరో జంట సహా ఏడుగురు దుర్మరణం పాలయ్యారు. మరో ఏడుగురికి గాయాలయ్యాయి. మృతులు, క్షతగాత్రులంతా పొట్ట చేతపట్టుకొని బయట రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కూలీలే. మహారాష్ట్ర ఒడిసా, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వలస కూలీలే! ఈ దారుణ ఘటనకు రైజ్ డెవలపర్స్ అనే నిర్మాణ సంస్థ నిర్లక్ష్యమే కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు. పాత సిమెంట్ ఇటుక గోడపై రిటైనింగ్ వాల్ నిర్మించడం, అక్కడ వర్షపు నీళ్లు నిలిచి.. ఒత్తిడికి గోడ కూలిందని చెబుతున్నారు. పనులు ముగించుకొని గుడెసెల్లోకి వెళ్లిన కొద్దిసేపటికే తమవాళ్లు ప్రమాదంలో మృతిచెందడంతో వారి కుటుంబసభ్యులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. నిజాంపేట్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లి రేణుకా ఎల్లమ్మ కాలనీలోని సర్వే నంబర్ 345 పార్ట్, 406 పార్ట్‌లో 2000 చదరపు మీటర్ల విస్తీర్ణంలో సెల్లార్, స్టిల్ట్ ప్లస్ ఐదంతస్తుల భవన నిర్మాణాల కోసం రైజ్ డెవలపర్స్ కంపెనీ, హెచ్ఎండీఏ నుంచి అనుమతులు పొందింది. రెండు, మూడు బ్లాక్‌లుగా ఇక్కడ భవనాల నిర్మాణం జరుగుతోంది. వాస్తవానికి నిర్మాణం పనులను రెండేళ్ల క్రితం ప్రారంభించారు. ప్రస్తుతం నాలుగో అంతస్తు శ్లాబ్ పనులు కొనసాగుతున్నాయి.



రిటైనింగ్ గోడ కూలిన ప్రాంతం ఇదే...

ఎత్తు వంపులుగా స్థలం ఉండటంతో ముంపు ముప్పు లేకుండా ఉండేందుకు ఎక్కువ ఎత్తులో భవనాన్ని నిర్మిస్తున్నారు. ఈ క్రమంలో భవనానికి ఓ వైపు రిటైనింగ్ వాల్ నిర్మించి సుమారు 30 అడుగుల మేర మట్టి పోశారు. రిటైనింగ్ వాల్‌కు ఆవలివైపు కార్మికులు నివసించేందుకు గుడిసెలు నిర్మించారు. మంగళవారం సాయంత్రం 5.30 గంటలకు కార్మికులు పనులు ముగించుకొని గుడిసెల్లోకి చేరుకున్నారు. వర్షానికి నీళ్ల పల్లంవైపు ఉన్న మట్టి వైపు వచ్చాయి. భారీగా వరద నీరు వచ్చి చేరడంతో మట్టి కుంగింది. దీంతో సాయంత్రం 6.40 గంటలకు రిటైనింగ్ వాల్ ఒక్కసారిగా కూలింది. లోపలున్న వారిలో ఏడుగురు అక్కడికక్కడే మృతిచెందారు. మృతులను ఛత్తీస్‌గడ్‌కు చెందిన రామ్‌యాదవ్ (44), ఆయ భార్య గీతబల్ (40), వారి కుమారుడు హిమాన్షు (4), సంకదేబ్‌గౌడ్ (18), మహారాష్ట్రకు చెందిన బింద్రేశ్ భవానీ చౌహాన్ (30), ఆయన భార్య ఖుషి (20), ఒడిసాకు చెందిన శ్రీపతి మాగి (23)గా గుర్తించారు. మరో ఏడుగురికి గాయాలయ్యాయి. వర్షం పడుతుండటం, విద్యుత్తు సరఫరా లేకపోవడంతో సహాయక చర్యలు ఆలస్యమయ్యాయి. సాయంత్రం 6.40కి ప్రమాదం జరిగితే రాత్రి 8 గంటలకు ప్లొక్లెయినర్‌తో శిథిలాలను తొలగించడం ప్రారంభించారు. మొదటి మృతదేహాన్ని సుమారు రాత్రి 11 గంటల సమయంలో బయటికి వెలికి తీసినట్లు స్థానికులు తెలిపారు. కాగా ఈ ప్రమాదానికి సంబంధించి నిర్మాణ సంస్థ యజమాని అరవింద్ రెడ్డి, కాంట్రాక్టర్లు రాజేశ్‌రెడ్డి, రాంరెడ్డిపై కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నట్లు బాలానగర్ డీసీపీ శ్రీనివాస్‌రావు చెప్పారు. కాగా నిర్మాణ స్థలిని హెచ్ఎండీఏ అధికారులు పరిశీలించారు. ప్రాజెక్టు అనుమతులను నిలిపివేశారు.

వేర్వేరు ఘటనల్లో ఆరుగురి మృతి

- కరీంనగర్, రంగారెడ్డిలో భారీ వర్షం
- నేడు, రేపు పలు చోట్ల వానలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

రాష్ట్రవ్యాప్తంగా బుధవారం కూడా కొన్నిచోట్ల వర్షం పడింది. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డుతో పాటు పలు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలు తడిసిపోయాయి. రంగారెడ్డి జిల్లాలో భారీ వర్షం పడింది. ఈదురుగాలుల బీభత్సానికి జిల్లా వ్యాప్తంగా 400 ఎకరాల్లో మామిడి, బొప్పాయి, అరటి తోటలు దెబ్బతిన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా వేర్వేరు ఘటనల్లో ఆరుగురు మృతిచెందారు. మెదక్ జిల్లా చేర్యాల మండలం అర్జునపట్ల గ్రామంలో ఓ కంపెనీ వద్ద తాటిచెట్టు కూలి మీద పడటంతో పశ్చిమబెంగాల్‌కు చెందిన అమల్ రేబ్‌నాథ్ (33) అనే కార్మికుడు మృతిచెందాడు. హైదరాబాద్ బేగంపేటలో



బేగంపేట నాలాలో కొట్టుకు వచ్చిన రెండు మృతదేహాలు

మంగళవారం రాత్రి ఒడిసాకు చెందిన చంద్ర పాండా (38), మనోజ్ దాస్ (45) అనే ఇద్దరు స్నేహితులు మద్యం మత్తులో నడుచుకుంటూ ప్రమాదవశాత్తు నాలాలో పడి మృతిచెందారు. కొత్తగూడెం జిల్లా పాల్వంచ సమీపంలోని సీతారాంపట్నానికి చెందిన వ్యాపారి బోళ్ల శ్రీనివాసరావు (48), వరంగల్ జిల్లా పాలకుర్తి మండలం దర్దెపల్లి గ్రామానికి చెందిన గిద్దెల రాజు (35) అనే వ్యక్తి, సూర్యాపేట జిల్లా మఠంపల్లికి చెందిన అబ్బగాని ప్రమీల (53) అనే మహిళ మృతిచెందారు. కాగా గురు, శుక్రవారాల్లో కొన్ని జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో ఓ మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ వాతావరణ కేంద్రం పేర్కొంది. ఈ రెండ్రోజుల్లో 40 డిగ్రీల లోపే ఉష్ణోగ్రతలు నమోదవుతాయని తెలిపింది. నిజామాబాద్ జిల్లా జకోరా, నిజామాబాద్ పట్టణంలో గరిష్ఠంగా 42.9, అదే జిల్లా కొరాటపల్లిలో42.8, నిర్మల్ జిల్లా నర్సాపూర్‌లో 42.6, నిజామాబాద్ జిల్లా మోస్రా, సాలూర, నిర్మల్ జిల్లా తానూర్‌లో 42.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.



అబ్ కీ బార్?

ఓటర్ల కోసం 2,500 ప్రత్యేక బస్సులు

హైదరాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఓటు వేసేందుకు హైదరాబాద్ నుంచి సొంతూళ్లకు వెళ్లే ఓటర్ల కోసం టీఎస్ఆర్టీసీ 2,500 ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు చేసింది. మే 13న పోలింగ్ ఉండగా.. 11న రెండో శనివారం, 12న ఆదివారం సెలవు ఉండటంతో ముందుగానే సొంత ప్రాంతాలకు వెళ్లేందుకు వీలుగా శుక్రవారం (10వ తేదీ) నుంచే ప్రత్యేక బస్సులు నడిపేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్టు ఆర్టీసీ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పురుషోత్తం తెలిపారు. మే10న 500, 11న 750, 12న 750, 13న 500 ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు.

కాంగ్రెస్ ప్రచారంలో ఢిల్లీ పోలీసుల జోక్యం

- వారెంట్ లేకుండా కార్యకర్తల ఇళ్లల్లోకి వెళ్లి సోదాలు
- హైకోర్టులో మహేశ్‌కుమార్ గౌడ్ పిటిషన్

హైదరాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ సోషల్ మీడియా రాష్ట్ర కార్యదర్శుల వ్యక్తిగత స్వేచ్ఛలో జోక్యం చేసుకోవడంతో పాటు ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు వారిని వేధిస్తున్నారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్ హైకోర్టును ఆశ్రయించారు. 29 మంది టీపీసీసీ సోషల్ మీడియా స్టేట్ సెక్రటరీలపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఢిల్లీ పోలీసులను ఆదేశించాలని పిటిషన్ దాఖలు చేశారు. అమిత్ షా మార్ఫింగ్ వీడియోను కాంగ్రెస్ సోషల్ మీడియా ఇన్‌చార్జిలు సోషల్ మీడియాలో పెట్టారన్న ఆరోపణలతో దాదాపు 150మంది ఢిల్లీ పోలీసులు తమ పార్టీ ప్రచార కార్యక్రమాల్లో జోక్యం చేసుకుంటున్నారని తెలిపారు. తెలంగాణ పోలీసులు నమోదు చేసిన కేసు దర్యాప్తులో ఉండగా ఢిల్లీ పోలీసులు తమ సోషల్ మీడియా కార్యదర్శులకు 91/160సీఆర్పీసీ నోటీసులు ఇవ్వడంతో పాటు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ఎలాంటి వారంట్ లేకుండా కార్యకర్తల ఇళ్లకు వెళ్లి సోదాలు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈ పిటిషన్ గురువారం జస్టిస్ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం ఎదుట విచారణకు రానుంది.

నేడు రాహుల్..ఎల్లుండి ప్రియాంక ప్రచారం

ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ.. మరోమారు తెలంగాణ ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారు. గురువారం మెదక్ లోక్‌సభ నియోజకవర్గం నర్సాపూర్‌లో, మల్కాజ్‌గిరి నియోజకవర్గంలోని సరూర్‌నగర్ స్టేడియంలో జరిగే జనజాతర సభల్లో ఆయన పాల్గొంటారు. ప్రత్యేక విమానంలో బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి హెలికాప్టర్లో సాయంత్రం 4 గంటల వరకు నర్సాపూర్‌కు చేరుకుంటారు. అక్కడి సభ అనంతరం సాయంత్రం 6 గంటలకు సరూర్‌నగర్‌కు వెళ్తారు. సరూర్‌నగర్ సభ ముగియగానే ఢిల్లీకి తిరుగుప్రయాణమవుతారు. కాగా, శుక్రవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే.. భువనగిరి నియోజకవర్గంలోని నకిరేకల్‌లో జరిగే జనజాతర సభలో పాల్గొంటారు. 11న(శనివారం) ప్రియాంక కామారెడ్డిలో జరిగే రోడ్‌షోలోను, తాండూరు సభలోనూ పాల్గొంటారు.

ఎమ్మెల్సీ విఠల్ ఎన్నిక చెల్లదన్న హైకోర్టు తీర్పుపై.. సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్ దాఖలు

న్యూఢిల్లీ, మే 8 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దండె విఠల్ ఎన్నిక చెల్లదన్న హైకోర్టు తీర్పుపై ఆదిలాబాద్‌కు చెందిన కాంగ్రెస్ నేత పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి బుధవారం సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్ దాఖలు చేశారు. తమ వాదన వినకుండా ఎలాంటి ఆదేశాలు జారీ చేయకూడదని ఈ మేరకు ఆయన పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. హైకోర్టు ఆదేశాలను దండె విఠల్ ఒకవేళ సుప్రీంకోర్టులో సవాల్ చేస్తే తమ వాదనలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఆదిలాబాద్ స్థానికసంస్థల ఎమ్మెల్సీగా దండె విఠల్ ఎన్నిక చెల్లదని గత శుక్రవారం తెలంగాణ హైకోర్టు తీర్పు ఇచ్చింది. 2022లో ఆదిలాబాద్ స్థానికసంస్థల ఎమ్మెల్సీగా బీఆర్ఎస్ తరపున విఠల్ గెలిచారు. ఆ సమయంలో విఠల్‌కు ప్రత్యర్థిగా పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి ఇండిపెండెంట్‌గా నామినేషన్ దాఖలు చేశారు. తాను విత్ డ్రా చేసుకోకపోయినా తన సంతకాన్ని ఫోర్జరీ చేసి ఎన్నికల బరి నుంచి తప్పించారని రాజేశ్వర్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. సంతకం ఫోర్జరీ జరిగిందని సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబరేటరీ ఇచ్చిన నివేదిక ఆధారంగా విఠల్ ఎన్నిక చెల్లదని హైకోర్టు తీర్పును వెలువరించింది. అయితే హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేస్తానని దండె విఠల్ ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో పిటిషనర్ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి ముందుగానే సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్ దాఖలు చేశారు.

రాజన్న సాక్షిగా మోదీ అబద్ధాలు చెప్పారు

- కరీంనగర్‌కు చేసిందేంటో చెప్పలేదు: పొన్నం

కరీంనగర్ అర్బన్, మే 8: వేములవాడ రాజన్న సాక్షిగా ప్రధాని మోదీ అబద్ధాలు చెప్పారని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. కరీంనగర్ అభివృద్ధికి చేసిందేంటో చెప్పాలని తాము అడిగిన దానికి జవాబు మాత్రం చెప్పలేదని దుయ్యబట్టారు. కశ్మీర్‌లో 370 ఆర్టికల్‌ను రద్దు చేసిన మోదీ.. అక్కడి ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని ఎందుకు నిలబెట్టలేదని ప్రశ్నించారు. రక్షణ రంగంలో ఆయుధాలను దిగుమతి చేసుకునే స్థాయి నుంచి ఎగుమతి చేసే స్థాయికి ఎదిగామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రాజకీయాల కోసం రక్షణ బలగాలను వాడుకున్న ద్రోహి మోదీ అని విమర్శించారు. వ్యవసాయ, ఆర్థిక, వస్త్ర రంగాల్లో కాంగ్రెస్ న్యాయం చేయలేకపోయిందని మోదీ చేసిన వ్యాఖ్యలు శుద్ధ అబద్ధమన్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చినప్పుడు బడ్జెట్ 190 కోట్లు మాత్రమేనని, 2014 నాటికి దాన్ని 30 లక్షల కోట్లకు పెంచడం కాంగ్రెస్ ఘనత కాదా? అని నిలదీశారు.

రూ. 2.66 కోట్ల విలువైన నగలు, రూ. 64.72 లక్షల నగదు సీజ్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్) : ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసులు రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో బుధవారం నిర్వహించిన తనిఖీల్లో రూ.2.66 కోట్ల విలువైన నగలు, రూ.64.72 లక్షల నగదు సీజ్ చేశారు. హైదరాబాద్, కూకట్‌పల్లిలోని రామ్‌దేవ్‌రావు ఆస్పత్రి వద్ద ఓ లాజిస్టిక్స్ వాహనాన్ని తనిఖీ చేసిన బాలానగర్ ఎస్ఓటీ పోలీసులు సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.2,66,63,845 విలువైన బంగారు, వెండి నగలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అందులో రూ.2.64 కోట్ల విలువైన నాలుగు కిలోల బంగారం, రూ.2.80 లక్షల విలువైన 4 కిలోల వెండి ఆభరణాలు ఉన్నాయి. అలాగే, కూకట్‌పల్లిలో మరో వాహనంలో రూ.2,63,845 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఇక, సరైన పత్రాలు లేకుండా సిస్కో వాహనంలో తరలిస్తున్న రూ.24,91,700 నగదును మెదక్ పోలీసులు సీజ్ చేశారు. ఇక, బాచుపల్లి వద్ద ఇద్దరు యువకులు ద్విచక్రవాహనాల్లో అక్రమంగా తరలిస్తున్న రూ.22 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే, కరీంనగర్, జగిత్యాల జిల్లాల్లో చేపట్టిన వాహన తనిఖీల్లో వేర్వేరు వ్యక్తుల నుంచి మొత్తం రూ.15.17 లక్షల నగదును పోలీసులు సీజ్ చేశారు.



సీఎం రేవంత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న సాంబశివరాజు

కాంగ్రెస్‌లోకి జోరుగా వలసలు

సీఎం సమక్షంలో చేరిన బీఆర్ఎస్ నేత ముక్కా సాంబశివరాజు

హైదరాబాద్, మే 8(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల వేళ కాంగ్రెస్ పార్టీలోకి వలసలు కొనసాగుతున్నాయి. బుధవారం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత ముక్కా సాంబశివరాజు సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. గతంలో టీడీపీలోనూ పని చేసిన ఆయన.. టీఆర్ఎస్ ఆవిర్భావం తర్వాత ఆ పార్టీలో చేరారు. కేసీఆర్ తీరు నచ్చక, సీఎం రేవంత్‌రెడ్డి పథకాలకు ఆకర్షితుడినయ్యి తాను హస్తం పార్టీలో చేరుతున్నట్లు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. కాగా, టీడీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు భవనం షకీలారెడ్డి బుధవారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి దీపాదాస్ మున్షీ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. అలాగే తెలంగాణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు గోశిక యాదగిరి, కార్యదర్శి నారా నరసింహ, పద్మశ్రీ అవార్డు గ్రహీత గజం గోవర్ధన్, అప్కో మాజీ చైర్మన్ గోశిక పాండు తదితరులూ దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

కేసీఆర్.. రైతు ఖాతాలు చూడు

(మొదటి పేజీ తరువాయి)

చేశారని మండిపడ్డారు. దీంతో 2019 ఎన్నికల్లో వంద మంది రైతులు నామినేషన్లు వేసి.. మోసం చేసిన కవితను ఓడించారని, ఆ ఎన్నికల్లో బాండ్ పేపర్ రాసిచ్చిన ధర్మపురి అర్వింద్‌ను గెలిపించారని గుర్తుచేశారు. ఎంపీగా గెలిచిన ఐదు రోజుల్లోనే పసుపు బోర్డు తీసుకువస్తానన్న అర్వింద్ కూడా ఐదేళ్లు గడిచినా.. ఆ హామీ నెరవేర్చలేదన్నారు. ఆర్మూర్ రైతుల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టు అయ్యిందని రేవంత్ ఆవేదన వెలిబుచ్చారు. నిజామాబాద్‌కు పసుపు బోర్డు రావాలన్నా.. చక్కెర కర్మాగారాలు తెరుచుకోవాలన్నా.. వ్యవసాయం తెలిసిన ఆదర్శ రైతు జీవన్‌రెడ్డిని పార్లమెంట్‌కు పంపించాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే తాము చక్కెర కర్మాగారాలపై మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేశామని.. ఫ్యాక్టరీలను తెరిపించడానికి ప్రయత్నాలను చేస్తున్నామని పేర్కొన్నారు. ఇప్పటికే 43 కోట్ల రూపాయలను బకాయిల చెల్లింపుల కోసం విడుదల చేశామన్నారు.

మోదీపై మండిపాటు..

కేంద్రంలో పదేళ్లు అధికారంలో ఉన్న ప్రధాని మోదీ నిజామాబాద్ రైతులను మోసం చేశారని.. నిజామాబాద్‌కు స్మార్ట్ సిటీ తేలేదని, చెరకు ఫ్యాక్టరీలను తెరిపించలేదని.. చెరకు రైతులకు మద్దతు ధర ఇవ్వలేదని రేవంత్ మండిపడ్డారు. "మళ్లీ గెలిపిస్తే ఇక్కడి ఎంపీ రాజ్యాంగాన్ని మారుస్తానంటున్నారు. బాబా సాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని మారుస్తామన్న వారిని గద్దె దించాలి" అని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను తీసేసేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. పదేళ్లకొకసారి చేపట్టే జనాభా లెక్కలను 2021లో ఎందుకు చేపట్టలేదని.. దేశవ్యాప్తంగా బీసీ కులగణనకు ఎందుకు అడ్డుపడుతున్నారని ఆయన ప్రశ్నించారు. పదేళ్ల నరేంద్రమోదీ పాలనలో తెలంగాణకు గాడిద గుడ్డు తప్ప ఇచ్చింది ఏమీ లేదన్నారు. విభజన చట్టంలో పొందుపర్చిన ఏ హామీలనూ నెరవేర్చనందుకు బీజేపీని గెలిపించాలా అని సీఎం ప్రశ్నించారు. గాడిద గుడ్డు ఇచ్చిన బీజేపీకి కర్రు కాల్చి వాత పెట్టాలని.. రాష్ట్రంలో ఆ పార్టీని బొంద పెట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో బీసీ గణన చేపట్టి రిజర్వేషన్ పెంచే బాధ్యత తమ ప్రభుత్వానిదేనని ప్రకటించారు.



నిజామాబాద్‌లో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి

పదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వం

రాష్ట్రంలో తమ ప్రభుత్వం పదేళ్లపాటు ఉంటుందని రేవంత్ పేర్కొన్నారు. "కానీ.. తెలంగాణ కేడీ కేసీఆర్ మాత్రం మేం దిగిపోవాలంటున్నారు" అని దుయ్యబట్టారు. 'బిడ్డ బెయిల్ కోసం నిజామాబాద్ కార్యకర్తల గౌరవాన్ని బీజేపీకి తాకట్టు పెడతావా!?' అని కేసీఆర్‌ను నిలదీశారు. రాష్ట్రంలో బీజేపీ గెలిచినా.. బీఆర్ఎస్ గెలిచినా.. ఒక్కటేనని, కేడీ, మోదీ ఒక్కటేనని ఆరోపించారు. ప్రజల రక్షణకు అండగా ఉండే కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. నిజామాబాద్ అభివృద్ధికి తాను అండగా ఉంటానని.. జీవన్‌రెడ్డిని గెలిపిస్తే నిజామాబాద్‌కు రింగ్‌రోడ్ వేయించే బాధ్యత తనదేనని.. నగరాన్ని స్మార్ట్ సిటీగా చేయడంతో పాటు ఇతర అభివృద్ధి పనులను కూడా చేపడుతామని రేవంత్ హామీ ఇచ్చారు.

మోదీ మళ్లీ గెలిస్తే ఎన్నికలుండవు

- జూన్4 తర్వాత తెలంగాణ భవన్‌కు తాళమే: మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్ సిటీ, నల్లగొండ, మే 8 (ఆంధ్రజ్యోతి): "పొరపాటునో, గ్రహపాటునో మోదీ మూడోసారి గెలిస్తే దేశంలో 2029లో ఎన్నికలుండవు. రష్యా, చైనా, మాదిరిగా 30 ఏళ్ల పాటు ప్రధానిగా ప్రకటించుకుంటారు. పదేళ్లు ప్రధానిగా ఉన్న మోదీ రాముడి పేరు చెప్పి ఓట్లు అడిగే పరిస్థితి దాపురించింది. కులాలు, మతాల మధ్య ఘర్షణ తీసుకురావడమే ఎన్డీయే లక్ష్యం" అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో 14 ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్ గెలుస్తుందని, కేంద్రంలో ఇండియా కూటమి ఖచ్చితంగా అధికారంలోకి వచ్చి రాహుల్ ప్రధాని కావడం ఖాయమని జోస్యం చెప్పారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో.. నల్లగొండ జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన వేర్వేరు విలేకరుల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. "ఆర్ఆర్ కలెక్షన్" అంటూ మోదీ చౌకబారు విమర్శలు చేస్తున్నారని.. కానీ మోదీ ఈ పదేళ్లలో ఏఏ (ఆదానీ, అంబానీ)లకు దేశ సంపదను దోచిపెట్టారని విమర్శించారు. మోదీని 'ఏఏ' అనాలని సూచించారు. ఇచ్చిన హామీల్లో ఒక్కదాన్ని కూడా ఆయన నెరవేర్చలేదని.. గబ్బర్‌సింగ్ ట్యాక్స్ మాదిరిగా కూరగాయలు మొదలుకుని అన్నింటి పైనా జీఎస్టీ వేస్తున్నారని దుయ్యబట్టారు. అలాగే.. రాష్ట్రంలో బీఆర్ఎస్ దుకాణం బంద్ అయిందని, ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి ఒక్క సీటు కూడా రాదని.. రెండు, మూడు స్థానాల్లో డిపాజిట్లు వస్తే గొప్ప అని వ్యాఖ్యానించారు. ఆ పార్టీ గురించి మాట్లాడి సమయం వృథా తప్ప ఏమీ లేదన్నారు. జూన్ 4 తర్వాత ఆ పార్టీ ఉండదని, తెలంగాణభవన్‌కు శాశ్వతంగా తాళం వేస్తారని, ఆ పార్టీని కేసీఆర్ రద్దు చేస్తారని కోమటిరెడ్డి జోస్యం చెప్పారు. బీజేపీ, బీఆర్ఎస్.. రెండు పార్టీల పైనా ప్రజలకు నమ్మకం పోయిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో మరో 15 ఏళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమే ఉంటుందని.. పదేళ్లు సీఎంగా రేవంత్‌రెడ్డే ఉంటారని స్పష్టం చేశారు. తమ వద్ద ఏక్‌నాథ్ షిండేలు లేరని.. రేవంత్ అందర్నీ కలుపుకొని పనిచేస్తున్నారని పేర్కొన్నారు. జూన్5 తర్వాత కాంగ్రెస్‌లో చేరేందుకు 25 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సిద్ధంగా ఉన్నారన్న కోమటిరెడ్డి.. 'వాళ్ల పేర్లు కూడా చెప్పాలా?'అని ప్రశ్నించారు. కేసీఆర్‌పై కసితో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గెలిచారని.. లక్ష కోట్లు ఇచ్చినా కూడా కేసీఆర్ దగ్గరకు వెళ్లరని తెలిపారు. నియోజకవర్గాల పునర్విభజనతో రాష్ట్రంలో సీట్ల సంఖ్య 154కు పెరుగుతుందని.. హైదరాబాద్‌లో 12సీట్లు పెరుగుతాయని తెలిపారు. కాగా.. సచివాలయం నిర్మాణంలో భాగంగా రూ.50 కోట్లతో అయ్యే ఇంటర్నెట్, ఎలక్ట్రిక్ పనులను కేసీఆర్ బంధువుకు అప్పగించి రూ.270కోట్లతో చేశారని, ఈ విషయం 'ఆంధ్రజ్యోతి' కూడా ప్రచురించిందన్నారు.





నిర్మల్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క, పక్కన దీపాదాస్ మున్షీ

బీజేపీకి ఓటేస్తే హక్కులు కోల్పోయినట్టే

- ప్రధాని మోదీకి ఓటమి భయం పట్టుకుంది
- అందుకే మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారు

బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటయ్యాయి: భట్టి

నిర్మల్, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీకి ఓటమి భయం పట్టుకుందని, దేశంలో మత విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. భారత రాజ్యాంగాన్ని మార్చాలని కుట్ర చేస్తున్న బీజేపీకి ఓటు వేస్తే మన హక్కులు పోతాయని పేర్కొన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు దేశ ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నిర్మల్‌లో బుధవారం నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ దేశ సంపదను బహుళ జాతి సంస్థలకు దారాదత్తం చేయాలన్న దురాలోచనతో మోదీ ఉన్నారని దుయ్యబట్టారు. లోక్‌సభ ఎన్నికల వేళ బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటయ్యాయని ఆరోపించారు. బీఆర్ఎస్ బలమున్నచోట బీజేపీ బలహీనమైన అభ్యర్థిని పోటీలో పెట్టగా.. బీజేపీ బలమున్న చోట బీఆర్ఎస్ బలహీనమైన అభ్యర్థిని పోటీలో నిలిపిందని వివరించారు. ఈ పార్టీల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతు భరోసా పంపిణీని అడ్డుకొన్న బీఆర్ఎస్, బీజేపీ.. రైతుల పట్ల కపట ప్రేమను ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే దేశ వ్యాప్తంగా కుల గణన చేపడతామని వెల్లడించారు. అకాల వర్షం, గాలి దుమారం వల్ల నష్టపోయిన రైతులను కచ్చితంగా ఆదుకుంటామని, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ వ్యాప్తంగా పోడు భూముల సమస్యకు పరిష్కారం చూపుతామని భరోసా ఇచ్చారు. ఆత్రం సుగుణ నిరుపేద మహిళ అని, ఆదిలాబాద్ ఎంపీగా ఆమెను గెలిపిస్తే పేదల పక్షాన పోరాడుతారన్నారు. సమావేశంలో రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ పాల్గొన్నారు.

మోదీ గ్లామర్ లీడర్... రాహుల్ పీపుల్ లీడర్

- బంగారం ధర తగ్గాలంటే రాహుల్ ప్రధాని కావాలి
- రాముడి పాలన పేదల కోసం.. మోదీ పాలన పెద్దల కోసం
- రాహుల్ కుటుంబ త్యాగం ముందు మోదీ, షాల రాజకీయం ఎంత
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి



హైదరాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ గ్లామర్ లీడర్ మాత్రమేనని... కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రజల మనిషని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి అన్నారు. బంగారం ధర తగ్గాలంటే.. రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలంటూ పిలుపునిచ్చారు. సోనియా గాంధీ, మన్మోహన్ హయాంలో తులం బంగారం ధర రూ. 28 వేలు ఉంటే.. మోదీ ప్రధాని అయ్యాక అది రూ. 76 వేలకు చేరుకుందన్నారు. మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్నప్పుడు రూ. 28 వేలకే తులం బంగారం కొన్న కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ల కుటుంబాలు.. మోదీ అధికారంలోకి వచ్చాక రూ. 76 వేలకు కొంటున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. మత విద్వేషాలు రెచ్చగొడుతూ ప్రసంగాలు చేయడం తప్ప.. ధరలు తగ్గించాం.. అది చూసి ఓటేయాలంటూ ఒక్క సభలోనైనా మోదీ చెప్పారా.. అని నిలదీశారు. తెలంగాణ ప్రజలు దీని గురించి ఆలోచించాలని కోరారు. గాంధీభవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ ఈ లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్, మోదీల మధ్య జాతీయ స్థాయిలో రాజకీయ పోరాటం సాగుతోందన్నారు. ప్రజల ఆర్థిక పరిస్థితిని మెరుగు పరచడంపైనే ఇండియా కూటమి దృష్టి పెట్టిందన్నారు. మోదీ నియంత, నిరంకుశ పాలన దేశానికి ప్రమాదకరమని ప్రజలు గుర్తించారని, దేశంలో ఆయనకు మద్దతు తగ్గిపోయిందన్నారు. పదేళ్ల మోదీ పాలన తర్వాత ఇందిరమ్మ చెప్పిన రోటీ, కపడా ఔర్ మకాన్ నినాదం మళ్లీ తెరపైకి వచ్చిందన్నారు. దీంతో ఆయనకు భయం పట్టుకుందన్నారు. మోదీ గ్లామర్ లీడర్ అయితే.. రాహుల్ గాంధీ ప్రజల మనిషన్నారు. పేదలు గ్లామర్ లీడర్‌ను నమ్మబోరని, వారు సోనియా, రాహుల్ గాంధీల నాయకత్వాన్నే నమ్ముతారన్నారు. శ్రీరాముడు కూడా పేదల మనిషని, తన రాజ్యంలోని పేద ప్రజల బాగు కోసమే ఆయన పాలన సాగించారన్నారు. మోదీ.. పెద్దల కోసమే పాలన చేస్తున్నారన్నారు. పేదలను ఆదుకునే పాలన ఈ పదేళ్లలో కనిపించిందా అని ప్రశ్నించారు. శ్రీరాముడికి వాడే పూజా సామగ్రిపైనా మోదీ ప్రభుత్వం జీఎస్టీ వేసిందని గుర్తు చేశారు. మోదీ తన ప్రసంగాల్లో హిందూ, ముస్లింల మధ్య ఘర్షణ పెడుతున్నాడంటేనే ఆయన రాజకీయంగా బలహీనపడినట్లు లెక్కన్నారు. రాహుల్ గాంధీ చరిత్ర ముందు, ఆయన కుటుంబం త్యాగం ముందు మోదీ, అమిత్‌షా రాజకీయం జీరో అన్నారు. ఇవాళ దివంగత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు ఇంటికి మోదీ వెళ్లాడంటే.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గుర్తింపు వల్లనే అన్నారు.

సూర్యాపేట కాంగ్రెస్ నేత.. వడ్డె ఎల్లయ్య మృతదేహం లభ్యం

- జగ్గయ్యపేటలోనే.. సగం కాల్చి, ఖననం చేసిన నిందితులు
- కేసు నుంచి బయటపడేందుకే తప్పుడు సమాచారం



వడ్డె ఎల్లయ్య(ఫైల్)


సూర్యాపేట రూరల్, మే 8: రియల్‌ఎస్టేట్ వివాదాలతో కిడ్నాపై.. ఆపై దారుణ హత్యకు గురైన సూర్యాపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వడ్డె ఎల్లయ్య మృతదేహం లభ్యమైంది. ఇరవై రోజుల క్రితం ఎల్లయ్య ప్రత్యర్థి, నాగారం మండలం మాచిరెడ్డిపల్లికి చెందిన శ్రీకాంతాచారి పథకం ప్రకారం అతణ్ని ఆంధ్రప్రదేశ్‌లోని జగ్గయ్యపేటకు రప్పించి, అపహరించి, హతమార్చిన విషయం తెలిసిందే. భార్యాభర్తల పంచాయితీ తీర్చాలంటూ అపర్ణ అనే మహిళతో ఎల్లయ్యను జగ్గయ్యపేటకు రప్పించిన శ్రీకాంతాచారి.. అక్కడి రైల్వేస్టేషన్ రోడ్ సమీపంలో హతమార్చాడు. ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు.. శ్రీకాంతాచారిని అదుపులోకి తీసుకుని, ప్రశ్నిస్తే.. హత్యకేసు వెలుగులోకి వచ్చింది. అయితే.. మృతదేహం లభించకపోతే.. తాము కేసు నుంచి బయట పడవచ్చనే ఉద్దేశంతో శ్రీకాంతాచారి పోలీసులను తప్పుదోవ పట్టించాడు. చేపల లారీలో మృతదేహాన్ని విశాఖకు తీసుకెళ్లి.. అక్కడ సముద్రంలో పారేసినట్లు వాంగ్మూలమిచ్చాడు. దీంతో పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి అక్కడ గాలింపు చేపట్టారు.

పశువుల కాపరుల సమాచారంతో..

బుధవారం ఉదయం జగ్గయ్యపేట మండలం బండిపాలెం గ్రామ శివారులో ఏదో మృతదేహం దుర్వాసన వస్తోందంటూ పశువుల కాపరులు గ్రామ పెద్దలకు సమాచారం అందించారు. వారి ద్వారా విషయం తెలుసుకున్న వీఆర్వో బాబూరావు.. పోలీసులకు తెలిపారు. జగ్గయ్యపేట సీఐ జానకీరాం తన సిబ్బందితో కలిసి అక్కడకు చేరుకున్నారు. దుర్వాసన వస్తున్న ప్రాంతంలో తాజాగా పూడ్చిన ఓ గోతి కనిపించడంతో.. అక్కడ తవ్వించారు. సగం కాలిన శవాన్ని వెలికి తీశారు. జగ్గయ్యపేట తహసీల్దార్ సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించారు. ఆ మృతదేహం ఎల్లయ్యదేనని గుర్తించారు. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో.. వారు మృతదేహాన్ని గుర్తించారు. నిందితుడు శ్రీకాంతాచారి పోలీసులను తప్పుదోవ పట్టించేందుకే విశాఖ సముద్రంలో పారేశామని చెప్పారని సీఐ వివరించారు. శ్రీకాంతాచారి తొలుత ఎల్లయ్య మృతదేహాన్ని కాల్చేందుకు ప్రయత్నించారని చెప్పారు. మృతదేహం సగం కాలడంతో.. పాతిపెట్టినట్లు పేర్కొన్నారు. కాగా.. బుధవారం సాయంత్రం సూర్యాపేట జిల్లాలోని ఎల్లయ్య స్వగ్రామం యార్కారంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఎల్లయ్య మాజీ నక్సలైట్ కావడంతో.. అంత్యక్రియలకు పలువురు మాజీ మావోయిస్టులు హాజరయ్యారు. దీంతో పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, తెలంగాణ పర్యాటక శాఖ చైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై.. ఎల్లయ్య మృతదేహానికి నివాళులు అర్పించారు. కాగా.. ఎల్లయ్య అంత్యక్రియలను ఆయన పెద్దకుమార్తె జరిపించారు.

రేవంత్ సిసలైన లీడర్


- అంచనాలను మించి అనూహ్యంగా ఎదిగారు
- 2022 ఏప్రిల్‌కు రాష్ట్రంలో కాంగ్రెస్‌ది 3వ స్థానం
- బీఆర్ఎస్‌తో పొత్తు అంశం.. పీకే చెప్తే వద్దన్నాం
- బీజేపీకి ఈ సారి 100 సీట్లు తగ్గుతాయ్
- మోదీ పతనం ఖాయం... 2004 పునరావృతం
- 'ఆంధ్రజ్యోతి'తో కాంగ్రెస్ నేత జైరామ్ రమేశ్



న్యూఢిల్లీ, మే 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందరి అంచనాలనూ అధిగమించి అసలు సిసలైన నాయకుడుగా నిరూపించుకున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత జైరామ్ రమేశ్ కొనియాడారు. ఈ ఎన్నికల్లో ఆయన సారథ్యంలో తెలంగాణలో కాంగ్రెస్ అత్యధిక సీట్లు సాధించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. 'ఆంధ్రజ్యోతి' ఢిల్లీ ప్రతినిధితో బుధవారం ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. 2022 ఏప్రిల్ 8న.. రాజకీయ విశ్లేషకుడు ప్రశాంత్ కిషోర్ తమకు ఇచ్చిన ప్రజంటేషన్ ప్రకారం అప్పటికి తెలంగాణలో కాంగ్రెస్ మూడో స్థానంలో ఉన్నదని, బీఆర్ఎస్‌తో పొత్తు పెట్టుకుంటే కాంగ్రెస్ ఉనికి నిలబడుతుందని ఆయన సిఫారసు చేసినా తాము తిరస్కరించామని తెలిపారు. తమ అంచనాలకు అనుగుణంగానే రేవంత్ రెడ్డి సత్తా చాటారని, కాంగ్రెస్‌లో నూతనోత్తేజం కలిగించి.. అందర్నీ ఒక కుదుపు కుదిపారని జైరాం చెప్పారు. ముఖ్యమంత్రి అయిన తర్వాత.. ఉత్తమ్, భట్టి, శ్రీధర్ బాబు వంటి అనుభవజ్ఞులైన నేతలతో టీమ్ ఏర్పరచుకున్నారని, సమర్థులైన అధికారులను ఎంపిక చేసుకున్నారని ప్రశంసించారు. ఎవరికి వారి భాషలోనే జవాబు చెప్పగల సామర్థ్యం రేవంత్‌కు ఉన్నదన్నారు. రేవంత్ బంధువైన జైపాల్ రెడ్డి ఇప్పుడు జీవించి ఉంటే ఎంతో సంతోషించి ఉండేవారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ తెలంగాణలో ప్రజలకిచ్చిన హామీలన్నీ అమలు చేసి తీరుతుందని, కర్ణాటకలో ఇప్పటికే అత్యధిక హామీలను నెరవేర్చారమని ఆయన గుర్తు చేశారు. తెలంగాణలో బీఆర్ఎస్ అంతరించిపోవడం ఖాయమని చెప్పారు. ఏపీలో వైఎస్ షర్మిల ముందే కాంగ్రెస్‌లో చేరి ఉంటే ఇంకా ప్రభావం చూపేవారని జైరామ్ అభిప్రాయపడ్డారు. ఇక.. ప్రధాని మోదీ గత పదేళ్లుగా అబద్ధాలపైనే కాలక్షేపం చేస్తున్న విషయాన్ని ప్రజలు అర్థం చేసుకున్నారని ఆయన వ్యాఖ్యానించారు. మోదీకి గుజరాత్ తప్ప మరేదీ పట్టదని, ప్రతిదీ గుజరాత్‌కు మళ్లిస్తున్నారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి దక్షిణాదిన సీట్లు గతంలో వచ్చినదానికంటే సగానికిపైగా తగ్గిపోతాయని.. ఉత్తరాదిన కూడా ఆ పార్టీకి ఎదురుగాలి వీస్తోందని అంచనా వేశారు. తెలంగాణ, కర్ణాటక, రాజస్థాన్, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, బిహార్, హరియాణా, పంజాబ్, తమిళనాడు, కేరళ, ఢిల్లీ రాష్ట్రాల్లో కాంగ్రెస్ బలం పెరుగుతోందని.. 20 ఏళ్ల తర్వాత చరిత్ర పునరావృతం కాబోతోందని.. 2004 తరహాలోనే కాంగ్రెస్ 2024లో గెలవబోతోందని పేర్కొన్నారు. బీజేపీ సంఖ్యాబలం ఎవరూ ఊహించనంతగా పడిపోతోందని.. ఆ పార్టీకి కనీసం వంద సీట్లు తగ్గిపోతాయని.. ఇండియా కూటమికి స్పష్టమైన మెజారిటీ లభిస్తుందని జోస్యం చెప్పారు. ఎన్డీయేలో ఉన్న పార్టీలు కూడా ఇండియా కూటమికి మద్దతు ఇస్తాయని, దేశంలో ఏ పార్టీ మోదీ నాయకత్వాన్ని మనస్ఫూర్తిగా ఇష్టపడదని జైరామ్ పేర్కొన్నారు. మతపరంగా దేశాన్ని విభజించడమే మోదీ ఎజెండా అని దుయ్యబట్టారు. ఏప్రిల్ 19న తొలి దశ పోలింగ్ తర్వాత.. దేశంలో మోదీ ప్రభంజనం ఎక్కడా వీయడం లేదని ఆయనకు అర్థమైందని, భయం ఆయన వ్యాఖ్యల్లో స్పష్టంగా కనిపిస్తోందని, అందుకే మాటిమాటికీ అనేక అంశాల్ని మారుస్తున్నారని.. హిందూ-ముస్లిం అంశాన్ని తెరపైకి తెచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీ అహంకారమే ఆయన పతనానికి కారణమవుతుందన్నారు. అహంకారంలో ఆయనను జగద్గురువుగా.. మార్కెటింగ్ చాంపియన్‌గా అభివర్ణించారు. హిట్లర్ కాలంలో గోబెల్స్ మాదిరిగా.. అబద్ధాలను పదే పదే ప్రచారం చేస్తే ప్రజలు నమ్ముతారని ఆయన భావిస్తారని తెలిపారు. మోదీ నియంత అని.. నిజమైన తానాషాహీ అని దుయ్యబట్టారు.



నేడు భువనగిరిలో అమిత్ షా ప్రచారం



హైదరాబాద్, మే 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంమంత్రి అమిత్‌షా గురువారం భువనగిరి నియోజకవర్గంలో పార్టీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు భువనగిరిలో ఏర్పాటు చేసిన సభలో ఆయన పాల్గొంటారు. 11న వికారాబాద్, వనపర్తిల్లో నిర్వహించే ఎన్నికల ప్రచారంలో షా పాల్గొంటారు. మధ్యప్రదేశ్ సీఎం మోహన్‌యాదవ్, గురువారం ఉదయం 10 గంటలకు మెదక్ పార్లమెంటు పరిధిలోని నర్సాపూర్‌లో పార్టీ అభ్యర్థి రఘునందన్‌రావు తరఫున ప్రచారం నిర్వహించనున్నారు.

మన గెలుపును ఎవరూ ఆపలేరు!

- ఏపీలో ప్రభుత్వాన్ని మార్చాలని జనంలో కోరిక: ప్రధాని
- అత్యద్భుత విజయం సాధిస్తున్నాం
- ఇక పోలింగ్‌పై దృష్టి సారించండి
- 2 పార్టీల అధినేతలకు ప్రధాని సూచనలు



అమరావతి,రాయచోటి, మే 8 (ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రప్రదేశ్‌లో మన కూటమి అత్యద్భుత విజయాన్ని నమోదు చేయబోతోంది. కూటమి గెలుపును ఎవరూ ఆపలేరు' అని ప్రధాని మోదీ ప్రకటించారు. బుధవారం విజయవాడ నగరంలో రోడ్ షో ముగిసిన తర్వాత ఆయన పది నిమిషాల పాటు టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌లతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో ఘన విజయాన్ని సాధించబోతున్నారంటూ వారిద్దరినీ అభినందించారు. 'రాష్ట్రంలోని ప్రజల్లో అవధుల్లేని ఉత్సాహాన్ని చూస్తున్నాను. ప్రభుత్వాన్ని మార్చాలన్న బలమైన కోరిక ఉన్నప్పుడే ప్రజల్లో ఇంత దూకుడు కనిపిస్తుంది. కూటమి పట్ల వారి మొగ్గు స్పష్టంగా కనిపిస్తోంది. మామూలు విజయం కాదు... చాలా పెద్ద విజయాన్ని మీరు సాధించబోతున్నారు. ఈ రోజు రోడ్‌షో బ్రహ్మాండంగా జరిగింది' అని ఆయన వారితో అన్నారు. ప్రజల్లో ఉన్న ఈ సానుకూలతను సంపూర్ణంగా అందుకోవడానికి పోలింగ్ రోజు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పోలింగ్ శాతం బాగా పెరగాలన్నారు. 'ఉదయం ఏడు నుంచి పది గంటల్లోపు వీలైనంత ఎక్కువ ఓటింగ్ జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలి. కార్యకర్తలు, అభ్యర్థులను ఈ విషయంలో అప్రమత్తం చేయండి' అని వారికి సూచించారు.

వైసీపీకి కౌంట్ డౌన్ మొదలు!

రాష్ట్రంలో ప్రస్తుతం ప్రజారాజ్యం నడవడం లేదు.. మాఫియా రాజ్యం నడుస్తోందని ప్రధాని మోదీ మండిపడ్డారు. వైసీపీకి కౌంట్‌డౌన్ మొదలైందని ప్రకటించారు. ఇసుక మాఫియా వల్లే అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయిందని.. 39 మంది చనిపోయారని.. 26 గ్రామాలు దెబ్బతిన్నాయని.. ఇది విని ఆందోళన చెందానని తెలిపారు. రాష్ట్రంలో మంత్రులు రౌడీ, గూండాయిజం చేస్తున్నారని.. మాఫియాకు ప్రభుత్వ మద్దతు ఉందని.. మాఫియాకు ఎన్డీయే సర్కార్ గట్టిగా బుద్ధి చెబుతుందని స్పష్టం చేశారు. కూటమి అభ్యర్థులకు మద్దతుగా అన్నమయ్య జిల్లా కలికిరిలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో ప్రధాని ప్రసంగించారు.

ఆస్తుల్లేని మోదీ మహనీయుడు

- దొంగల ముఠా నేత రాహుల్: బండి సంజయ్



సిరిసిల్ల, మే 8 (ఆంధ్రజ్యోతి): 'మోదీని కించపరుస్తున్న కాంగ్రెస్ నేతల్లారా ఖబడ్దార్.. మోదీ మొండి మొలోడు కాదు. ఈ దేశాన్ని భ్రష్టు పట్టించిన కాంగ్రెస్‌ను మెడలు పట్టి బయటకు గెంటేసిన జగమొండి. మోదీకి ఆస్తిపాస్తులు, బ్యాంకు బ్యాలెన్స్‌లు లేవు. ప్రధాని పదవి వద్దనుకుంటే జబ్బకు సంచి వేసుకొని పోయే మహనీయుడు మోదీ' అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ అభ్యర్థి బండి సంజయ్ అన్నారు. బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో బీజేపీ జనసభలో ఆయన మాట్లాడారు. "370 ఆర్టికల్ రద్దు. త్రిపుల్ తలాక్ రద్దు. అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ. దేశవ్యాప్తంగా ప్రజలందరికీ కరోనా వ్యాక్సిన్ పంపిణీ. మూతపడిన రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ పునరుద్ధరణ. కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు రూ.12 వేల కోట్లు విడుదల" ఇవన్నీ మోదీ హయాంలోనే జరిగాయని, ఆయనెప్పుడూ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని కొనియాడారు. కాశీ విశ్వేశ్వరుడి ప్రతిరూపమే మోదీ అని, దేశచరిత్రలో తొలిసారి దక్షిణ కాశీకి విచ్చేసిన నాయకుడు మోదీ మాత్రమేనని పేర్కొన్నారు. ఆరు గ్యారెంటీల గురించి అడిగితే కాంగ్రెస్ నేతలు తెలంగాణ ప్రజలకు గాడిద గుడ్డు చూపిస్తున్నారని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే పెద్ద గాడిద గుడ్డు అని విమర్శించారు. దేశాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్తున్న ఆరడుగుల బుల్లెట్ నరేంద్ర మోదీ కావాలో?, దొంగల ముఠా నేత రాహుల్ గాంధీ కావాలా? ప్రజలే తేల్చుకోవాలన్నారు.

బీజేపీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రేమేందర్ రెడ్డి



హైదరాబాద్, హనుమకొండ టౌన్, మే 8 : వరంగల్-ఖమ్మం-నల్లగొండ పట్టభద్రుల ఉప ఎన్నిక ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థిగా హనుమకొండ జిల్లా దామెరకు చెందిన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి పేరు ఖరారైంది. ఈమేరకు బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ బుధవారం అధికారికంగా ప్రకటించింది. ఈ స్థానం నుంచి పోటీ చేయడానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కాసం వెంకటేశ్వర్లు, ప్రకాశ్‌రెడ్డి ప్రయత్నం చేయగా, వారిని కాదని గుజ్జుల పేరును ప్రకటించింది. 2021లో జరిగిన పట్టభద్రుల ఎన్నికల్లో పార్టీ ప్రేమేందర్‌రెడ్డిని పోటీకి దింపగా ఓటమి పాలయ్యారు. మళ్లీ ఆయన్నే అభ్యర్థిగా బరిలోకి దింపారు. కాగా, గుజ్జుల గురువారం తన నామినేషన్ దాఖలు చేయనున్నారు.

మోదీ అనుచిత వ్యాఖ్యలపై చర్యలు చేపట్టండి

- సీఈసీకి కాంగ్రెస్ నేత ఫిర్యాదు

హైదరాబాద్, మే 8(ఆంధ్రజ్యోతి): కరీంగనగర్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారసభలో ప్రధాని మోదీ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఏఐసీసీ సభ్యుడు జి.నిరంజన్ ఆరోపించారు. మోదీ చేసిన ప్రసంగాన్ని పరిశీలించి తగిన చర్యలు చేపట్టాలని కోరుతూ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్‌కుమార్‌కు బుధవారం ఆన్‌లైన్ ద్వారా నిరంజన్ ఫిర్యాదుచేశారు. ప్రధాని తన ప్రసంగంలో కాంగ్రెస్‌పై నిరాధార ఆరోపణలు చేయడంతోపాటు కాంగ్రెస్ నేతలపై తీవ్ర విమర్శలు చేశారని అందులో పేర్కొన్నారు. అంతేగాక దివంగత ప్రధాని పీవీ.నరసింహారావుపై తీవ్రస్థాయిలో వ్యాఖ్యలు చేశారన్నారు. వీటిపై ఎన్నికల సంఘం స్పందించాలని, మోదీపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

తమిళిసైపై ఈసీకి ఫిర్యాదు

హైదరాబాద్, మే 8(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో భాగంగా.. మాజీ గవర్నర్, బీజేపీ నేత తమిళిసై ఓటర్లను ప్రలోభపెట్టే ప్రయత్నంచేశారని, ఆమెకు వ్యతిరేకంగా చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) రాజీవ్‌కుమార్‌కు, సీఈవో వికాస్‌రాజ్‌కు బీఆర్ఎస్‌పార్టీ నేతలు ఫిర్యాదుచేశారు. బుధవారం ఈ మేరకు సీఈఓ కార్యాలయంలో ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఆన్‌లైన్ ద్వారా సీఈసీకి, సీఈవోకు ఫిర్యాదు పంపారు. ఇటీవల సికింద్రాబాద్ నియోజకవర్గంలో ప్రచారం చేసిన ఆమె.. అయోధ్య రామమందిరాన్ని పోలిన ప్రతిమలను ఓటర్లకు బహూకరించారని అందులో పేర్కొన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించారని, ఈసీ తక్షణమే చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నేతలు డిమాండ్ చేశారు.

అదానీ, అంబానీ నుంచి ఎంత ముట్టింది?

(మొదటిపేజీ తరువాయి)

వస్తోందన్నారు. 'వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు సాగురంగాన్ని ఆధునీకరిస్తున్నాం. నానో యూరియా, డ్రోన్ల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నాం. కిసాన్ సమ్మాన్ నిధి, ఫసల్ బీమా అమలు చేస్తున్నాం. ప్రతీ ఇంటికీ అభివృద్ధి ఫలాలు అందేలా కృషిచేస్తున్నాం. టెక్స్‌టైల్ పార్కులు అభివృద్ధి చేస్తున్నాం. మీ ఒక్క ఓటుతో.. ఐదో అతిపెద్ద ఆర్థిక శక్తిగా భారత్ ఎదిగింది. 370 ఆర్టికల్ రద్దు చేశాం. రక్షణ రంగంలో ఉత్పత్తులను దిగుమతి చేసుకునే స్థాయి నుంచి ఎగుమతి చేసే స్థాయికి ఎదిగాం. ఇవన్నీ చేసింది నేను కాదు.. మీరిచ్చిన ఓటు బలం' అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

విజయపథంలో బీజేపీ

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయపథంలో దూసుకుపోతోందని, మూడో దశలో ఇది స్పష్టమైందని మోదీ తెలిపారు. కాంగ్రెస్, ఇండీ (ఇండియా) కూటమి వ్యూహం ఊడిపోయిందని ఎద్దేవా చేశారు. ఈ మూడు దఫాల్లో ఎక్కడ గెలిచే అవకాశం ఉందో తెలుసుకోవడానికి కాంగ్రెస్ నాయకులు భూతద్దం పెట్టి వెతుకుతున్నారని, ఇక నాలుగో దశలో ఆ పార్టీకి భూతద్దం కూడా సరిపోదు.. మైక్రోస్కోప్ అవసరం అని పేర్కొన్నారు. ఇండీ కూటమి ఐదేళ్లు, ఐదుగురు పీఎంలు ఫార్ములాతో వస్తోందని.. కూటమిలోని ప్రతీ పార్టీ నుంచి ఏటా ఒకరు ప్రధానిగా ఉండాలని వారు నిర్ణయించుకున్నట్లు ప్రచారం జరుగుతోందన్నారు. ఏడాదికో ప్రధాని ఉంటే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోండి అని హెచ్చరించారు. మీ పిల్లల భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలన్నా, వికసిత్ భారత్, వికసిత్ తెలంగాణ లక్ష్యం నెరవేరాలన్నా ఫిర్ ఏక్ బార్ మోదీ సర్కార్ కావాలని మోదీ పిలుపునిచ్చారు.

మతపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగం వ్యతిరేకం

మతపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగం వ్యతిరేకమని మోదీ పేర్కొన్నారు. ఎస్సీ ఎస్టీ, బీసీల రిజర్వేషన్‌లు లాక్కుని ముస్లింలకు ఇవ్వాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తోందన్నారు. తెలంగాణలో మాదిగలకు రిజర్వేషన్‌లు ఇవ్వడానికి కూడా కాంగ్రెస్ వ్యతిరేకంగా ఉందని, రిజర్వేషన్‌లను రద్దుచేస్తే చూస్తూ ఊరుకుంటారా? అని ప్రశ్నించారు. ఎస్సీ వర్గీకరణ చేసి తీరుతామని, ఈ మేరకు మంద కృష్ణ మాదిగకు, మాదిగ సమాజానికి ఇచ్చిన మాట మర్చిపోనని మోదీ తెలిపారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒకే తాను ముక్కలు

బీఆర్ఎస్, కాంగ్రెస్‌లు కుటుంబ పార్టీలని, ఆ రెండు పార్టీలను కలిపేది అవినీతి, బుజ్జగింపు రాజకీయాలు, జీరో గవర్నెన్స్ (పాలనా శూన్యత) అని విమర్శించారు. ఈ రెండు పార్టీలు ఒకే తాను ముక్కలు.. నాణేనికి బొమ్మా బొరుసు.. వీరి నుంచి తెలంగాణను కాపాడుకోవాల్సిన అవశ్యకత ఉందని అన్నారు. బీజేపీకి మాత్రం దేశం తర్వాతే కుటుంబమని తెలిపారు. అవినీతిలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లది ఫెవికాల్ బంధమని.. బహిరంగంగా ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటారు కానీ తెరవెనుక మాత్రం వారిది అవినీతి సిండికేట్ అని పేర్కొన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్.. ఓటుకు నోటు కేసుపై ఎందుకు దర్యాప్తు కొనసాగించలేదు? కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆరోపణలు చేసిన కాంగ్రెస్, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత హడావుడి తప్ప ఏం చేసింది? అని మోదీ నిలదీశారు. కాళేశ్వరం వ్యవహారంలో బీఆర్ఎస్‌ను కాంగ్రెస్ రక్షిస్తోందన్నారు. దేశవ్యాప్తంగా సూపర్‌హిట్ అయిన ట్రిపుల్ ఆర్ సినిమాకు రూ.వెయ్యి కోట్ల కలెక్షన్ వచ్చిందని, కానీ, తెలంగాణలో జరుగుతున్న డబుల్ ఆర్ ట్యాక్స్ వసూళ్లు నాలుగైదు నెలల్లోనే దీనిని మించిపోయాయని మోదీ ఎద్దేవా చేశారు. డబుల్ ఆర్‌లో ఒక ఆర్ తెలంగాణను దోచుకుంటూ ఢిల్లీలోని మరో ఆర్‌కు కప్పం కడుతోందన్నారు. వరంగల్‌లో ఏర్పాటు చేస్తున్న టెక్స్‌టైల్ పార్కు నుంచి కూడా డబుల్ ఆర్ ట్యాక్స్ కోసం కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని మోదీ ఆరోపించారు. అబద్ధాలు చెప్పడంలో కాంగ్రెస్ మాస్టర్ అని మోదీ విమర్శించారు. ఆ పార్టీ అగ్రనేత జన్మదినం సందర్భంగా రైతుల రుణమాఫీ చేస్తామని మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రచారం చేసి, ఇప్పుడు పంద్రాగస్టు అని చెబుతున్నారని పేర్కొన్నారు. సనాతన ధర్మాన్ని విమర్శించే వాళ్లు, రుణమాఫీని పంద్రాగస్టు నాటికి అమలు చేస్తామని వేములవాడ రాజన్నపై ఒట్టుపెట్టుకుంటున్నారని మోదీ విమర్శించారు. హైదరాబాద్‌ను కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ఎంఐఎంకు లీజుకిచ్చాయని విమర్శించారు.





వేములవాడ దేవస్థానంలో నందిని దర్శించుకుంటున్న ప్రధాని మోదీ; వేములవాడ బీజేపీ జనసభకు హాజరైన జనం

వేములవాడలో మోదీ ప్రత్యేక పూజలు

బుధవారం ఉదయం 9.20 గంటలకు వేములవాడకు చేరుకున్న ప్రధాని మోదీ తొలుత రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేశారు. కోడె మొక్కును చెల్లించుకున్నారు. అరగంటపాటు ఆలయంలో గడిపారు. ప్రధానికి అర్చకులు రాజన్న ప్రసాదాన్ని, శేషవస్త్రాలను అందించారు. ప్రధాని హోదాలో వేములవాడ ఆలయాన్ని దర్శించుకున్న తొలి నేతగా మోదీ నిలిచారు. మాజీ ప్రధాని పీవీ వేములవాడ దేవస్థానం ధర్మకర్తల మండలి ధర్మకర్తగా ఉన్నప్పటికీ ప్రధాని హోదాలో స్వామివారిని దర్శించుకోలేదు.

తెలంగాణ తలుపులతో రామమందిరానికి శోభ

సంస్కృతీ సంప్రదాయాలకు, భక్తిశ్రద్ధలకు తెలంగాణ నిలయమని ప్రధాని మోదీ కొనియాడారు. అయోధ్య రామమందిరానికి తెలంగాణ నుంచి వచ్చిన తలుపులు ప్రత్యేక శోభనిస్తున్నాయన్నారు. రామమందిరం పూర్తికావడం మనందరికీ సంతోషం కలిగిస్తుంటే, కాంగ్రెస్‌కు మాత్రం ఈర్ష్య కలిగిస్తోందని విమర్శించారు. 'సుప్రీం కోర్టు తీర్పు ద్వారా రామమందిరం నిర్మించాం. అధికారంలోకి వస్తే అదే కోర్టు తీర్పును పునస్సమీక్షించాలని కాంగ్రెస్ భావిస్తోంది. రామమందిరానికి తాళం వేయాలని యోచిస్తోంది' అని ఆరోపించారు. రామమందిరాన్ని కాపాడుకుందాం.. కాంగ్రెస్‌కు గుణపాఠం చెబుదాం అని పిలుపునిచ్చారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు చెందిన మూడు తరాల కుటుంబసభ్యులను కలుసుకోవడం తనకు సంతోషం కలిగించిందని మోదీ చెప్పారు. పీవీని కాంగ్రెస్ అవమానించిందని, కానీ, తమ ప్రభుత్వం పీవీని భారతరత్నతో గౌరవించిందన్నారు. చివరగా.. మీరు నా వ్యక్తిగత పని ఒకటి చేసి పెడతారా? అంటూ బీజేపీ కార్యకర్తలను ప్రశ్నించిన మోదీ, తాను నమస్కారం చేసినట్లు ఇంటింటికీ వెళ్లి చెప్పాలని కోరారు.

మందకృష్ణకు ఆలింగనం

వరంగల్ సభలో మోదీ వేదికపైకి వెళ్లిన తర్వాత అక్కడ నిల్చొని ఉన్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ వద్దకు వెళ్లి ఆయనను ఆలింగనం చేసుకున్నారు. దీంతో సభ ఒక్కసారిగా మోదీ నినాదాలతో మార్మోగింది. మోదీ ప్రసంగాన్ని ప్రారంభిస్తూ.. తన కర్మభూమి అహ్మదాబాద్‌తోపాటు ఇక్కడ వరంగల్‌లో కూడా భద్రకాళి ఉన్నారని పేర్కొంటూ.. భద్రకాళికి ప్రణామాలని చెప్పారు.

జనసందోహాన్ని చూసి మోదీ ఫిదా

వేములవాడలో ఉదయం పదిన్నరకు మోదీ వేదిక వద్దకు చేరుకోగా అప్పటికే ఆ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. అయినా కూడా బయటి నుంచి జనం తరలి వస్తూనే ఉన్నారు. ఈ జనసందోహాన్ని చూసి మోదీ ఫిదా అయ్యారు. 'గుజరాత్‌లో ఏళ్లపాటు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొన్నా. మూడుసార్లు సీఎంగా చేశా. కానీ, ఎప్పుడు కూడా ఉదయం పది గంటలకే జనం ఇంతగా తరలిరావటం చూడలేదు. ఈ విధంగా సభ నిర్వహణ నాకు గుజరాత్‌లో కూడా సాధ్యం కాలేదు. మీరు నా పట్ల చూపిన అభిమానానికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నా' అని పేర్కొన్నారు. సభను విజయవంతంగా నిర్వహించినందుకు కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌ని మోదీ ప్రత్యేకంగా అభినందించారు.

'రిజర్వేషన్'పై కాంగ్రెస్ ప్రచారం ఫెయిల్

- అబద్ధాల ప్రచారంలో ఆ రెండు పార్టీలు దిట్ట : కిషన్‌రెడ్డి



హైదరాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్‌ల వ్యవహారంపై కాంగ్రెస్ చేసిన తప్పుడు ప్రచారం ఫెయిల్ అయ్యిందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డి అన్నారు. వెనుకబడిన వర్గాల నుంచి వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ.. రిజర్వేషన్‌లు తొలగించరనే విశ్వాసం ప్రజల్లో ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో అత్యధిక ఎంపీ స్థానాలను బీజేపీ గెలువబోతోందని, దీనిపై ఎటువంటి అనుమానాలూ లేవని చెప్పారు. "గతంలో ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి అవకాశం ఇచ్చారు. అంతకుముందు పదేళ్లు కాంగ్రెస్‌కు పీఠాన్నిచ్చారు. ఈసారి మెజారిటీ ఓట్లు, సీట్లు బీజేపీకే వేయాలని నిశ్చయించుకున్నారు. ఇది చూసి కాంగ్రెస్‌లో కలవరం పెరిగింది. సీఎం రేవంత్ రెడ్డి ప్రసంగాల్లో అభద్రతాభావం, అసహనం కనబడుతోంది" అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఇద్దరు, ముగ్గురు జర్నలిస్టులను జైల్లో వేస్తే బుద్ధి వస్తుందన్న రేవంత్ రెడ్డి ప్రకటనలు.. ఆయన అహంకారానికి నిదర్శనమని విమర్శించారు. ప్రధానమంత్రి స్వయంగా.. తన కంఠంలో ప్రాణం ఉన్నంతవరకు రిజర్వేషన్లపై ఎలాంటి ఆందోళన అక్కర్లేదని చెప్పినా దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అబద్ధాల ప్రచారంలో కల్వకుంట్ల కుటుంబానికి, రేవంత్‌కు ఆస్కార్ అవార్డు ఇవ్వొచ్చన్నారు. కాంగ్రెస్ ఎన్ని డబ్బులు పంచినా.. ఈ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ రెండంకెల మార్కు దాటడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ 10వ తేదీన హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించే బహిరంగసభలో పాల్గొంటారని తెలిపారు.

చిన్నవానకే 10 గంటలు కరెంట్ పోతదా?

(మొదటిపేజీ తరువాయి)

ఆరోపించారు. మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా బుధవారం హైదరాబాద్ శివారు దుండిగల్ ఔటర్ రింగ్ రోడ్డు చౌరస్తా వద్ద, మెదక్ అభ్యర్థి వెంకట్రామ్ రెడ్డి గెలుపు కాంక్షిస్తూ మెదక్ జిల్లా నర్సాపూర్, పటాన్‌చెరులలో నిర్వహించిన రోడ్ షోల్లో ఆయన మాట్లాడారు. నాలుగైదు నెలల్లోనే రాష్ట్రంలో పరిస్థితులు దారుణంగా మారిపోయాయన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బ్రహ్మాండంగా తాగునీటి సరఫరా చేశామని, ఇప్పుడు నీటి సరఫరా ఎందుకు తగ్గిందని, నీటి ట్యాంకర్లు ఎందుకు తిరుగుతున్నాయో ప్రజలు అర్థం చేసుకోవాలని కోరారు. బీఆర్ఎస్ హయాంలో ఏనాడూ హైదరాబాద్, హెచ్ఎండీఏ పరిధిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పడిపోలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత నగరం, చుట్టు పక్కల ప్రాంతాల్లో భూముల ధరలు పడిపోయాయని, రియల్ ఎస్టేట్ వ్యాపారం ఆగిపోయిందని, ఐటీ రంగం కుదేలైందని ఆరోపించారు. ఇదంతా సీఎం రేవంత్‌రెడ్డి చలవే అని అన్నారు. చదరపు గజానికి రూ.75 రూపాయలు సీఎంకు కప్పం కడితేనే హెచ్ఎండీఏ అనుమతులు జారీ చేస్తామని బెదిరిస్తున్నారని, అందుకే ఐదునెలలుగా అనుమతులు నిలిపివేశారని ఆరోపించారు. నిర్మాణ రంగ సంస్థల నుంచి చదరపు అడుగుకు ఇంత అని ఆర్ఆర్ ట్యాక్స్ వసూలు చేసి రేవంత్‌రెడ్డి ఢిల్లీకి కప్పం కడుతున్నారని స్వయంగా ప్రధాని మోదీ చెప్పారని గుర్తు చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా తనను తిట్టుడు తప్ప మరో పని సీఎంకు చేతకావడం లేదని విమర్శించారు. తన చెడ్డీ సైతం గుంజుకుంటా అని అన్నారని, అది ఏం చేసుకుంటారో తనకు అర్థం కావడం



లేదన్నారు. వరినాట్లు పడకముందే రైతు బంధు ఇవ్వాల్సి ఉండగా, కోతలయ్యాక కూడా ఇంకా పూర్తి స్థాయిలో ఇవ్వలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప.. ఏ ఒక్కటీ అమలు చేయడంలేదని విమర్శించారు. తెలంగాణ కోసం పేగులు తెగే దాక కొట్లాడే పార్టీ బీఆర్ఎస్ అని, 12 మంది తమ అభ్యర్థులను గెలిపిస్తే పార్లమెంట్‌లో రాష్ట్ర హక్కుల గురించి కొట్లాడుతారని, నిధులు తీసుకొస్తారని చెప్పారు. ఊపిరి ఉన్నంత వరకు రాష్ట్ర ప్రజల కోసం కొట్లాడుతానని, జైళ్లు, కేసులు తనకు కొత్త కాదని, అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న తెలంగాణను ఆగం చేస్తే సహించబోనని కేసీఆర్ అన్నారు.

విశ్వగురువు చేసిందేంటి?

విశ్వగురువు అని చెప్పుకునే ప్రధాని మోదీ అంతర్జాతీయంగా దేశం ప్రతిష్ఠ దిగజార్చుతున్నారని కేసీఆర్ ఆరోపించారు. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 84కు పడిపోయిందని, దేశంలో విదేశీ మారక నిల్వలు తగ్గాయని, దిగుమతులు పెరిగాయని, ఎగుమతులు తగ్గాయన్నారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేస్తే అమెరికా నిరసన వ్యక్తం చేసిందని, ఇది దేశ ప్రతిష్ఠకు మంచిది కాదన్నారు. బీజేపీ వాళ్లు ఊదితే కొట్టుకుపోయే పాకిస్తాన్ పేరు చెప్పి రాజకీయ పబ్బ గడుపుకుంటున్నారని ఆరోపించారు. పదేళ్లలో 150 వాగ్దానాలు చేసి ఏ ఒక్కటి అమలు చేయలేదన్నారు. మోదీ చెప్పిన అచ్ఛేదిన్ ఏమో కాని మనం సచ్చేదినాలు వచ్చాయన్నారు. ఐటీఐఆర్‌ను మోదీ రద్దు చేశారని, 400 మెగావాట్ల సీలేరు విద్యుదుత్పత్తి ప్లాంట్‌ను ఆంధ్రకు అప్పగించారని, తెలంగాణకు దక్కాల్సిన కృష్ణా, గోదావరి జలాలను తమిళనాడుకు తరలించేందుకు కుట్ర పన్నుతున్నారని, ఇంత అన్యాయం చేస్తున్న బీజేపీకి ఎందుకు ఓటెయ్యాలో ఆలోచించాలని కేసీఆర్ కోరారు.

సీఎంగా రేవంత్ పనికిరారు

- 12 ఎంపీ సీట్లు ఇస్తే శాసించేది కేసీఆరే
- రాజకీయ కక్షతోనే కవిత అరెస్టు: కేటీఆర్

నాగర్‌కర్నూల్/గద్వాల/సైదాబాద్, మే 8 (ఆంధ్రజ్యోతి): "ఆరు గ్యారెంటీల పేరిట ప్రజలను మోసగించిన రేవంత్‌రెడ్డి సీఎంగా పనికి రారు. ప్రజాస్వామ్యయుతమైన పదవిలో ఉండి పేగులు మెడలో వేసుకుంటా.. పొడుస్తా అని మాట్లాడటం ఎంతవరకు సమంజసం. జేబులో కత్తెర పెట్టుకొని తిరుగుతున్నానని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డికి జేబు దొంగలకు తేడా ఏముంది?లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రం నుంచి 12 ఎంపీ స్థానాల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించండి. ఆరు నెలల్లో రాష్ట్ర రాజకీయాలను శాసించేంది కేసీఆరే" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బుధవారం ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి, అచ్చంపేట, జోగుళాంబ గద్వాల జిల్లా గద్వాలల్లో జరిగిన రోడ్‌షోల్లో పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వాన్ని నడపడమంటే పాన్ డబ్బా కాదనే విషయాన్ని రేవంత్‌రెడ్డి గ్రహించాలన్నారు. పచ్చి అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను, దేవుళ్ల పేరు చెప్పి ఓట్లు కొల్లగొట్టాలనుకుంటున్న బీజేపీకి తెలంగాణ ప్రజానీకం గట్టిగా గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని అత్యంత బ్రహ్మాండంగా నిర్మించారని, అయినా తాము దేవుళ్ల పేరు చెప్పి ఓట్లు అడగడం లేదన్నారు. పాలనా సౌలభ్యం కోసం చేసిన జిల్లాలను రేవంత్‌రెడ్డి తీసేసి పార్లమెంటుకో జిల్లా పెడుతా అంటున్నారని, అదే జరిగితే జిల్లాలో కొనసాగుతున్న మెడికల్ కాలేజీలు, జిల్లా ఆస్పత్రులు పోతాయని పేర్కొన్నారు. రూ.2 లక్షల రుణమాఫీని డిసెంబరు 9న మాఫీ చేస్తానని చెప్పిన ముఖ్యమంత్రి.. ఇప్పుడు ప్రమాణాలతో నెట్టుకొస్తున్నారని విమర్శించారు. బీజేపీతో తమ పార్టీకి లోపాయికారి ఒప్పందం ఉన్నదంటూ కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు కేటీఆర్ తిప్పికొట్టారు. 'రాజకీయ కక్షసాధింపుతోనే అబద్ధపు మద్యం కుంభకోణం కేసులో తన సోదరి(కవిత)ని అరెస్టు జైల్లో పెట్టారు. ఇలాంటప్పుడు బీజేపీతో మా పార్టీకి ఒప్పందం ఎలా ఉంటుంది? బీజేపీతో మా పార్టీ ఎప్పుడూ పొత్తు పెట్టుకోదు. ఎలాంటి ఒప్పందాలూ చేసుకోదు' అని కేటీఆర్ స్పష్టం చేశారు.

క్రిశాంక్ అరెస్టు అప్రజాస్వామికం

బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ క్రిశాంక్ అరెస్టు ప్రజాస్వామికమని, సీఎం రేవంత్ రెడ్డి అధికార దుర్వినియోగంతో తప్పుడు కేసు పెట్టించారని కేటీఆర్ ఆరోపించారు. చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్న క్రిశాంక్‌ను బుధవారం కేటీఆర్ పరామర్శించారు. ఓయూలో మెస్ అంశానికి సంబంధించి క్రిశాంక్ పెట్టిన సర్క్యులర్ తప్పైతే తాను చంచల్‌గూడ జైలుకు వెళ్లడానికి సిద్ధమేనని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి పెట్టిన సర్క్యులర్ ఫేక్ అని తాము రుజువు చేస్తే ఆయన జైలులో కూర్చుంటారా? అంటూ సవాల్ విసిరారు. తన భర్త చేయని తప్పునకు రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు కేసులు పెట్టి వేధిస్తోందని క్రిశాంక్ భార్య సుహాసిని ఆరోపించారు. జైలులో కేటీఆర్‌తో పాటు ఆమె కూడా క్రిశాంక్‌ను కలిసి మాట్లాడారు.



నాగర్‌కర్నూలు జిల్లా కల్వకుర్తి కార్నర్ మీటింగ్‌లో కేటీఆర్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

బీజేపీ, కాంగ్రెస్ గాడిదగుడ్డునిచ్చాయి

రాష్ట్రానికి ఆ పార్టీలు చేసిందేమీ లేదు: హరీశ్

సిద్దిపేట టౌన్, మే 8: బీజేపీ, కాంగ్రెస్ రెండు పార్టీలు తెలంగాణకు గాడిద గుడ్డునిచ్చాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ఆ రెండు పార్టీలు చేసిందేమీ లేదని విమర్శించారు. బుధవారం సిద్దిపేట పట్టణంలోని శివానుభవ మండపంలో హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డికి రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఆర్ఎంపీ, పీఎంపీలు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక పాలన రివర్స్ గేర్‌లో నడుస్తోందన్నారు. రియల్ ఎస్టేట్ రంగం కుదేలయిందని, విద్యుత్ కోతలు మొదలయ్యాయని, ఇంకా పూర్తిస్థాయిలో రైతుబంధు ఇవ్వలేదని.. మార్పు అంటే ఇదేనా అని ప్రశ్నించారు. రాహుల్‌గాంధీ తెలంగాణకు వచ్చి ఆరు గ్యారెంటీలు అమలు చేశామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.


రామోజీరావు కుమారుడు కిరణ్‌ను ఓదారుస్తున్న చంద్రబాబు


రామోజీ సతీమణికి నమస్కరిస్తున్న మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు


రామోజీరావు పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న ఆంధ్రజ్యోతి ఎండీ రాధాకృష్ణ, సుప్రీం మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ



రైతు కుటుంబం నుంచి పద్మవిభూషణ్ దాకా!

1962లోనే మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు శంకుస్థాపన

1974 ఆగస్టు 10న ఈనాడు దినపత్రిక ప్రారంభం

చెరుకూరి రామోజీరావు ప్రస్థానం అనితరసాధ్యం



రామోజీ గ్రూపు సంస్థల చైర్మన్‌గా, దిగ్గజ వ్యాపారవేత్తగా, సినీ నిర్మాతగా అనితర సాధ్యమైన ప్రయాణం సాగించిన రామోజీరావుది సాధారణ మధ్య తరగతి రైతు కుటుంబం. కృష్ణా జిల్లాలోని పెదపారుపూడి గ్రామానికి చెందిన చెరుకూరి వెంకటసుబ్బారావు, వెంకట సుబ్బమ్మ దంపతుల కుమారుడైన రామోజీరావు.. 1936 నవంబరు 16న జన్మించారు. గుడివాడలోని మునిసిపల్ ఉన్నత పాఠశాలలో 1947లో 8వ తరగతిలో చేరి, సిక్స్ ఫాం వరకు అక్కడే చదివారు. గుడివాడ కళాశాలలో ఇంటర్మీడియట్, బీఎస్సీ పూర్తి చేశారు. ఢిల్లీలోని ఓ యాడ్ ఏజెన్సీలో ఆర్టిస్ట్‌గా తొలి ఉద్యోగం చేశారు. 1961ఆగస్టు 19న రమాదేవిని వివాహం చేసుకున్నారు. 1962లో హైదరాబాద్ వచ్చిన రామోజీరావు.. అదే ఏడాది మార్గదర్శి చిట్‌ఫండ్స్‌కు శంకుస్థాపన చేశారు. 1965లో కిరణ్ యాడ్స్ పేరిట మరో సంస్థను ప్రారంభించారు. 1969లో రైతుల కోసం అన్నదాత పత్రికను ప్రారంభించారు. 1970లో ఇమేజెస్ అవుట్‌డోర్ అడ్వర్టైజింగ్ ఏజెన్సీకి శ్రీకారం చుట్టారు. 1972-73లో విశాఖలో డాల్ఫిన్ హోటల్‌ను నిర్మించి, ప్రారంభించారు. 1974 ఆగస్టు 10వ తేదీన విశాఖ వేదికగా ఈనాడు దినపత్రికకు శ్రీకారం చుట్టారు. 1975 డిసెంబరులో 'ఈనాడు'ను హైదరాబాద్‌కు తీసుకొచ్చారు. 1976లో సినీ ప్రేమికుల కోసం సితార, 1978లో విపుల, చతుర మాసపత్రికలను ప్రారంభించారు. 1980లో ప్రియా ఫుడ్స్ పేరిట నోరూరించే పచ్చళ్లను తయారు చేసి, ప్రపంచ వ్యాప్తంగా పరిచయం చేశారు. 1983లో ఉషాకిరణ్ మూవీస్ సంస్థను ప్రారంభించారు. 1992-93 మధ్య ఈనాడు ద్వారా సారాపై సమరం ప్రకటించిన రామోజీరావు.. మద్య నిషేధంపై ఉత్తర్వులు వచ్చే వరకూ పోరాడారు. ప్రపంచంలోనే అతి పెద్ద సినీ స్టూడియోగా పేరుగాంచిన రామోజీ ఫిల్మ్ సిటీని 1996లో స్థాపించారు. 2002లో ఈటీవీ ఆరు ప్రాంతీయ చానళ్లను ప్రారంభించి, టీవీ రంగంలో సరికొత్త మార్పునకు నాంది పలికిన రామోజీరావును బీడీ గోయెంకా అవార్డు, యుధ్‌వీర్ అవార్డు వరించాయి. 2016లో కేంద్ర ప్రభుత్వం ఆయనకు ప్రతిష్ఠాత్మకమైన పద్మవి

ప్రముఖుల నివాళులు


డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క


తాజా మాజీ కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్


మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్


నివాళులర్పిస్తున్న చిరంజీవి


జనసేన అధినేత పవన్ కల్యాణ్

అక్షరయోధుడి అస్తమయం

(మొదటిపేజీ తరువాయి)


చికిత్స అందించారు. అత్యవసర యాంజియోగ్రామ్ చేయడంతో పాటుగా స్టెంట్ వేశారు. అయినప్పటికీ ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో శనివారం తెల్లవారుజామున 4.51 గంటలకు రామోజీరావు తుది శ్వాస విడిచారని స్టార్ హాస్పిటల్ ప్రకటించింది. కాగా, అనంతరం రామోజీరావు పార్థివదేహాన్ని ఫిలింసిటీకి తరలించారు. ఆదివారం ఉదయం 9-10 గంటల మధ్యలో ఫిలింసిటీలోని స్మృతివనంలో రామోజీరావు అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆయన అంత్యక్రియలను అధికారిక లాంఛనాలతో నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. సీడబ్ల్యూసీ సమావేశాల కోసం ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి అక్కడి నుంచే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిని ఈ మేరకు ఆదేశించారు. ఏర్పాట్లను పర్యవేక్షించాల్సిందిగా రంగారెడ్డి జిల్లా కలెక్టర్, సైబరాబాద్ కమిషనర్‌లకు సీఎస్ సూచించారు. రామోజీరావు మరణవార్త తెలిసిన వెంటనే 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' సంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ ఫిలింసిటీకి వెళ్లి నివాళులర్పించారు. రామోజీ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. కాగా, అజరామర చిత్రాలను నిర్మించడంతో పాటు సినీ రంగానికి ఫిలిం సిటీ లాంటి అద్భుతాన్ని అందించిన రామోజీరావుకు నివాళిగా ఆదివారం షూటింగ్‌లను నిలిపివేయాలని తెలుగు చిత్ర పరిశ్రమ నిర్ణయించింది.


రామోజీరావు పార్థివదేహం

ఫిలింసిటీలో ఘనంగా నివాళులు..

రామోజీరావును కడసారి చూసేందుకు ఫిలింసిటీలోని ఆయన నివాసానికి రాజకీయ, వ్యాపార, సినీ రంగాలకు చెందిన ప్రముఖులు, అభిమానులు, ప్రజలు భారీగా తరలివచ్చారు. ఆయన భౌతికకాయానికి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబసభ్యులను ఓదార్చారు. కాగా, రామోజీరావు మృతికి సంతాపంగా ఆంధ్రప్రదేశ్‌లో ఆది, సోమవారాలు సెలవు దినంగా ప్రకటించారు. ఆయన అంత్యక్రియలకు సీనియర్ ఐఏఎస్‌లు ఆర్పీ సిసోదియా, రజత్ భార్గవ, సాయిప్రసాద్‌లతో కూడిన బృందాన్ని ప్రత్యేకంగా పంపుతున్నట్లు వెల్లడించింది. ప్రధాని మోదీ సందేశంతో వచ్చిన కేంద్ర మాజీ మంత్రి నిర్మలాసీతారామన్.. రామోజీ పార్థివ దేహానికి నివాళులర్పించారు. కాగా, రామోజీకి నివాళులర్పించినవారిలో టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి, పలువురు మంత్రులతో పాటు, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, సుప్రీంకోర్టు పూర్వ చీఫ్ జస్టిస్ ఎన్వీ రమణ ఉన్నారు.

ఆంధ్రజ్యోతి - హైదరాబాద్ సిటీ, అబ్దుల్లాపూర్‌మెట్, వనస్థలిపురం



జననం
1936 నవంబరు 16

పుట్టిన గ్రామం
కృష్ణా జిల్లాలోని పెదపారుపూడి

తల్లిదండ్రులు
వెంకటసుబ్బారావు, వెంకట సుబ్బమ్మ

వివాహం
1961 ఆగస్టు 19న రమాదేవితో

రామయ్య.. రామోజీరావుగా

రామోజీరావు అసలు పేరు రామయ్య. అయితే ఆయన పాఠశాలలో చేరాక.. తొలి రోజు ఉపాధ్యాయుడు నీ పేరేంటి అని అడగ్గా.. ఈయన రామోజీరావు అని చెప్పారు. రికార్డులో అదే పేరు ఎక్కింది. అలా తన పేరును తానే మార్చి పెట్టుకున్నారు. ఆయన భార్య పేరు చిన్నతనంలో రమణమ్మ. ఆమె కూడా రామోజీరావు లాగానే ఆమె పేరును రమాదేవిగా మార్చుకున్నారు. ఆమె పేరిటే రమాదేవి పబ్లిక్ స్కూల్‌ను రామోజీరావు స్థాపించారు.

అర్ధ శతాబ్ది... అద్వితీయ ముద్ర!

తెలుగునాట సామాజిక జీవనంపై రామోజీ సంతకం.. ప్రయోగాలే వేదికగా వ్యాపార సామ్రాజ్య విస్తరణ

హైదరాబాద్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): రామోజీరావు లాగా ఒక్క రోజు బతికినా చాలు అని ఆస్కార్ అవార్డు గ్రహీత, సంగీత దర్శకుడు కీరవాణి అన్నారు. రామోజీరావు లాగా వ్యాపారం చేయాలని ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కొన్ని వేలమంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు కలలుగంటారు. మీడియా మొఘల్ రామోజీరావు కేవలం వ్యాపారవేత్త కాదు. తెలుగు రాష్ట్రాల అర్ధ శతాబ్దపు రాజకీయాలను, సామాజిక జీవనాన్ని తన మీడియా సంస్థల ద్వారా ప్రభావితం చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి. వ్యాపారవేత్తగా ఆరు దశాబ్దాల ప్రయాణంలో వేల కోట్ల రూపాయల వ్యాపార సామ్రాజ్యాన్ని సృష్టించడమే కాకుండా తన సంస్థల ద్వారా దాదాపు పాతిక వేల మందికి ఉపాధి కల్పిస్తున్నారు. యాడ్ ఏజెన్సీతో తొలి అడుగులు వేసిన ఆయన తన జీవితకాలంలో స్పృశించిన వ్యాపార రంగాలు చూస్తే భారతదేశ వాణిజ్యవేత్తల్లో చేతివేళ్ల మీద లెక్క పెట్టగలిగినంత కొద్ది మందికే సాధ్యమైన వ్యవహారం అది. రైతు కుటుంబం నుంచి వ్యాపారవేత్తగా ఎదగాలన్న ఆకాంక్షతో ఢిల్లీదాకా అన్ని అవకాశాలను అన్వేషించి, చివరకు హైదరాబాద్‌లో చిట్‌ఫండ్ కంపెనీ ద్వారా తన విజయయాత్రను ప్రారంభించారు. అందులో కుదురుకున్నాక రైతుల కోసం ఏదైనా చేయాలన్న తపనతో 1969 నుంచి దాదాపు ఐదు దశాబ్దాల పాటు అన్నదాత పేరుతో రైతుల కోసం పత్రిక నడిపారు. 1974లో 'ఈనాడు' ద్వారా దినపత్రిక రంగంలో అడుగు పెట్టారు. అప్పటికే దిగ్గజ పత్రికలున్న నేపథ్యంలో తెలుగునాట పెద్దగా రాజకీయ ప్రాధాన్యం లేని వైజాగ్ నుంచి 'ఈనాడు'ను ప్రారంభించి, ప్రయోగాలనే మెట్లుగా చేసుకుంటూ రాష్ట్రమంతటా విస్తరించారు. దేశంలోనే తొలిసారిగా స్థానిక వార్తల కోసం ట్యాబ్లాయిడ్‌ను తీసుకొచ్చారు. వాటి కోసం మండల స్థాయిలో విలేకరులను నియమించే సంప్రదాయానికి తెర తీశారు. డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్‌ను బలోపేతం చేసి, ఉదయం 6 గంటలకే పత్రిక ఇంటి ముందుకు వచ్చే సంప్రదాయానికి తెరతీశారు.

సినిమాల్లోకి...

తెలుగు ప్రజలను అత్యధికంగా ప్రభావితం చేస్తున్న రంగం సినిమాలేనని రామోజీరావు గ్రహించారు. చిన్న సినిమాలతో మొదలెట్టి వివిధ భాషల్లో 85 సినిమాలు నిర్మించారు. కొద్ది బడ్జెట్‌తో సమకాలీన సమస్యలను కథలుగా తీసుకొని భారీ విజయాలు సాధించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఫిల్మ్ సిటీని నిర్మించారు. టాలీవుడ్ మాత్రమే కాకుండా బాలీవుడ్, కోలీవుడ్, ఇతర భాషా ప్రాంతాల నుంచి వచ్చి హైదరాబాద్‌లో సినిమాలు తీసుకొనే విధంగా మౌలిక సదుపాయాలు కల్పించారు. దేశం గర్వించదగ్గ బాహుబలి లాంటి సినిమా టాలీవుడ్‌లో రూపొందడానికి ఆయన పరోక్ష సహకారం ఉంది. చెన్నై, ముంబైలకు పోటీగా ప్రస్తుతం హైదరాబాద్ భారతీయ సినిమాకు కీలకంగా మారడంలో ఆయన పాత్ర ఉంది. ఫిల్మ్‌సిటీని పర్యాటక ప్రాంతంగా మలిచి ఏటా 13 లక్షల మంది పర్యాటకులను ఆకర్షిస్తున్నారు. 'పాడుతా తీయగా' కార్యక్రమం ద్వారా వందల మంది గాయకులను తెలుగునేలకు పరిచయం చేశారు.

టీవీరంగంలోకి...

దూరదర్శన్ ఏక చత్రాధిపత్యం నశించి స్టార్ టీవీతో దేశంలో ప్రైవేటు టీవీ చానల్ విప్లవం ముంచుకొస్తున్న విషయాన్ని రామోజీరావు గ్రహించారు. 1995లోనే తెలుగునాట ప్రైవేటు చానల్‌కు తెర తీశారు. క్రమంగా వివిధ భాషల్లో 12 టీవీ చానెళ్లు స్థాపించి దేశంలోనే అతిపెద్ద చానళ్ల వ్యవస్థను సృష్టించారు. మీడియా మొఘల్‌గా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందారు.

ఫీడ్ బ్యాక్‌కు పెద్దపీట

రామోజీరావు ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ కోసం పరితపించేవారు. తన పత్రిక కథనాల మీద ఎవరు అభ్యంతరాలు లేవనెత్తినా స్పందించి తిరుగు లేఖలు రాసేవారు. సహేతుకమైన విమర్శలు చేస్తే, అభినందించి తన తప్పు దిద్దుకొనేవారు. ఆయన సంతకంతో లేఖలను అపురూపంగా దాచుకున్నవారు వేలమంది ఉంటారు. తన ఉద్యోగులు చెప్పిన విషయాలను కూడా రామోజీరావు అంతే శ్రద్ధగా వినేవారు. చాంతాడంత పొడుగు రిపోర్టులు రాసినా విసుక్కోకుండా చదివేవారు. ఎందులో ఏ మంచి ఆలోచన ఉంటుందో అన్నది ఆయన ఉద్దేశం.

తెలుగు అంటే ప్రాణం

రామోజీరావుకు తెలుగు భాష అంటే ప్రాణం. ఆధునిక కాలపు తెలుగుభాషా సేవకుల్లో అగ్రగణ్యుడు. పత్రికలో వాడుక భాషనే వాడాలని పట్టుబట్టారు. ప్రపంచీకరణలో భాగంగా తెలుగును ఇంగ్లిష్ వింగేస్తున్న విషయాన్ని గ్రహించి దాన్ని పరిహరించేందుకు తన పత్రిక, చానెళ్ల ద్వారా సాధ్యమైనంత కృషి చేశారు. వ్యవహారిక భాషలో ఉండే కథలు, నవలలను ఆదరించడం కోసం విపుల, చతుర పేరుతో మాసపత్రికలను నిర్వహించారు. 'తెలుగు వెలుగు' పేరుతో సాహితీ మాస పత్రికను, పిల్లల కోసం బాలభారతం మాస పత్రికను నడిపారు. ఆయన సేవలను గుర్తించి వెంకటేశ్వర వర్సిటీ డాక్టరేట్ ఇచ్చింది. తెలుగులో వ్యవహారిక పదకోశాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. రాష్ట్రంలోని జర్నలిస్టులకు అదొక ప్రామాణిక నిఘంటువు. ఆయన న్యూస్‌టైం పేరుతో ఆంగ్లపత్రికను నిర్వహించారు.

యాక్టివిటీతో జనంలోకి...

పత్రిక జనంతో మమేకం అవ్వాలంటే వాళ్ల సమస్యలపై వార్తలు రాయడమే కాకుండా ప్రజల్లోకి వెళ్లి కార్యకలాపాలు చేపట్టాలన్నది రామోజీరావు విధానం. అందుకే, విపత్తులు వచ్చినపుడు సహాయ కార్యక్రమాల్లో, సామాజిక ఉద్యమాలు వచ్చినపుడు పాల్పంచుకోవడంలో ప్రజలను భాగస్వాములను చేస్తూ వార్తలు రాయించేవారు. 1984లో ఎన్టీఆర్‌ను కేంద్రం అక్రమంగా గద్దె దించినపుడు ప్రజాస్వామ్య పునరుద్ధరణ ఉద్యమాన్ని భుజాన వేసుకున్నారు. సారా వ్యతిరేక ఉద్యమాన్ని కూడా అలాగే చేపట్టి నడిపించారు. తుఫాను బాధితులకు పాఠకుల నుంచి విరాళాలు సేకరించి ఇళ్లు నిర్మించి ఇచ్చారు.

టీడీపీకి అధికారంలో పాత్ర

1982లో ఎన్టీఆర్ నేతృత్వంలో టీడీపీ ఏర్పడిన తొమ్మిది నెలల్లోనే అధికారంలోకి రావడం ఒక ప్రభంజనం. ఆనాటి ప్రధాని ఇందిరాగాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్‌ను ఢీకొని అధికారంలోకి రావడం దేశంలోనే ఒక సంచలనం. కొత్తగా ఏర్పడిన పార్టీకి అన్ని విధాలుగా వెన్నుదన్నుగా నిలిచి విస్తృత ప్రచారమిచ్చి ప్రజల్లోకి వెళ్లేందుకు రామోజీరావు కృషి చేశారు.

మొండి పట్టుదల

ఆత్మగౌరవం విషయంలో రామోజీరావుది రాజీలేని ధోరణి. చేయని తప్పుకు శిక్ష విధించాలని శాసన మండలి నిర్ణయించిందని భావించిన ఆయన మండలి ఆదేశాలకు తల వంచలేదు. చివరికి ప్రభుత్వమే మండలిని రద్దు చేసే పరిస్థితి వచ్చింది. తర్వాత కాలంలో కాంగ్రెస్, వైసీపీ ప్రభుత్వాలతోనూ ఆయన అదే రాజీలేని ధోరణిని కనబరిచారు. ఆరు దశాబ్దాలుగా చిట్‌ఫండ్స్ నిర్వహిస్తూ రాజకీయ ప్రత్యర్థులు సంక్షోభం సృష్టించే ప్రయత్నం చేసినా తట్టుకొని నిలబడ్డారు. ఫైనాన్స్ రంగం చిన్న తప్పుడు ప్రచారానికే కూలిపోయేంత సున్నితమైనది. ప్రభుత్వాలు తన మూలాలను దెబ్బ తీయాలని యత్నించినా చిట్టీల చందాదారుల నమ్మకంతో నిలబడ్డారు. ప్రైవేటు రంగంలో ఒకటో తారీఖునే జీతాలివ్వడం అనే సంప్రదాయాన్ని సృష్టించారు. మీడియా, సినిమా, ఫుడ్ ప్రాసెసింగ్ మాత్రమే కాకుండా హాస్పిటాలిటీ, ఈవెంట్ మేనేజ్‌మెంట్ రంగాల్లోనూ విస్తరించారు.

తొలి వ్యాపారం ఖమ్మం నుంచే...

ఖమ్మం సంక్షేమ విభాగం: దివంగత మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావుతో రామోజీరావుకు మంచి స్నేహం ఉంది. ఆయన సూచన మేరకు వ్యాపార రంగంలోకి అడుగుపెట్టిన రామోజీ రావు.. ఖమ్మంలోనే తొలి వ్యాపారం ప్రారంభించారు. 1970లోనే ప్రస్తుతం జిల్లా కాంగ్రెస్ కార్యాలయ ఉన్న భవనంలో రెండు గదులను అద్దెకు తీసుకొని ఎరువుల దుకాణం ఏర్పాటు చేశారు. అయితే, రైతుల కష్టాలను దగ్గర్నుంచి చూసిన ఆయన... బాకీలు వసూలు చేయలేకపోయారు. వ్యాపారంలో నష్టాలు రావడంతో రెండేళ్లకే దానిని మూసివేశారు. ఆ తర్వాతి కాలంలో జలగం సూచనతో హైదరాబాద్‌కు వెళ్లి పలు వ్యాపారాలను ప్రారంభించారు. ఖమ్మంకు చెందిన విలాసరావుకు రామోజీతో బంధుత్వం ఉంది. మయూరి లాడ్జి బుచ్చిబాబు, డాక్టర్ హరీశ్‌రావుతోపాటు ప్రస్తుత మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రేణుకాచౌదరి, తమ్మినేని వీరభద్రం, పోటు రంగరావు, కూనంనేని సాంబశివరావుతో ఆయనకు స్నేహ సంబంధాలు ఉన్నాయి.

నచ్చిన జర్నలిస్టు బీజీ వర్గీస్

ఇష్టమైన ఆహారం పెసరట్టు, మీగడ పెరుగు



హైదరాబాద్, జూన్ 9 (ఆంధ్రజ్యోతి): మీడియా రంగ దిగ్గజమైన రామోజీరావుకు నచ్చిన జర్నలిస్టు ఒకరు ఉన్నారు. ఆయనే బీజీ వర్గీస్. రామోజీరావుకు ఇష్టమైన ఆహారం వేరుశనగ పప్పు, పెసరట్టు, మీగడ పెరుగు. ఎన్ని సాధించినా తీరని కల ఏదని ఆయన్ని అడిగితే.. తీరని దానిని తానెప్పుడూ కలగనని స్పష్టంగా చెప్పారు. ప్రపంచం మిమ్మల్ని ఏ విధంగా గుర్తించుకోవాలనుకుంటున్నారని అడిగితే.. "నేను సైతం ప్రపంచాగ్నికి సమిదనొక్కటి ఆహుతిచ్చాను" అనుకుంటే చాలని వ్యాఖ్యానించారు.

స్నేహం చేసే ముందే ఆలోచించాలి



"స్నేహం చేసేముందే జాగ్రత్తగా ఆలోచించి చేయాలి.. ఒక సారి స్నేహం చేశాక తర్వాత ఆలోచించకూడదు. తర్వాత ఎలాంటి పరిస్థితి ఎదురైనా స్నేహాన్ని, స్నేహితుడిని వదలకూడదు" అని రామోజీరావు తనతో తరచూ చెప్పేవారని ప్రముఖ సినీ నేపథ్య గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పలు సందర్భాల్లో చెప్పారు. రామోజీరావు ఓ చిత్రంలో నటించారు. ఆ చిత్రం పేరు "మార్పు" ఇందులో ఆయన న్యాయవాది పాత్రలో నటించారు. అతిథి పాత్రలోనే అయినప్పటికీ ఆయన ఫొటో సినిమా పోస్టర్‌లో ముద్రించారు.

నవ్య | చిత్రజ్యోతి

దర్శకుడు సంగీత్ శివన్ ఇక లేరు



మలయాళంలో, హిందీలో పలు హిట్ చిత్రాలు తెరకెక్కించిన సంగీత్ శివన్ (65) ఇక లేరు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన్ను ముంబైలోని కోకిలా బెన్ ధీరూభాయ్ ఆస్పత్రిలో చేర్పగా.. బుధవారం గుండెపోటుతో తుది శ్వాస విడిచారని ఆయన సోదరుడు, సినిమాటోగ్రాఫర్ సంతోశ్ శివన్ తెలిపారు. సంగీత్ మృతి పట్ల కేరళ ముఖ్యమంత్రి పినరాయి విజయన్, నటుడు రితేశ్ దేశ్‌ముఖ్ సంతాపం వ్యక్తం చేశారు. కాగా, దర్శకుడు శివన్(శివశంకరన్ నాయర్) సంతానంలో పెద్ద కుమారుడు సంగీత్ శివన్. 1990లో దర్శకుడిగా మలయాళంలో 'వ్యూహం' చిత్రంతో అరంగేట్రం చేశారు సంగీత్ శివన్. ఆ తర్వాత 1998లో సన్నీ డియోల్, సుస్మితా సేన్ నటించిన 'జోర్' చిత్రంతో బాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు. మలయాళ చిత్రం 'యోధా', బాలీవుడ్ చిత్రం 'అప్నా సప్నా మనీ మనీ' ఆయనకు మంచి పేరు తెచ్చిపెట్టాయి.

స్టైలీ బ్యూటీ



నాగచైతన్య, సాయి పల్లవి జంటగా నటిస్తున్న చిత్రం 'తండేల్'. అల్లు అరవింద్ సమర్పణలో బన్నీ వాసు నిర్మిస్తున్న ఈ చిత్రానికి చందు మొండేటి దర్శకుడు. గ్రామీణ నేపథ్యంలో రూపుదిద్దుకుంటున్న ప్రేమకథా చిత్రమిది. గురువారం సాయిపల్లవి పుట్టిన రోజు సందర్భంగా స్పెషల్ పోస్టర్ విడుదల చేశారు. నవ్వుతూ ఫోన్ మాట్లాడుతున్న సాయిపల్లవి ఆ పోస్టర్‌లో కనిపించారు. గురువారం ఆమె బర్త్‌డే స్పెషల్ వీడియో విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు తెలిపారు. నాగచైతన్య ఇందులో జాలరిగా నటిస్తున్నారు. ఆ పాత్ర కోసం ఆయన పూర్తిగా మేకోవర్ అయ్యారు.

సెట్‌లో సెలబ్రేషన్స్



ఒకప్పుడు తన సినిమాను రిలీజ్ చేసేందుకు సపోర్ట్ కోసం వెతుకుతూ ఇబ్బందులు పడిన విజయ్ దేవరకొండ ఇప్పుడు తన సినిమాలను గ్రాండ్‌గా పాన్ ఇండియా రిలీజ్ చేసే స్థాయికి ఎదిగారు. విజయ్ సాగిస్తున్న ఈ జర్నీ యంగ్ టాలెంట్‌ను ఇన్‌స్పైర్ చేస్తోంది. తన సక్సెస్‌తో చాలా మందికి రోల్ మోడల్ అయ్యారు విజయ్. తన పుట్టినరోజు సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆయనకు అలవాటు. ఈసారి తన పుట్టిన రోజును గురువారం విశాఖలో జరుగుతున్న తాజా చిత్రం షూటింగ్‌లో బర్త్‌డేను సెలబ్రేట్ చేసుకుంటున్నారు. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ఈ సినిమాను నిర్మిస్తోంది. ఇవి కాక మరో రెండు చిత్రాల్లో నటించడానికి విజయ్ దేవరకొండ అంగీకరించారు.

తాతామనవళ్లుగా తండ్రీ కొడుకులు



ప్రముఖ హాస్యనటుడు బ్రహ్మానందం, ఆయన తనయుడు రాజా గౌతమ్ కలసి ఓ సినిమా చేయనున్నారు. ఇందులో వీళ్లిద్దరూ తాతా మనవళ్లుగా నటిస్తుండడం విశేషం. కొత్త దర్శకుడు ఆర్వీఎస్ నిఖిల్ దర్శకత్వం వహించే ఈ చిత్రం పేరు 'బ్రహ్మ ఆనందం'. రాహుల్ యాదవ్ నక్కా ఈ సినిమాకు నిర్మాత. గౌతమ్ తదుపరి చిత్రం గురించి బ్రహ్మానందం, వెన్నెల కిశోర్ మధ్య జరిగిన ఫన్నీ సంభాషణతో ఓ వీడియో విడుదల చేశారు. కొత్త సినిమాలో నటించడానికి గౌతమ్ అంగీకరించాడనీ వెన్నెల కిశోర్ చెప్పగానే, అందులో తాత పాత్ర పోషించమని కిశోర్, గౌతమ్ బ్రహ్మానందంను అభ్యర్థించడం ఈ వీడియోలో ఉంది. ప్రియా వడ్లమాని, ఐశ్వర్య హోలకల్ హీరోయిన్లుగా నటించే ఈ వినోద భరిత చిత్రం షూటింగ్ త్వరలో ప్రారంభమవుతుందనీ, డిసెంబర్ 6న విడుదల చేస్తామని నిర్మాత చెప్పారు.

ముగ్గురు స్నేహితుల కథ



నటుడు సత్యదేవ్ కథానాయకుడిగా నటించిన చిత్రం 'కృష్ణమ్మ' ఈ శుక్రవారం విడుదలవుతోన్న సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో సత్యదేవ్ మీడియాతో ముచ్చటించారు.

"ఇది ముగ్గురు స్నేహితుల కథ. మంచి జీవితం కోరుకునే ఆ ముగ్గురి కల చెదిరితే వారు ఏం చేశారనేది సినిమా కథాంశం. ఈ సినిమాలో వించిపేట భద్ర అనే క్యారెక్టర్‌లో నటించాను. కొన్ని వాస్తవ సంఘటనల ఆధారంగా దర్శకుడు ఈ రోల్‌ను డిజైన్ చేశారు. ఇందులో లుక్ వేరియేషన్స్ ఉంటాయి, ఆ మేకోవర్ కోసం చాలా కష్టపడ్డాను. సినిమా చూసేటప్పుడు ప్రేక్షకులకు ఈ పాత్రతో ఒక ఎమోషనల్ ట్రావెల్ ఏర్పడుతుంది" అని చెప్పారు.

నాలుగేళ్ల కల



జీవన్ రెడ్డి, అలేఖ్య జంటగా అశ్విన్ కామరాజ్ కొప్పాల దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'వృషభ'. మురళీకృష్ణా రెడ్డి, గడ్డం నవీన్,రాజమౌళి తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఉమా శంకర్ నిర్మాత. ఈ సినిమా లిరికల్ సాంగ్, ట్రైలర్ లాంచ్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత ఉమా శంకర్ రెడ్డి మాట్లాడుతూ "నాలుగేళ్ల కల ఈ సినిమా. ఎక్కడా రాజీ పడకుండా చిత్రాన్ని నిర్మించాను. టీమ్ అంతా ఈ సినిమా కోసం ఎంతో కష్టపడ్డారు" అని చెప్పారు. చిత్ర దర్శకుడు అశ్విన్ కామరాజ్ మాట్లాడుతూ "ఉమా శంకర్ అద్భుతమైన కథ రాసుకొచ్చి నన్ను అప్రోచ్ అయ్యారు. ఈ కాన్సెప్ట్ మీద చాలా హార్డ్‌వర్క్ చేశాం" అని అన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్: మహేంద్ర నాథ్, డీఓపీ: యుఎస్ విజయ్, సంగీతం: ఎమ్.ఎల్.రాజా, కో ప్రొడ్యూసర్: మల్లికా రెడ్డి.

శింబు థగ్ లైఫ్



సూపర్‌హిట్ చిత్రం 'విక్రమ్' తర్వాత కమల్‌హాసన్ కథానాయకుడిగా రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'థగ్ లైఫ్'. మణిరత్నం దర్శకుడు. 'నాయకుడు' తర్వాత ఆయన కమల్‌హాసన్‌తో చేస్తున్న చిత్రం కావడంతో భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాలో తమిళ హీరో శింబు కీలకపాత్ర పోషిస్తున్నారు. ఆయన పాత్రను పరిచయం చేస్తూ, చిత్రబృందం బుధవారం టీజర్‌ను విడుదల చేసింది. శింబు కారుతో దూసుకొచ్చి తుపాకీ గురిపెట్టిన తీరు ఆకట్టుకుంది. ఆర్ మహేంద్రన్ శివ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఏ.ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: రవి కే చంద్రన్

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

నిట్ సిల్చార్‌లో పీహెచ్‌డీ

సిల్చార్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎన్ఐటీ) పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. గ్రూపుల వారీగా(గ్రూప్-ఏ, గ్రూప్-బి) ప్రవేశాల భర్తీని చేపడతారు. గ్రూప్-ఏ అభ్యర్థులు రెగ్యులర్ పరిధిలోకి వస్తారు. వీరికి అన్ని రకాల ఫెలోషిప్‌లు వర్తిస్తాయి. గ్రూప్-బి కేటగిరీ అభ్యర్థులకు ఎలాంటి స్కాలర్‌షిప్‌లు గానీ, ఫెలోషిప్‌లు గానీ వర్తించవు. అకడమిక్ మెరిట్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి రాత పరీక్ష, ఇంటర్వ్యూలు నిర్వహించి మెరిట్ ప్రకారం అడ్మిషన్స్ ఇస్తారు. గ్రూప్- ఏ అభ్యర్థులకు గేట్/నెట్ స్కోర్‌పై వెయిటేజీ ఇస్తారు.

విభాగాలు

సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ & ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఫిజిక్స్, మేథమెటిక్స్, కెమిస్ట్రీ, మేనేజ్‌మెంట్ స్టడీస్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్.

అర్హత వివరాలు

విభాగాన్ని అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌తో పీజీ పూర్తిచేసి ఉండాలి. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. ఇంజనీరింగ్ విభాగాలకు 75 శాతం మార్కులతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. గేట్/నెట్ అర్హత తప్పనిసరి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1000, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఈ-మెయిల్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 15
- **అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** జూన్ 27న
- **రాత పరీక్ష, ఇంటర్వ్యూలు:** జూలై 22న
- **అడ్మిషన్ పొందిన అభ్యర్థుల జాబితా విడుదల:** జూలై 24న
- **వెబ్‌సైట్:** www.nits.ac.in/

ఆంధ్రజ్యోతి

దిక్సూచి

హైదరాబాద్ ● గురువారం 9 మే 2024

diksuchi@andhrajyothy.com

ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్

గుంటూరు జిల్లా మంగళగిరిలో ఉన్న డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్.... ప్రభుత్వ మెడికల్ కాలేజెస్ అండ్ టీచింగ్ హాస్పిటల్స్‌లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు 158

పోస్టు: ట్యూటర్

డిపార్ట్‌మెంట్స్: అనాటమీ, ఫిజియాలజీ, బయోకెమిస్ట్రీ, ఫార్మకాలజీ, పాథాలజీ, మైక్రోబయాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, కమ్యూనిటీ మెడిసిన్.

అర్హత: ఎంబీబీఎస్ ఉత్తీర్ణత

జీతం: నెలకు రూ.70,000

దరఖాస్తు ఫీజు: ఓసీ అభ్యర్థులకు రూ.1000. బీసీ, ఎస్సీ, ఈడబ్ల్యూఎస్, ఎస్టీ అభ్యర్థులకు రూ.500.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 15

వెబ్‌సైట్: https://apmsrb.ap.gov.in/msrb/

హెచ్ఏఎల్‌లో మెడికల్ ఆఫీసర్లు

హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్, బెంగళూరు...తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

1. సీనియర్ మెడికల్ ఆఫీసర్(ఈఎన్‌టీ): 1 పోస్టు
2. సీనియర్ మెడికల్ ఆఫీసర్(ఎమర్జెన్సీ మెడిసిన్): 1 పోస్టు
3. సీనియర్ మెడికల్ ఆఫీసర్(మెడిసిన్): 1 పోస్టు
4. మెడికల్ ఆఫీసర్(జనరల్ డ్యూటీ): 1 పోస్టు

వయోపరిమితి: గ్రేడ్-2 పోస్టులకు 35 ఏళ్లు; గ్రేడ్ -3 పోస్టులకు 45 ఏళ్లు మించరాదు.

వేతనం: నెలకు గ్రేడ్-2 పోస్టులకు రూ.40,000-రూ.1,40,000; గ్రేడ్-3 పోస్టులకు రూ.50,000- రూ.1,60,000

దరఖాస్తులకు చివరి తేదీ: మే 13

వెబ్‌సైట్: https://www.halindia. co.in/career



కర్నూలు 'సిల్వర్ సెట్'



కర్నూలులోని సిల్వర్ జూబ్లీ గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్(అటానమస్, కో ఎడ్యుకేషన్)- 'సిల్వర్ సెట్ 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా బీఏ ఆనర్స్, బీకాం ఆనర్స్, బీఎస్సీ ఆనర్స్ ప్రోగ్రామ్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. కోర్సుల్లో భాగంగా ఫీల్డ్ ట్రిప్స్, డిజిటల్ అసైన్‌మెంట్స్, ఈ లెర్నింగ్, గ్రూప్ డిస్కషన్స్, గెస్ట్ లెక్చర్స్, కెరీర్ గైడెన్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ తదితరాలు ఉంటాయి. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పురుషులకు, మహిళలకు విడివిడిగా హాస్టల్ సౌకర్యం ఉంది.

ప్రోగ్రామ్‌లు-స్పెషలైజేషన్‌లు

- బీఏ ఆనర్స్: హిస్టరీ, పొలిటికల్ సైన్స్
- బీకాం ఆనర్స్: జనరల్, కంప్యూటర్ అప్లికేషన్
- బీఎస్సీ ఆనర్స్: కంప్యూటర్ సైన్స్-మేథ్స్, కంప్యూటర్ సైన్స్-ఫిజిక్స్, మేథ్స్-కంప్యూటర్ సైన్స్, ఫిజిక్స్-కంప్యూటర్ సైన్స్, బోటనీ, జువాలజీ, మైక్రోబయాలజీ, కెమిస్ట్రీ, ఆర్గానిక్ కెమిస్ట్రీ

సీట్లు: బీఏ, బీకాం ప్రోగ్రామ్‌లో స్పెషలైజేషన్‌కు 20 సీట్లు; బీఎస్సీ ఆనర్స్ ప్రోగ్రామ్‌లో మేథ్స్-కంప్యూటర్ సైన్స్, ఫిజిక్స్-కంప్యూటర్ సైన్స్, ఆర్గానిక్ కెమిస్ట్రీ స్పెషలైజేషన్‌లకు ఒక్కోదానిలో 25 సీట్లు మిగిలిన స్పెషలైజేషన్‌లకు ఒక్కోదానిలో 20 సీట్లు ఉన్నాయి.

అర్హత: అభ్యర్థులు ఎంచుకొనే డిగ్రీ కోర్సును అనుసరించి ఎంపీసీ/బైపీసీ/ఏదేని గ్రూప్‌తో ఇంటర్/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. ఇంగ్లీష్‌లో కనీసం 40 శాతం మార్కులు; మొత్తమ్మీద కనీసం 50 శాతం మార్కులు ఉండాలి. ఇంటర్ స్థాయిలో ఇన్‌స్టంట్/సప్లిమెంటరీ అభ్యర్థులు దరఖాస్తుకు అనర్హులు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు ఫీజు: రూ.600
- ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 4
- అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్: జూన్ 11 నుంచి
- సిల్వర్ సెట్ 2024 తేదీ: జూన్ 16న
- వెబ్‌సైట్: sjgckurnool.edu.in

సిల్వర్ సెట్ 2024 వివరాలు

- దీనిని ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. డిగ్రీ కోర్సులకు నిర్దేశించిన ప్రకారం మూడు పేపర్లు ఉంటాయి. అదనంగా ఇంగ్లీష్ పేపర్ అందరికీ కామన్‌గా ఉంటుంది. ఏపీ ఇంటర్ సిలబస్ ఆధారంగా మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలను ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో ఇస్తారు. పేపర్‌కు 25 మార్కులు చొప్పున మొత్తం మార్కులు 100. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం 100 నిమిషాలు.
- బీకాం ఆనర్స్ అభ్యర్థులు ఇంగ్లీష్, ఎకనామిక్స్, కామర్స్-1(ఎలిమెంట్స్ ఆఫ్ కామర్స్), కామర్స్-2(బుక్ కీపింగ్ అండ్ అకౌంటెన్సీ) సబ్జెక్టుల్లో; బీఏ ఆనర్స్ అభ్యర్థులు ఇంగ్లీష్, హిస్టరీ, ఎకనామిక్స్, సివిక్స్ సబ్జెక్టుల్లో; బీఎస్సీ ఆనర్స్ అభ్యర్థులు ఇంగ్లీష్, మేథమెటిక్స్/బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో ఎగ్జామ్ రాయాల్సి ఉంటుంది.

నీలిట్‌లో ఎంటెక్

కేంద్ర ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ, కాలికట్‌లో నిర్వహిస్తున్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(నీలిట్)- ఎంటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో ఎలక్ట్రానిక్స్ డిజైన్ టెక్నాలజీ, ఎంబెడెడ్ సిస్టమ్స్ స్పెషలైజేషన్లు ఉన్నాయి. ఒక్కోదానిలో 18 సీట్లు ఉన్నాయి. ఒక్కో స్పెషలైజేషన్‌లో అయిదు సీట్లను స్పాన్సర్డ్ అభ్యర్థులకు ప్రత్యేకించారు. గేట్ వ్యాలిడ్ స్కోర్, ఆన్‌లైన్ కౌన్సెలింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. ఇంకా సీట్లు మిగిలిన పక్షంలో నాన్ గేట్ అభ్యర్థులకు అకడమిక్ ప్రతిభను అనుసరించి అవకాశాలు కల్పిస్తారు. ప్లేస్‌మెంట్స్ సౌకర్యం ఉంది.

అర్హత వివరాలు

ఎలక్ట్రానిక్స్ డిజైన్ టెక్నాలజీ స్పెషలైజేషన్‌కు ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్/ఎలక్ట్రానిక్స్ అండ్ బయోమెడికల్ ఇంజనీరింగ్ విభాగాల్లో బీఈ/ బీటెక్ పూర్తిచేసి ఉండాలి. ఎంబెడెడ్ సిస్టమ్స్ స్పెషలైజేషన్‌కు ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/అప్లయిడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్/కంప్యూటర్ సైన్స్/కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/బయోమెడికల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ బయోమెడికల్ ఇంజనీరింగ్/బయోమెడికల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్ విభాగాల్లో బీఈ/బీటెక్ పూర్తిచేసి ఉండాలి. కనీసం 60 శాతం మార్కులు తప్పనిసరి. ఎలక్ట్రానిక్స్‌లో ఏఎంఐఈ/ఏఎంఐఈటీఈ ప్రోగ్రామ్ ఉత్తీర్ణతతో పాటు కనీసం రెండేళ్ల అనుభవం ఉన్నవారు కూడా అర్హులే. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుంది. స్పాన్సర్డ్ అభ్యర్థులకు కనీసం రెండేళ్ల అనుభవం ఉండాలి. వీరికి గేట్ స్కోర్ తప్పనిసరి కాదు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 12
- **కౌన్సెలింగ్, అడ్మిషన్స్:** జూన్ 24
- **వెబ్‌సైట్:** https://nielit.gov. in/calicut



ఇండియన్ నేవీలో అగ్నివీర్ పోస్టులు

భారత నౌకాదళంలో అగ్నివీర్ ఖాళీల నియామకానికి ప్రకటన వెలువడింది. అగ్నివీరులుగా ఎంపికైన అభ్యర్థులకు ఐఎన్ఎస్ చిల్కాలో ప్రారంభమయ్యే 02/2024 బ్యాచ్‌తో శిక్షణ ఉంటుంది.

పోస్టు: అగ్నివీర్(సీనియర్ సెకండరీ రిక్రూట్- ఎస్ఎస్ఆర్)

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో మేథ్స్, ఫిజిక్స్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్మీడియట్(10+2)/రెండేళ్ల ఒకేషనల్ కోర్సు లేదా ఇంజనీరింగ్ డిప్లొమా(మెకానికల్/ఎలక్ట్రికల్/ఆటోమొబైల్స్/కంప్యూటర్ సైన్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన ఉండాలి.

వయసు: 2003 నవంబరు 1 నుంచి 2007 ఏప్రిల్ 30 మధ్యలో జన్మించి ఉండాలి. అవివాహిత పురుష, మహిళా అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

కనిష్ఠ ఎత్తు ప్రమాణాలు: పురుషులు, మహిళలు కనీసం 157 సెం.మీ. ఎత్తు ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: అప్లికేషన్ షార్ట్‌లిస్టింగ్, స్టేజ్-1(ఇండియన్ నేవీ ఎంట్రెన్స్ టెస్ట్), స్టేజ్-2(రాత పరీక్ష, శారీరక దారుఢ్య పరీక్ష-పీఎఫ్‌టీ), వైద్య పరీక్షల ఆధారంగా ఎంపిక చేస్తారు.

శిక్షణ: అగ్నివీరులుగా ఎంపికైన అభ్యర్థులకు ఒడిశా రాష్ట్రంలోని ఐఎన్ఎస్ చిల్కాలో నవంబరులో శిక్షణ ప్రారంభం అవుతుంది. శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న తరవాత సదరు విభాగాల్లో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

జీత భత్యాలు: ఎంపికైన అభ్యర్థులకు మొదటి ఏడాది రూ.30 వేలు, రెండో ఏడాది రూ.33 వేలు, మూడో ఏడాది రూ.36,500, నాలుగో ఏడాది రూ.40 వేల వేతనం లభిస్తుంది.

దరఖాస్తు ఫీజు: రూ.550

దరఖాస్తు విధానం: అభ్యర్థులు నేవీ అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

ఆన్‌లైన్ దరఖాస్తు, ఫీజు చెల్లింపు ప్రారంభం: మే 13.

చివరి తేదీ: మే 27

శిక్షణ ప్రారంభం: 2024 నవంబరు

వెబ్‌సైట్: https://www.joinindiannavy.gov.in/

లిటిల్స్



ముంగిస విధేయత

ఒక ఊరిలో గోపాల్, మాధురి అనే జంట ఉండేది. వారికి ఓ కొడుకు పుట్టాడు. అతని పేరు శంకర్. అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు. గోపాల్ వ్యవసాయం చేస్తాడు. ప్రతి రోజూ చేనుకు వెళ్లేవాడు. ఉదయాన్నే చద్దన్నం కట్టించేది గోపాల్ భార్య. విచిత్రంగా వారింటికి ఒక రోజు ముంగిస వచ్చింది. సాధారణంగా ముంగిసను ఎవరైనా తరిమికొడతారు. శంకర్ చిన్న పిల్లవాడు దాని దగ్గరకు వెళ్లాడు. అదీ ఏమనలేదు. దీంతో శంకర్, ముంగిస స్నేహితులయ్యారు.

'కుక్కపిల్లతోనో, పిల్లితోనో ఆడుకోవాలి కానీ.. ఈ ముంగిస ఏంటీ?' అని పక్కింటి జనాలు అన్నారు. అయితే శంకర్ పట్టించుకోలేదు. ఆ ముంగిస ప్రతిరోజు ఇంట్లో వచ్చి కూర్చునేది. ఆహారం తినేది. ఒక రోజు యథావిధిగా గోపాల్ చేనుకు వెళ్తూ ఆలస్యంగా వస్తానని వెళ్లాడు. తన భార్య సరేనంది. మాధురి పక్క ఇంటిలో గాజుల వ్యాపారం చేసే ఆమె వస్తే అక్కడికి వెళ్లిపోయింది. పిల్లవాడిని ఊయలలో ఉంచి వెళ్లింది. ఆ ముంగిస ఇంట్లోనే కాపలా ఉంది. మాధురి పక్కింటికి వెళ్లి గాజులు తొడుక్కుని ఇంటికి వచ్చింది.



వచ్చి చూడగానే పిల్లవాడి ఊయల ముందు రక్తం. కచ్చితంగా ఇది ముంగిస పనే అనుకుంది మాధురి. పిల్లవాడిని చంపేసిందే అంటూ గట్టిగా అరిచింది. క్షణాల్లో కోపంతో కట్టె తీసుకుని ముంగిసను బాదింది. అది అక్కడికక్కడే రక్తం కక్కుకుని చచ్చింది. ఆలస్యంగా వస్తానన్న తన భర్త అప్పుడే ఇంటికి వచ్చాడు. ఏమైందని అడిగాడు. 'మన పిల్లవాడు లేడు. ఆ దొంగ ముంగిస కొరికేసింది. చచ్చిపోయాడు' అంటూ దీర్ఘాలు తీసింది. గోపాల్ చేతిలో కట్టె ఉంది. అలానే ముందుకు వెళ్లాడు. ఊయల వెనకాల ఓ పాము చచ్చిపడి ఉంది. ఊయల్లో శంకర్ హాయిగా నిద్రపోతున్నాడు. గోపాల్‌కి తన ప్రాణాలు తిరిగి వచ్చాయని అనిపించింది.

తన భార్యను పిలిచాడు. అసలే మనది ఊరి చివరి ఇల్లు. ఒక పాము వస్తే.. దాంతో ఈ ముంగిస పోరాడింది. పామును చంపేసింది. 'నువ్వు తప్పుగా అర్థం చేసుకున్నావు. విధేయతతో ఉండే ముంగిసను చంపేశావెందుకూ? నీకు మతి ఉందా?' అంటూ తిట్టడం మొదలెట్టాడు గోపాల్. 'ఒక పని చేసేముందు ఆలోచించకపోతే ఎలా? పిల్లవాడిని ఈ ముంగిస కాపాడింది. ఇంతటి విధేయత గల దీన్ని చంపేయటానికి మనసెలా వచ్చింది?' అంటూ అరిచాడు. తన భార్య జరిగిన తప్పుకు బాధపడింది. ఆ తర్వాత ఆ రైతు కూడా బాధపడ్డాడు.


సరైన నీడ ఏది?



6 తేడాలు గుర్తించండి



దారి కనుక్కోండి



పరిశోధనలకు జర్మనీ ఫండింగ్

పరిశోధనలకు పట్టం కట్టే సంస్థల స్థానంలో వాటికి ఊతం ఇచ్చే వ్యవస్థలూ ఉన్నాయి. అలాంటి వాటిలో 'ద మాక్స్ ప్లాంక్ సొసైటీ' ఒకటి. జర్మనీకి చెందిన ఈ సంస్థకు వంద సంవత్సరాలకు పైబడిన చరిత్ర ఉంది. ఇండియాతో ఇరవై సంవత్సరాల అనుబంధం ఉంది. మంచి వర్కింగ్ కండిషన్స్‌కు తోడు అవసరమైన సిబ్బంది ఎంపికలో స్వేచ్ఛనిస్తున్న ఈ సంస్థ పరిశోధనలను కొత్త పుంతలు తొక్కిస్తోంది అంటే అతిశయోక్తి కాదు.

ద మాక్స్ ప్లాంక్ సొసైటీలో 31 మంది నోబెల్ గ్రహీతలు, పలువురు శాస్త్రవేత్తలు ఉన్నారు. వీరికి తోడు ప్రపంచంలోనే ప్రసిద్ధ పరిశోధన సంస్థలతో భాగస్వామ్యం ఉంది. విశిష్ట పరిశోధనలను నిర్వచించే స్థాయిలో అలరారుతోంది. సంస్థకు చెందినవి, ఇతరత్రా కలిపి దీని గొడుగు కింద 84 ఉన్నాయి. నేచురల్ సైన్సెస్, లైఫ్ సైన్సెస్, సోషల్ సైన్సెస్, హ్యూమానిటీస్‌లో పరిశోధనలు కొనసాగిస్తున్నాయి. పలు దేశాలకు చెందిన యువ శాస్త్రవేత్తలు పీహెచ్‌డీ, పోస్ట్ డాక్టొరల్ పరిశోధనలు కొనసాగిస్తున్నారు. 1400 మంది విజిటింగ్ శాస్త్రవేత్తలు ఉన్నారు. ఇండియా నుంచి కూడా గుర్తించదగ్గ సంఖ్యలో శాస్త్రవేత్తలు ఈ పరిశోధనల్లో పాల్గొంటున్నారు.



ఈ సంస్థ పరిధిలో ప్రపంచవ్యాప్తంగా ఉన్న సంస్థలకు తోడు ఇండియాలోని రీసెర్చ్ ఆర్గనైజేషన్స్‌తో మంచి సంబంధాలు నెలకొల్పుకొనే వీలు ఇక్కడ పరిశోధనలు కొనసాగించే రీసెర్చర్లకు ఉంటుంది. ఉమ్మడి యత్నాల్లో భాగంగా 85 వరకు పార్టనర్ గ్రూప్స్ ప్రపంచవ్యాప్తంగా దీనికి ఏర్పడ్డాయి. శాస్త్రీయ సంస్థలే కాకుండా సైంటిఫిక్‌గా ఎదగిన దేశాలు కూడా ఈ గ్రూపులో జతకట్టి ఉన్నాయి. తద్వారా పరిశోధనలను మరింత పటిష్టపర్చడం, అంతర్జాతీయ స్థాయిలో నెట్‌వర్క్‌ను నెలకొల్పటం ఈ చర్యలోని ప్రధాన ఉద్దేశం. అలాగే భాగస్వామ్యంలో ఉన్న గ్రూపులు విదేశాల్లో సంస్థలను పెట్టుకోవచ్చు. అదే సమయంలో మాక్స్ ప్లాంక్ ఇన్‌స్టిట్యూట్‌లో రీసెర్చ్ రెసిడెన్సీ ఉండాలి. తద్వారా పోస్ట్ డాక్టొరల్ అభ్యర్థులు తమ సొంత దేశంలో అత్యున్నత పరికరాలతో ప్రయోగశాలను సమకూర్చుకోవచ్చు. అలా తమకు నచ్చిన సబ్జెక్టులో పరిశోధనలను కొనసాగించవచ్చు. పార్టనర్ గ్రూప్స్ నెలకొల్పుకొనే ఇలాంటి వాటి వ్యవధి అయిదేళ్లకు మించకూడదు.

ఫండింగ్

ఎంపీజీలో డాక్టొరల్ విద్యార్థులకు ఫండింగ్ కాంటాక్ట్‌ల ద్వారా రీసెర్చ్ విద్యార్థులకు నిధులు సమకూరుస్తారు. సైంటిఫిక్ ఫ్రీడమ్, సోషల్ సెక్యూరిటీ కలగలిసిన కాంట్రాక్టులు ఇవి. వర్కింగ్ టైమ్ వారానికి 39 గంటలు. కలెక్టివ్ వేజ్ అగ్రిమెంట్ కింద కనీసం 2700 యూరోలు చెల్లిస్తారు. సబ్జెక్టు, చేపట్టిన పరిశోధనను అనుసరించి వార్షిక బోనస్‌ను కూడా నిర్ణయిస్తారు. ఈ కాంట్రాక్ట్ కాలవ్యవధి మూడేళ్లు. ఒక ఏడాది వరకు పొడిగింపునకు అవకాశం ఉంటుంది. డాక్టరేట్ ఫ్రేమ్ వర్క్‌లోనే విదేశీ పర్యటనలు ఉంటాయి. అందుకు ఫండింగ్ సపోర్ట్ ఉంటుంది.

సైంటిఫిక్ కెరీర్‌కు ఆలంబనగా మాక్స్ ప్లాంక్ ఇండియా మొబిలిటీ గ్రాంట్ ఉంటుంది. మేక్స్ ప్లాంక్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో పని చేసేందుకు వీలు కల్పిస్తుంది. డాక్టరేట్ ఫైనల్ ఇయర్ లేదంటే డాక్టరేట్ పొంది పదేళ్లు కూడా కాని వారు నామినీలుగా ఉండాలి. అలాగే సంస్థలకు అయిదు వేల యూరోలు ఇస్తారు. ఇండియన్ సైంటిస్టులకు అయ్యే ట్రావెల్ ఖర్చులు తదితరాలకు ఆ మొత్తాన్ని వినియోగిస్తారు. అలాగే ఈ గ్రాంట్ పొందిన ఇండియన్ సైంటిస్టులు మూడేళ్ల కాలంలో వరుసగా సంవత్సరానికి ఒక నెల వీటిలో పనిచేయాలి. అలాగే ఈ సంస్థ నిధులు పొందుతున్న అభ్యర్థులు ఇండియన్ రీసెర్చ్ సంస్థలో భాగస్వాములై ఉండాలి.

మన దేశంలో

పార్టనర్ గ్రూప్ మరీ ముఖ్యంగా ఇండియాలో విజయవంతమైంది. ఈ ప్రోగ్రామ్ మనదేశానికి పరిచయమైన తరవాత 85 మంది ఇండియన్ సైంటిస్టులు ఈ అవార్డును పొందారు. మరేదేశంలో లేని విధంగా ఇండియాలో ఇందుకు సంబంధించి ఇరవయ్యో వార్షికోత్సవాన్ని జరుపుకొంటున్నారు. ఫలితంగా మేధావలసకు బదులు మేధాపరంగా సర్క్యులేషన్‌కు వీలుపడుతోంది.

మాక్స్ ప్లాంక్ సంస్థల్లో నాలుగువేల మంది యువ శాస్త్రవేత్తలు తమ పరిశోధనలను కొనసాగిస్తున్నారు. వారిలో మూడో వంతు మంది ఇంటర్నేషనల్ మ్యాక్స్ ప్లాంక్ రీసెర్చ్ స్కూల్(ఐఎంపీఆర్ఎస్)లో భాగస్వాములు. ఈ స్కూల్స్, సెంటర్స్ పరిధిలోనే పలువురు పీహెచ్‌డీలు పూర్తి చేశారు. ఐఎంపీఆర్ఎస్ పూర్తిగా ప్రాంతీయ ఫోకస్ అంటే లోకల్ యూనివర్సిటీలు, రీసెర్చ్ సంస్థలతో కలిగి ఉంటుంది. పద్ధతిగా రూపొందించిన గ్రాడ్యుయేట్ శిక్షణకు అవకాశం కల్పిస్తుంది. ఒక్క జర్మనీలోనే 50 మంది పార్టనర్స్‌తో కలిసి అత్యున్నత స్థాయిలో పీహెచ్‌డీ చేసే వ్యక్తులకు తోడ్పాటును అందిస్తోంది. ప్రతి స్కూల్ యూనిట్‌లో బెస్ట్ స్కాలర్స్ ఉంటారు. వారే పరిశోధకులకు మార్గదర్శకులుగా వ్యవహరిస్తారు. జర్మనీ అలాగే ప్రపంచవ్యాప్తంగా యూనివర్సిటీలు, వర్సిటీయేతర పరిశోధన సంస్థలతో కలిసి పనిచేస్తుంటారు.

కాగ్నిషన్, మేటర్ ఆఫ్ లైఫ్, ఫొటొనిక్స్‌లో మాక్స్ ప్లాక్ స్కూల్స్ ఉన్నాయి. కంప్యూటర్ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్సెస్, లా, క్వాంటమ్ మెటీరియల్స్‌లో 2018లో గ్రాడ్యుయేట్ సెంటర్స్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో ప్రత్యేకించి కేంద్రీకృత దరఖాస్తు విధానం లేదు. ఏడాది పొడుగునా సంబంధిత డాక్టొరల్ ప్రకటనలు వస్తూ ఉంటాయి. సాధారణంగా సెప్టెంబర్ 1 నుంచి దరఖాస్తు ప్రక్రియ ఆరంభమవుతుంది. సెంట్రల్ అప్లికెంట్ పోర్టల్ ద్వారా పనులన్నీ జరుగుతుంటాయి. డాక్టొరల్ విద్యార్థులకు గ్రాంట్ మంజూరవుతుంది. ఎంప్లాయిమెంట్ కాంట్రాక్ట్ ఉంటుంది. ఈ సొసైటీ ఇప్పటి వరకు 35 మంది డాక్టొరల్ అభ్యర్థులకు 'ఒట్టో హాన్ మెడల్'ను సైంటిఫిక్ అచీవ్‌మెంట్స్‌కుగాను ప్రకటించింది.

డైలీ సుడోకు - 302

			3					
		7		1	8	5		
	1						9	8
7					9		4	
	9	4	7		5	8	1	
	8		1					7
6	4						5	
		2	4	8		3		
					1			

సుడోకు - 301 సమాధానం

5	4	3	9	8	1	2	6	7
7	8	1	6	2	3	5	9	4
2	6	9	5	4	7	1	8	3
8	2	5	4	7	9	6	3	1
1	7	4	3	6	5	8	2	9
9	3	6	2	1	8	4	7	5
3	9	2	1	5	6	7	4	8
6	5	8	7	9	4	3	1	2
4	1	7	8	3	2	9	5	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.